సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 187

శుక్రవారం 27-9-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'



క్లీన్‌స్వీప్ లక్ష్యంగా...

నేటి నుంచి కాన్పూర్‌లో బంగ్లాదేశ్‌తో భారత్ రెండో టెస్టు - 17లో



మార్కెట్ రికార్డుల ర్యాలీ

దేశీ స్టాక్ మార్కెట్లు వరుసగా ఆరో రోజూ లాభపడ్డాయి - 17లో



మహారాష్ట్రలో కుండపోత..

మహారాష్ట్రను భారీ వర్షాలు ముంచెత్తాయి. ముంబై నగరం స్తంభించింది. అంధేరీలో మహిళ మ్యాన్‌హోల్‌లో పడి మృతిచెందింది.

- వివరాలు 6లో▶



కిషిదా వారసుడెవరో!

జపాన్ ప్రధాని కిషిదా నిష్క్రమణ నేపథ్యంలో నాయకత్వం కోసం పోటీ నెలకొంది. నేడు జరిగే ఎన్నికలో 9 మంది బరిలో ఉన్నారు.

- వివరాలు 6లో▶

మూసీ 'రెడ్ మార్క్'!

గూడు వదిలేది లేదంటున్న బాధితులు

మూసీ నది వెంట సర్వే బృందాలకు నిరసన సెగలు..

ఎక్కడో ఇచ్చే డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మాకు ఎందుకంటూ మండిపాటు

- నదీ గర్భంలోని కట్టడాల కూల్చివేతకు సర్కారు మార్కింగ్
- పాత సర్వే ప్రకారం వివరాల సేకరణ.. యాప్‌లో నమోదు
- అర్హులైన నిర్వాసితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల హామీ
- రెండు మూడు రోజుల్లోనే లబ్ధిదారులకు పట్టాలు అందజేసేందుకు ఏర్పాట్లు.. ఏరియాల వారీగా కుటుంబాల తరలింపు ప్రక్రియ ప్రారంభం

12లో

చావనైనా చస్తాం.. కూల్చనివ్వం

''ఎన్నో ఏళ్లుగా ఇక్కడే బతుకుతున్నాం. కరెంటు, నీటి బిల్లులు కడుతున్నాం. ఇప్పుడు కూల్చుతామంటే ఎలా? చావనైనా చస్తాం కానీ ఇళ్లను కూల్చనివ్వం.. ఇంత విషం ఇచ్చి ఆ పుణ్యం కూడా మీరే కట్టుకోండి..'' అంటూ మూసీ పరీవాహకం పరిధిలోని చైతన్యపురి వినాయకనగర్ కాలనీ నివాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ రివర్‌బెడ్, బఫర్‌జోన్లలోని ఇళ్లను మార్కింగ్ చేయడానికి వచ్చిన సర్వే అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి నుంచి రంగు డబ్బాలను లాక్కుని పారబోశారు. వేసిన మార్కింగ్స్‌ను తుడిపేశారు. డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామంటూ మాయమాటలు చెప్తున్నారంటూ అధికారులు, పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సర్వే బృందాలు వెనక్కి తిరిగి వెళ్లిపోవాల్సి వచ్చింది. మరికొన్ని ప్రాంతాల్లోనూ అధికారులకు ఇదే తరహా నిరసన ఎదురైంది.

ఈ దుఃఖం తీర్చేదెవరు?



హైడ్రా కూల్చివేతల తీరుపై కుటుంబాల్లో కన్నీళ్లు

గుండెపోటుతో మరణించిన బాధితురాలు అంజలి

- తీవ్ర నష్టంతో రోడ్డునపడ్డ విజయ్‌ప్రతాప్, రవి..
- రోడ్డున పడ్డ బతుకులు..

12లో



వినాయకనగర్‌లో మార్కింగ్‌ను అడ్డుకుంటున్న మహిళలు

చాలీచాలని రైళ్లు.. అదనపు కష్టాలు

12లో

మోక్షగుండం ఆదర్శమా? కాళేశ్వరమా?



కొత్త ఏఈఈలు ఆలోచించాలన్న ముఖ్యమంత్రి రేవంత్

వందేళ్ల కిందటి రిజర్వాయర్లు పదిలం.. మన కళ్ల ముందే కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది

2లో

ఫార్మాసిటీ రద్దు వెనుక వేల కోట్ల భూ స్కాం



ఫార్మాసిటీ రద్దు వెనుక రూ.వేల కోట్ల భూకుంభకోణం ఉందని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ అంటూ.. ఫోర్ బ్రదర్స్‌కు రియల్ ఎస్టేట్ దందా కోసం ఇవ్వాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు.

3లో



దేవుడా.. ఓ మంచి దేవుడా..



సింహమైనా సరే.. పెళ్లాం చెబితే వినాలి..



నాన్నా పెంగ్విన్లే గుంపుగా వస్తాయి



జంబలకిడి పంబ.. అంతా రివర్స్..



ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇల్లు కట్టేశా.. ఇప్పుడెలా చెప్మా..

దేవుడిని ప్రార్థిస్తున్నట్లు కనిపిస్తున్న ఓ ఒటర్.. సివంగితో క్లాసు పీకించుకుంటున్న సింహం.. ఓ పెంగ్విన్‌కు సీరియస్‌గా వార్నింగ్ ఇస్తున్న మరో పెంగ్విన్.. ఎప్పుడూ గద్దల వేటకు బలవ్వాల్సిందేనా అంటూ రివర్స్ అటాక్ ఇస్తున్న ఓ ఫ్రస్ట్రేటెడ్ ఫిష్.. ఏంటి రామయ్యా.. దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్ టైపులో ఉన్న చింపాంజీ.. ఇవి కామెడీ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ అవార్డులు-2024లో తుది జాబితాకు ఎంపికైన చిత్రాల్లో కొన్ని. 2015 నుంచి ఈ పురస్కారాలను ఏటా ఇస్తున్నారు. త్వరలో విజేతలను ప్రకటిస్తారు.

:. సాక్షి సెంట్రల్‌డెస్క్ :.

క్లుప్తంగా...

ఆహార భద్రతలో రాష్ట్రానికి 23వ ర్యాంకు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఆహార భద్రత విషయంలో తెలంగాణ 23వ స్థానంలో నిలిచింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇటీవల విడుదల చేసిన స్టేట్ ఫుడ్ సేఫ్టీ ఇండెక్స్-2024లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆహార భద్రత పనితీరును అంచనా వేసి వార్షిక ర్యాంకింగ్ ఇచ్చింది. తయారు చేసిన ఈ నివేదికలో 100 స్కోర్ కుగాను 35.75 స్కోర్‌తో తెలంగాణ 23వ ర్యాంక్ సాధించింది. ఈ జాబితాలో 73.75 స్కోర్ సాధించి వరుసగా రెండో సంవత్సరం కూడా కేరళ అగ్రస్థానంలో నిలిచింది. కఠిన ఆహార భద్రతా ప్రమాణాలు, ఆధునిక మౌలిక సదుపాయాలు, పటిష్ట నిఘా, ప్రజారోగ్యంపట్ల నిబద్ధతతో కేరళ టాప్ ర్యాంక్ సాధించింది.

ఇంద్రసేనారెడ్డికి మిజోరం గవర్నర్‌గా అదనపు బాధ్యతలు



సాక్షి, న్యూఢిల్లీ: త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డికి మిజోరం గవర్నర్‌గా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అదనపు బాధ్యతలు అప్పగించారు. మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు సెలవులో ఉన్నప్పుడు.. ఆ రాష్ట్ర బాధ్యతలు ఇంద్రసేనారెడ్డి నిర్వహిస్తారు. ఈ మేరకు గురువారం రాష్ట్రపతి భవన్ ప్రకటన విడుదల చేసింది.

ముంబై విమానాలు హైదరాబాద్‌కు మళ్లింపు

ముంబైలో ప్రతికూల వాతావరణంతోనే...

శంషాబాద్: ముంబైలో ప్రతికూల వాతావరణం కారణంగా బుధవారం రాత్రి నుంచి తెల్లవారుజామువరకు మొత్తం పది విమానాలను హైదరాబాద్‌కు మళ్లించారు. ఇందులో ఢిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్, గౌహతి, బహ్రెయిన్, దోహా నుంచి ముంబైకి వచ్చిన విమానాలు హైదరాబాద్ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యాయి. కొలంబియా నుంచి చెన్నైకు వెళ్లాల్సిన విమానాన్ని కూడా అక్కడ ప్రతికూల వాతావరణం ఉండటంతో హైదరాబాద్‌కు దారి మళ్లించారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముంబై వెళ్లాల్సిన పలు విమానాలు నిర్దిష్ట సమయాని కంటే ఆలస్యంగా నడిచాయి.

'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారంలో తెలంగాణ ముందంజ

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో అడవుల పెంపకాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారంలో తెలంగాణ ముందంజలో ఉంది. దేశవ్యాప్తంగా ఈ ప్రచారంలో భాగంగా సుమారు 140 కోట్ల మొక్కలు నాటాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 80.8 కోట్ల మొక్కలు నాటారు. కాగా, 2024-25 సంవత్సరంలో తెలంగాణ వ్యాప్తంగా 18 కోట్ల మొక్కలు నాటడాన్ని లక్ష్యంగా పెట్టుకోగా...సెప్టెంబర్ నెలలో 4 కోట్ల మొక్కలు నాటారు. దీంతో తెలంగాణలో ఇప్పటివరకు 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారంలో నాటిన మొక్కల సంఖ్య 8.37 కోట్లని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ జాబితాలో 26.5 కోట్ల మొక్కలతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో నిలవగా, 15.4 కోట్ల మొక్కలు నాటి గుజరాత్ ఆ తర్వాత స్థానంలో నిలిచింది.

ఆదర్శం మోక్షగుండమా?.. కాళేశ్వరమా?

కొత్త ఏఈఈలు ఆలోచించాలన్న సీఎం రేవంత్

- వందేళ్ల కింద మోక్షగుండం కట్టిన రిజర్వాయర్లు అలానే ఉన్నాయి
- కానీ రూ.లక్ష కోట్లతో మన కళ్ల ముందే కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది
- ఎందుకు తప్పిదం జరిగిందో అధ్యయనం చేయాలన్న ముఖ్యమంత్రి
- 673 మంది ఏఈఈలకు నియామక పత్రాల అందజేత



ఇంజనీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొన్నం, ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: 'హైదరాబాద్‌లో 1908లో వరదలు వచ్చి భారీ ప్రాణనష్టం జరిగితే నిజాం గ్లోబల్ టెండర్లు పిలిచి నగరాన్ని రక్షించే బాధ్యతను ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు అప్పగించారు. ఆయన 100 ఏళ్ల కింద నిర్మించిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లు ఇంకా అలానే ఉన్నాయి. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి మన కళ్ల ముందు కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది. పనిమంతుడు పందిరేస్తే కుక్క తోక తగిలి కూలిపోయిందనే సామెత గుర్తుకు వస్తోంది. మీకు మోక్షగుండం ఆదర్శం కావాలా? కాళేశ్వరం ఆదర్శం కావాలా? ఆలోచన చేయండి..' అని నీటి పారుదల శాఖలో కొత్తగా నియమితులైన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు (ఏఈఈలు) ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. నీటిపారుదల శాఖలోని 50 శాతానికి పైగా ఇంజనీర్లు కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేశారని, వారిపై చర్యలు తీసుకుంటే శాఖే ఉండదన్నారు. అలా అని వారిని కొనసాగిస్తే తమను అందరూ ప్రశ్నిస్తున్నారని చెప్పారు. టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన 673 మంది నీటిపారుదల శాఖ ఏఈఈలకు నియామక పత్రాలు అందజేసేందుకు గురువారం సాయంత్రం జలసౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతమని విచారణ కమిషన్ ముందు కొందరు సాక్ష్యం ఇస్తున్నారని, కమిషన్ అడిగే ప్రశ్నలకు మాత్రం వారి వద్ద సమాధానం ఉండడం లేదని సీఎం అన్నారు. ఎవరిని ఎవరు రక్షించే ప్రయత్నాలు చేస్తున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. గతంలో క్షేత్ర స్థాయిలోని ఇంజనీర్లు తప్పులను తిరస్కరిస్తూ రిమార్క్స్ రాసి పంపేవారని, ఇప్పుడు సీఎం చెప్పాడని మంత్రి.. మంత్రి చెప్పాడని కార్యదర్శి.. కార్యదర్శి చెప్పాడని ఈఎన్సీ.. డీఈ చెప్పాడని ఏఈ.. ఏ పనైనా చేసేస్తున్నారని విమర్శించారు. మీకున్న పరిజ్ఞానాన్ని పేపర్ మీద పెట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పరోక్షంగా కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీర్లను ఉద్దేశించి ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

కేస్ స్టడీగా కాళేశ్వరంపై అధ్యయనం చేయండి

'కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1.47 లక్షల కోట్లకు పెరిగింది. కానీ లక్ష ఎకరాల ఆయకట్టుకైనా సాగు నీరు ఇవ్వలేదు. 52 వేల ఎకరాలకే ఇచ్చారు. ఎందుకీ తప్పిదం జరిగింది? తప్పిదం ప్రజాప్రతినిధులదా? ఈఎన్‌సీలు, సీఈలు, ఎస్ఈలదా? లేక క్షేత్ర స్థాయిలోని ఈఈలు, ఏఈలు, జేఈలదా ? అనే అంశంపై అధ్యయనం చేయడానికి కాళేశ్వరం ప్రాజెక్టును ఒక కేస్ స్టడీగా తీసుకోవాలి. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులు ఎన్నో వరదలు, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని ఈనాటికీ నిలబడ్డాయి. కానీ గత పదేళ్లలో రూ.2 లక్షల కోట్లను ఖర్చుచేసినా ప్రాజెక్టులు ఎందుకు పూర్తికాలేదు? భవిష్యత్తులో మనం అలాంటి తప్పిదాలు చేయకూడదు..' అని రేవంత్ అన్నారు.

గొప్ప వారసత్వాన్ని కొనసాగించాలి.. మంత్రి ఉత్తమ్

కొత్త ఇంజనీర్లు తెలంగాణ గర్వించదగ్గ ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్య, నవాబ్ అలీజంగ్‌ల వారసత్వాన్ని కొనసాగించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. 673 మందిలో 31 మంది ఐఐటీ, 83 మంది ఎన్ఐటీ విద్యార్థులు ఉండడం గర్వకారణమన్నారు. అందరికీ క్షేత్ర స్థాయిలోనే పోస్టింగ్స్ ఇస్తున్నామని, పైరవీలు చేయవద్దని సూచించారు. శాఖను బలోపేతం చేయడానికి 281 మంది హెల్పర్లు, 1,591 మంది లస్కర్ల నియామకానికి సీఎం అంగీకరించారని తెలిపారు. చివర్లో విభాగాల వారీగా టాపర్లకు సీఎం నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ జనరల్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సిఫారసులు తెస్తే అడవిలో పోస్టింగ్ ఇవ్వండి

నీళ్లు, వ్యవసాయంతో ముడిపడిన మీ బాధ్యత కేవలం ఉద్యోగం కాదని, తెలంగాణ ప్రజల భావోద్వేగంతో ముడిపడి ఉందని సీఎం అన్నారు. ఏఈఈలు క్షేత్ర స్థాయిలో పనిచేయాలంటూ ఎవరైనా సిఫారసులు తీసుకొస్తే దూరంగా అడవిలో పోస్టింగ్ ఇవ్వాలని మంత్రి ఉత్తమ్‌కు సూచించారు. రోజుకు ఒకేసారి తిండి దొరికే చోట పోస్టింగ్ ఇవ్వాలని సరదాగా వ్యాఖ్యానించారు. ఏ వృత్తిలోనైనా క్షేత్ర స్థాయిలో అనుభవం ఉన్న వారే రాణిస్తారని, పీవీ నరసింహారావు, నీలం సంజీవరెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి లాంటి వాళ్లు సర్పంచ్‌గా ప్రస్థానం ప్రారంభించి పీఎంగా, రాష్ట్రపతిగా, సీఎంగా రాణించారన్నారు. పూర్వంలా ఇప్పుడు క్షేత్ర స్థాయి తనిఖీలకు వెళ్లే ఇంజనీర్లు తగ్గిపోయారని, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులూ పర్యటించడం లేదని తప్పుబట్టారు.

రేపు రాష్ట్రానికి రాష్ట్రపతి



సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఒక రోజు పర్యటన కోసం శనివారం రాష్ట్రానికి రానున్నారు. ఉదయం 9.40 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు బయల్దేరుతారు. ఉదయం 11.40 గంటలకు హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి బయల్దేరి 12.10 గంటలకు శామీర్‌పేట్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లాకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12.20 గంటల నుంచి ఆ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.05 నిమిషాలకు నల్సార్ యూనివర్సిటీ కార్యక్రమంలో రాష్ట్రప తి ప్రసంగం ఉంటుంది. మధ్యాహ్న భోజనం అనంతరం 3-10 గంటలకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి వెళ్తారు. సాయంత్రం 4 గంటలకు భారతీయ కళా మహోత్సవ్ 2024 ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. కేంద్ర మంత్రులు, గవర్నర్లు, ముఖ్యమంత్రుల సన్మానా లు, వారి ఉపన్యాసాల అనంతరం.. సాయంత్రం 5.05 గంటలకు రాష్ట్రపతి ముర్ము తన ప్రసంగాన్ని ప్రారంభిస్తారు. అక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రూప్ ఫొటో అనంతరం సాయంత్రం 5.45 గంటలకు రాష్ట్రపతి నిల యం నుంచి హకీంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు బయల్దేరతారు. హకీంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక విమానంలో ఆమె ఢిల్లీకి తిరిగి వెళ్తారు.

ఇంజనీర్లు మోక్షగుండంను ఆదర్శంగా తీసుకోవాలి

కాళేశ్వరం కట్టిన ఇంజనీర్లను కాదు: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఒక కట్టడం లక్షల మంది అవసరాలను తీర్చేదని ప్రతీ ఇంజనీర్ గుర్తెరగాలని, కొత్తగా నియామకమైన ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని తమ కెరీర్లను నిర్మించుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. హైటెక్స్ ప్రాంగణంలోని న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్)లో గురువారం టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన 156 మంది ఆర్ అండ్ బీ శాఖ ఇంజనీర్లకు శాఖాపరమైన అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న ఐదురోజుల ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు. అనంతరం నూతన ఇంజనీర్లకు మంత్రి మార్గనిర్దేశనం చేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య, నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ వంటి ఇంజనీర్లను ఆదర్శంగా తీసుకోవాలే తప్పా..కాళేశ్వరం కట్టిన ఇంజనీర్లను కాదని సూచించారు. రాష్ట్రంలో కొన్ని ప్రాజెక్టులు కట్టిన వెంటనే కూలిపోయి ఇంజనీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసిన ఘటనలను మనం చూశామన్నారు. గత పదేళ్లలో ఆర్ అండ్ బీ శాఖలో సైతం నియామకాలు జరగలేదని చెప్పారు. దీంతో ఇంజనీర్లు లేక పనులను పర్యవేక్షించే వారే లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏవైనా సమస్యలుంటే తనకు చెబితే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

వసతుల కల్పనకు అడ్డంకిగా పర్యావరణ అనుమతులు

- అనుమతుల అధికారాన్ని గ్రామ సభలకు కట్టబెట్టాలి
- 'పెసా' చట్టంపై జాతీయ సదస్సులో మంత్రి సీతక్క
- కేంద్రమంత్రులతో కలసి 'పెసా' సదస్సును ప్రారంభించిన సీతక్క



కేంద్రమంత్రులు ప్రహ్లాద్ సింగ్ పటేల్, ఎస్పీ సింగ్ భగెల్‌లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి సీతక్క

సాక్షి, న్యూఢిల్లీ: గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అటవీ, పర్యావరణ శాఖల అనుమతులు అడ్డంకిగా మారుతున్నాయని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. అనుమతుల అధికారాలను గ్రామ సభలకు కట్టబెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయతీల విస్తరణ(పెసా) చట్టంపై సదస్సు జరిగింది. కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ సింగ్ పటేల్, ఎస్పీ సింగ్ భగెల్‌తో కలసి మంత్రి సీతక్క జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధి, పెసా చట్టం అమల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, పరిష్కార మార్గాలపై సీతక్క ప్రసంగించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ..గిరిజన ప్రాంతాల్లో కనీస వసతులు కల్పించడానికి సైతం సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. గనులు, భారీ ప్రాజెక్టులకు అనుమతులు వేగంగా మంజూరు అవుతున్నాయి కానీ అడవి పుత్రులకు కనీస సదుపాయాలు కల్పించే విషయంలో మాత్రం అనుమతులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం పలు పథకాల ద్వారా నిధులు ఇచ్చినా వాటిని వినియోగించలేని పరిస్థితి ఉందన్నారు. ఇదే విషయాన్ని సదస్సులో ప్రస్తావించానని, ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని ఆయా రాష్ట్రాల మంత్రులు సదస్సులో వాపోయారని తెలిపారు.

రేషన్‌కార్డు లేని అర్హులకూ ఇందిరమ్మ ఇళ్లు

అవసరమైతే ఇళ్ల సంఖ్య పెంచుతాం: మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: రేషన్ కార్డు లేని నిరుపేదలకు కూడా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్టు గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న ఇందిరమ్మ కమిటీలు అలాంటి పేదలను గుర్తించి, ఇతర నిబంధనల మేరకు వారు అర్హులే అని గుర్తిస్తే వారికి కూడా ఇళ్లను మంజూరు చేయనున్నట్టు వెల్లడించారు. గురువారం సాయంత్రం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. దసరా నాటికి ఇందిరమ్మ కమిటీలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో ఉండే ఇందిర మ్మ కమిటీల్లో ఐదుగురు సభ్యులుంటారని తెలిపారు. సర్పంచ్/పర్సన్ ఇన్‌చార్జి, గ్రామ కార్యదర్శి, ముగ్గురు సామాజిక సేవా కార్యకర్తలు సభ్యులుగా ఉండి, అర్హులను గుర్తించటంలో కీలకంగా వ్యవహరిస్తారని వెల్లడించారు. వీరు రూపొందించే నివేదికలను ఎండీఓల ద్వారా జిల్లా కలెక్టర్లకు పంపుతారని తెలిపారు.

అవసరమైతే మరిన్ని ఇళ్లను మంజూరు చేస్తాం

డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా 16.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిరుపేదలకు అందించామని, ఇప్పుడు కూడా వీలైనంత ఎక్కువ మందికి ఇళ్లను మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి పేర్కొన్నారు. ఎక్కువ సంఖ్యలో ఇళ్ల నిర్మాణం సవాల్‌గానే ఉండనున్నా, వీలైనన్ని ఎక్కువ ఇళ్లను నిర్మించేలా చూస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గానికి మూడున్నర వేల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, అవసరమైతే ఈ సంఖ్యను పెంచేందుకు కూడా సిద్ధమేనని ఆయన పేర్కొన్నారు. అమ్ముకుండా నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ ఇళ్లను వీలైనంత తొందరలో వేలం ద్వారా అమ్మేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నిధుల విడుదలలో జాప్యంతో నిలిచిపోయిన గ్రామాభివృద్ధి

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘ నిధులివ్వాలి: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధుల విడుదలలో జాప్యంతో రాష్ట్రంలో గ్రామాభివృద్ధి నిలిచిపోయిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. దీంతో ఎనిమిది నెలలుగా గ్రామాల్లో పారిశుధ్యం కుంటుపడటంతో పాటు కనీసం కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. 15వ ఆర్థిక సంఘం కేటాయించిన పంచాయతీరాజ్ నిధుల విడుదలలో జాప్యం, జాతీయ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులు విడుదల చేయడంలో ఆలస్యంతో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు హరీశ్‌రావు గురువారం బహిరంగ లేఖ రాశారు. '15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధుల నుంచి నయా పైసా విడుదల చేయకపోవడంతో గ్రామాలు మురికి కూపాలుగా మారాయి. గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శులు సెలవులు పెట్టే దుస్థితి దాపురించింది' అని లేఖలో పేర్కొన్నారు. 'పంచాయతీ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులతో పాటు పద వీ కాలం పూర్తయినా సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు కూడా 8 నెలల గౌరవ వేతనాలు చెల్లించడం లేదు. మాజీ సర్పంచ్‌లు గవర్నర్‌ను కలి సి మొర పెట్టుకునే పరిస్థితి వచ్చింది. ఉపాధి హామీ పథకం కింద కేంద్రం రూ.1,200 కోట్లు విడుదల చేసింది. సెప్టెంబర్ 30లోపు యుటిలైజేషన్ సర్టిఫికెట్‌ను కేంద్రానికి ఇవ్వకుంటే రెండో విడత నిధులు కూడా వచ్చే పరిస్థితి ఉండదు.

'గుడెందొడ్డి' సామర్థ్యం 15 టీఎంసీలకు పెంపు

జూరాల ఆయకట్టు స్థిరీకరణలో భాగంగా నిర్ణయం

- ప్రాధాన్యత ప్రాజెక్టులకు ప్రతినెలా నిధుల విడుదల
- సాగునీటి ప్రాజెక్టుల సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం



సమావేశంలో సీఎం రేవంత్, మంత్రులు పొన్నం, తుమ్మల, ఉత్తమ్, కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్ జైన్, జీఆర్ఎంబీ చైర్మన్ ఎంకే సిన్హా తదితరులు

సాక్షి, హైదరాబాద్: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన గుడెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.5 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచే ప్రతిపాదనలను పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సీఎం గురువారం రాత్రి జలసౌధలో మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్, తుమ్మలతో కలిసి సమీక్షించారు. జూరాల రిజర్వాయర్ ప్రాజెక్టు సామర్థ్యం 9 టీఎంసీలుండగా, దానిపై జూరాల కాల్వతో పాటు జవహర్ నెట్టెంపాడు, రాజీవ్‌భీమా, కోయిల్‌సాగర్, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాలు ఆధారపడి ఉన్నాయని, ఈ ప్రాజెక్టుకు ఏడాదికి 55 రోజులు వరద వస్తుందని అధికారులు సీఎంకు తెలిపారు. జూరాల ప్రాజెక్టు కింద ఉన్న మొత్తం 7లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు గుడెందొడ్డి సామర్థ్యం పెంపు ఒక్కటే మార్గమని అధికారులు నివేదించగా, సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

- రేలంపాడు రిజర్వాయర్‌లో సీపేజీ ఉండడంతో నీరు నిల్వ చేయలేని పరిస్థితి ఏర్పడిందని, కర్టెన్ గ్రౌటింగ్ చేస్తే సీపేజీని నివారించొచ్చని అధికారులు చెప్పగా,మరమ్మతులు చేసి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 4 టీఎంసీలకు పెంచాలని సీఎం ఆదేశించారు.
- ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు కింద 7.5 టీఎంసీలతో నిర్మించాల్సి ఉన్న నక్కలగండి రిజర్వాయర్‌కు అటవీభూముల సేకరణ, పునరావాసం, పునర్నిర్మాణ సమస్యలు, పెండ్లిపాక రిజర్వాయర్‌కు ఈ సమస్యలే ఉన్నాయని అధికారులు చెప్పగా, సత్వరంగా పరిష్కరించాలని సీఎం ఆదేశించారు.
- కల్వకుర్తి లిఫ్ట్‌లో ఐదు మోటార్లకుగాను 3 మాత్రమే నడుస్తున్నాయని, పంప్‌హౌస్ బ్రస్ట్‌వాల్ పనులు చేపడితే మిగిలిన 2 మోటార్లు నడపొచ్చని అధికారులు వివరించారు. ఆ మేరకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

నెలకు రూ.240 కోట్లు విడుదల

ఈ ఏడాది 6.3 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రాధాన్యత కేటగిరీలైన ఏ, బీలోని ప్రాజెక్టుల పూర్తికి ఈ ఏడాది రూ.5వేల కోట్లు అవసరమని సీఎంకు అధికారులు తెలిపారు. ప్రతీనెలా రూ.240 కోట్లు విడుదల చేయాలని అధికారులు విజ్ఞప్తి చేయగా, గ్రీన్‌చానల్ ద్వారా ఈ మేరకు నిధులు విడుదల చేయాలని ఆర్థికశాఖను సీఎం ఆదేశించారు. 75%, ఆపై పనులు జరిగిన ప్రాజెక్టులను వచ్చే ఖరీఫ్‌లోగా పూర్తి చేస్తే కొత్త ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు.

- చిన్న కాళేశ్వరం, మోడికుంటవాగు, లోయర్ పెన్‌గంగా, చనాఖా కొరాటా, దేవాదుల, శ్రీపాద ఎల్లంపల్లి, కోయిల్‌సాగర్, కల్వకుర్తి లిఫ్ట్, నెట్టెంపాడు, రాజీవ్ భీమా, ఎస్ఎల్‌బీసీ, డిండి, ఎస్సారెస్పీ-2, సదర్‌మట్ బరాజ్, నీల్వాయి, పాలెంవాగు ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు ఉన్న అవకాశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమీక్షలో శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ఈఎన్సీ ఎన్.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పూడిక తొలగింపుపై ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం

మేజర్, మీడియం ప్రాజెక్టుల్లో పూడికతీతపై ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. మన ప్రాజెక్టుల్లో సగటున 25 శాతం పూడిక, ఇసుక మేటలున్నాయని ఒక అధ్యయనంలో తేలిందని రాహుల్ బొజ్జా చెప్పారు.

- జలసౌధలో సీఎం రేవంత్‌ను కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్ జైన్, జీఆర్ఎంబీ చైర్మన్ ఎంకే సిన్హాలు కలిశారు.

ఆదిలాబాద్‌లో ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు చేయండి

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: ఆదిలాబాద్‌లో ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు బీజేపీ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు తెలిపారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పదేళ్లుగా బీఆర్ఎస్ వైఖరి కారణంగా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు కాలేదని రాజ్‌నాథ్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ, ఆదిలాబాద్‌లో రక్షణశాఖకు సంబంధించిన భూమి ఉందని, ఈ భూమి కి మరికొంత భూమిని రాష్ట్ర ప్రభుత్వం కూడా కేటాయిస్తే ఆ స్థలంలో ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు చేయొచ్చని ప్రధాని నరేంద్ర మోదీ 2014లో ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఈ విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, భూమి కేటాయించకుండా, స్టేషన్ ఏర్పాటు కానివ్వకుండా అడ్డుపడిందని వారు ఆరోపించారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందని చెప్పినట్లు వివరించారు. రాజ్‌నాథ్‌సింగ్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లినట్టు చెప్పారు. ఆదిలాబాద్‌లో సిమెంట్ ఫ్యాక్టరీ పునః ప్రారంభించాలని కేంద్రమంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిసి కోరినట్లు తెలిపారు.

ఇదంజగత్



..మన క్షిపణులకన్నా మన వైరస్‌కే ఎక్కువ భయపడ్తారాసార్!



ఐలమ్మ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం తదితరులు

కులగణనపై ఆందోళన వద్దు

- అది జరిగిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు
- చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో పొన్నం ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్/గన్‌ఫౌండ్రీ: కులగణన జరుగుతుందని..ఈ విషయంలో ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని సర్వాయి పాపన్న జయంతి రోజునే ప్రకటించానని గుర్తు చేశారు. వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలను ప్రభుత్వం తరఫున గురువారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం మాట్లాడుతూ కులగణనపై విపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ తెలంగాణ పోరాటానికి గుర్తు అని, ప్రతి ఒక్కరికి స్ఫూర్తి అని చెప్పారు. చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా ప్రభుత్వం నిర్వహిస్తుందని.. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అధికారికంగా ఐలమ్మ జయంతిని నిర్వహిస్తుంటే ధర్నాలు ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ధర్నాలు చేస్తున్నవారు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు గుర్తించలేదో చెప్పాలన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ స్ఫూర్తిని ప్రభుత్వం కొనసాగిస్తుందని చెప్పారు. టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ చాకలి ఐలమ్మ నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అరాచకాలను ఎదిరించి పోరాడిన వీరనారి ఐలమ్మ అన్నారు. పలువురు వక్తలు ఐలమ్మ సేవలను కొనియాడారు. ఐలమ్మ జీవిత చరిత్రపై రచించిన పలు పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, ఎమ్మెల్సీలు బసవరాజు సారయ్య, అలుగుబెల్లి నర్సిరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయాదేవి, మహిళా కమిషన్ సభ్యురాలు చిట్యాల శ్వేత ఐలమ్మ, బీసీ కమిషన్ సభ్యులు రాథోడ్ జయప్రకాశ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ రద్దు వెనుక వేల కోట్ల భూస్కాం

సిరిసిల్లలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

- ముఖ్యమంత్రి ఓ పిచ్చోడు.. నోటిఫికేషన్లు ఇవ్వకుండానే ఉద్యోగాలు ఇచ్చినం అంటాడు
- రైతుల రుణాలు మాఫీ కాలేదు.. రైతు భరోసా ఇవ్వలేదు
- కాంగ్రెసోళ్లను రైతులు తన్నేటట్లు ఉన్నారు
- కొందరు అధికారులు కాంగ్రెస్ కార్యకర్తల్లా పనిచేస్తున్నారు

సిరిసిల్ల/సాక్షి, హైదరాబాద్: ఫార్మాసిటీ రద్దు వెనుక రూ.వేల కోట్ల భూకుంభకోణం ఉందని మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఫార్మాసిటీ పేరిట సేకరించిన భూములను ఇతర రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు వినియోగిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. 14 వేల ఎకరాలను తాము సేకరిస్తే ఒక్క ఎకరం కూడా సేకరించకుండా సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ అంటూ.. ఫోర్ బ్రదర్స్‌కు రియల్ ఎస్టేట్ దందా కోసం ఇవ్వాలని చూస్తున్నారని ఆరోపించారు. న్యాయమూర్తులు సైతం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో గురువారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కేటీఆర్ సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ పిచ్చోడు.. ఆయనకేం తెల్వదు.. ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండానే 35 వేల ఉద్యోగాలు ఇచ్చినం అంటాడు.. 22 మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటే పట్టించుకోడు.. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే స్పందించడు. సిరిసిల్ల నేతన్నల ఉపాధి కోసం బతుకమ్మ చీరల పథకాన్ని తెస్తే దాన్ని బంద్ చేసిండ్రు.. కేసీఆర్ కిట్లు లేవు.. రంజాన్ తోఫా లేదు.. క్రిస్మస్ కానుక లేదు. సిరిసిల్లకు ఏడేళ్లలో రూ.3,312 కోట్ల ఆర్డర్లు ఇచ్చి రూ.200 కోట్ల బకాయిలుంటే.. మేమే ఇస్తున్నామని పోజులు కొడుతున్నారు. మళ్లీ మా ప్రభుత్వమే వస్తుందనే అంచనాతో డబుల్ బెడ్రూం ఇళ్లను కట్టి లబ్ధిదారులకు అందించలేకపోయాం. 1.65 లక్షల ఉద్యోగాలు ఇచ్చి కూడా చెప్పుకోలేకపోయాం' అని పేర్కొన్నారు. తనపై కోపం, పగ ఉంటే.. తనతోనే చూసుకోవాలి.. కానీ సిరిసిల్ల నేతన్నలను గోస పెట్టవద్దని కోరారు.



సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

రికవరీ చేస్తాం...

రైతుల రుణమాఫీ కాలేదు.. రైతు భరోసా సీజన్ అయిపోయినా.. అందలేదు.. కాంగ్రెసోళ్లు ఊళ్లలోకి వెళ్తే రైతులు తన్నేటట్లు ఉన్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. కొందరు అధికారులు ఆలిండియా సర్వీస్ స్థాయిలో ఉన్న వాళ్లు కాంగ్రెస్ కార్యకర్తల్లా పని చేస్తున్నారని.. ఇష్టారాజ్యంగా పనిచేస్తే.. ఆర్డీవో అయినా.. కలెక్టర్ అయినా.. వడ్డీతో సహా చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించా రు. రిటైరై వెళ్లిపోయినా జరిగిన నష్టాన్ని సంబంధిత అధికారి నుంచి రికవరీ చేస్తామని హెచ్చరించారు. హైడ్రా పేరిట హైడ్రామా చేస్తున్నారని, తన అన్న తిరుపతిరెడ్డికి నోటీసులు ఇచ్చి వదిలేశారని, అదే పేదోళ్ల ఇళ్లను కూలగొడుతున్నారని ఆరోపించారు. మూసీ బాధితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామంటున్న సీఎం ఒక్క ఇల్లు అయినా కట్టించాడా? అని ప్రశ్నించారు. సిరిసిల్లలో తనపై నాలుగుసార్లు ఓడిపోయిన వ్యక్తి ఎలాంటి పదవి లేకపోయినా రేషన్ షాపులను అక్రమంగా అనుచరులకు కట్టబెట్టారన్నారు.

హైకోర్టునూ మోసం చేస్తున్నారు...

ఫార్మాసిటీ వ్యవహారంలో నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలతో పాటు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. 'ఎన్నికల ప్రచారంలో హైదరాబాద్ ఫార్మాసిటీని రద్దు చేసి రైతులకు భూమిని తిరిగి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వెంటనే ఫార్మా సిటీని రద్దు చేసింది. ఫార్మాసిటీ పేరు మార్చి ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ సిటీ అని రకరకాల కొత్త పేర్లను తెరపైకి తెచ్చి అతి పెద్ద కుంభకోణానికి స్కెచ్ వేసింది. ఫార్మాసిటీ విషయంలో హైకోర్టును, న్యాయమూర్తులను కూడా తప్పుదోవ పట్టించే విధంగా కోర్టులో ప్రభుత్వం అబద్ధాలు చెబుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఒక్క ఎకరం భూమి కూడా సేకరించకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ, ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీలను ఎక్కడ కడతారో చెప్పాలి'అని కేటీఆర్ నిలదీశారు. ఈ మేరకు కేటీఆర్ గురువారం బహిరంగ లేఖ రాశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫార్మాసిటీపై స్పష్టమైన ప్రకటన చేయడంతో పాటు హైకోర్టుకు వాస్తవ పరిస్థితులను తెలియజేయాలని డిమాండ్‌చేశారు.

మీ వ్యాఖ్యలు వెనక్కు తీసుకోండి

కేటీఆర్‌కు సృజన్‌రెడ్డి లీగల్ నోటీసులు

సాక్షి, హైదరాబాద్: అమృత్ టెండర్లపై తన పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేశారని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుకు శోధ కన్‌స్ట్రక్షన్స్ అధినేత సృజన్‌రెడ్డి లీగల్ నోటీసులు పంపారు. 'ఎటువంటి ఆధారాలు లేకుండా ప్రెస్‌మీట్లలో, సోషల్ మీడియాలో మాకు వ్యతిరేకంగా మాట్లాడారు. నా ప్రతిష్ఠను దెబ్బతీసేలా తప్పుడు ప్రకటనలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి దగ్గరి బంధువు కావడంతోనే శోధకన్‌స్ట్రక్షన్స్‌కు టెండర్లు ఇచ్చారంటూ ఆరోపణ చేశారు. టెండర్లలో మా కంపెనీ దక్కించుకుంది 29 శాతమే (రూ. 321కోట్లు). ఈ వ్యాఖ్యలను వెంటనే సోషల్ మీడియా నుంచి 24 గంటల్లోగా తొలగించాలి. అలాగే బహిరంగ క్షమాపణ చెప్పాలి. లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది'అని అందులో హెచ్చరించారు.

మండలి సీట్లపై కమలం కన్ను

- త్వరలో రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు
- రెండైనా గెలిచేందుకు బీజేపీ కార్యాచరణ



సాక్షి, హైదరాబాద్: త్వరలోనే జరగనున్న ఎన్నికల్లో మూడింటికి మూడు ఎమ్మెల్సీ స్థానాలను (రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్) గెలుచుకుని సత్తా చాటాలని బీజేపీ భావిస్తోంది. ఈ ఎమ్మెల్సీ సీట్లలో పార్టీ గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు పార్టీ ముఖ్యనేతలు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ఇప్పటినుంచే టీచర్, గ్రాడ్యుయేట్ ఓటర్లను పెద్దసంఖ్యలో చేర్పించేలా కార్యాచరణ అమలు చేయాలని తీర్మానించింది. ఓటర్ల నమోదుకు దరఖాస్తులను పార్టీ ఇప్పటికే పెద్దసంఖ్యలో ముద్రించి సిద్ధం చేసింది. ఈ దరఖాస్తులను ఆయా జిల్లాలకు పంపించి టీచర్, గ్రాడ్యుయేట్ ఓటర్లను చేర్పేలా చర్యలు తీసుకోనున్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలు (టీచర్స్, గ్రాడ్యుయేట్స్ చెరో సీటు), వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ సీటుకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికలు జరగనున్న జిల్లాల్లో.. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల నుంచి బీజేపీ 4 ఎంపీ, 7 ఎమ్మెల్యే సీట్లలో విజయం సాధించడం తెలిసిందే. ఈ జిల్లాల పరిధిలో ఎమ్మెల్సీ సీట్లను కూడా కచ్చితంగా గెలుపొందడం ద్వారా పార్టీ బలాన్ని నిరూపించాలని పట్టుదలతో పార్టీ నేతలున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదుకు పార్టీపరంగా ఒక ఇన్‌చార్జిని నియమించాలని నిర్ణయించినట్టు సమాచారం. గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ తరఫున గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గ అభ్యర్థిగా సుగుణాకరరావు, టీచర్స్ అభ్యర్థిగా మోహన్‌రెడ్డి పోటీ చేయడం తెలిసిందే. బీజేపీ కార్యాలయంలో గురువారం రాత్రి ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో.. పార్టీ ముఖ్యనేతలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎన్.రామచంద్రరావు, చంద్రశేఖర్ తివారీ, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని నిర్ణయించారు. బీజేపీ మెంబర్‌షిప్ డ్రైవ్–2024 పై నిర్వహించిన మరో సమావేశంలో పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, అరవింద్ మీనన్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్ తివారీ, ధర్మారావు, జి.ప్రేమేందర్‌రెడ్డి, డి.ప్రదీప్‌కుమార్, బంగారు శ్రుతి పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజాభవన్‌లో 'ప్రవాసీ ప్రజావాణి' ప్రత్యేక కౌంటర్

- ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్
- హాజరుకానున్న ప్రవాసీ ప్రభావిత నియోజకవర్గ ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్: బేగంపేటలోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల కోసం శుక్రవారం ఉదయం 10:00 గంటలకు 'ప్రవాసీ ప్రజావాణి'ప్రత్యేక కౌంటర్‌ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. ఇక నుంచి ప్రతి బుధ, శుక్రవారాల్లో ఈ కౌంటర్ కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ఇతర ప్రవాసీ ప్రభావిత నియోజకవర్గ ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. పీసీసీ ఎన్నారై విభాగం, గల్ఫ్ కార్మిక కుటుంబాలు, గల్ఫ్ సంఘాల నాయకులు గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రవాసీ ప్రజావాణి ప్రత్యేక కౌంటర్‌ను ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నం కోరారు. 'ప్రవాసీ ప్రజావాణి'ఏర్పాట్లను ఎన్ఆర్ఐ ప్రతినిధులు డాక్టర్ వినోద్ కుమార్, మంద భీంరెడ్డి, నంగి దేవేందర్‌రెడ్డి (దుబాయ్), బొజ్జ అమరేందర్‌రెడ్డి (అమెరికా), గంగసాని నవీన్‌రెడ్డి (లండన్), చెన్నమనేని శ్రీనివాస్‌రావు గురువారం పరిశీలించారు. ఇందులో వేతన బకాయిలు, యజమానితో సమస్యలు, పరిహారం, కార్మికులను ఇబ్బంది పెట్టడం, విదేశాల్లో జైలు శిక్షలు, మృతదేహాలను స్వదేశానికి రవాణా చేయడం, జాడ తెలియని వారి ఆచూకీ తెలుసుకోవడం, వివాహ సంబంధ వివాదాలు వంటి వాటిపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్లు

- రాష్ట్రంలో అమలు చేసేలా పోరాడుతాం
- బీఆర్ఎస్ నేతల ప్రకటన
- బీసీ రిజర్వేషన్లపై అధ్యయనానికి తమిళనాడులో పర్యటిస్తున్న నేతలు



చెన్నైలో బీఆర్ఎస్ నేతలు స్వామిగౌడ్, బడుగుల, బండా ప్రకాశ్, మధుసూదనాచారి, శ్రీనివాస్‌గౌడ్, గంగుల, వద్దిరాజు, దాసోజు, జోగురామన్న, చెరుకు సుధాకర్, వి.ప్రకాశ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: తమిళనాడు తరహాలో రాష్ట్రంలో కూడా విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేసేలా పోరాడుతామని బీఆర్ఎస్ నేతలు ప్రకటించారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించి, వారిని అన్ని రంగాల్లో ముందుకు నడిపించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని వారు అభిప్రాయపడ్డారు. తమిళనాడులో అమలవుతున్న రిజర్వేషన్లను పరిశీలించేందుకు మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి నేతృత్వంలో బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ చైర్మన్లు రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం చెన్నైలో అక్కడి అధికారులతో సమావేశం అయ్యారు. తమిళనాడులో రిజర్వేషన్లు ఏ విధంగా అమలు అవుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమిళనాడు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తద్వారా తమ వద్ద జరుగుతున్న రిజర్వేషన్ల అమలు తీరును బీఆర్ఎస్ నేతలకు వివరించారు. శాస్త్రీయంగా ఇంటింటి సర్వే నిర్వహించి బీసీ వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

తమిళ తరహాలో రిజర్వేషన్ల సాధనకు పోరాటం: మధుసూదనాచారి

తెలంగాణలో విద్యా ఉద్యోగాలలో బీసీలకు న్యాయమైన రిజర్వేషన్లు దక్కాలంటే తమిళనాడు తరహా రిజర్వేషన్ల అమలు ఒక్కటే అంతిమ పరిష్కార మార్గమని మధుసూదనాచారి అన్నారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎప్పుడో స్పష్టం చేశారని, సమావేశం ముగిసిన తరువాత మధుసూదనాచారి మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. తెలంగాణలో తమిళనాడు తరహా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రధాన మంత్రి మోదీని పలుమార్లు కేసీఆర్ కోరారన్నారు.

42 శాతం అమలయ్యే దాకా..

రాజ్యసభలో బీఆర్ఎస్ పక్ష నాయకుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు వి. శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, జోగు రామన్నలు మాట్లాడుతూ తెలంగాణలో బీసీలకు విద్యా ఉద్యోగాల్లోనే కాకుండా స్థానిక సంస్థల్లో నలభై రెండు శాతం రిజర్వేషన్లు అమలు చేసేదాక బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకు తమిళనాడులో అమలవుతున్న రిజర్వేషన్లు, అభివృద్ధి పథకాలపై అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, పుట్టమధు, కోరుకంటి చందర్, అలాగే జూలూరు గౌరీశంకర్, డా.ఆంజనేయగౌడ్, పల్లె రవి కుమార్, తుల ఉమ, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, నాగేందర్ గౌడ్, రవీంద్రసింగ్, బాలరాజు యాదవ్, సుభప్రద పటేల్, కిశోర్‌గౌడ్, దాసోజు శ్రీనివాస్, చెరుకు సుధాకర్, రాజ్యలక్ష్మి, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, విద్యార్థి సంఘం నేత దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

రేపు రాష్ట్రానికి నడ్డా

బీజేపీ సభ్యత్వ నమోదుపై సమీక్ష



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 28న కేంద్రమంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్రానికి వస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రపార్టీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం సాగుతున్న విషయం తెలిసిందే. మొత్తం మూడు విడతలుగా నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదును రాష్ట్ర పార్టీ నాయకత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో నడ్డా రాష్ట్రంలో మెంబర్‌షిప్ డ్రైవ్ జరుగుతున్న తీరును సమీక్షించడంతో పాటు, కేడర్‌లో ఉత్సాహం నింపేలా చర్యలు తీసుకోనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో తొమ్మిది లక్షల మందిని పైగా పార్టీ సభ్యులుగా చేర్పించినట్టుగా పార్టీ నేతలు చెబుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లలో పోటీచేసిన బీజేపీ అభ్యర్థులకు 78 లక్షల ఓట్లు పడ్డాయి. వీటిలో 75 శాతం పార్టీకి ఓటేసిన ఓటర్లను పార్టీ సభ్యులుగా చేర్పించాలని రాష్ట్ర పార్టీ లక్ష్యంగా నిర్దేశించుకుంది. సభ్యత్వ నమోదు సంతృప్తికరంగా జరుగుతున్నట్టు మెంబర్‌షిప్ డ్రైవ్ ఇన్‌చార్జి ఎన్.రామచంద్రరావు తెలిపారు. గురువారం రాత్రి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నడ్డా పర్యటన, ఈ సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై పార్టీ ముఖ్యనేతలు చర్చించారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హత్య

దుమ్ముగూడెం: ఇన్‌ఫార్మర్ నెపంతో ఒక గిరిజనుడిని మావోయిస్టులు హత్య చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. జిల్లాలోని భండార్ పదార్ గ్రామానికి చెందిన పూనెం పాండు అనే గిరిజనుడి ఇంటిపై మావోయిస్టులు దాడి చేసి.. ఇన్‌ఫార్మర్ నెపంతో కత్తులతో నరికి చంపారు. పోలీసులకు తమ సమాచారం అందజేస్తున్నాడని ఆరోపిస్తూ ఈ దారుణానికి పాల్పడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రిలేని బిడ్డలు పెళ్ళీడుకు వచ్చేవరకూ వారిని తీర్చిదిద్దండి. వారిలో కార్యదక్షత కానవస్తే వారి ఆస్తిని వారికి అప్పగించండి. వారు పెద్దవారవుతున్నారన్న భయంతో వారి ఆస్తిపాస్తులను ఆదరా బాదరగా దుబారా ఖర్చుచేయకండి.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 27 సెప్టెంబర్ 2024

'తక్షణ న్యాయం' ప్రమాదకరం

సర్వోన్నత న్యాయస్థానంతో సహా దేశంలో వివిధ హైకోర్టులు అడపా దడపా అక్షింతలు వేస్తున్నా ఎన్‌కౌంటర్ల జాడ్యం పోయేలా లేదు. ఏ పార్టీ ఏలుబడి ఉందన్నదాంతో నిమిత్తం లేకుండా దాదాపు అన్ని రాష్ట్రాల తీరూ ఇదే. కనీసం స్క్రిప్టు మార్చడానికి కూడా పోలీసులు ప్రయత్నించరు. ముద్దాయిని/ముద్దాయిలను నేరస్థలానికి తీసుకెళ్లినప్పుడో, న్యాయస్థానంలో హాజరు పరచడానికి వెళ్తున్నప్పుడో హఠాత్తుగా తిరుగుబాటు చేసి పోలీసుల నుంచి తుపాకి గుంజుకుని కాల్చబోవటం, ఈలోగా పోలీసులు అప్రమత్తమై ఎదురుకాల్పులు జరపడం వీటన్నిటి సారాంశం. పోలీసులకు స్వల్ప గాయాలు కావటం కూడా అన్నిచోట్లా డిటో. అక్షయ్ షిండే అనే నేరగాడిని మహారాష్ట్ర పోలీసులు హతమార్చిన తీరుపై బొంబాయి హైకోర్టు బుధవారం అనేక సందేహాలు వ్యక్తం చేసింది. వాహనంలో వెళ్తుండగా షిండే తిరగబడి పిస్తోల్ గుంజుకుని కాల్పులు జరిపే సమయంలో నలుగురు పోలీసులున్నా అతగాణ్ణి లొంగదీయలేకపోవటం ఏమిటని ప్రశ్నించింది. అసలు తుపాకులు, పిస్తోళ్లు ఉపయోగించటం తెలియని వ్యక్తి ఆయుధాన్ని అన్‌లాక్ చేసి కాల్పులు జరపటం ఎలా సాధ్యమని అడిగింది. ఈ ప్రశ్నలు సహేతుకమైనవి.

బద్లాపూర్ స్కూల్ ఉదంతం ఘోరమైనది. గత నెల 13న ఒక పాఠశాలలోని మరుగుదొడ్డి వద్ద ఇద్దరు కిండర్‌గార్టెన్ పిల్లలపై నిందితుడు లైంగిక నేరానికి పాల్పడ్డాడని ఆరోపణ. ఘటనపై పిల్లల తల్లిదండ్రులకు తెలిసి ఫిర్యాదుచేస్తే ముద్దాయిని ఆగస్టు 17న అరెస్టు చేశారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలు ఎందుకు తీసుకోలేదని హైకోర్టు ప్రశ్నించాకగానీ ప్రిన్సిపాల్, సంస్థ చైర్మన్, కార్యదర్శులపై పోక్సో కేసు పెట్టలేదు. ఆ స్కూల్ నిర్వహణ ఎంత ఘోరంగా ఉన్నదో చూస్తే దిగ్భ్రాంతి కలుగుతుంది. నిబంధనల ప్రకారం ఉండాల్సిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. అసలు ఆడపిల్లలు ఉపయోగించే మరుగుదొడ్డి వద్ద మహిళను నియమించాలని కూడా వారికి తోచలేదు. వీటన్నిటినీ తనిఖీ చేయాల్సిన విద్యాశాఖ పట్టించుకోలేదు. ఇంతమంది నిర్లక్ష్యం ఫలితంగా ఇద్దరు చిన్నారులు బాధితులుగా మారాక మాత్రం కఠిన చర్య తీసుకున్నట్టు కనబడటం కోసం వక్రమార్గం అనుసరించారు. స్కూల్ నిర్వాహకులు బీజేపీకి కావలసినవారు గనుకే ఎన్‌కౌంటర్ నాటకం ఆడారని శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గం నాయకుడు సంజయ్ రౌత్ ఆరోపణ. నిజానిజాల మాటెలా ఉన్నా ప్రభుత్వాధికారులు మెతగ్గా వ్యవహరించారన్నది మాత్రం వాస్తవం.

గత రెండు నెలల్లో మూడు ఎన్‌కౌంటర్లు జరిపి తమిళనాడు పోలీసులు ముగ్గురు నిందితులను హతమార్చారు. మావోయిస్టుల ప్రభావం అధికంగావున్న ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్‌లు జరగకపోతే వార్త. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ఏలుబడిలో ఎన్‌కౌంటర్ల జోరు అధికమే. గత ఏడున్నరేళ్లలో యూపీ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు 49 మందిని కాల్చిచంపారు. గత సోమవారమే మరొకరిని హతమార్చి అర్ధ సెంచరీ పూర్తి చేశారని మీడియా కథనాలు చెబుతున్నాయి. ఎన్‌కౌంటర్ మృతులంతా అమాయకులనీ, సచ్ఛీలురనీ ఎవరూ అనరు. ఎన్నో ఆరోపణలున్నవారే. కానీ నేరగాళ్లను శిక్షించటానికి ఒక విధానం ఏర్పర్చుకున్నప్పుడూ, దానికి అనుగుణంగా భిన్న వ్యవస్థలు పనిచేస్తున్నప్పుడూ ఇష్టారాజ్యంగా కాల్చిచంపే అధికారం పోలీసులకెక్కడిది? ఇది ఎక్కడికి దారితీస్తుంది? ఇలాంటి కేసులను విచారించినప్పుడల్లా న్యాయస్థానాలు నిశితంగా ప్రశ్నిస్తున్నాయి. కానీ ఎక్కడా ఇవి ఆగుతున్న దాఖలాలు లేవు. 2006లో ఇద్దరు నిందితులను నవీ ముంబైలో పట్టుకుని వారిలో ఒకరిని ఎన్‌కౌంటర్ చేసిన కేసులో 12 మంది పోలీసులకు కిందికోర్టు విధించిన యావజ్జీవ శిక్షను బొంబాయి హైకోర్టు ధ్రువీకరించటంతోపాటు కింది కోర్టు నిర్దోషిగా విడిచిపెట్టిన 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్టు' ప్రదీప్ శర్మకు కూడా యావజ్జీవ శిక్ష ఖరారు చేసింది. న్యాయవాది అయిన ఎన్‌కౌంటర్ మృతుడి సోదరుడు అతను అరెస్టయ్యాక ఉన్నతాధికారులకూ, న్యాయస్థానానికీ టెలిగ్రామ్‌లు, ఫ్యాక్స్ మెసేజ్‌లు పంపటం, కాల్ రికార్డులు సేకరించటం పర్యవసానంగా ఇదంతా సాధ్యమైంది. కానీ ఎన్ని కేసుల్లో ఎందరు ఇలా చేయగలుగుతారు?

ఎన్‌కౌంటర్లను వ్యతిరేకించే పౌరహక్కుల సంఘాల నేతలనూ, పౌర సమాజ కార్యకర్తలనూ నేరగాళ్లకు వత్తాసు పలుకుతున్నవారిగా ముద్రేయటం పాలకులకూ, పోలీసులకూ అలవాటు. కొన్ని సందర్భాల్లో ఎన్‌కౌంటర్‌లు సాగిస్తున్న పోలీసులను సమాజంలోని భిన్నవర్గాలవారు ప్రశంసించటం కూడా కనబడుతుంది. 'తక్షణ న్యాయం' కోరేవారికి ఇది సబబే అనిపించవచ్చు. కానీ ఈ క్రమంలో ప్రభుత్వాల బాధ్యతనూ, జవాబుదారీతనాన్నీ ఉపేక్షించటం లేదా? అసలు పోలీసు కాల్పుల్లో మరణించినవారే నిజమైన దోషులని ఏ ప్రాతిపదికన నమ్మాలి? ఈ ధోరణివల్ల అసలు దోషులు తప్పించుకునే ప్రమాదంతోపాటు మరిన్ని నేరాలు జరగటానికి ఆస్కారం ఉండదా? కోల్‌కతాలోని పీజీ కర్ ఆసుపత్రిలో మహిళా వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఉదంతమే తీసుకుంటే సక్రమంగా దర్యాప్తు జరిగింది గనుకే మాఫియాల ఆధిపత్యం, వారి అండతో ఆసుపత్రి ఉన్నతాధికారులు సాగిస్తున్న తప్పుడు పనులు బయటపడ్డాయి. నేరాలకు తావులేని వాతావరణం ఏర్పర్చటానికీ, వాటి నియంత్రణకు దోహదపడే చర్యలకూ బదులు నేరగాళ్లను హతమార్చే విధానం సమాజాన్ని బండబారుస్తుంది. అధికారులకు తాము ఏం చేసినా అడిగేవారు లేరన్న భరోసానిస్తుంది. కఠినమైన చట్టాలు, పకడ్బందీ దర్యాప్తు, న్యాయస్థానాల్లో చురుగ్గా విచారణ వంటివి మాత్రమే సమాజ భద్రతకు తోడ్పడతాయి. అది మరిచి 'తక్షణ న్యాయం' కోసం వెంపర్లాడటం సరికాదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, తిథి: బ.దశమి సా.4.17 వరకు తదుపరి ఏకాదశి, నక్షత్రం: పుష్యమి తె.4.39 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి ఆశ్లేష, వర్జ్యం: ప.12.06 నుండి 1.42 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.17 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.17 నుండి 1.05 వరకు, అమృత ఘడియలు: రా.10.10 నుండి 11.48 వరకు.

సూర్యోదయం : 5.53
సూర్యాస్తమయం: 5.52
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

కొత్త బయోటెక్ సీసాలో పాత సారా

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

వాతావరణ మార్పులు; ఘన, ద్రవ వ్యర్థాల సమర్థ నిర్వహణ; వ్యవసాయ ఉత్పాదకతల పెంపు, మెరుగైన ఇంధన వ్యవస్థ, ఆరోగ్య సౌకర్యాలు... బయోటెక్నాలజీ సమర్థ వినియోగంతో భారత్ అధిగమించగల సవాళ్లల్లో ఇవి కొన్ని మాత్రమే. బోలెడన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకూ బయోటెక్నాలజీ ఎంతో సాయం చేయగలదు. ఇదే విషయాన్ని గత నెల 31న విడుదల చేసిన 'బయోటెక్నాలజీ ఫర్ ఎకానమీ, ఎన్విరాన్‌మెంట్, ఎంప్లాయ్‌మెంట్ (బయో ఈ3)' విధానం ద్వారా కేంద్రం కూడా లక్షించింది. ఈ విధానంలోని అతిపెద్ద లోపం ఏమిటంటే... ఇవన్నీ ఎప్పటిలోగా సాధిస్తామన్నది స్పష్టం చేయకపోవడం. ఎందుకంటే ఇవన్నీ 2021లో 'నేషనల్ బయోటెక్నాలజీ అభివృద్ధి వ్యూహం' పేరుతో విడుదల చేసిన పత్రంలో ఉన్నవే!

'బయో ఈ3' విధానం ప్రధాన లక్ష్యం– వైవిధ్యభరితమైన కార్యకలాపాల ద్వారా పర్యావరణ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని పరిరక్షిస్తూనే, సుస్థిరాభివృద్ధి వంటి అంతర్జాతీయ సమస్యలను దీటుగా ఎదుర్కొనేందుకు బయో మాన్యుఫాక్చరింగ్ పరిష్కారాలు వెతకడం! సృజనాత్మక ఆలోచనలను టెక్నాలజీలుగా వేగంగా పరివర్తించాలని కూడా సంకల్పం చెప్పుకొన్నారు. ఇప్పటివరకూ వేర్వేరుగా జరుగుతున్న కార్యకలాపాలన్నింటినీ బయోమాన్యుఫాక్చరింగ్ అనే ఒక ఛత్రం కిందకు తీసుకు రావాలనీ, సుస్థిరమైన అభివృద్ధి పథాన్ని నిర్మించాలనీ కూడా విధాన పత్రంలో పేర్కొన్నారు.

ఈ విధానాన్ని ప్రతిపాదించే క్రమంలో కేంద్ర 'బయోటెక్నాలజీ విభాగం' (డీబీటీ) కార్యదర్శి రాజేశ్ గోఖలే జీవశాస్త్ర పారిశ్రామికీకరణకు నాంది పలుకుతున్నట్లు ప్రకటించారు. ఈ రంగంలో భారత్‌ను అగ్రగామిగా నిలుపుతామన్నారు. ఈ విధానంలోని వాపును కాస్తా పక్కకు పెడితే – బయోటెక్నాలజీ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం, డిజిటలైజేషన్, కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను ఇందుకు వాడటం కీలకాంశాలుగా తోస్తాయి. ఇదే వాస్తవమని అనుకుంటే ఇందులో కొత్తదనమేమీ లేదు. ఎందుకంటే 2021లో ఇదే డీబీటీ 'నేషనల్ బయోటెక్నాలజీ అభివృద్ధి వ్యూహం (2021–25)' పేరుతో ఒక పత్రాన్ని విడుదల చేసింది. అందులోనూ కచ్చితంగా ఇవే విషయాలను ప్రస్తావించారు. కాకపోతే అప్పుడు ఆర్థికాంశాలు, కాలక్రమం, లక్ష్య సాధనకు మార్గాల వంటివి స్పష్టంగా నిర్వచించారు.

బయోటెక్నాలజీ ఆధారంగా విజ్ఞాన, సృజనాత్మకతలతో నడిచే ఓ జీవార్థిక వ్యవస్థను అభివృద్ధి చేయాలన్నది 2021లో డీబీటీ పెట్టుకున్న లక్ష్యం. 2025 నాటికల్లా భారత్‌ను అంతర్జాతీయ బయో మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా రూపుదిద్దాలని అనుకున్నారు. బయో ఫౌండ్రీల వంటి వాటికి తగిన మౌలిక సదుపాయాలు కల్పించడం, నైపుణ్యం కలిగిన సిబ్బంది, కార్మికులను తయారు చేయడం, అందరికీ అందుబాటులో ఉండే వస్తువులను తయారు చేయగల పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా లక్ష్యాన్ని సాధించాలని అప్పట్లో తీర్మానించారు. వాతావరణ మార్పులు, ఆహార భద్రత, పర్యావరణ అనుకూల ఇంధనాలు, వ్యర్థాల సమర్థ నిర్వహణ వంటివి 2021లో గుర్తించిన ప్రాధాన్యతాంశాలు. తాజా జాబితాలోనూ ఇవే అంశాలను పునరుద్ఘాటించారు. కానీ డీబీటీ తెలివిగా పాత విధానం, వ్యూహాలను అస్సలు ప్రస్తావించకపోవడం గమనార్హం. అప్పుడు నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎందుకు సాధించలేకపోయారన్న ప్రశ్న నుంచి తప్పించుకునేందుకు అన్నమాట! 2021 విధానానికి అనుగుణంగా తీసుకున్న చర్య ఏదైనా ఉందీ అంటే... అది తాజా బడ్జెట్‌లో బయో ఫౌండ్రీల ప్రోత్సాహానికి ఒక పథకాన్ని ప్రకటించడం మాత్రమే.



బయోటెక్నాలజీ ఏయే రంగాల్లో ఉపయోగపడగలదో చెప్పాల్సిన పని లేదు. టీకాల తయారీ మొదలుకొని కొత్త రకాల వంగడాల సృష్టి వరకూ చాలా విధాలుగా సహాయకారి కాగలదని గత నాలుగు దశాబ్దాల్లో నిరూపణ అయ్యింది. దేశ విధాన రూపకర్తలు దీని సామర్థ్యాన్ని ముందుగానే గుర్తించారు. 1986 లోనే బయోటెక్నాలజీ రంగానికి ఊతమిచ్చేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. తొలినాళ్లలో ఇది దేశవ్యాప్తంగా పరిశోధన, విద్య అవకాశాలను పెంచడం వల్ల ఈ రోజు అంతర్జాతీయ స్థాయిలో కీలక స్థానానికి చేరుకోగలిగింది.

అయితే బయోటెక్నాలజీ ఆధారిత పరిశ్రమ వృద్ధి కొంచెం నెమ్మదిగానే జరిగిందని చెప్పాలి. వెంచర్ క్యాపిటలిస్టుల లేమి, తగిన వాతావరణం లేకపోవడం ఇందుకు కారణాలు. అయినప్పటికీ పరిశ్రమ అందుబాటులోకి తెచ్చిన ఉత్పత్తులేవీ డీబీటీ కార్యక్రమాల కారణంగా వచ్చినవి కాకపోవడం గమనార్హం. భారతీయ బయోటెక్ పరిశ్రమకు ఇష్టమైన ప్రతినిధిగా చూపే 'బయోకాన్'... డీబీటీ ఏర్పాటు కంటే మునుపటిది. శాంత బయోటెక్, భారత్ బయోటెక్ వంటి కంపెనీలు కూడా టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డు వంటి ఇంకో ప్రభుత్వ విభాగపు రిస్క్ ఫైనాన్సింగ్ ద్వారా ఏర్పాటు చేసినవే.

2000లలో కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బయో టెక్నాలజీ రంగం కోసం ప్రత్యేక విధానాలను ప్రకటించడమే కాకుండా పరిశ్రమలకు ప్రోత్సాహకాలూ అందించాయి. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, ఐకేపీ నాలెడ్జ్ పార్క్‌ల విజయం ఈ విధానాల ఫలమే. 2012లో మాత్రమే డీబీటీ పారిశ్రామిక ప్రోత్సాహం కోసం ప్రత్యేక వాణిజ్య విభాగాన్ని ఏర్పాటు చేసింది. దీన్నే 'ద బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్'... క్లుప్తంగా బైరాక్ అని పిలుస్తారు.

ప్రభుత్వం గతానుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలు, మన సామర్థ్యాల ఆధారంగా బయోటెక్నాలజీ రంగంలో పరిశ్రమలను ప్రోత్సహించాల్సి ఉంటుంది. కానీ తాజా విధానంలో జీనోమ్ వ్యాలీ, ఐకేపీ నాలెడ్జ్ పార్క్ వంటి విజయవంతమైన నమూనాల ప్రస్తావనే లేదు. కాకపోతే ఇదే భావనను 'మూలాంకుర్ బయో ఎనేబ్లర్ హబ్' అన్న కొత్త పేరుతో అందించింది. విధాన పత్రం ప్రకారం ఈ హబ్స్ ఆవిష్కరణలు, ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్‌లను సమన్వయ పరుస్తాయి. పైలట్ స్కేల్, వాణిజ్య పూర్వ పరిశోధనలకు సహకారం అందిస్తాయి. ఇప్పటికే దేశంలో ఉన్న టెక్నాలజీ క్లస్టర్లు చేస్తున్నది కూడా ఇదే.

కేంద్రం సర్వరోగ నివారిణిగా ప్రచారం చేస్తున్న ఈ కొత్త విధానం నియంత్రణ వంటి అంశాలను పెద్దగా పట్టించుకున్నట్లు లేదు. మౌలిక పరిశోధనలకు తగినన్ని ప్రభుత్వ నిధులను అందుబాటులో ఉంచడం, సాంకేతిక పరిజ్ఞానం, మానవ వనరుల అభివృద్ధి విషయాల్లోనూ ప్రభుత్వం నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నదీ విస్మరించింది. బయో మాన్యుఫాక్చరింగ్‌కు నియంత్రణ వ్యవస్థ కీలకం. ఎందుకంటే జన్యు మార్పిడి చేసిన సూక్ష్మజీవులు, ఇతర జీవజాలాన్ని వాడతారు కాబట్టి. ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించిన నిబంధనలు చెల్లాచెదురుగా ఉండటమే కాదు, పారదర్శకంగానూ లేవు. ఓ భారీ బయోటెక్ ఆధారిత వ్యవస్థను ఏర్పాటు చేయాలని అనుకున్నప్పుడు అంతకంటే ముందే స్వతంత్ర, చురుకైన చట్టపరమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం అవసరం.

ఐటీ విప్లవం మాదిరిగానే బయోటెక్నాలజీ ఆధారంగా సరికొత్త పారిశ్రామిక విప్లవాన్ని తీసుకొస్తామని డీబీటీ కార్యదర్శి వ్యాఖ్యానించారు. సమాచార రంగంలో వచ్చిన మార్పులే ఐటీ విప్లవానికి నాంది అనీ, ఏదో విధానాన్ని రూపొందించి విడుదల చేయడం వల్ల మాత్రమే ఇది రాలేదనీ ఆయన గుర్తించాలి. డిజిటల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌ను సొంతంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం గట్టిగా సంకల్పించడం, పెట్టుబడులు పెట్టడం, డెడ్‌లైన్లను విధించడం వల్లనే దేశంలో ఈ రోజు ఐటీ రంగం ఈ స్థాయిలో ఉంది. అలాగే ప్రభుత్వం స్వయంగా సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ పథకాన్ని ప్రవేశపెట్టడం వల్ల ఈ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందింది. ప్రభుత్వం కేవలం ప్రకటనలు చేయడం కాకుండా నిర్ణయాత్మకంగా వ్యవహరించడం కీలకం.

విధానాలు అనేవి బాధ్యతాయుతమైన పాలనకు మార్గదర్శక పత్రాల్లా ఉండాలి. ఉన్నతాశయాలు, దార్శనికతతో ఉండటం తప్పు కాదు. కానీ, లక్ష్యాలేమిటి? వాటి సాధనకు ఉన్న కాలపరిమితి, సవాళ్లపై అవగాహన అవసరం. కాలపరీక్షకు తట్టుకున్న పాత విధానాన్ని కాకుండా కొత్త మార్గాన్ని అనుసరించాలని డీబీటీ ప్రయత్నించింది. శాస్త్రీయ విభాగం అయినందుకైనా తార్కికమైన, ఆధారాల కేంద్రిత విధానాన్ని రూపొందించి ఉంటే బాగుండేది. 'ఆర్థిక వ్యవస్థ', 'ఉపాధి కల్పన' రెండూ శీర్షికలోనే ఉన్నా ఈ విధానం ప్రాథమ్యాలు అస్పష్టం, సందేహాస్పదం. వాక్చాతుర్యం తప్ప ఏమీలేదు.

వ్యాసకర్త సైన్స్ వ్యవహారాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



అలా మారింది!



బీరూట్ (లెబనాన్ రాజధాని)ని ఒకప్పుడు 'తూర్పు పారిస్' అనేవాళ్లు. ఇప్పుడు పారిస్‌ను 'పశ్చిమ బీరూట్' అంటున్నారు.

– ఇంతియాజ్ మహమూద్, వ్యాఖ్యాత

పాయిరం చూపొద్దు!



మీ ఊపిరితిత్తుల మీద మీకు ప్రేముంటే, పావురాలకు గింజలు వేయడం మానండి. పావురాల రెట్టలతో ఏర్పడిన దుమ్మును పీల్చుకుంటే– ముఖ్యంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్లలో– బ్యాక్టీరియా, ఫంగల్ లేదా అలెర్జిక్ ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.

– జకర్ డాక్టర్, ఫిజీషియన్

రెండు ముఖాలు



బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ అమెరికాలో మహ్ఫూజ్ ఆలమ్‌ను పరిచేయం చేస్తూ, షేక్ హసీనాను దింపిన 'మొత్తం విప్లవ మేధ' అని పరిచయం చేశారు. ఆయన నిషేధిత ఇస్లామిక్ తీవ్రవాద సంస్థ 'హిజ్బ్ ఉత్–తహరీర్' నాయకుడు. బిల్ క్లింటన్ (అమెరికా మాజీ అధ్యక్షుడు) చప్పట్లు కొట్టారు. ఈ అమెరికానేనా ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ, ఇస్లామిక్ తీవ్రవాదులతో పోరాడేది?

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

జ్ఞానంతో అణకువ



మన్మోహన్ సింగ్ (మాజీ ప్రధాని) మర్యాద, అణకువ గుణాలు ఆయన లోతైన జ్ఞానం, ఆత్మవిశ్వాసం వల్ల ఏర్పడినవి. గట్టిగా పెద్ద మాటలు మాట్లాడే నాయకులు తమలో లేని ఆత్మవిశ్వాసాన్ని దాచుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. ఆయన అలాంటి రకం కాదు. ఆయనతో కలిసి నేను పనిచేయడం సంతోషకరం. హ్యాపీ బర్త్ డే (సెప్టెంబర్ 26).

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

విభజన రాజకీయాలా?



కంట్లో పడ్డ కథనం: ఇదే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేస్తే పెద్ద వ్యతిరేకత వచ్చింది. కాని దాన్నే అనుసరిస్తూ, ఆహారం అమ్మకందారుల పేర్లను ప్రదర్శించాలని హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వం అంటోంది. ఆహార రాజకీయాలు మనల్ని విభజించడానికి ఎన్నాళ్లు అంగీకరిద్దాం? ఇదే శక్తి మెరుగైన ఆహారం, ఆరోగ్యం మీద పెట్టివుంటే మంచి పాలన అవుతుంది.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

తులానికి లక్ష?



అందరికీ యుద్ధమే కావాలి. ఆపేవాళ్లు ఎవరూ లేరు. ప్రపంచం మాంద్యం వైపు పయనిస్తోంది. ముడి చమురు పడిపోతుంది, రూపాయి బలహీనం అవుతుంది, ఇదే కొనసాగితే మార్చ్ లేదా అంతకుముందే బంగారం ధర తులానికి (పది గ్రాములు) లక్ష అవుతుంది.

– ప్రవేశ్ జైన్, పారిశ్రామికవేత్త

లైకులు ఎందుకు?




చాలామంది ఎదుటివాళ్ల అటెన్షన్ కోసం పిచ్చెక్కిపోతున్నారు. కొన్నిసార్లు దీనికి మూల్యంగా వాళ్లు అత్యంత విలువైనది చెల్లిస్తుంటారు. అవును, మనశ్శాంతి. సోషల్ మీడియాలో చూడండి. తరచుగా వారి జీవితంలోని అత్యంత ఐహిక విషయాన్ని పోస్ట్ చేసి, లైక్స్, కామెంట్స్ కోసం ఎదురుచూస్తుంటారు. ఈ గొడవల్లో పడకండి. మీ హుందాతనాన్ని నిలుపుకోండి.

– ముఫ్తి మెంక్, మత గురువు

ఇన్ బాక్స్

ఉద్యమాల కొండ

తెలంగాణ ప్రాంతానికి దాస్య విముక్తి కల్పించిన నాయకుల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ ఒకరు. ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ తాలూకాలోని వాంకిడి అనే కుగ్రామంలో ఒక నిరు పేద చేనేత కుటుంబంలో 1915 సెప్టెంబర్ 27న బాపూజీ జన్మించారు. భూమికోసం, భుక్తికోసం, నిజాం సంస్థానంలో సుదీర్ఘకాలం కొనసాగిన సంగ్రామంలో జనానికి అండగా నిలిచారు. ఆయన ఇచ్చిన 'జై తెలంగాణ' నినాదం ప్రజాబాహుళ్యాన్ని జాగృత పర్చింది.



కొండా లక్ష్మణ్ బాపూజీ

1938లో తాను మెట్రిక్యులేషన్ చదువుతున్నప్పుడే హైద్రాబాద్ స్టేట్ కాంగ్రెస్‌లో చేరి పౌర హక్కుల ఉద్యమం, వందేమాతర ఉద్యమం, ఆంధ్ర మహా సభల్లో క్రియాశీలక పాత్ర పోషించి పలువురు జాతీయ నాయకుల దృష్టిని ఆకర్షించారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో ఆబిడ్స్ పోస్ట్ ఆఫీసుపై, కోఠిలో ఉన్న బ్రిటిష్ రెసిడెన్సీపై జాతీయ జెండా ఎగురవేసి సంచలనం సృష్టించారు. నవాబుల పాలనలో నలిగిపోతున్న ప్రజానీకాన్ని రక్షించాలంటే మీర్–ఉస్మాన్ అలీఖాన్‌ను అంతమొందించడం ఒక్కటే మార్గమని భావించి షోలాపూర్, బొంబాయి, అహ్మదాబాద్‌లలో 'పహాడీ' (కొండ) పేరుతో ప్రచ్ఛన్న కార్యకలాపాలు నిర్వహించి నిజాం రాజుపై బాంబు దాడికి వ్యూహం రచించారు.

రెండు దఫాలు మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా సేవలందించారు. ముల్కీ ఉద్యమం నుండి మొన్నటి తెలంగాణ ఉద్యమం దాక ముందుండి నడిపించారు. కార్మికులను, చేతివృత్తుల వారిని సమీకరించి సహకార రంగం పరిధిలోకి తీసుకొచ్చారు. బీసీల స్థితిగతులను అధ్యయనం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం నియమించిన కాకా కాలేల్కర్ కమిటీ, మండల కమిషన్‌లకు జనాభా దామాషా ప్రకారం రేజర్వేషన్లతో పాటు రాజ్యాధికారంలో బీసీలకు వాటా దక్కేలా చూడాలని నివేదించారు. ప్రభుత్వాలు సమగ్ర కుల గణన చేపట్టి ఆ దిశలో ముందడుగు వేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి.

– డా॥ వంగర భూమయ్య, పాలమూరు విశ్వవిద్యాలయంలో సహాయాచార్యులు (నేడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి)

తప్పను సరిదిద్దుకునే మార్గాలు

పర్యావరణం సమతుల్యత కోల్పోయింది. కాదు... పర్యావరణాన్ని మనమే ప్రమాదంలోకి నెట్టేశాం. మన పనుల ద్వారా భూ ఆవరణాన్ని కాలుష్య కాసారంగా మార్చాం. ప్రకృతిని పీల్చి పిప్పి చేస్తున్నాం. ఈ పూట గడిస్తే చాలు అన్న ట్లుగా వనరుల విధ్వంసానికి పాల్పడుతున్నాం. ప్రకృతి మాత మూలుగను పీల్చేస్తున్నాం. వెరసి... జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు వాడుకోవాల్సిన పర్యావరణ వనరుల బడ్జెట్‌ను పరిమితికి మించి ఓవర్ డ్రాఫ్ట్ ఖాతాలో తెగ వాడేసుకుంటున్నాం.

అవసరాలు తీర్చుకోవటానికి కాకుండా అత్యాశకు పోయి వార్షిక పర్యావరణ బడ్జెట్‌ను ఆగస్టు 1 నాటికే పూర్తిగా కాజేసి... ఆ తర్వాత ప్రతి క్షణం ప్రకృతి మాత మూలుగను అదే పనిగా పీల్చేస్తున్నాం. దాంతో, తిరిగి తిప్పుకోలేని స్థితికి చేరిన భూగోళం గతి తప్పి సమతుల్యతను కోల్పోయింది. మొన్నటి వరకు గతమెన్నడూ ఎరుగనంతగా అత్యధిక ఉష్ణోగ్రతలు, ఇప్పుడేమో అతి భారీ కుండపోత వర్షాలు, భీకర వరదలు; ములుగు జిల్లాలో అభయారణ్యం నేలమట్టం కావటం... ఐక్య రాజ్యసమితి ప్రకటించి నట్లు ఇవన్నీ 'క్లైమేట్ ఎమర్జెన్సీ'కి ప్రత్యక్ష నిదర్శనాలు.

భూగోళం గతమెన్నడూ లేనంత ఎక్కువగా వేడెక్కుతోంది. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశా ల్లోనూ గత 13 నెలలు అత్యంత అధిక ఉష్ణో గ్రతలు నమోదయ్యాయి. భూతాపాన్ని పెంచ టంలో, భూగోళం ఆరోగ్యాన్ని క్షీణింప జేయటంలో వ్యవసాయం, ఆహార సరఫరా రంగాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని గణాంకాలు చెబు తున్నాయి. మనుషులు, పశువుల ఆరోగ్యాన్ని కూడా ఇది ప్రభావితం చేస్తోంది. మనం పండిస్తున్న ఆహారంలో యాంటీ ఆక్సిడెంట్లు, సూక్ష్మ పోషకాలు, ఫైటో న్యూట్రియంట్స్ భారీగా తగ్గి పోయాయి. భూగోళం ఆరోగ్యాన్ని అనేక విధాలుగా క్షీణింపజేయటంలో పారిశ్రామిక వ్యవసాయ–ఆహార వ్యవస్థల పాత్ర చాలా ఉంది.

2022 నాటికే లక్ష్మణరేఖ దాటేశాం...

క్లైమేట్ ఛేంజ్‌పై పరిశోధనలు చేస్తున్న మూడు ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఒకటైన స్టాక్‌హోం రెజిలియన్స్ సెంటర్ (ఎస్ఆర్‌సీ) సమాచారం ప్రకారం...



ప్రకృతి వనరుల విచ్చలవిడి వినియోగ తీరును బట్టి, భూతాపోన్నతిని బట్టి... భూగోళం ఆరోగ్యాన్ని 9 అంశాల ప్రాతిపదికగా అంచనా వేస్తారు.

ఈ 9 అంశాల్లో ఆరింటిలో 2022 నాటికే లక్ష్మణరేఖ దాటేశాం. ముఖ్యమైన విషయం ఏమిటంటే... ఈ ఆరింటిలో ఐదింటికి కారణం వ్యవసాయం, ఆహార వ్యవస్థలేనని ఎస్ఆర్‌సీ తేల్చి చెప్పింది.

నీటి వినియోగం, జీవావరణ సమగ్రత, భూమి వినియోగ మార్పిడి, నావెల్ ఎన్‌టిటీస్, నత్రజని/ఫాస్ఫరస్ వంటి రసాయనాల వాడకం... ఈ ఐదు అంశాల్లో పరిస్థితి విషమించటడానికి ఒకానొక మూల కారణం ముఖ్యంగా రసాయనిక/పారిశ్రామిక వ్యవసాయం, ఆహార వ్యవస్థ లేనని ఎస్ఆర్‌సీ నిర్ధారణకు వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా సాగు భూమిలో 40 శాతం ఇప్పటికే సాగు యోగ్యం కాకుండాపోయి బంజరుగా మిగిలి పోయింది. ఈ ఖాళీ భూముల నుంచి, పంట లేని పొలాల నుంచి రీ రేడియేషన్ ప్రక్రియ ద్వారా సూర్యరశ్మి వాతావరణంలోకి పరావర్తనం చెందటం భూతాపోన్నతికి దోహదం చేస్తోంది. పారిశ్రామిక వ్యవసాయ క్షేత్రాల నుంచి వస్తు సరఫరా వ్యవస్థ చివరి గొలుసు వరకు (అగ్రీ ఫుడ్ సిస్టమ్స్) వెలువడే కర్బన ఉద్గారాలు క్లైమేట్ ఛేంజ్‌కు 34 శాతం మేరకు కారణభూతాలని గుర్తించాలి.

తిరిగి ప్రాణశక్తిని పుంజుకొని సమతుల్యతను సంతరించుకోవడంలో భూగోళానికి తోడుగా ఉండటానికి మార్గాలేవీ లేవా? తప్పకుండా ఉన్నాయన్నది నిపు ణులు చెబుతున్న గుడ్ న్యూస్. వాటిల్లో ఒకటేమిటంటే... పునరుజ్జీవన (ప్రకృతి/సేంద్రియ) వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా అమల్లోకి తేవటం! తద్వారా కొద్ది సంవత్సరాల్లోనే క్లైమేట్ సంక్షోభం నుంచి చాలా వరకు బయటపడొచ్చని సుసంపన్న అనుభవాలే తెలియజెబుతున్నాయి.

– పంతంగి రాంబాబు
సీనియర్ జర్నలిస్ట్ ׀ 86397 38658

నిదానమే ప్రధానం

మేధాతిథి అనే తాపసుని పుత్రుడు చిరకారి. అతడు ఏ పనిని తొందరపడి చేయడు. చక్కగా ఆలోచించి చేస్తాడు. అందువలన అందరూ అతనిని చిరకారి అని పిలిచేవారు. ఒకసారి మేధాతిథికి భార్యపై బాగా కోపం వచ్చింది. కొడుకును పిలిచి ఆమెను చంపమని ఆజ్ఞాపించి అతడు ఎక్కడికో వెళ్ళిపోయాడు. చిరకారి చాలా సేపు ఇలా ఆలోచించాడు: 'తండ్రి ఆజ్ఞను ఉల్లంఘించటం మంచిది కాదు. అలాగని తల్లిని చంపటం యుక్తం కాదు. తల్లి నెలాగైనా కాపాడుకోవాలి. తల్లిదండ్రుల మధ్య పుత్రత్వం అనేది స్వేచ్ఛ లేనిదిగా ఉంది. నేను ఇద్దరికీ చెందినవాడను. ఈ క్లిష్ట పరిస్థితిలో వీరిద్దరిలో ఎవరిని వదులుకోవాలి? కొడుకు ఏ వయసులో ఉన్నా తల్లి ప్రేమ, రక్షణ బాధ్యత ఒకే విధంగా ఉంటాయి. తల్లి లేకపోతే లోకం శూన్యమై పోతుంది. ఇంతటి పూజ్యురాలైన తల్లిని వధించటానికి నాకు చేతులెలా వస్తాయి?' అనుకుంటూ చిరకారి సుదీర్ఘంగా ఆలోచిస్తూ ఉంటాడు.

జ్యోతిర్మయం

'మాతృ దేవోభవ' అనే సూక్తి కూడా తల్లినే ప్రథమ దైవంగా భావించమని బోధించింది. చిరకారి తండ్రి మాట కాదనలేక, తల్లిని చంపలేక కత్తి చేత్తో పట్టుకుని ఆలోచిస్తూ ఉండగా, మేధాతిథిలో పశ్చాత్తాప భావన మొదలైంది. చిన్న తప్పుకు కోపించి భార్యను చంపమని కొడుకుని ఆజ్ఞాపించాను. చిరకారి ఏ పనైనా దీర్ఘంగా ఆలోచించి కాని చేయడు. మాతృ వధకు పూనుకోకుండా తన పేరు సార్థకం చేసుకుంటే బాగుండును అనుకుంటూ ఇంటికి వస్తాడు. చిరకారి చేతిలో ఖడ్గాన్ని వదిలి తండ్రి పాదాలకు నమస్కరించాడు. భార్య కూడా ఆయనకు నమస్కరించింది. ఆయన వారిద్దరినీ దీవించాడు. ఏ పనైనా తొందరపడక, ఆలోచించి ధీరత్వంతో చేసేవాడు సమస్త శుభాలు పొందుతాడని మేధాతిథి చెబుతాడు.

ధర్మరాజు కార్యాచరణలో అవసరమైనది బహు దీర్ఘ సమయమా? అత్యల్ప సమయమా అని భీష్ముని అడిగినప్పుడు ఆయన చిరకారి కథ చెప్పి అలా చేయమని చెబుతాడు. ఏ పనినైనా తొందరపాటుతో చేస్తే అనర్థాలు కలుగుతాయి. ఆలోచించి చేస్తే సత్ఫలితాలు కలుగుతాయి అని సారాంశం.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

ఏటీసీల్లో కొలువుల భర్తీకి కసరత్తు

- రాష్ట్రవ్యాప్తంగా 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వం
- వాటిలో మంజూరైన పోస్టులు 2,033... ఖాళీలు 740కి పైమాటే
- సరికొత్త ట్రేడ్‌లకు అనుగుణంగా అర్హతగల ఫ్యాకల్టీ నియామకానికి ప్రణాళిక

సాక్షి, హైదరాబాద్: నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లుగా అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యంలో వాటిలో ఉద్యోగ ఖాళీల భర్తీపై కార్మిక ఉపాధి కల్పన విభాగం దృష్టి సారించింది. దాదాపు పదేళ్లుగా ఐటీఐల్లో ఉద్యోగ నియామకాలు జరగకపోవడంతో దాదాపు 40 శాతం కొలువులు ఖాళీగా ఉన్నట్లు ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఖాళీలను వీలైనంత త్వరగా భర్తీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి గతవారం కార్మిక, ఉపాధి కల్పన శాఖపై సమీక్షలో ఆదేశించారు. దీంతో ఏటీసీలవారీగా ఖాళీలను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. వచ్చే నెల రెండో వారంలోగా కార్మిక శాఖకు నివేదికలు సమర్పించనున్నారు.

ప్రతి ఏటీసీకి పూర్తిస్థాయి ప్రిన్సిపాల్...

రాష్ట్రంలోని 65 ప్రభుత్వ ఏటీసీల్లో వివిధ కేటగిరీల్లో 2,033 ఉద్యోగాలు మంజూరయ్యాయి. అందులో మూడింట రెండో వంతు శిక్షణ ఇచ్చే శిక్షకుల పోస్టులు ఉన్నాయి. దాదాపు 1,500 శిక్షకుల పోస్టుల్లో 740 ఖాళీలు ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఏటీసీలవారీగా ఏయే కేటగిరీలో ఎన్ని ఖాళీలున్నాయనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఏటీసీలలో కొత్త ట్రేడ్‌లను పరిచయం చేయనుంది. పాత ట్రేడ్‌లు రద్దు చేస్తూనే వాటి స్థానంలో కొత్త ట్రేడ్‌లను ప్రవేశపెడుతోంది. ఈ క్రమంలో కొత్త ట్రేడ్‌లపై శిక్షణ ఇచ్చే శిక్షకులకు అర్హతలను ఖరారు చేస్తూ ఖాళీల భర్తీకి ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. సగానికిపైగా ఏటీసీల్లో పూర్తిస్థాయి ప్రిన్సిపాల్ లేకపోవడంతో ఇన్‌చార్జీలతోనే నెట్టుకొస్తున్నారు. ప్రతి ఏటీసీకి తప్పకుండా ప్రిన్సిపాల్ ఉండాలని సీఎం స్పష్టం చేయడంతో ప్రిన్సిపాల్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలా లేక నూతన నియామకాల్లో భాగంగా చేపట్టాలా అనే అంశంపై కార్మిక శాఖ కసరత్తు చేస్తోంది. మరోవైపు నూతన ఏటీసీల ఏర్పాటుపైనా అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

ఆఫీసులోనే ప్రభుత్వోద్యోగి ఆత్మహత్య

- రియల్ ఎస్టేట్, స్టాక్ మార్కెట్‌లో నష్టాలతో ఘాతుకం


అశోక్‌కుమార్

గద్వాల క్రైం: ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో ఓ ప్రభుత్వ ఉద్యోగి తాను పనిచేస్తున్న కార్యాలయంలోనే ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గురువారం ఈ విషాద ఘటన వెలుగుచూసింది. పోలీసులు, కుటుంబ సభ్యులు, సహచరుల కథనం ప్రకారం గద్వాల పట్టణంలో నివసిస్తున్న అశోక్‌కుమార్ (41), భార్య వీరావతి ప్రభుత్వోద్యోగులు. వారికి ఓ కుమారుడు ఉన్నాడు. గద్వాల ఇరిగేషన్ శాఖలో పనిచేసే అశోక్ కుమార్ 20 రోజుల కిందటే సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందగా ఆయన భార్య అక్కడే జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అయితే రియల్ ఎస్టేట్, స్టాక్ మార్కెట్‌లో భారీ లాభాలు ఆర్జించొచ్చని భావించి అశోక్‌కుమార్ పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాడు. కానీ భూముల ధరలు పడిపోవడం, స్టాక్ మార్కెట్‌లో నష్టాలు చుట్టుముట్టడంతో తెలిసిన వ్యక్తుల ద్వారా భారీ మొత్తంలో అప్పులు తీసుకున్నట్లు తెలుస్తోంది. జీతం సొమ్మంతా వడ్డీలకే పోతుండటంతో ఈ విషయమై ఇంట్లో గొడవలు తీవ్రమయ్యాయి. ఈ పరిణామాలతో తీవ్ర మనస్తాపానికి గురైన అశోక్‌కుమార్ బుధవారం రాత్రి పట్టణంలోని కేఎల్ఐ క్యాంపులో ఉన్న ఇరిగేషన్ కార్యాలయంలో ఆఫీస్ రికార్డులు రాసే పని ఉందని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి 11 గంటల వేళ తన గదిలోనే ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకొని మృతిచెందాడు. గురువారం ఉదయం కార్యాలయానికి వచ్చిన అటెండర్ ఇక్బాల్ దీన్ని గమనించి ఉన్నతాధికారులు, కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై కల్యాణ్ కుమార్ తెలిపారు.

కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం పొంది..

అశోక్‌కుమార్ తండ్రి పాగ విజయ్‌కుమార్ అదే శాఖలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ 12 ఏళ్ల క్రితం మృతి చెందడంతో అశోక్‌కుమార్‌కు కారుణ్య నియామకం కింద జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. ఆయనకు 20 రోజుల క్రితమే వనపర్తి జిల్లా పెబ్బేరు డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది.

కిషిదా వారసుడెవరో!

నేడు లిబరల్ డెమొక్రటిక్ పార్టీ నేత ఎన్నిక

వారికే ప్రధాని పదవి	జపాన్‌కు తొలి మహిళా ప్రధాని వచ్చేనా?	టాప్‌-3లో తకైచీ	మొత్తం 9 మంది పోటీ

జపాన్ అధికార పార్టీ లిబరల్ డెమొక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) ప్రతి మూడేళ్లకు ఒకసారి ప్రభుత్వాన్ని నడిపేందుకు తమ నాయకుడిని ఎన్నుకుంటుంది. ప్రధాని ఫుమియో కిషిదా 2021లో ఎల్‌డీపీ నేతగా ఎన్నికై ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. మూడు పర్యాయాలు పదవి చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రజాదరణ తక్కువగా ఉండటాన్ని దృష్టిలో పెట్టుకొని కిషిదా తాను మరోమారు ప్రధాని పదవికి పోటీపడటం లేదని చాన్నాళ్ల కిందటే ప్రకటించారు. అక్టోబర్ ఒకటిన కిషిదా, ఆయన కేబినెట్ రాజీనామా చేయనుంది. అదేరోజు పార్లమెంటు ఆమోదముద్ర పడ్డాక కొత్త ప్రభుత్వం ఏర్పాటవుతుంది. కిషిదా నిష్క్రమణ నేపథ్యంలో లిబరల్ డెమొక్రటిక్ పార్టీ నాయకత్వానికి తీవ్ర పోటీ నెలకొంది. శుక్రవారం జరిగే ఎన్నికలో ఏకంగా తొమ్మిది మంది బరిలో ఉన్నారు. వీరిలో కొందరు ప్రస్తుత కేబినెట్ మంత్రులు కాగా.. మరికొందరు మాజీ మంత్రులు. దిగువసభ కాలావధి 2025 అక్టోబర్ వరకు ఉన్నప్పటికీ.. కొత్త ప్రధానిగా ఎన్నికైన వారు తమ కొత్త ఇమేజ్‌ను ఉపయోగించుకొని.. ఎన్నికల్లో లబ్ధి పొందాలని భావిస్తున్నారు. ప్రధాని పదవి చేపట్టాక కొద్ది వారాల్లోనే ఎన్నికలకు వెళతామని చాలా మంది పోటీదారులు బాహాటంగానే చెప్పారు.

ఓటింగ్ జరిగేదిలా..

లిబరల్ డెమొక్రటిక్ పార్టీ నాయకత్వ ఎన్నిక శుక్రవారం జరగనుంది. ఎల్‌డీపీకి 368 మంది ఎంపీల బలముంది. ఎంపీకి ఒక ఓటు ఉంటుంది. 11 లక్షల ఎల్‌డీపీ సభ్యుల ప్రాధామ్యాలకు అనుగుణంగా మరో 368 ఓట్లను పోటీపడుతున్న అభ్యర్థులకు కేటాయిస్తారు. అంటే తొలిరౌండ్‌లో మొత్తం 736 ఓట్లు ఉంటాయి. మొదటిరౌండ్‌లో 50 శాతానికి పైగా ఓట్లు సాధించిన వారిని విజేతగా ప్రకటిస్తారు. ఏకంగా తొమ్మిది మంది బరిలో ఉండటంతో తొలిరౌండ్‌లో ఏ ఒక్కరూ 50 శాతం ఓట్లను సాధించే అవకాశాలు లేవని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో శుక్రవారమే రెండో రౌండ్ ఓటింగ్ జరుగుతుంది. మొదటిరౌండ్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారు తదుపరి రౌండ్ ఓటింగ్‌కు అర్హత సాధిస్తారు. ఈ రౌండ్లో 368 మంది ఎంపీలకు తోడు 47 మంది స్థానిక ప్రభుత్వాల ప్రతినిధులు ఓటింగ్‌కు అర్హులు. మొత్తం 415 ఓట్లు ఉంటాయి. తమ పరిధిలోని మెజారిటీ పార్టీ సభ్యులు ఎవరివైపు మొగ్గుచూపారో దానికి అనుగుణంగా స్థానిక ప్రభుత్వాల ప్రతినిధులు తమ ఓటు వేస్తారు.

ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ

కిషిదా కుర్చీ కోసం తొమ్మిది మంది రేసులో నిలిచినా.. ప్రధానంగా పోటీ ముగ్గురి మధ్యే ఉందని పలు పోల్ సర్వేలు చెబుతున్నాయి. మాజీ రక్షణమంత్రి షిగెరూ ఇషిబా, మాజీ పర్యావరణ మంత్రి షిన్‌జిరో కొయిజుమీ, ఆర్థిక భద్రత మంత్రి తకైచీ సనయీలు ముందంజలో ఉన్నారు. యోషిమాసా హయాషి, తకయుకి కొబయాషి, తొషిమిత్సు మొతెగి, యోకో కమికావా, టారో కోనో, కత్సునోబు కటో.. మిగతా పోటీదారులు. టాప్‌–3 పోటీదారుల వివరాలిలా ఉన్నాయి...

షిగెరూ ఇషిబా (67)- ఆపత్కాలంలో అనుభవజ్ఞుడు

ఇషిబా మాజీ బ్యాంకర్. ఎల్‌డీపీ నాయకత్వానికి ఆయన పోటీపడటం ఇది ఐదోసారి. ఇదే తన చివరి ప్రయత్నమని ప్రకటించారు. 1986లో తొలిసారిగా పార్లమెంటుకు ఎన్నికైన ఇషిబా రక్షణ, వ్యవసాయ శాఖలతో పాటు పలు మంత్రిత్వ శాఖలు చూశారు. పార్టీ పదవుల్లోనూ పనిచేశారు. ప్రజల్లో ఆదరణ ఉన్నప్పటికీ.. తోటి ఎంపీల నుంచి ఆశించినంత మద్దతు కూడగట్టుకోలేకపోయారు. ఏడాది కాలంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో విపక్ష కాన్స్టిట్యూషనల్ డెమొక్రాటిక్ పార్టీ మాజీ ప్రధాని యోషిహికో నోడాను తమ నాయకుడిగా ఎన్నుకుంది. వాగ్ధాటితో ప్రజలను ఆకట్టుకునే నోడాను ఎదుర్కొనడానికి ఇషిబా అనుభవం, విషయ పరిజ్ఞానం, నైపుణ్యం అక్కరకొస్తాయని ఎల్‌డీపీ భావిస్తోంది. రక్షణ విధానాల రూపకల్పనలో నిపుణుడిగా ఇషిబాకు పేరుంది. నాటో రక్షణ కూటమి లాంటిది ఆసియాకూ ఉండాలని ఇషిబా ప్రతిపాదించారు.



తకైచీ సనయీ | షిగెరూ ఇషిబా | షిన్‌జిరో కొయిజుమీ

షిన్‌జిరో కొయిజుమీ (43): నాలుగోతరం వారసుడు

ప్రజాదరణ పొందిన మాజీ ప్రధాని జునిచిరో కొయిజుమీ కుమారుడే షిన్‌జిరో. కొయిజుమీ రాజకీయ వారసత్వంలో నాలుగోతరం నాయకుడు. శుక్రవారం ఎన్నికల్లో నెగ్గితే జపాన్‌కు అత్యంత పిన్న వయస్కుడైన ప్రధానిగా రికార్డులకెక్కుతారు. 2009లో తొలిసారిగా పార్లమెంటుకు ఎన్నికయ్యారు. షింజో అబే కేబినెట్‌లో 2019– 2021 మధ్య పర్యావరణ మంత్రిగా పనిచేశారు. కొలంబియా యూనివర్సిటీ నుంచి రాజనీతిశాస్త్రంలో మాస్టర్స్ చేసిన షిన్‌జిరో ప్రముఖ టీవీ యాంకర్ తకిగవా క్రిస్టెల్‌ను వివాహమాడారు. ఇతర పోటీదారులతో పోల్చినపుడు అనుభవం పెద్దగా లేకున్నా.. ఎల్‌డీపీ శ్రేణుల్లో ఆదరణ ఉంది. మాజీ ప్రధాని యోషిహిడే సుగా మద్దతు ఉంది. సంస్కరణ వాది. పితృత్వపు సెలవును ప్రమోట్ చేయడానికి 2020లో స్వయంగా రెండు వారాలు సెలవు తీసుకున్నారు. జపాన్‌– అమెరికా బంధాన్ని మరింత బలోపేతం చేస్తానని, పెరుగుతున్న చైనా ప్రాబల్యానికి అడ్డుకట్టవేయడానికి భావసారూప్యత కలిగిన దేశాలతో కలిసి పనిచేస్తానని షిన్‌జిరో చెబుతారు. రెండోరౌండ్ వెళ్లే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని సర్వేలు చెబుతున్నాయి. అనుభవలేమి ఒక్కటే ప్రతికూలత.

తకైచీ సనయీ (63): సంప్రదాయవాది

తకైచీ గెలిస్తే జపాన్‌కు తొలి మహిళా ప్రధానమంత్రి అవుతారు. మాజీ ప్రధాని షింజో అబే అనుయాయురాలు. సంప్రదాయవాది. రైట్ వింగ్ మద్దతు ఉంది. 2021లో లిబరల్ డెమొక్రటిక్ పార్టీ నాయకత్వం కోసం కిషిదాతో పోటీపడి మూడోస్థానంలో నిలిచారు. ప్రకృతి విపత్తులను ఎదుర్కొనే సాధనసంపత్తిని బలోపేతం చేయడం, ఆహార భద్రత, సైనిక సామర్థ్యం పెంపుదల, పంపిణీ వ్యవస్థల బలోపేతం.. ఇవి తకైచీ ప్రధాన హామీలు. స్వలింగ వివాహాలను వ్యతిరేకిస్తారు. పురుషులనే వారసులుగా పరిగణించే రాజకుటుంబ సంప్రదాయాన్ని బలపరుస్తారు. టీవీ యాంకర్‌గా పనిచేసిన తకైచీ తొలిసారిగా 1993లో పార్లమెంటుకు ఎన్నికయ్యారు. అంతర్గత వ్యవహారాలు, లింగ సమానత్వ మంత్రిగా పనిచేశారు. బ్రిటన్ మాజీ ప్రధాని మార్గరెట్ థాచర్ తనకు రోల్ మోడల్ అని చెబుతారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

పాలస్తీనా మా సొంతం


మేం వదిలి వెళ్లం: అబ్బాస్



న్యూయార్క్: గాజా ప్రాంతంపై ఇజ్రాయెల్ చేపట్టిన సైనిక దాడులను పాలస్తీనా అథారిటీ చీఫ్ మహ్మూద్ అబ్బాస్ తీవ్రంగా ఖండించారు. పాలస్తీనా మా సొంతం. పాలస్తీనా నుంచి వెళ్లిపోవాల్సిన వారు ఎవరూ అంటే ఆక్రమణదారులు మాత్రమే' అని ఆయన అన్నారు. గురువారం అబ్బాస్ ఐరాస జనరల్ అసెంబ్లీలో ప్రసంగించారు. ఆయన స్టేడియం వైపు వెళ్తుండగా కరతాళధ్వనులు, చప్పట్లు హాలంతా మారుమోగాయి. అర్థంకాని కేకలు వినిపించాయి. పోడియం వద్దకు చేరుకున్న అబ్బాస్..మేం వదిలి వెళ్లం. మేం వదిలి వెళ్లం. మేం వదిలి వెళ్లం..అంటూ ప్రసంగం మొదలుపెట్టారు.గాజాను, అక్కడి ప్రజలను అంతం చేసేందుకు ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న నరమేధాన్ని ఆపాలంటూ ప్రపంచ నేతలకు ఆయన విజ్ఞప్తి చేశారు. గాజాను నివాసయోగ్యం కాకుండా చేస్తోంది. యుద్ధానంతరం ఏర్పడే గాజాను మేమే పాలిస్తాం. పాలస్తీనా మా మాతృ భూమి. మా తండ్రులు, తాతలది. అది ఎప్పటికీ మాదే. వెళ్లిపోవాల్సింది ఎవరైనా ఉంటే వారు ఆక్రమిత వడ్డీవ్యాపారులు మాత్రమే'అని వ్యాఖ్యానించారు.

సంజయ్‌రౌత్‌కు 15 రోజుల జైలు శిక్ష

వెంటనే బెయిల్ ● ఎన్నికల వేళ బలిపశువు అయ్యానన్న రౌత్



ముంబై: మహారాష్ట్రలో శివసేన (యూబీటీ) నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్‌పై బీజేపీ నేత కీర్తి సోమయ్య భార్య మేధ సోమయ్య వేసిన పరువునష్టం కేసులో సంజయ్‌కు 15 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ ముంబై కోర్టు గురువారం తీర్పు చెప్పింది. అయితే వెంటనే బెయిల్ కోసం రౌత్ రెండు పిటిషన్లు వేయడంతో శిక్ష అమలును 30 రోజులపాటు నిలుపుదల చేస్తూ జడ్జి ఉత్తర్వులిచ్చారు. ఆయనకు రూ.25,000 జరిమానా విధిస్తూ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆర్తీ కులకర్ణి తీర్పు చెప్పారు. ముంబై శివారులోని మీరా–భయందర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ ప్రాజెక్టులో రూ.100 కోట్ల కుంభకోణం జరిగిందని సంజయ్‌రౌత్ గతంలో ఆరోపించారు. మేధ సారథ్యంలోని యువక్ ప్రతిష్టాన్ అనే స్వచ్ఛంద సంస్థ ఈ మీరా భయందర్ పనులను చేపట్టింది. నిరాధార ఆరోపణలు చేశారంటూ సంజయ్‌పై మేధ పరువునష్టం దావా వేయడం తెల్సిందే. సంజయ్ చేసిన ఆరోపణలు అన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో విస్తృత ప్రచారం పొందాయని, వ్యక్తిత్వ హననానికి సంజయ్ పాల్పడ్డారని కోర్టును మేధ 2022 మే 18న ఆశ్రయించారు. శిక్షపై సంజయ్ మాట్లాడారు. '' ప్రధాని పదవిలో ఉండి కూడా మోదీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇంటికెళ్లి మోదకాలు తింటుంటే, అవినీతిపై మాట్లాడే నా లాంటి వాళ్లకు శిక్షలే పడతాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ నన్ను బలిపశువును చేశారు. మొత్తం న్యాయవ్యవస్థను ఆర్‌ఎస్‌ఎస్ ప్రభావితం చేస్తోంది. మేం చేసిన తప్పేంటో ప్రజలకు వెల్లడించాలని సెషన్స్ కోర్టును కోరుతున్నా'' అని సంజయ్ డిమాండ్‌చేశారు.

గట్టెక్కిన కెనడా ప్రధాని ట్రూడో



పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేసిన 211 మంది

టొరంటో: అవిశ్వాస తీర్మానంలో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వం నెగ్గింది. దీంతో ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ పార్లమెంటులో బుధవారం ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. హౌస్ ఆఫ్ కామన్స్‌లో అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా 211 మంది సభ్యులు ఓటేయడంతో తీర్మానం వీగిపోయింది. తీర్మానానికి మద్దతుగా కేవలం 120 మంది సభ్యులు ఓటేశారు. దీంతో విపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో ట్రూడో గెలుపు సులువైంది. పెరుగుతున్న ధరలు, గృహ సంక్షోభంపై అసంతృప్తితో ప్రజాదరణ తగ్గిపోయింది. దీనికి తోడు మాంట్రియల్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో అధికార లిబరల్ పార్టీ ఓటమిపాలైంది. న్యూ డెమొక్రటిక్ పార్టీ 2022లో చేసుకున్న ఒప్పందానికి తూట్లు పొడుస్తూ ట్రూడో ప్రభుత్వానికి తన మద్దతును ఉపసంహరించుకుంది. దీంతో ట్రూడో ప్రభుత్వం మైనారిటీలో పడింది. 2025 అక్టోబర్ చివరిదాకా ప్రభుత్వానికి కాలపరిమితి ఉన్నా మైనారిటీ సర్కార్ కావడంతో అవిశ్వాస తీర్మానానికి ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ పట్టుబట్టడం తెల్సిందే. ''ఈ రోజు దేశానికి మంచి రోజు. కెనడా ప్రజలు ఎన్నికలను కోరుకుంటున్నారని నేను అనుకోవడం లేదు'' అని ప్రభుత్వ వ్యవహారాల ఇంచార్జ్, సీనియర్ లిబరల్ పార్టీ నేత కరీనా గౌల్డ్ అన్నారు. వివిధ రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరుపుతూ, సమస్య వారీగా చట్టం చేయబోతున్నామని ఆయన తెలిపారు.

ముందున్న సవాళ్లు..

అవిశ్వాసం నుంచి గట్టెక్కినా ట్రూడోకు ఇతర సవాళ్లు ఎదురవుతున్నాయి. తమ డిమాండ్లకు అంగీకరించకపోతే ప్రభుత్వాన్ని కూలదోస్తామని బ్లాక్ నేతలు హెచ్చరిస్తున్నారు. మరోవైపు లిబరల్స్ త్వరలో బడ్జెట్‌పై రెండో ఓటింగ్‌ను ఎదుర్కోనున్నారు. 2025 అక్టోబర్ నెలాఖరులో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ఒపీనియన్ పోల్స్‌లో రైట్ ఆఫ్ సెంటర్ కన్జర్వేటివ్ పార్టీకి భారీ ఆధిక్యం లభించింది. దీంతో వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని తాము కోరుకుంటున్నామని కన్జర్వేటివ్‌లు చెబుతున్నారు. లిబరల్స్ పాలనలో ఫెడరల్ ఖర్చులు, నేరాలు పెరిగాయని విమర్శిస్తున్నారు. మరోవైపు సీనియర్లకు ఎక్కువ నిధులు ఇస్తే కనీసం డిసెంబర్ నెలాఖరు వరకు ట్రూడోను అధికారంలో ఉంచుతామని, లేదంటే గద్దె దించుతామని బ్లాక్ నాయకులు హెచ్చరిస్తున్నారు. క్యూబెక్‌లో నివసిస్తున్న పాడి రైతులను రక్షించే సుంకాలు, కోటాల వ్యవస్థను పరిరక్షిస్తామని బ్లాక్ నాయకుడు వైవ్స్ ఫ్రాంకోయిస్ బ్లాంచెట్ అన్నారు. అక్టోబర్ 29లోగా ప్రభుత్వం అధికారికంగా ఈ పని చేయకపోతే ట్రూడోను గద్దె దించేందుకు విపక్షాలతో చర్చిస్తామని ఆయన హెచ్చరిస్తున్నారు. ఇందులోనూ ఆయన విజయం సాధించాలంటే అవిశ్వాస తీర్మానం సందర్భంగా ట్రూడోకు మద్దతిచ్చిన న్యూ డెమొక్రటిక్ పార్టీ మద్దతు అవసరం.

కుల గణన జరపాల్సిందే: చిరాగ్ పాశ్వాన్



ముంబై: దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ అన్నారు. దేశంలో ఏ వర్గం జనాభా ఎంత ఉంది? వారి ఆర్థిక స్థితిగతులు ఏమిటి? అనేది కుల గణన ద్వారా తేలుతుందని చెప్పారు. ఆయన గురువారం ముంబైలో 'ఇండియా టుడే' సదస్సులో మాట్లాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకోవాల్సిన విధానపరమైన నిర్ణయాలు, అమలు చేయాల్సిన చర్యలకు కుల గణన డేటా ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. కుల గణనకు తాను పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తున్నట్లు స్పష్టంచేశారు. సాధ్యమైనంత త్వరగా కుల గణన ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో లేటరల్ ఎంట్రీ విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

కఠిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోం

- తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదు
- పరుష వ్యాఖ్యల తొలగింపు కోసం గుజరాత్ చేసిన అభ్యర్థనను తోసిపుచ్చిన కోర్టు

న్యూఢిల్లీ: బిల్కిస్ బానో రేప్, కుటుంబసభ్యుల హత్య కేసు దోషుల మిగిలిన శిక్షా కాలాన్ని రద్దు(రెమిషన్) చేస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబడుతూ గత తీర్పులో తాము చేసిన పరుష వ్యాఖ్యలను తొలగించబోమని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. కోర్టు వ్యాఖ్యానాల తొలగింపు అంశాన్ని పునర్‌సమీక్షించాలంటూ గుజరాత్ ప్రభుత్వం పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు జడ్జీలు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం తోసిపుచ్చింది. '' రివ్యూ పిటిషన్‌లో ఎలాంటి పస లేదు. గతంలో తీర్పు సందర్భంగా మేం చేసిన వ్యాఖ్యానాల్లో ఎలాంటి తప్పు లేదు. ఈ కోణంలో గత తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదు'' అని కోర్టు స్పష్టంచేసింది. దోషుల రెమిషన్‌పై నిర్ణయం తీసుకునే హక్కు గుజరాత్‌కు ఉంటుందని 2022 మేలో సుప్రీంకోర్టులోని మరో బెంచ్ చెప్పడంతోనే తాము తుది నిర్ణయం తీసుకున్నామని గుజరాత్ ప్రభుత్వం వాదించింది. అయితే మహారాష్ట్రలోని సీబీఐ కోర్టులో కేసు విచారణ జరిగినందున రెమిషన్‌పై నిర్ణయం తీసుకునే అధికారం మహారాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంటుందని, ఆ అధికారాన్ని గుజరాత్ బలవంతంగా లాక్కుందని, తన విచక్షణాధికారాన్ని



దుర్వినియోగం చేసిందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పడం తెల్సిందే. 11 మంది దోషుల రెమిషన్‌ను రద్దుచేస్తూ సుప్రీంకోర్టు ఈ తీర్పు వెలువరించింది. గోధ్రాలో రైలు దహనం ఉదంతం తర్వాత 2002లో గుజరాత్‌లో ముస్లింలపై దాడుల సందర్భంగా ఐదునెలల గర్భిణి అయిన బిల్కిస్ బానోను రేప్ చేసి, ఆమె మూడు నెలల కూతురుసహా ఏడుగురు కుటుంబసభ్యులను ఈ 11 మంది చంపేయడం తెల్సిందే.

దాడులు కొనసాగించండి!

- ఇజ్రాయెల్ సైన్యానికి ప్రధాని నెతన్యాహూ ఆదేశం
- 75 హెజ్‌బొల్లా లక్ష్యాలపై దాడులు

టెల్ అవీవ్: ఇజ్రాయెల్–హెజ్‌బొల్లా మధ్య ఉద్రిక్తతలు మరింత ముదిరే ప్రమాదం కనిపిస్తోంది. లెబనాన్‌లో హెజ్బొల్లా స్థావరాలపై దాడులు కొనసాగించాలని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ తమ సైన్యానికి ఆదేశాలు జారీ చేశారు. శత్రువుల భరతం పట్టాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. ఆయన తాజాగా అమెరికాకు పయనమయ్యారు. న్యూయార్క్‌లో ఐక్యరాజ్య సమితి కార్యాలయంలో ప్రసంగిస్తారు. హెజ్బొల్లాతో చర్చల ప్రతిపాదన వచ్చిన మాట వాస్తవమేనని, అయితే దానిపై తాము ఇంకా స్పందించలేదని చెప్పారు. మరోవైపు హెజ్బొల్లాకు గట్టిగా బుద్ధి చెప్పాలన్న డిమాండ్లు ఇజ్రాయెల్‌లో వినిపిస్తున్నాయి. చర్చలు అవసరం లేదని నెతన్యాహూ మద్దతుదారులు తేల్చిచెబుతున్నారు. ఇదిలా ఉండగా, దక్షిణ లెబనాన్‌లోని బెకా లోయ రక్తసిక్తంగా మారుతోంది. హెజ్‌బొల్లా ఆయుధ నిల్వలతోపాటు పలు స్థావరాలపై ఇజ్రాయెల్ సైన్యం బుధవారం అర్ధరాత్రి తర్వాత నిప్పుల వర్షం కురిపించింది. భారీగా క్షిపణులు ప్రయోగించింది. 75 హెజ్‌బొల్లా లక్ష్యాలపై దాడుల చేశామని ఇజ్రాయెల్ సైన్యం గురువారం వెల్లడించింది.



23 మంది సిరియన్లు మృతి

లెబనాన్‌లోని యూనైన్ పట్టణంలో మూడంతస్తుల భవనంపై బుధవారం రాత్రి ఇజ్రాయెల్ సైన్యం జరిపిన దాడుల్లో 23 మంది సిరియన్లు మరణించారు. వీరిలో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులే ఉన్నట్లు తెలిసింది. లెబనాన్‌లో ప్రస్తుతం 15 లక్షల మంది సిరియన్లు తలదాచుకుంటున్నారు. సిరియాలో అంతర్యుద్ధం మొదలైన తర్వాత వీరంతా ప్రాణరక్షణ కోసం లెబనాన్‌కు చేరుకున్నారు. హెజ్బొల్లా విషయంలో కాల్పుల విరమణ ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి కట్జ్ గురువారం స్పష్టంచేశారు.

హెజ్‌బొల్లా డ్రోన్ కమాండర్ మృతి?

హెజ్బొల్లా డ్రోన్ విభాగం కమాండర్ లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దళం గురువారం సాయంత్రం లెబనాన్ రాజధాని బీరుట్‌పై మళ్లీ దాడులకు దిగింది. దహియెలోని అపార్టుమెంట్‌పై జరిగిన దాడిలో ఇద్దరు మృతి చెందగా 15 మంది వరకు గాయ పడ్డారని లెబనాన్ వార్తా సంస్థలు తెలిపాయి. ఈ దాడిలో హెజ్బొల్లా డ్రోన్ కమాండర్ మహ్మద్ హుస్సేన్ సరౌర్ చనిపోయినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించుకోగా హెజ్‌బొల్లా స్పందించలేదు.

లెబనాన్ నుంచి వెంటనే వెళ్లిపోండి

జెరూసలేం: యుద్ధ వాతావరణం, ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నందున లెబనాన్‌కు భారత పౌరులెవరూ రావొద్దని బీరుట్‌లోని భారత రాయబార కార్యాలయం కోరింది. లెబనాన్‌లో ఉండే భారతీయులు సాధ్యమైనంత త్వరగా దేశాన్ని వీడాలని, ఉండాలనుకునే వారు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని హెచ్చరించింది. ఈ మేరకు బుధవారం 'ఎక్స్'లో అడ్వైజరీ జారీ చేసింది.

భారత్ శాశ్వత సభ్యత్వానికి ఫ్రాన్స్ మద్దతు



న్యూయార్క్: ఐక్యరాజ్యసమితిలోని కీలకమైన భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వమివ్వాలన్న డిమాండ్‌ను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ సమర్థించారు. 'ఇప్పుడున్న భద్రతా మండలి అచేతనంగా మారింది. ఐక్యరాజ్యసమితిని మరింత శక్తివంతంగా మారుద్దాం. ఇందుకోసం మరిన్ని దేశాలకు ప్రాతినిధ్యం కల్పిద్దాం'అని బుధవారం ఐరాస జనరల్ అసెంబ్లీనుద్దేశించి మాక్రాన్ అన్నారు. 'అందుకే భద్రతా మండలి విస్తరణకు ఫ్రాన్సు సానుకూలంగా ఉంది. విస్తరించిన మండలిలో భారత్‌తోపాటు జర్మనీ, జపాన్, బ్రెజిల్‌లకు శాశ్వత సభ్యులుగా స్థానం కల్పించాలి. అదేవిధంగా ఆఫ్రికాలోని రెండు దేశాలకూ ప్రాతినిధ్యం ఇవ్వాలి'అని ఆయన పేర్కొన్నారు. మండలిలో శాశ్వత సభ్య హోదా కోసం భారత్ దశాబ్దాలుగా డిమాండ్ చేస్తోంది. 1945లో ఐరాస ఏర్పడిన సమయంలో 15 మంది సభ్యులతో ఏర్పాటైన మండలి నేటి భౌగోళిక రాజకీయ అవసరాలకు తగ్గట్లుగా లేదని వాదిస్తోంది. అమెరికా, రష్యా, యూకే, ఫ్రాన్సు, చైనా శాశ్వత సభ్యులు కాగా 10 శాశ్వతేతర సభ్యత్వ దేశాలు రెండేళ్లకోసారి ఎన్నికవుతూ ఉంటాయి.

డీఎంకే మాజీ మంత్రి బాలాజీకి బెయిల్



న్యూఢిల్లీ: మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తమిళనాడు మాజీ మంత్రి, డీఎంకే సీనియర్ నాయకుడు సెంథిల్ బాలాజీకి ఊరట లభించింది. సుప్రీంకోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో సమీప భవిష్యత్తులో దర్యాప్తు పూర్తయ్యే సూచనలు కనిపించడం లేదని, అందుకే నిందితుడికి బెయిల్ ఇస్తున్నామని తెలియజేసింది. గత 15 నెలలుగా జైల్లోనే ఉంచడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం అతడి ప్రాథమిక హక్కును హరించడమే అవుతుందని పేర్కొంది. తమిళనాడు మంత్రిగా ఉన్న సెంథిల్ బాలాజీని మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గత ఏడాది అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన మంత్రి పదవికి రాజీనామా చేశారు. తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ జార్జి మాసితో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది.

సూపర్ కంప్యూటర్లు వర్చువల్‌గా ప్రారంభం

న్యూఢిల్లీ: పుణేలో జరగాల్సిన పర్యటన రద్దు కావడంతో ప్రధాని మోదీ గురువారం వర్చువల్‌గా మూడు 'పరమ్ రుద్ర సూపర్ కంప్యూటర్లు' ప్రారంభించారు. నేషనల్ సూపర్‌కంప్యూటింగ్ మిషన్ కింద వీటిని దేశీయంగానే అభివృద్ధి చేశారు. మన దార్శనికత(విజన్) ఉన్నతంగా ఉన్నప్పుడే ఉన్నతమైన లక్ష్యాలు సాధించగలమని ఈ సందర్భంగా మోదీ చెప్పారు. నూతన టెక్నాలజీ పేదల సాధికారత తోడ్పడాలని అన్నారు. భారత్ నేడు నూతన అవకాశాలు సృష్టించుకుంటోందని వ్యాఖ్యానించారు. టెక్నాలజీలో జరుగుతున్న పరిశోధనలతో సామాన్య ప్రజలకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మిషన్ గగన్‌యాన్‌కు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని, 2035 నాటికల్లా మనం సొంతంగా అంతరిక్ష కేంద్రం ఏర్పాటు చేసుకోబోతున్నామని ప్రధానమంత్రి పేర్కొన్నారు. రూ.130 కోట్లతో రూపొందించిన మూడు పరమ్ రుద్ర సూపర్ కంప్యూటర్లను పుణే, ఢిల్లీ, కోల్‌కతాలో ఏర్పాటు చేయబోతున్నారు. అత్యాధునిక శాస్త్రీయ పరిశోధనల కోసం వీటిని ఉపయోగించుకుంటారు. అలాగే వాతావరణ పరిస్థితులపై పరిశోధనల కోసం రూ.850 కోట్ల హై–పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ సిస్టమ్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు.

మహారాష్ట్రలో కుండపోత వానలు

ముంబైలో మ్యాన్‌హోల్‌లో పడి మహిళ మృతి

ముంబై: మహారాష్ట్ర రాజధాని ముంబై సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ముంబై, థానే, పాల్ఘార్, పుణే, పింప్రీ–చించ్‌వాడ్ తదితర ప్రాంతాల్లో వర్ష బీభత్సం వల్ల జనం తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గురువారం ఆయా ప్రాంతాల్లో విద్యాసంస్థలను మూసివేశారు. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం అర్ధరాత్రి కురిసిన వర్షంతో ముంబై సిటీ అస్తవ్యస్తంగా మారింది. లోకల్ రైళ్ల రాకపోకలు ఆగిపోవడంతో జనం స్టేషన్లలోనే చిక్కుకుపోయారు. అంధేరీ ఈస్ట్‌లో విమలా అనిల్ గైక్వాడ్ అనే మహిళ పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోల్‌లో పడిపోయింది. మురుగు కాల్వలో కొట్టుపోతున్న అమెను పోలీసులు బయటకు తీశారు. కానీ, ఆమె అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. ముంబైతోపాటు శివారు ప్రాంతాల్లో 100 మిల్లీమీటర్లకుపైగా వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ముంబై నుంచి రాకపోకలు సాగించాల్సిన పలు విమానాలను ప్రతికూల వాతావరణం వల్ల దారి మళ్లించారు. మరికొన్నింటిని రద్దు చేశారు. మరోవైపు గురువారం కల్లా ముంబైలో పరిస్థితి కొంత మెరుగుపడినట్లు అధికారులు చెప్పారు.

మోదీ పర్యటన రద్దు

మహారాష్ట్రలోని పుణేలో గురువారం జరగాల్సిన ప్రధాని మోదీ అధికారిక పర్యటన భారీ వర్షం కారణంగా రద్దయ్యింది. ఆయన పుణేలో మెట్రో రైలు మార్గాన్ని ప్రారంభించాల్సి ఉంది. అలాగే రూ.22,600 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించేలా షెడ్యూల్ ఖరారు చేశారు. మోదీ బహిరంగ సభ జరగాల్సిన ఎస్పీ కాలేజీ గ్రౌండ్ బురదమయంగా మారింది. త్వరలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మోదీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. కానీ, వర్షం వల్ల పర్యటనను రద్దు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పుణేలో మోదీ పర్యటన త్వరలో ఉంటుందని, తేదీని ఇంకా ఖరారు చేయలేదని తెలిపాయి.

సీబీఐకి నో ఎంట్రీ!

'ముడా' కేసు వేళ సీబీఐకి గేట్లు మూసివేత


బెంగళూరు: మైసూర్ పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ(ముడా) స్థలాల కేటాయింపుల్లో అక్రమాల ఉదంతం కర్ణాటకలో తీవ్ర చర్చనీయంశమైన వేళ సిద్ధరామయ్య సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. నేరాలపై రాష్ట్రపరిధిలో దర్యాప్తు కోసం గతంలో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)కు ఇచ్చిన సాధారణ సమ్మతిని ఉపసంహరించుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తర్వాత రాష్ట్ర న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాతో మాట్లాడారు. ''సీబీఐ లేదంటే కేంద్ర ప్రభుత్వం తమ అధికారాలను వినియోగించేటపుడు వాటికి న్యాయబద్ధంగా ఉపయోగించట్లేవని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సీబీఐ పక్షపాత ధోరణిలో వ్యవహరించే అవకాశముందని భావిస్తున్నాం. అందుకే సమ్మతిని ఉపసంహరించుకుంటున్నాం'' అని పాటిల్ చెప్పారు. ఆ చట్టంలోని ఆరో సెక్షన్ ప్రకారం ఏదైనా కేసును ఏదైనా రాష్ట్రంలో దర్యాప్తుచేయాలంటే ఆ రాష్ట్ర అనుమతి తప్పనిసరి. '' గతంలో కొన్ని కేసుల్లో దర్యాప్తు చేస్తూ కూడా చార్జ్‌షీట్ దాఖలుచేయడానికి సీబీఐ నిరాకరించింది. వాళ్ల దగ్గర అపరిష్కృతంగా కేసులు కొండలా పేరుకుపోయాయి. ఎన్నో కేసుల్లో సీబీఐ వైఖరి చూశాక మేం ఈ నిర్ణయానికొచ్చాం'' అని మంత్రి వ్యాఖ్యానించారు. దీంతో రాష్ట్రంలో దర్యాప్తుపై సీబీఐకి అనుమతిని ఉపసంహరించుకున్న రాష్ట్రాల జాబితాలో కర్ణాటక చేరిపోయింది. ఇప్పటికే విపక్షపార్టీల పాలిత రాష్ట్రాలైన పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాలు సీబీఐకి అనుమతిని ఉపసంహరించుకున్నాయి.

వాళ్లు అప్పుడు చేయలేదుగా: సిద్ధూ

లోకాయుక్త కేసుపై సీఎం గురువారం స్పందించారు. ''చట్టప్రకారం ఎలా ముందుకెళ్లాలన్న దానిపై న్యాయ నిపుణులో చర్చిస్తున్నాం. ఈ కేసును ఎదుర్కొంటున్నంత మాత్రాన సీఎం పదవికి రాజీనామా చేయాలా?. గోధ్రా ఉదంతంలో ఎఫ్‌ఐఆర్ నమోదైతే నాటి సీఎం పదవికి నరేంద్ర మోదీ రాజీనామా చేశారా?. బెయిల్ మీద బయటే ఉన్న కేంద్రమంత్రి జేడీఎస్ నేత కుమారస్వామి రాజీనామా చేశారా?' అని ప్రశ్నించారు.

వాషింగ్టన్ స్వాగతం పలుకుతోంది

న్యూయార్క్‌లో ఉన్న విషయాన్ని మరిచిన బైడెన్



న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు బైడెన్ మరోమారు తప్పు మాట్లాడారు. ఇటీవల న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి వార్షిక సర్వసభ్య సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బైడెన్ మాట్లాడుతూ 'వెల్కమ్ టు వాషింగ్టన్' అని తన ప్రసంగాన్ని మొదలుపెట్టారు. తన తప్పును గ్రహించని అధ్యక్షుడు తన ప్రసంగాన్ని కొనసాగించారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. గతంలో బైడెన్ ఉక్రెయిన్ ప్రధాని జెలెన్‌స్కీని 'మిస్టర్ ప్రెసిడెంట్' అని పదేపదే పిలిచారు. ఇక జూలైలో జరిగిన నాటో శిఖరాగ్ర సమావేశంలో జెలెన్‌స్కీని ''అధ్యక్షుడు పుతిన్''గా పరిచయం చేయడం చూసి అక్కడున్న వారంతా షాకయ్యారు. మరోమారు కమలా హారిస్‌ను పొరపాటున ''వైస్ ప్రెసిడెంట్ ట్రంప్'' అని సంబోధించారు. అధ్యక్ష అభ్యర్థిగా వైదొలగడానికి ముందు జరిగిన బిగ్ డిబేట్‌లోనూ ఆయన తడబడటం, సొంత పార్టీ నుంచే వ్యతిరేకత రావడంతో ఆ తరువాత బరి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. ఈ పొరపాట్లు ఇటీవలి కాలంలో మరింత పెరిగాయి.



కట్టడి చేయాల్సిందే...

నగరంలో గణేశ్ ఉత్సవాలు, మిలాదున్నబీ ఊరేగింపుల నేపథ్యంలో డీజేల శబ్దకాలుష్యం గణనీయంగా పెరిగిందని, దీనిని కట్టడి చేయాలని కొత్వాల్ సీవీ ఆనంద్ అన్నారు. -8లో



డ్యాన్సింగ్ సిటీ

ఫ్యాషన్ హంగులను అందిపుచ్చుకోవడంలో నగరం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిసిందే. మోడ్రన్ ఆర్ట్స్‌కు క్రేజ్ పెరిగిపోతోంది. ట్రెండీ డ్యాన్స్ స్టెప్పులను ఆహ్వానిస్తున్నారు. -సిటీ ప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
31.0/24.0

వాతావరణం

నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 31 డిగ్రీ కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

నిమ్స్ వైద్యుల కృషి అమోఘం

ఉచిత గుండె ఆపరేషన్లపై బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్



బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ ఓవెన్‌ను అభినందిస్తున్న నిమ్స్ సీటీ హెచ్ఓడి డాక్టర్ అమరేశ్వరరావు

లక్డీకాపూల్: నిమ్స్ వైద్యుల కృషి ఆదర్శప్రాయంగా ఉందని బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ అన్నారు. నాలుగు రోజులుగా బ్రిటన్ వైద్యులు డాక్టర్ దన్నపనేని రమణ, నిమ్స్ కార్డియోథొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ ఎం.అమరేశ్వరరావు నేతృత్వంలో చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటివరకు 17 మంది చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపారు. విషయం తెలుసుకున్న బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గురువారం నిమ్స్‌ను సందర్శించారు. చిన్నారులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. స్వంత గడ్డకు సేవ చేస్తున్నారంటూ డాక్టర్ రమణను అభినందించారు. డాక్టర్ రమణ మాట్లాడుతూ మూడేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం, నిమ్స్ వైద్యులు డాక్టర్ అమరేశ్వర్‌రావు సహకారంతో గుండె ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. డాక్టర్ అమరేశ్వర్‌రావు మాట్లాడుతూ ఈ నెల 30 తేదీ వరకు జరిగే ఈ వైద్యశిబిరంలో 20 మందికి గుండె సంబంధిత శస్త్ర చికిత్సలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. మొత్తం 209 మంది గుండె జబ్బు బాధితులు పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. ముగ్గురికి గుండె మార్పిడి ఆపరేషన్లు చేయాల్సి ఉందని.. 40 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు గుర్తించామని, వారికి త్వరితగతిన ఆపరేషన్లు చేయాల్సి ఉందని అన్నారు.

మాతృ సంస్థకు 'డిప్యుటేషన్' ఇంజినీర్లు

సాక్షి, సిటీబ్యూరో: జలమండలిలో ఏళ్ల తరబడి 'డిప్యుటేషన్' పై కొనసాగుతున్న సుమారు 35 మంది ఇంజినీర్లు తిరిగి మాతృ సంస్థ హౌసింగ్ కార్పొరేషన్‌కు బదిలీ కానున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు కోసం పునరుజ్జీవం పోసుకున్న హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ వివిధ శాఖల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న తమ సంస్థ ఇంజినీర్ల సేవలను ఉపసంహరించుకుంది. దీంతో జలమండలిలో డిప్యూటేషన్ పై పనిచేస్తున్న ఇంజినీర్లు వెనక్కి వెళ్లనున్నారు. గత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరిట జరిగిన అక్రమాలపై సీబీడీ విచారణ జరిపించి అవినీతిలో కూరుకుపోయిన రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థపై చర్యలకు ఉపక్రమించింది. అందులో భాగంగా తొలుత డిప్లొమా అర్హత గల ఇంజినీర్లకు డిప్యుటేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. 2016 ఆగస్టు 20న రాష్ట్ర వ్యాప్తంగా పనిచేసే సుమారు 66 మంది ఏఈ (సహాయక ఇంజినీర్)లను ఏడాది కాలపరిమితితో డిప్యూటేషన్‌పై జలమండలికి కేటాయించగా అందులో 35 మాత్రమే రిపోర్టు చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం రోడ్లు, భవనాల శాఖలో హౌసింగ్ కార్పొరేషన్‌ను పూర్తిగా విలీనం చేసింది. అప్పటి నుంచి హౌసింగ్ డిపార్ట్‌మెంట్ ఆర్అండ్ బీలో ఒక విభాగంగా కొనసాగుతూ వస్తోంది. అయితే జలమండలిలో రిపోర్ట్ చేసిన ఇంజినీర్లు మాత్రం ఎనిమిదేళ్లుగా డిప్యుటేషన్‌పై కొనసాగుతున్నారు.

ట్రిలియన్ ఎకానమీ.. పదేళ్ల లక్ష్యం

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ఐఎస్ఎఫ్-2024 సదస్సు, ఎస్కీ నూతన భవనం ప్రారంభం

రాయదుర్గం: రాష్ట్రంలో వచ్చే దశాబ్ద కాలంలో ఒక ట్రిలియన్ రూపాయల ఎకానమీ సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఐఎస్ఎఫ్-2024 సదస్సులో పాల్గొన్నారు. ఎస్కీలో నూతనంగా నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అందరి సహకారంతో లక్ష్యాల సాధన దిశగా ముందుకుసాగాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని గ్లోబల్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)కు రాజధానిగా మార్చాలని సంకల్పించినట్లు చెప్పారు. అందులో భాగంగా ఏఐ నగరాన్ని నిర్మాణం చేసేందుకు ఇప్పటికే చర్యలు ఆరంభించినట్లు తెలిపారు. ఈ తరుణంలో అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్‌ను నగరంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామి కావాలని కోరుకుంటోందని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు, ఐటీ దిగ్గజాలు బీవీఆర్‌మోహన్‌రెడ్డి, జేఏచౌదరి, రంగనాథ్,శ్రీనిరాజు,గుప్త వి భానుప్రకాశ్‌రెడ్డి, అచ్యుత్, సత్యేంద్రకుమార్, శివమహేష్‌తోపాటు పలు ఐటీ సంస్థలు,హైసియా ప్రతినిధులు, స్టార్టప్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.

30 జూనికార్న్‌కు ప్రోత్సాహం

ఐఎస్ఎఫ్-2024లో భాగంగా 30 జూనికార్న్స్(పాఠశాల, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు) రూపొందించిన నూతన ఆవిష్కరణలకు చోటు లభించింది. 200కుపైగా ఎంపిక చేసిన స్టార్టప్‌లతో మహోన్నత ఆవిష్కరణలకు ఐఎస్ఎఫ్ ఎక్స్‌పోలో ప్రదర్శించేందుకు అవకాశం లభించడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.



ఎస్కీ భవనాన్ని ప్రారంభించి ఐఎస్ఎఫ్-2024 సదస్సులో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు





'ఓపెన్ డే' సందడి

జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(సీఎస్ఐఆర్ ఎన్‌జీఆర్ఐ)లో విద్యార్థులు సందడి చేశారు. గురువారం 'ఓపెన్ డే'లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలు వారిని అబ్బురపరిచాయి. ప్రదర్శనలను ఆసక్తిగా తిలకిస్తూ భూమి లోపలి పొరల్లో దాగి ఉన్న విశేషాలు, సునామీ, భూకంపాల గురించి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. జంటనగరాలు, శివారు మున్సిపాలిటీల పాఠశాలల నుంచి 15 వేల మందికిపైగా విద్యార్థులు 'ఓపెన్ డే'ను సందర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు. – ఉప్పల్

8 జోన్లుగా ఫ్యూచర్ సిటీ!

- లైఫ్‌సైన్స్, స్పోర్ట్స్, ఎడ్యుకేషన్, హెల్త్ జోన్లుగా విభజన
- ఆఫీసులు, నివాసాలు, వాణిజ్య సముదాయాలన్నీ ఇక్కడే..
- దేశంలోనే తొలి నెట్‌జీరో సిటీగా తీర్చిదిద్దాలని సీఎం సంకల్పం

14 వేలకుపైగా ఎకరాల్లో ఏర్పాటుకు ప్లాన్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో వాటి సరసన కొత్తగా నాలుగో నగరం 'ఫ్యూచర్ సిటీ'పేరిట రూపుదిద్దుకోనుంది. దానిని ప్రణాళికాబద్ధంగా, ఆధునిక రీతిలో, కాలుష్యరహితంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కర్బన ఉద్గారాలు లేకుండా దేశంలోనే తొలి నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంకల్పించారు. హైదరాబాద్‌కు దక్షిణ భాగంలో 14 వేలకుపైగా ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకోనుంది.

కొత్త సిటీలు అనివార్యమే..

పట్టణీకరణ, వలసలు, కాస్మోపాలిటన్ కల్చర్, మెరుగైన విద్యా, ఉద్యోగ, వైద్య అవసరాలు.. ఇలా అనేక కారణాలతో నగర జీవనానికి ప్రాధాన్యం పెరిగింది. 1951లో 17 శాతంగా ఉన్న పట్టణ జనాభా ఇప్పుడు 35 శాతానికి చేరింది. ఈ మధ్య కాలంలో ఎలాంటి ప్రణాళికలు లేకుండా నగరాలు, పట్టణాల విస్తరణ జరిగింది. దీంతో పట్టణాలు, నగరాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, సౌకర్యాల కల్పన క్లిష్టంగా మారింది. కాలుష్యం, ట్రాఫిక్ వంటి సమస్యలు తీవ్రమయ్యాయి. ఈ నేపథ్యంలో సమగ్రంగా, ప్రణాళికాబద్ధంగా దీర్ఘకాలిక దృష్టితో కొత్త నగరాలను తీర్చిదిద్దడం, అభివృద్ధి చేయడం తప్పనిసరిగా మారింది. అయితే నిధులు, భూమి లభ్యత, రాజకీయ అనిశ్చిత పరిస్థితులు వంటివి కొత్త సిటీల అభివృద్ధికి సవాళ్లుగా మారుతున్నాయి. మెరుగైన ప్రయాణ సదుపాయాలు, ఇతర నగరాలతో కనెక్టివిటీ, స్థిరమైన జీవన ప్రమాణాలు, విస్తృత ఆర్థిక, సామాజిక, ఉద్యోగ అవకాశాలు, సరసమైన గృహాలతో గ్రీన్‌ఫీల్డ్ నగరాలను నిర్మించడం ఉత్తమం. కొత్త నగరాలు స్థానిక అవసరాలకే కాకుండా అంతర్జాతీయ ఆర్థిక, పర్యాటక ఆకర్షణగా నిలుస్తేనే విజయవంతం అవుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



8 జోన్లుగా ఫ్యూచర్ సిటీ..

గతంలో ఫార్మాసిటీగా ప్రతిపాదించిన ముచ్చెర్ల, మీర్‌ఖాన్‌పేట వంటి 10 గ్రామాలు ఫ్యూచర్ సిటీలో భాగం కానున్నాయి. ఈ నాలుగో నగరంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లైఫ్ సైన్స్ హబ్, హెల్త్ సిటీ, స్పోర్ట్స్ హబ్, ఎలక్ట్రానిక్ అండ్ అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎడ్యుకేషన్ అండ్ యూనివర్సిటీ, రెసిడెన్షియల్, మిక్స్‌డ్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు ఉంటాయి. భవిష్యత్తు నగరిలో సింహభాగం మేర భూమిని లైఫ్ సైన్సెస్ హబ్, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లకే కేటాయించారు. లైఫ్ సైన్సెస్ హబ్‌కు 4,207, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు 3,642 ఎకరాలను కేటాయించినట్లు సమాచారం.

ఎయిర్, మెట్రో, రోడ్డు సదుపాయాలు

ఫ్యూచర్ సిటీకి విమానయానం, మెట్రో, రోడ్డు వంటి అన్ని రకాల రవాణా సదుపాయాలతో అనుసంధానమై ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా శంషాబాద్ విమానాశ్రయం, ఓఆర్ఆర్, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్, మెట్రో రైల్ కనెక్టివిటీతో ఫ్యూచర్ సిటీకి రోడ్లు నిర్మించనున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.

- 140 ఎకరాల ఏఐ సిటీలో ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ హబ్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఎక్స్‌పీరియన్స్ సెంటర్ వంటివి ఉంటాయి.
- మీర్‌ఖాన్‌పేటలో 255 ఎకరాలను ఎడ్యుకేషన్ అండ్ యూనివర్సిటీ జోన్‌కు కేటాయించారు. ఇందులో ఇప్పటికే నైపుణ్య విశ్వవిద్యాలయానికి సీఎం శంకుస్థాపన చేశారు.
- 258 ఎకరాలను స్పోర్ట్స్ హబ్‌కు కేటాయించారు. ఇందులో స్పోర్ట్స్ అకాడమీ, మల్టీపర్పస్ స్టేడియం, క్లబ్ హౌస్ వంటివి నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది.
- హెల్త్ సిటీకి 116 ఎకరాలు కేటాయించగా, మెడికల్ టూరిజంను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పాలసీని తీసుకురానున్నది. ఇందులో ప్రపంచ స్థాయి ప్రయోగశాలలు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(ఆర్ అండ్ డీ) జోన్‌లు, వ్యాపార కేంద్రాలుంటాయి.
- ఆయా జోన్లలో పనిచేసే వారికి నివాసాల కోసం 1,170 ఎకరాలను కేటాయించింది.
- మల్టీప్లెక్స్‌లు, పార్కులు, హోటళ్లు, వినోద కేంద్రాల కోసం 336 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది.

అడిషనల్ కమిషనర్లకు సీఆర్‌ఎంపీ బాధ్యతలు

- రహదారుల్లో ఎప్పటికప్పుడు లోపాలు గుర్తించాలి
- ఒప్పందం మేరకు పనులయ్యేలా చూడాలి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సమగ్ర రోడ్డు నిర్వహణ పథకం(సీఆర్ఎంపీ) బాధ్యతను అడిషనల్ కమిషనర్లకు జీహెచ్ఎంసీ అప్పగించింది. కాంట్రాక్టు ఏజెన్సీలకు ఐదేళ్ల నిర్వహణకుగాను రూ.1,800 కోట్లు చెల్లిస్తున్నప్పటికీ, వర్షాల సమయంలో అవి ప్రయాణానికి అనుకూలంగా ఉండటంలేదు. రోడ్లపై గుంతలు పడితే ఒప్పందం ప్రకారం ఇరవై నాలుగు గంటల్లోగా కాంట్రాక్టర్ పూడ్చివేయాలి. అయితే ఆ కాలవ్యవధిలో పనులు జరగడం లేవు. త్వరలోనే కాంట్రాక్టు ఏజెన్సీల గడువు కూడా ముగిసిపోనున్న నేపథ్యంలో సీఆర్ఎంపీ రోడ్లకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేయించుకోవాలనే కృతనిశ్చయంతో జీహెచ్ఎంసీ ఉంది. తప్పుడు లెక్కలు చూపే అధికారులపైనా చర్యలుంటాయని ఇటీ వల జరిగిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించిన విషయం తెలిసిందే. వారంరోజులుగా కురుస్తున్న వరుస వర్షాల నేపథ్యంలో నగర రోడ్లపై అడుగో మడుగు, గుంతలు భయంకరంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటిని వెంటనే పూడ్చేయాల్సి ఉన్నా ఆ పనుల జాడ లేదు. ఈ నేపథ్యంలో సీఆర్ఎంపీ రోడ్ల పర్యవేక్షణ బాధ్యతలను అడిషనల్ కమిషనర్లకు అప్పగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. తమకు కేటాయించిన సీఆర్ఎంపీ రోడ్లను ప్రతిరోజు ఉదయం ఒక పర్యాయం పరిశీలించాలి. ఎక్కడ లోపాలున్నా వెంటనే మరమ్మతు చేయించాలి. పారిశుధ్యం, పచ్చదనం, లేన్‌మార్కింగ్ వంటివి సవ్యంగా ఉండేవిధంగా చూడాలి. వారితోపాటు సంబంధిత ఎస్ఈ, ఈఈలు యథావిధిగా వాటికి సంబంధించిన తమ బాధ్యతలు నిర్వహించాలి. నగరవ్యాప్తంగా ఆయా జోన్లలో మొత్తం 2,256 గుంతలు ఉన్నట్లుగా అంచనా.

'రెడ్' అలర్ట్

మూసీ పరిధిలోని నివాసాల కూల్చివేతకు మార్కింగ్

- పునరావాస గూడుపై సందేహాలు
- పాత సర్వే ప్రకారం వివరాల సేకరణ
- ప్రారంభమైన తరలింపు ప్రక్రియ



సాక్షి, సిటీబ్యూరో/: మూసీనది గర్భంలో ఉన్న నివాసాల కూల్చివేతకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే గుర్తించిన ఇళ్లపై గురువారం రెడ్ మార్క్ పడింది. కొందరు స్థానికులు పునరావాసం కల్పిస్తే కదిలేందుకు సిద్ధం కాగా, మరికొందరు ససేమిరా అన్నారు. అయినప్పటికీ సర్వే బృందాలు నదిలోని నివాసాలపై మార్కింగ్ చేసి కుటుంబాల వివరాలు సేకరించి అక్కడికక్కడే ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో నిర్వాసితుల పునరావాసం కోసం తరలింపు ప్రక్రియ కూడా ప్రారంభమైంది.

నిరసనల సెగ..

ఇళ్లపై ఆర్‌బీ -ఎక్స్ పేరుతో రెడ్ మార్కింగ్‌కు చేస్తున్న సర్వే బృందాలకు నిరసన సెగ తగిలింది. చైతన్యపురి వినాయకనగర్ కాలనీలో నివాసితులు సర్వే అధికారులకు ఎదురు తిరిగారు. 'ఇళ్లను కూల్చనివ్వం .. మీరే ఇంత విషం తెచ్చి ఇవ్వండి. తాగుతాం'అని సిబ్బందిని అడ్డుకున్నారు. కలర్ డబ్బాలను లాక్కుని పారబోసి ఆందోళనకు దిగారు. దీంతో సర్వే బృందాలు వెనుతిరగక తప్పలేదు. అత్తాపూర్ డివిజన్‌లోని భరత్ నగర్ నివాసితులు అధికారులపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. కడుపు కట్టుకుని దాచుకున్న డబ్బులతో నిర్మించుకున్న ఇళ్లను ఎలా వదులుకోవాలంటూ అధికారుల ముందు బోరున విలపించారు.

ఆపరేషన్‌కు రెడీ

మూసీ ప్రక్షాళలో భాగంగా తొలి విడతలో నది గర్భంలోని సుమారు 2,166 నివాసాల తొలగింపుపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. అందులో సుమారు 288 భారీ కట్టడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించింది. మొత్తం మీద వాటి కూల్చివేతకు రెడ్ మార్కింగ్ వేసింది.

చైతన్యపురి: మార్కింగ్ చేసేందుకు వచ్చిన రెవెన్యూ అధికారును అడ్డుకుని స్థానికులు ఆందోళన చేపట్టటంతో చైతన్యపురి వినాయకనగర్ కాలనీలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులకు తీవ్ర వాగ్వాదం జరిగింది. ఉద్రిక్తతను గమనించి చేసేదేమీ లేక రెవెన్యూ అధికారులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

ఇంటింటికీ తిరిగి వివరాల సేకరణ

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని మూసీ తీర ప్రాంతంలో గురువారం సైదాబాద్ రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. తహసీల్దార్ జయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ ఆధ్వర్యంలోని బృందం ఇంటింటికీ తిరిగి కరెంట్ బిల్లు, ఆధార్‌కార్డు, కుటుంబసభ్యులు వివరాలు సేకరించింది. శాలివాహననగర్‌లోని సాయిలు హట్స్, అంబేద్కర్ హట్స్, గోశాల, పార్కు సమీప ప్రాంతాల్లో సర్వే చేశారు. సర్వే ఆధారంగా బాధితులకు డబుల్ బెడ్‌రూమ్‌లు కేటాయించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. అయితే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు ఇచ్చిన తరువాతే తమ నివాసాలను ఖాళీ చేయించాలని బాధితులు పేర్కొంటున్నారు.

130 ఇళ్లకు ఆర్‌బీఎక్స్

చాదర్‌ఘాట్: హిమాయత్‌నగర్ ఎంఆర్వో సంధ్యారాణి ఆధ్వర్యంలో మూసానగర్, శంకర్‌నగర్‌లో దాదాపు 130 ఇళ్లకు ఆర్‌బీఎక్స్ మార్కు చేశారు. బాధితులు తరలిపోవటానికి సిద్ధంగా ఉన్నారని ఎంఆర్వో తెలిపారు. బాధితులకు ఇళ్ల పట్టాలు ఇచ్చాకే తరలింపు ఉంటుందని, ఆందోళన చెందనవసరం లేదని ఆమె స్పష్టం చేశారు.

ప్రతి జిల్లాకు స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీ

మంత్రి పొంగులేటి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

వెంగళరావునగర్: రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీలను ఏర్పాటు చేసి, తెలంగాణ యువత భవిష్యత్‌కు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించనున్నట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్‌లో గురువారం నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్‌డీసీ) ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై) 4.0 పథకం కింద ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం జరిగిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ త్వరలో అన్ని జిల్లాల్లో 'స్కిల్'కాలేజీలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పెట్టుబడిదారులను ఆకర్షించే విధంగా రాష్ట్రాన్ని తయారు చేయడం, విశ్వవ్యాప్తంగా ఉద్యోగాలు పొందడానికి యువతలో ప్రపంచస్థాయి నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు.

రూ.2,324 కోట్లు వెచ్చించి ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలు(ఏటీసీ)గా మార్చి యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ ఏటీసీ కేంద్రాలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, భారీ పరిశ్రమలకు సాంకేతిక కేంద్రాలుగా పనిచేస్తాయన్నారు. తొలుత ఆయన నిమ్స్ మే ప్రాంగణంలో రోడ్లు ఊడ్చి స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, 2023-24లో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నవారికి మంత్రి టీ-షర్ట్స్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ మే డైరెక్టర్ జనరల్ గ్లోరీ స్వరూప, ప్రోగ్రాం ఇన్‌చార్జి వి.స్వప్న తదితరులు పాల్గొన్నారు.



నిమ్స్‌మే పరిసరాలను శుభ్రం చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు


మిథులానగర్‌లో చేరిన వరదనీరు

ముంచెత్తిన వరద

ట్రంక్‌లైన్ ఓవర్‌ఫ్లోతో ప్రవాహం	కాలనీలను చుట్టేసిన వరద నీరు	ఇళ్లలోకి చేరి జనం ఇక్కట్లు	పాడైపోయిన ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ పరికరాలు

మీర్‌పేట: వరదనీరు కార్పొరేషన్ పరిధిలోని మిథులానగర్, సత్యసాయినగర్ కాలనీలను ముంచెత్తింది. బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో బడంగ్‌పేట ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున వరదనీరు మీర్‌పేట పెద్ద చెరువు, మంత్రాల చెరువు ద్వారా ట్రంక్‌లైన్‌లోకి వచ్చి చేరింది. వరదనీటి ప్రవాహం అధికమవడంతో మిథులానగర్ వద్ద ట్రంక్‌లైన్, మ్యాన్‌హోళ్లు తట్టుకోలేక ఓవర్‌ఫ్లో అయ్యాయి. దీనికి తోడు ట్రంక్‌లైన్‌లో ఇసుక, చెత్తా చెదారం చేరి జామ్ కావడంతో కాలనీలను ఒక్కసారిగా వరదనీరు చుట్టేసింది. బయటకు రాలేని పరిస్థితి వరదనీరు ఒక్కసారిగా ముంచెత్తడంతో ఆయా కాలనీలవాసులు భయాందోళనకు గురయ్యారు. గురువారం ఉదయం 11 గంటల వరకు కూడా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. నీరు మోకాలిలోతు వరకు వచ్చి చేరడంతో పాఠశాలలు, ఉద్యోగాలకు వెళ్లే వారు ఇళ్లకే పరిమితమయ్యారు. సత్యసాయినగర్ కాలనీలోని చాలా వరకు ఇళ్లలోకి నీరు చేరి ఫర్నిచర్, గృహోపకరణాలు పాడైపోయాయి. ఇటీవల ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదని మిథులానగర్‌వాసులు ఆరోపిస్తున్నారు.

డీఆర్‌ఎఫ్ బృందంతో తొలగింపు

కార్పొరేషన్ అధికారులు డీఆర్‌ఎఫ్ బృందాన్ని రప్పించి కాలనీల్లో నిలిచిన వరదనీటి తొలగింపు చర్యలు చేపట్టారు. సిబ్బంది రంగంలోకి దిగి ఆరు గంటల పాటు మ్యాన్‌హోళ్లకు అడ్డంగా ఉన్న ఇసుక, మట్టిని తొలగించడంతో వరదనీరు దిగువకు వెళ్లిపోయింది. వరదనీటి ప్రవాహం అధికంగా ఉండడం.. ట్రంక్‌లైన్ మార్గంలో జామ్ కావడంతో సమస్య తలెత్తిందని మీర్‌పేట కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. చెత్తా చెదారాన్ని తొలగించామని, ప్రస్తుతం నీరు సాఫీగా వెళ్తోందని చెప్పారు.

పరారీలో హర్షసాయి


నిందితుడు హర్షసాయి

మణికొండ: ఓ యువతిపై లైంగికదాడికి పాల్పడటం, ఆమె వద్ద రూ. 2 కోట్ల డబ్బు తీసుకుని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ హర్షసాయి పరారీలో ఉన్నాడు. అతడితో పాటు అతని తండ్రి రాధాకృష్ణ పైన బాధితురాలు నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. బాధితురాలి నుంచి ఆధారాలు, స్టేట్ మెంట్ నమోదు చేసుకున్న పోలీసులు అతడిని అరెస్టు చేసేందుకు అతని ఇంటికి వెళ్లగా అక్కడ ఎవరూ లేక పోవటంతో తిరిగి వచ్చారు. అతను ఏపీలో ఉన్నట్లు తెలియడంతో మూడు ప్రత్యేక బృందాలు అక్కడికి వెళ్లినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా గురువారం ఉదయం నుంచి కేసును ఉపసంహరించుకోవాలని, లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హర్షసాయి బాధితురాలిని ఈ మెయిల్ ద్వారా వేధించినట్లు సమాచారం. దాంతో బాధితురాలు మరో మారు తన న్యాయవాదితో కలిసి నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని పోలీసులు ధృవీకరించలేదు.

- శబ్ద కాలుష్యంపై ఫిర్యాదులు 500 శాతం పెరిగాయి
- 'గణేష్'తో పాటు 'మిలాద్'కూ డీజే విస్తరించింది
- నియంత్రించకపోతే భవిష్యత్తులో దుష్పరిణామాలు
- సీఎం సైతం దీనిపై ఆందోళన వ్యక్తం చేశారు
- పరిష్కార మార్గాల కోసమే రౌండ్ టేబుల్ సమావేశం
- వెల్లడించిన నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

కట్టడి చేయాల్సిందే..

గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం, మిలాదున్నబీ ఊరేగింపుల నేపథ్యంలో డీజేల కారణంగా నగరంలో శబ్ద కాలుష్యం గణనీయంగా పెరిగిందని, గతంతో పోలిస్తే దీనిపై వచ్చే ఫిర్యాదులు 500 శాతం ఎక్కువయ్యాయని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. 'గణేష్' ఉత్సవాలతో పాటు 'మిలాద్' ఊరేగింపునకూ డీజే సంస్కృతి విస్తరిచడం ఆందోళనకరమన్నారు. ఈ శబ్ద కాలుష్యంపై ముఖ్యమంత్రి సైతం ఆందోళన వ్యక్తం చేశారని, నియంత్రించకుంటే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారని తెలిపారు. డీజేలతో పాటు టపాసుల కారణంగా వెలుడుతున్న శబ్ద కాలుష్య నియంత్రణకు మార్గాలు అన్వేషించేందుకు గురువారం కమిషనరేట్‌లో రాజకీయ పార్టీలు, వివిధ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో అత్యధిక వక్తలు డీజేలను బ్యాన్ చేయాలని సూచించారు. –సాక్షి, సిటీబ్యూరో



డ్రగ్స్ వినియోగంపై అనుమానాలున్నాయి:

ఊరేగింపుల నేపథ్యంలో మితిమీరిన శబ్దాలతో డీజేలు వినియోగిస్తున్నారు. మిలాదున్నబీ ఊరేగింపులోనూ డీజేలు వాడటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. దీంతో పాటు ఆయా వాహనాల్లో ఉండే యువత 15 నుంచి 20 గంటల పాటు ఏకధాటిగా నృత్యాలు చేస్తున్నారు. ఇది కేవలం మాదకద్రవ్యాలు, గంజాయి సేవించిన వారికే సాధ్యం. దీంతో పాటు అనేక మంది తల్లిదండ్రులు తమ కుమారులు ఊరేగింపునకు వెళ్లి వచ్చిన తర్వాత అనారోగ్యానికి గురయ్యారని చెబుతున్నట్లు సమాచారం ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో వారు డ్రగ్స్, గంజాయి వినియోగించి ఉంటారని అనుమానిస్తున్నాం. మండపాల వద్ద శబ్దకాలుష్యంపై ఫిర్యాదులు వచ్చినప్పుడు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్తున్నారు. కొందరు ఆపుతుండగా.. మరికొందరు పట్టించుకోవట్లేదు. ఆపిన వారిలోనూ పలువురు మళ్లీ ఆన్ చేశారు. మహారాష్ట్రలో డీజేలను నిషేధించడంతో ఆ ఉపకరణాలకు తక్కువ ధరకు తీసుకువచ్చి ఇక్కడ వినియోగించినట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే ఈ ఏడాది డీజేల వినియోగం గణనీయంగా పెరిగిందని భావిస్తున్నాం. రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల అభిప్రాయాలను క్రోడీకరించి ముఖ్యమంత్రికి నివేదిస్తాం. ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– సీవీ ఆనంద్, సిటీ కొత్వాల్

అరెస్టులు చేస్తేనే ..

డీజేల వల్ల చిన్నారులు, అనారోగ్యంతో ఉన్న వాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా వీటిని నిషేధించాలని అనుకుంటున్నా అమలు కావట్లేదు. డీజేలు వినియోగించిన వారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు ఉపకరణాలు స్వాధీనం చేసుకోవాలి. డ్యాన్స్ చేసే వారికి డ్రగ్ పరీక్షలు చేయాలి. వారు మాదకద్రవ్యాలు తీసుకున్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలి. డీజేలు వినియోగించే వారిని అరెస్టు చేస్తేనే అదుపు చేయగలం.

– రాఘవరెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి

ప్రత్యామ్నాయం చూపాలి

ఉత్సవాలు, ఊరేగింపుల్లో పాల్గొనే యువత డీజేపై ఆసక్తి చూపుతారు. ఈ రంగంపై అనేక కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయి. ఈ అంశాన్నీ ఆలోచించాలి. ఇరు పక్షాలకు ఇబ్బంది లేకుండా మధ్యేమార్గం ఆలోచించాలి. అధికారులు, రాజకీయ నాయకులతో కమిటీ వేసి డీజే నిర్వాహకులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపిద్దాం. ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలోని క్రీడలు నిర్వహిస్తూ యువతను పోలీసులకు దగ్గరగా, పెడదారులకు దూరంగా ఉండేలా ప్రయత్నిద్దాం.

– అనిల్‌కుమార్ యాదవ్, రాజ్యసభ ఎంపీ

బ్యాన్ చేయాలి

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని డీజేలను బ్యాన్ చేయాలి. ఏవరైనా డీజేలు పెట్టుకోవాలని భావిస్తే నాయకులనే ఆశ్రయిస్తారు. మనమే పోలీసులకు ఫోన్లు చేసి ఈ ఒక్కసారికీ వదిలేయమని చెబుతుటాం. ఇకపై ఎంతటి ఒత్తిడి వచ్చినా డీజేలకు మద్దతు ఇవ్వవద్దు. డీజేలు ఉండే ఉత్సవాలకు హాజరుకామంటూ నిర్వాహకులకు రాజకీయ నాయకులు స్పష్టంగా చెప్పాలి. డీజేల ఏర్పాటు కోసం ఎవరూ సిఫార్సులు చేయకూడదు.

– దానం నాగేందర్, ఎమ్మెల్యే

ఉత్సవాల నిర్వహణ చేతకాకే..

ప్రభుత్వానికి ఉత్సవాల నిర్వహణ చేతకావట్లేదని, కేవలం హిందూ పండుగలను టార్గెట్‌గా చేసుకుని డీజేలను బ్యాన్ చేయాలని చూస్తున్నారని గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. శబ్ద కాలుష్యం, పరిష్కార మార్గాలపై హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 'డీజే బ్యాన్ చేయాలని ముందే నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాతే ఈ రౌండ్ టేబుల్ సమావేశం పెట్టినట్లు అనిపిస్తోంది. డీజే నిర్వహణపై అనేక కుటుంబాలు ఆధారపడ్డాయి. హఠాత్తుగా బ్యాన్ చేస్తే వారు రోడ్డున పడతారు. స్పీడ్ లాకింగ్ మాదిరిగా డీజేల శబ్ద తీవ్రతకు పరిమితులు నిర్దేశించాలి. ప్రభుత్వానికి తాను చేయాల్సిన పని చేతకావట్లేదు. మా పండుగలు ఎలా చేసుకోవాలో ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో ఎలా చేసుకున్నామో ఇప్పుడూ అలానే చేసుకుంటాం. సుప్రీం ఆదేశాల మేరకు శబ్ద కాలుష్యం తగ్గించాలి అంటే అన్ని విధాలుగా చర్యలు తీసుకోండి. మేం కూడా నాలుగు పూటలా శబ్ద కాలుష్యాన్ని వింటున్నాం. ఇలా అన్ని విధాలైన శబ్ద కాలుష్యాన్ని నిరోధిస్తే నేనే చొరవ తీసుకుని డీజేలు, మైకులు బంద్ చేయిస్తా. దేవాలయాలతో పాటు మసీదుల్లో ఉన్న మైకుల్నీ బంద్ చేయండి అప్పుడు మీకు మద్దతుగా నిలబడతా.

–గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్

గోల్డ్ ఫిష్ అడోబ్ ఎండీ చంద్రశేఖర్ అరెస్ట్

- కార్పస్ ఫండ్, మెయింటెనెన్స్ చార్జీల దుర్వినియోగం
- రూ.6.81 కోట్లు వ్యక్తిగత అవసరాలకు మళ్లింపు
- సైబరాబాద్ ఈఓడబ్ల్యూలో కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్‌కు చెందాల్సిన కార్పస్ ఫండ్, మెయింటెనెన్స్ చార్జీలను దుర్వినియోగం చేసినందుకు గాను గోల్డ్ ఫిష్ అడోబ్ ఎండీ చంద్రశేఖర్‌ను సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ)లో పోలీసులు గురువారం అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెల్లాపూర్‌కు చెందిన గోల్డ్ ఫిష్ అడోబ్ ప్రై.లి. ఎండీ చంద్రశేఖర్ వేగే, గండిపేటకు చెందిన క్రెస్టా విల్లాస్ ఓనర్స్ ఎంఎంఏసీఎస్ లిమిటెడ్‌తో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కం జనరల్ పవరాఫ్ అటార్నీ (జీపీఏ) ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే జీపీఏ నిబంధనలు ఉల్లంఘించి 2020–23 మధ్యకాలంలో తన డైరెక్టర్ల ద్వారా కార్పస్ ఫండ్, మెయింటెనెన్స్ చార్జీల రూపంలో విల్లా యజమానుల నుంచి సేకరించిన రూ.6.81 కోట్ల నిధులను చంద్రశేఖర్ దుర్వినియోగం చేశారు. ఆయా నిధులను క్రెస్టా విల్లాస్ ఓనర్స్‌కు బదిలీ చేయకుండా వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకున్నాడు. అంతేకాకుండా అగ్రిమెంట్‌లో వ్యక్తిగతంగా సంతకం చేసినప్పటికీ.. నిందితుడు తన అదనపు డైరెక్టర్ల ద్వారా క్రెస్టా గేటెడ్ కమ్యూనిటీలోని విల్లాలను రిజిస్ట్రేషన్ చేశారు. క్రెస్టా విల్లాస్ ఓనర్స్ ఎంఎంఏసీఎస్ లిమిటెడ్ సెక్రటరీ ఎస్ విక్రాంత్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో చంద్రశేఖర్‌ను అరెస్టు చేశారు. నిందితుడిపై ఇప్పటికే నార్సింగి పీఎస్ పరిధిలో ఏడు క్రిమినల్ కేసులతో పాటు గచ్చిబౌలి పీఎస్‌లో పీడీ యాక్ట్ నమోదయ్యింది.

లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

రూ.8 వేల జరిమానా...

రాజేంద్రనగర్: లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.8 వేల జరిమానా విధిస్తూ రాజేంద్రనగర్ అడిషనల్ డిస్ట్రిక్ట్ స్పెషల్ జడ్జి గురువారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. నేపాల్‌కు చెందిన వినోద్ కుమార్ నగరానికి వలసవచ్చి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్‌జీకే ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. అతడి బంధువు కుటుంబం బాచుపల్లిలో నివాసం ఉండేది. బంధువు మృతి చెందడంతో అతడి భార్య, కుమార్తెను వినోద్ కుమార్ ఆర్‌జీకే ప్రాంతానికి తీసుకొచ్చాడు. బంధువు కుమార్తెపై కన్నేసిన వినోద్ కుమార్ పలు మార్లు ఆమెపై లైంగిక దాడికి పాల్పడటంతో గర్భవతి అయ్యింది. దీనిని గుర్తించిన ఆమె తల్లి నిలదీయగా అసలు విషయం చెప్పింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసును విచారించిన రాజేంద్రనగర్ ఫోక్సో కోర్టు అడిషనల్ డిస్ట్రిక్ట్ స్పెషల్ జడ్జి ఆంజనేయులు నిందితునికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.8 వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ.7 లక్షల నష్ట పరిహారాన్ని అందించాలని ప్రభుత్వానికి సూచించారు.


ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య


అక్షయ్‌కుమార్

రాంగోపాల్‌పేట్: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ లాడ్జిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వరంగల్ జిల్లా, భూపాలపల్లికి చెందిన అక్షయ్‌కుమార్(24) ఐటీఏ పూర్తి చేశాడు. ఏడాదిగా నగరంలో ఉద్యోగం చేస్తున్న అతను మూడు వారాల క్రితం ఉద్యోగం మానేసి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం రాత్రి సికింద్రాబాద్‌కు వచ్చిన అక్షయ్‌కుమార్ బండిమెట్‌లోని లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నాడు. బుధవారం ఉదయం బయటికి వెళ్లిన అతను సాయంత్రం లాడ్జికి తిరిగొచ్చాడు. ముందు రోజు రాత్రి తన ఫోన్ స్టేటస్‌లో స్నేహితులు, కుటుంబసభ్యుల ఫొటోలను పెట్టుకున్నాడు. వాటిని స్నేహితులు అతడికి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో లొకేషన్ ఆధారంగా బుధవారం రాత్రి లాడ్జికి చేరుకున్నారు. గది తలుపులు తెరిచి చూడగా అక్షయ్ ఉరేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న మార్కెట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రేమ విఫలమై అక్షయ్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసిందని పోలీసులు పేర్కొన్నారు.

గుర్రం దాడిలో యువకుడికి తీవ్ర గాయాలు

- ఉరికించి కొరికిన అశ్వం
- తెగిపడిన చిటికెన వేలు
- కాళ్లు, చేతులకు గాయాలు
- గాంధీ ఆస్పత్రికి తరలింపు


గుర్రం దాడిలో గాయపడిన గూడ్‌సాబ్

బషీరాబాద్: గుర్రం దాడిలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం జీవన్గీలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కర్ణాటక రాష్ట్రం, సేడం తాలుకా, జెట్టూరు గ్రామానికి చెందిన మహబూబ్‌సాబ్ కుమారుడు గూడ్ సాబ్(23) గుర్రాలను పోషిస్తుంటాడు. గురువారం వీటిని మేతకు తీసుకెళ్లగా ఓ ఆడ గుర్రం తప్పిపోయింది. దానిని వెతుక్కుంటూ వెళ్లిన గూడ్‌సాబ్ పక్కనే ఉన్న తెలంగాణలోని జీవన్గీ శివారుకు చేరుకున్నాడు. ఇక్కడ మరో మగ గుర్రంతో కలిసి మేస్తున్న తన గుర్రాన్ని గుర్తించిన అతను దానికి ఉన్న తాడు పట్టుకుని తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా.. గమనించిన మగ గుర్రం అతడిపై దాడికి దిగింది. తలతో కుమ్మి కిందపడేసింది. తప్పించుకునేందుకు ప్రయత్నించగా కాళ్లు, చేతులపై నోటితో కరిచి తీవ్రంగా గాయపర్చింది. కుడిచేతి చిటికెన వేలిని పూర్తిగా కొరికేసింది. కిలోమీటర్ మేర వెంబడించి కాళ్లతో తొక్కింది. ప్రాణభయంతో పరుగెత్తుతున్న గూడ్‌సాబ్‌ను గమనించిన స్థానికులు.. కర్రలతో బెదిరించడంతో గుర్రం ఆగిపోయింది. అనంతరం బాధితుడిని ఆటోలో తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేశారు.

వారి నుంచి నాకు ప్రాణహాని ఉంది

ఆశారామ్ బాపు అనుచరులపై నరేష్ సింగ్ ఆరోపణలు

లక్డీకాపూల్: తన ఇంటిని కాజేయడానికి ప్రయత్నం చేయడమే కాకుండా తన ప్రాణాలకు హాని తలపెడుతున్న ఆశారామ్ బాపు అనుచరులు ప్రశాంత్ రెడ్డి, కట్టా లక్ష్మీకాంత్ లపై చర్యలు తీసుకోవాలని బాధితుడు నరేష్ సింగ్ కోరారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిమాయత్ నగర్ లోని ప్లాట్ నెంబర్ 3-6-240 ఐదు అంతస్తుల భవనాన్ని తన తండ్రి మరణించిన తరువాత కొన్నేళ్లకు బెక్కన్ ఇన్ఫ్రా లిమిటెడ్ డైరెక్టర్ బి. ప్రశాంత్ రెడ్డికి జీపీఏ చేశామన్నారు. తర్వాత కోర్టుకు వెళ్లి జీపీఏని కూడా రద్దు చేశామన్నారు. అయినా తమ ఆస్తిని వేరే వారికి వారు అమ్మేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వారిపై గత సంవత్సరం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కేసు నమోదైనప్పటి నుంచి తనపై, తన కుటుంబ సభ్యులపై వారు దాడులు చేస్తూనే ఉన్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. తన ప్రాణాలకు వారి వల్ల ముప్పు ఏర్పడిందని ప్రభుత్వం తనకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు అడ్వొకేట్ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి



సభ్యత్వ నమోదులో రామచంద్రారెడ్డి తదితరులు

వెంకటేశ్వరకాలనీ: బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆ పార్టీ ఉపాధ్యక్షుడు, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బీజేపీ మెగా మెంబర్‌షిప్ డ్రైవ్‌లో భాగంగా గురువారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ నందినగర్ బస్తీ బూత్‌నెంబర్ 145లో సభ్యత్వ నమోదు చేపట్టారు. దీనికి హాజరైన చింతల రామచంద్రారెడ్డి స్థానికంగా పలువురికి సభ్యత్వాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వాన్ని స్వీకరించేందుకు అన్ని వర్గాల ప్రజలు ముందుకువస్తున్నారన్నారు. చిరు వ్యాపారులు, దుకాణదారులు, మార్కెట్ ఏజెంట్లు, ఉద్యోగులు, మహిళలు, యువకులు..ఇలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు 'డైనమిక్ స్కూల్' అవార్డు



అవార్డు అందుకుంటున్న వరలక్ష్మి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు ప్రతిష్ఠాత్మక 'డైనమిక్ స్కూల్ అవార్డు' వరించింది. తెలంగాణ ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో భాగంగా గురువారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో పాఠశాల డైరెక్టర్ ఎం.వరలక్ష్మి ఈ అవార్డును అందుకున్నారు. డిజిటల్ తరగతులు ప్రోత్సహిస్తున్నందుకు గాను ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డైనమిక్ స్కూల్ అవార్డును సాధించడం చాలా సంతోషంగా ఉందని, ఇకముందు కూడా జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విజయ పరంపరను కొనసాగిస్తుందన్నారు. సృజనాత్మకత, ఉత్తేజపరిచే అభ్యాస వాతావరణాన్ని పెంపొందించడంలో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ముందుంటుందన్నారు. బోధనా పద్ధతులు, ఇంటరాక్టివ్ తరగతి గదులు విద్యార్థుల విజయానికి దోహదంగా నిలుస్తున్నాయన్నారు.

బసవతారకం కేన్సర్ ఆస్పత్రితో రెడ్‌హెల్త్ భాగస్వామ్యం



అంబులెన్స్ సేవలను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

బంజారాహిల్స్: క్రిటికల్ కేర్ సేవల్లో రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి రెడ్‌హెల్త్ అంబులెన్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఆస్పత్రి సీఈవో డాక్టర్ కూరపాటి కృష్ణయ్య, రెడ్‌హెల్త్ వ్యవస్థాపకుడు ప్రబదీప్ సింగ్ కలిసి అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సీఈవో కృష్ణయ్య మాట్లాడుతూ అత్యవసర సహాయం, అవసరమైన రోగులకు సకాలంలో సంరక్షణ అందించేందుకు అన్ని వసతులు, ప్రస్తుత వైద్య రంగానికి అవసరానికి అవసరమైన పరికరాలు అమర్చిన రెడ్‌హెల్త్ అంబులెన్స్ సేవలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.

పేరెంట్ టీచర్ మీటింగ్‌లతో మంచి ఫలితాలు



బంజారాహిల్స్: పేరెంట్ టీచర్ మీటింగ్‌లో వెల్లడైన సమస్యలను పరిష్కరించాలని కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ కె.మల్లయ్య సూచించారు. గురువారం షేక్‌పేట మండల కాంప్లెక్స్ మీటింగ్ షేక్‌పేట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయగా, 76 మంది టీచర్లు పాల్గొన్నారు. 11 పాఠశాలల నుంచి పాల్గొన్న టీచర్లను ఉద్దేశించి కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ కె.మల్లయ్య మాట్లాడుతూ పేరెంట్ టీచర్ మీటింగ్‌లతో మంచి ఫలితాలు వస్తున్నాయని, ఏమాత్రం గైర్హాజర్ కాకుండా నిర్వహించాలన్నారు. ఎస్‌ఏ-1 పరీక్షల సన్నాహకాలపై దృష్టిపెట్టాలన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డీఈఓ రోహిణి ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

శ్రీనగర్‌కాలనీ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడల్లో ప్రావీణ్యం సాధించి దేశ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించి దేశానికి ఖ్యాతితో పాటు మంచి ఉపాధిని పొందవచ్చని మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ ఇంటర్ ఖైరతాబాద్, షేక్‌పేట జోనల్‌లెవెల్ కబడ్డీ, ఖో–ఖో టోర్నమెంట్ అండర్ 14–17 సెలెక్షన్స్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు బాబా ఫసియుద్దీన్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని, మనలోని ప్రతిభను వెలికితీస్తాయన్నారు. ఖైరతాబాద్ కార్పొరేటర్ పి. విజయారెడ్డి మాట్లాడుతూ యువతీ యువతులు తమలోని ప్రతిభను చూపించే సమయమిదేనన్నారు. మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని డిప్యూటీ ఈఓ శ్యాముల్‌రాజ్ తెలిపారు.

ఇకపై పక్కాగా హాజరు!

సర్కార్ బడుల్లో 'ఫేస్' రికగ్నైజేషన్ సిస్టం..!



- ప్రతిరోజూ విద్యార్థుల ఫొటోలు యాప్‌లో నమోదు
- బడుల్లో పెరిగిన హాజరుశాతం
- టీచర్లకూ వర్తిస్తున్న ప్రక్రియ
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

బంజారాహిల్స్: సర్కార్ బడుల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. అన్ని పాఠశాలల్లో గత నెల రోజుల నుంచి స్కూల్‌కు వచ్చిన ప్రతి విద్యార్థి ఫొటోను ఉపాధ్యాయులు తమ వద్ద ఉన్న యాప్‌లో మొబైల్ ఫోన్ యాప్ ద్వారా తీసి నమోదు చేస్తున్నారు. ప్రతి తరగతి ఉపాధ్యాయుడికి ఈ యాప్‌ను అందుబాటులో ఉంచారు. సదరు టీచర్ తమ వద్ద ఉన్న ఫోన్, ట్యాబ్ ద్వారా విద్యార్థి వద్ద కెమెరా ఉంచగానే పేరు, తరగతి వివరాలు తెరపై కనిపిస్తాయి. ఈ విధానాన్ని విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 48 ప్రాథమిక, 17 ఉన్నత పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. ప్రతిరోజూ టీచర్ తన తరగతి గది వద్ద విద్యార్థుల ఫొటోలు తీసుకుంటూ లోపలికి పంపిస్తారు. అంతేకాకుండా టీచర్ల హాజరు కూడా పక్కాగా నమోదయ్యే విధంగా వారి ఫొటోలను కూడా ప్రతిరోజూ ఈ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ముఖ గుర్తింపు నమోదు ప్రక్రియ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థుల పేర్లు, తరగతి..ఇలా అన్ని వివరాలు ఈ యాప్‌లో ఉంటాయి. ఈ ప్రక్రియ ప్రారంభమయ్యాక ఖైరతాబాద్ జోన్ పరిధిలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెరిగిందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. జోన్ పరిధిలో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం 16,150 ఉంది. గతంలో రోజూ 60 శాతం మాత్రమే విద్యార్థులు హాజరయ్యేవారు. ముఖ గుర్తింపు నమోదు ప్రక్రియ మొదలయ్యాక 90 శాతం హాజరు నమోదు అవుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ ప్రక్రియ మొదలయ్యాక ఉపాధ్యాయుల హాజరు శాతం కూడా పక్కాగా ఉంటుంది. ఒకరోజు రాకున్నా ఆ వివరాలు వెంటనే డీఈఈఓకు, కలెక్టర్‌కు తెలిసిపోతాయి. ఇంకోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో అసౌకర్యాలను గుర్తించేందుకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. మంచినీరు, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులను మరింతగా ఆకర్షిస్తున్నారు. పాఠశాలకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించడంతో అన్ని పాఠశాలల్లోనూ ఫ్యాన్లు, లైట్లు వెలుగుతూ విద్యార్థుల అసౌకర్యాలను దూరం చేస్తున్నాయి. దాదాపు అన్ని పాఠశాలల్లో ప్రయోగశాలలు, డిజిటల్ క్లాస్‌లు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌ను అమలు చేయడం వల్ల తల్లిదండ్రులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలు పక్కాగా స్కూల్‌కు హాజరవుతుండడం, టీచర్లకు కూడా ఈ ప్రక్రియ వర్తించడాన్ని తల్లిదండ్రులు స్వాగతిస్తున్నారు.



విద్యార్థుల హాజరు తీసుకుంటున్న బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-7లోని గతి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

మహిళా పోరాట శక్తికి ప్రతీక ఐలమ్మ



ఐలమ్మకు ఘన నివాళి అర్పించిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా ఖైరతాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో పలు ప్రభుత్వ, వివిధ కార్యాలయాల్లో గురువారం ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ మహిళా శక్తికి స్ఫూర్తి చాకలి ఐలమ్మ అన్నారు. చాకలి ఐలమ్మ భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిన వీరవనితగా, మహిళ పోరాట శక్తికి ప్రతీకగా నిలిచారన్నారు. దొరల ఆధిపత్యానికి వ్యతిరేకంగా జరిగిన రైతాంగ పోరాటానికి ఊపిరి పోసిన యోధురాలని కొనియాడారు. ఐలమ్మ చూపిన తెగువ, శౌర్యం, ధైర్యం ప్రతి ఒక్కరిలో ప్రేరణ కల్పించిందన్నారు. అదే విధంగా వివిధ ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో పలువురు ఐలమ్మ పోరాట పటిమను కొనియాడారు.

– ఖైరతాబాద్/జూబ్లీహిల్స్



నివాళులు అర్పిస్తున్న నేతలు



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్



నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు



ఐలమ్మ చిత్రపటానికి నాయకుల నివాళులు



నివాళులర్పిస్తున్న కమాండెంట్, అధికారులు



వేడుకల్లో ఎమ్మెల్యే శంకయ్య, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప

మోదీ పాలనలో బలహీన వర్గాల అభివృద్ధి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అరవింద్ మినాన్ తదితరులు

బంజారాహిల్స్: ప్రధాని మోదీ పాలనలో బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతారని, దేశం కూడా అన్ని రంగాల్లో దూసుకెళ్తుందని బీజేపీ జాతీయ కార్యదర్శి, దక్షిణ భారత బీజేపీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి అరవింద్ మినాన్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ చౌరస్తాలో గురువారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అరవింద్ మినాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని కొత్త సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో ప్రధాని మోదీ ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. కేంద్ర పథకాలను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వాలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, భోజిరెడ్డి, గడ్డం వెంకటస్వామి, కొత్త నీరజ, ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేడియంట్ హైస్కూల్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న రేడియంట్ స్కూల్ చైర్మన్ షరీఫ్

శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడలోని రేడియంట్ హైస్కూల్‌కి ఫీల్డ్ ఎడ్యుకేషన్ కేటగిరీలో అవార్డు లభించింది. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం రాత్రి డైనమిక్ స్కూల్స్–2024 అవార్డ్స్ కార్యక్రమంలో భాగంగా బెస్ట్ స్కూల్ ఇన్ ఫీల్డ్ ఎడ్యుకేషన్ కేటగిరీలో అవార్డును స్కూల్ చైర్మన్ అహ్మద్ షరీఫ్ అందుకున్నారు. ఈ అవార్డు నాలో మరింత బాధ్యతను పెంచిందని, ఉన్నత విద్యతో పాటు విద్యార్థులు త్వరగా అర్థం చేసుకునేలా కొంగొత్త విధానాలను అమలు మరితం విస్తృతం చేస్తామన్నారు.

అంబేడ్కర్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి

ఫిలింనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–46లోని అంబేడ్కర్‌నగర్ బస్తీలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యపై జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేద ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. అదే విధంగా అక్రమ కట్టడాలను కూడా కూల్చివేయాలని సూచించారు. అలాగే గురుబ్రహ్మనగర్ బస్తీలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదని, వెంటనే వాటిని ప్రారంభించాలని కోరారు.



కమిషనర్ ఆమ్రపాలికి వివరిస్తున్న వెల్దండ వెంకటేష్

ఆధునిక పద్ధతులతో మెరుగైన శస్త్ర చికిత్సలు

డాక్టర్ టామ్ చెరియన్



మాట్లాడుతున్న డాక్టర్ టామ్ చెరియన్

బంజారాహిల్స్: వైద్య రంగంలో అందుబాటులోకి వస్తున్న అధునాత చికిత్సా పద్ధతులతో రోగులకు మెరుగైన చికిత్సలు అందించగలుగుతున్నామని ప్రొఫెసర్ డాక్టర్ టామ్ చెరియన్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని సౌత్ ఏషియన్ లివర్ ఇనిస్టిట్యూషన్‌లో డాక్టర్లు అరుణ్, తేజస్విలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లివర్ సంబంధ సమస్యలతో బాధపడుతున్న వారికి తమ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్యం అందించి అతి తక్కువ కాలంలోనే వారిని సాధారణ స్థితికి తీసుకొచ్చామని ఇరాస్ ప్రొటోకాల్ ప్రకారం వేగవంతంగా చికిత్సలు పూర్తి చేయడంతో పాటు వారిని త్వరితగతిన కోలుకునేలా చేయగలుగుతున్నామని తెలిపారు. లివర్ చికిత్సా పద్ధతుల్లో ఇరాస్ ప్రొటోకాల్ వాడుతున్నది నగరంలో తాము మాత్రమేనని వెల్లడించారు. గతంలో శస్త్ర చికిత్స పూర్తయిన రోగులు 20–30 రోజుల తర్వాత డిశ్చార్జి చేసేవారమని ప్రస్తుతం ఇరాస్ ప్రొటోకాల్ ప్రకారం చేస్తున్న లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా ఏడు రోజుల్లోనే రోగులు సాధారణ స్థితికి వస్తున్నారని అన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ దీపక్ జాన్

రహమత్‌నగర్: క్రైస్తవుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ స్పష్టం చేశారు. రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్‌లో గురువారం నిర్వహించిన జూబ్లీహిల్స్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆవిర్భావ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎన్నడూ చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నదన్నారు. ఇందులో భాగంగానే గ్రూప్–1 మెయిన్ పరీక్ష రాయబోయే విద్యార్థులకు ఒక్కొక్కరి రూ. 1.25 లక్షలు వెచ్చించడం జరుగుతుందన్నారు. క్రైస్తవ విద్యార్థులకు స్కాలర్ షిప్పులు, రెసిడెన్షియల్ అదనపు పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమైందన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జూబ్లీహిల్స్ పాస్టర్ ఫెలోషిప్ ఫౌండర్ రెవరండ్ కృపాసన్నిధి, వర్కింగ్ ప్రెసిడెంట్లు రెవ శ్రీనివాస్, చిన్నారావు, చంద్రశేఖర్, నర్సింగరాజు, వైస్ ప్రెసిడెంట్లు మోస్, ప్రభాకర్, సామ్యేల్, హేమలత, జాయింట్ సెక్రటరీలు పరంజ్యోతి, ప్రవీణ్ తదితరులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ బిషప్ ఇండిపెండెంట్ చర్చీల యూనియన్ నాయకుడు డా.విల్సన్ సింగం, అపోస్తలిక్ సహవాస సేవకుడు డా.ఎ.జాషువా పట్లాభి, డాక్టర్ మోహన్‌బాబు, గోపీ, సాలమన్‌రాజ్, న్యాయవాది సుధీర్ భాట్ల తదితరులు పాల్గొన్నారు.

నిద్రమత్తులో పౌర సమాజం

జాగృతం చేయడమే లక్ష్యం

– రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వీ.కే.సింగ్

లక్డీకాపూల్ : నిద్రమత్తులో ఉన్న పౌరసమాజాన్ని జాగృతం చేయడమే లక్ష్యంగా సిటీజన్ ఫోరం తెలంగాణ ఆవిర్భవించిందని ఫోరం కో–ఆర్డినేటర్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వినయ్ కుమార్ సింగ్(వీ.కే.సింగ్) అన్నారు. గురువారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఫోరం రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో విచ్చలవిడితమనైన డ్రగ్స్ సరఫరా, మహిళలపై అత్యాచార ఘటనలు, కాలుష్య కొరల్లలో చిక్కుకున్న పర్యావరణం వంటి సమస్యలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయన్నారు. ప్రధానంగా ప్రజలను విద్య, వైద్యం, రెవెన్యూ, పురపాలక సంబంధ సమస్యలతో పాటు పర్యావరణం వంటి అంశాలు పట్టిపీడిస్తున్నాయన్నారు. క్లిష్టమైన ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారాల దిశగా సిటీజన్ ఫోరం తెలంగాణ నిర్మాణాత్మకమైన పోరాటం జరుపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి బి.వి.గోపీనాథ్, రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ ఎ. నర్సింహ, అపోలో కార్డియాలజిస్ట్ డాక్టర్ పీ. శ్రీధర్ రెడ్డి, ఉస్మానియా యూనివర్శిటీ గ్రాడ్యుయేట్స్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఏ. అశోక్ కుమార్, ఇంజనీర్ సి. రాజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యునానీ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలి

ఆయుష్ మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి భావనా సక్సేనా



వెంగళరావునగర్ : యునానీ వైద్యాన్ని అధునాతన పద్ధతుల ద్వారా పరీక్షలను నిర్వహించి, దానిని విశ్లేషించి దేశవ్యాప్తంగా ప్రజలందరికీ అందుబాటులోనికి తీసుకురావాలని ఆయుష్ మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి భావనా సక్సేనా తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని నేషనల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యునానీ మెడిసిన్ ఫర్ స్కిన్ డిజాస్టర్ (కేంద్రీయ యునానీ వైద్యశాల)లో గురువారం ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ యునానీ మెడిసిన్ (సీసీఆర్‌యూఎం) రెండురోజుల మెథడాలజీ, హెచ్‌ఆర్‌డీ కోర్ పరిశోధనా అధికారుల వర్క్‌షాపును నిర్వహించారు. వర్క్‌షాపు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన భావనా సక్సేనా మాట్లాడుతూ నానాటికీ మారుతున్న వాతావరణ మార్పులు, వస్తున్న రోగాలను దృష్టిలో పెట్టుకుని ప్రొఫెసర్లు పరిశోధనలు చేయాలని సూచించారు. ఇప్పటికే భారతీయ వైద్య విధానాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలన్నీ స్వాగతిస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా యోగా డేను విశ్వవ్యాప్తంగా అనుసరించడం ఎంతో గర్వకారణంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీసీఆర్‌యుఎం మాజీ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ ఆసిమ్ ఆలీ ఖాన్, హైదరాబాద్ సీసీఆర్‌యుఎం మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎ.వాహీద్, న్యూఢిల్లీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్.జహీర్ అహ్మద్, హైదరాబాద్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ యూనిస్ ఇఫ్తికర్ మున్షి తదితరులు పాల్గొన్నారు.



ప్రముఖ ఆకృతి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఈ నెల 27, 28 తేదీలలో హోటల్ తాజ్ కృష్ణలో నిర్వహిస్తున్న సందర్భంగా ఆభరణాలను ప్రదర్శిస్తున్న సశినత తదితరులు. – బంజారాహిల్స్

ఆర్టిజన్లను రెగ్యులరైజ్ చేయాలి



మింట్ కాంపౌండ్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యుత్ ఆర్టిజన్లు

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేసి, అర్హులైన వారందరికీ పదోన్నతులు కల్పించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్స్ జేఏసీ డిమాండ్ చేసింది. ఆర్టిజన్లను రెగ్యులరైజ్ చేసిన తర్వాతే జేఎల్ఎం, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్స్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం మింట్ కాంపౌండ్‌లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించారు. సుమారు రెండు వేల మంది కార్మికులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. తెలంగాణ విద్యుత్ సంస్థల్లో 23,667 మంది గత18 ఏళ్లుగా పని చేస్తున్నట్లు తెలిపారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేయించుకుంటూ, వారికి సమానమైన హోదాను కల్పించకుండా తమకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో ఆర్టిజన్ కార్మిక ప్రతినిధులు ఈశ్వర్‌రావు, వజీర్, గాంబోనాగరాజు, తదితరులు ఉన్నారు.

జూనియర్ లెక్చరర్స్ ఫలితాలు విడుదల చేయాలి



మంత్రి పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న జూనియర్ లెక్చరర్స్ అభ్యర్థులు

సాక్షి, సిటీబ్యూరో: జూనియర్ లెక్చరర్స్ నియామక ఫలితాలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన జూనియర్ లెక్చరర్స్ అభ్యర్థులు కలిసి వినతి పత్రం సమర్పించారు. చాలా సంవత్సరాలుగా జూనియర్ లెక్చరర్ల నియామకాలు లేక ఉన్నత విద్యారంగం నిర్వీర్యం అయిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. 15 సంవత్సరాల తర్వాత జూనియర్ లెక్చరర్ల నియామక పక్రియ ప్రారంభమైందన్నారు. ప్రభుత్వం ఉన్నత విద్యారంగాన్ని బలోపేతం చేయాలంటే వెంటనే 1392 జూనియర్ లెక్చరర్స్ నియామకాలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డిలు స్పందిస్తూ టీజీపీఎస్సీ చైర్మన్ తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఫలితాలు తొందరలో వచ్చేలాగా చర్యలు తీసుకొంటామని తెలిపారన్నారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ద్వారా నియామక పత్రాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

హెచ్‌సీయూకు ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న హెచ్‌సీయూ పీఆర్‌ఓ ఆశిశ్‌జాకబ్ థామస్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) మరో అంతర్జాతీయ గుర్తింపు సాధించింది. గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ కెరీర్స్ ఫోరమ్, యూనివర్సిటీ ఆఫ్ విండర్స్ కెనడా.. హెచ్‌సీయూకు ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డును అందించారు. బుధవారం బేగంపేట్‌లోని తాజ్ వివాంటాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును హెచ్‌సీయూ పీఆర్‌ఓ ఆశిశ్‌జాకబ్ థామస్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, విండర్స్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు, వైస్‌చాన్సలర్ డాక్టర్ రాబర్ట్ గోర్డాన్ సమక్షంలో అవార్డును అందించారు. దీంతో అంతర్జాతీయ స్థాయిలో అందించే అవార్డును స్వీకరించే అవకాశం రావడం పట్ల ఆశిశ్ జాకబ్ థామస్ సంతోషం వ్యక్తం చేశారు

మెడికల్ హబ్‌గా హైదరాబాద్

– మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



తొలి ఏఐ సహాయక లేజర్ టెక్నాలజీని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బంజారాహిల్స్: వెరికోస్ వెయిన్ చికిత్స కోసం జూబ్లీహిల్స్‌లోని గో హాస్పిటల్‌లో తెలంగాణ తొలి ఏఐ సహాయక లేజర్ టెక్నాలజీ, మొబైల్ డయాగ్నస్టిక్ బస్సు సర్వీసులను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఆయనతో పాటు ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మాజీ హోంమంత్రి జానారెడ్డిలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వెరికోస్ చికిత్స కోసం గో వాస్కులర్, మొబైల్ డయాగ్నస్టిక్ బస్సు, లేటెస్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్రీట్‌మెంట్ ఎక్విప్‌మెంట్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. హైదరాబాద్ నగరం మెడికల్ హబ్‌గా మారిందన్నారు. దేశ విదేశాల నుంచి చికిత్స కోసం నగరానికి వస్తున్నారన్నారు. కార్యక్రమంలో గో హాస్పటల్ సీఈఓ సువర్ణ నరవ, వాస్కులర్ ఇంటర్వెన్షనల్ రేడియాలజీ, ఎండోవాస్కులర్ సర్జరీ చీఫ్ డాక్టర్ సంపత్ వదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌డీపీపై రాష్ట్ర ప్రభుత్వం దూకుడు

రక్షణ శాఖ అధికారులతో.

రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల ప్రత్యేక భేటీ

కంటోన్మెంట్: స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్స్ ప్రాజెక్టులో భాగంగా కంటోన్మెంట్ పరిధిలో చేపట్టనున్న రెండు ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తోంది. ఆరు నెలల క్రితమే ఈ రోడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయగా, క్షేత్రస్థాయిలో భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. ఇందులో భాగంగా గురువారం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో రక్షణ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ (ల్యాండ్ అండ్ వర్క్స్) రాకేశ్ మిట్టల్, డిఫెన్స్ ఎస్టేట్స్ అదనపు డైరెక్టర్ జనరల్ (ఇన్‌ఫ్రా) వలేటీ ప్రేమ్ చంద్, డిఫెన్స్ ఎస్టేట్స్ సదరన్ కమాండ్ డైరెక్టర్ అమోల్ బి. జగతప్ తదితరుల పర్యటన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు వారితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా రక్షణ ఎలివేటెడ్ కారిడార్లకు సంబంధించి రక్షణ భూముల కేటాయింపునకు సంబంధించి తదుపరి కార్యాచరణపై చర్చించినట్లు తెలుస్తోంది.

‘ఓపెన్ డే’ వండర్





- ఎన్‌జీఆర్‌ఐలో సందడి చేసిన విద్యార్థులు
- భూకంపాలు, సునామీ గురించి వివరించిన శాస్త్రవేత్తలు

ఉప్పల్: జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(సీఎస్ఐఆర్ ఎన్‌జీఆర్‌ఐ)లో నిర్వహించిన ఓపెన్ డే విద్యార్థులను అబ్బురపరచింది. ఎన్‌జీఆర్‌ఐ ప్రాంగణంలో దాదాపు 20 ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. భూమి లోపలి పొరల్లో దాగి ఉన్న విశేషాలను తెలుసుకున్న విద్యార్థులు సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయారు. ముఖ్యంగా భూకంపాలు, సునామీల గురించి శాస్త్రవేత్తలను అడిగి మరీ తెలుసుకున్నారు. ఎన్‌జీఆర్‌ఐ ప్రాంగణం విద్యార్థులతో కిటకిట లాడింది. భూకంపాలు, సునామీ వేవ్‌ల హెచ్చరికలు, భూఫలకలు, భూమి లోపల జరిగే ప్రక్రియలు, లభించే ఖనిజాలు, రాక్ గార్డెన్‌లను విద్యార్థులు ఎంతో ఆసక్తిగా చూసారు. జంట నగరాల నుంచే కాకుండా శివారు మున్సిపాల్టీల పాఠశాలల విద్యార్థులు దాదాపు 15000 మందికి పైగా సందర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు.

భూకంపాల గురించి తెలుసుకున్నా..



ఇక్కడ భూకంపాల గురించి తెలుసుకున్నాను. సివిల్ ఇంజనీరింగ్‌లో ప్రస్తుతం ట్రెండింగ్ టాపిక్ ఇది. భూకంపాలను తట్టుకుని నిర్మించే నిర్మాణాల గురించి కొత్త పద్ధతులను తెలుసుకున్నాను. భూకంపాలు వచ్చినా తట్టుకునే విధంగా నిర్మించే నిర్మాణాలు మెలకువలను తెలుసుకున్నాను.

–స్ఫూర్తి, ఓయూ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థి

కొత్త కొత్త ఐడియాలు వచ్చాయి



పాఠశాల స్థాయి నుంచే సైంటిస్టు అవ్వడానికి ఈ ఓపెన్ డె ఎంతగానో ఉపయోగ పడుతుంది. శాస్త్ర వేత్తల ప్రయోగాత్మక వివరణ నచ్చింది. భూకంపాలను ఎలా గుర్తిస్తారో తెలుసుకున్నాం. భూమి లోపల మినరల్స్ అవి లభ్యమయ్యే ప్రాంతాలు తెలుసుకున్నాం. ఇక్కడికి వచ్చిన తరువాత కొత్త ఐడియాలు వచ్చాయి.

–సాయివర్ష, పదవ తరగతి, సీజీఆర్ స్కూల్, మాదాపూర్

విద్యార్థులను విజ్ఞాన శాస్త్రం వైపు మళ్లించడానికే..



విద్యార్థులను విజ్ఞాన శాస్త్రం వైపు మళ్లించడానికి తమ వంతు కృషి చేస్తున్నామని ఎన్‌జీఆర్‌ఐ చీఫ్ సైంటిస్టు శ్రీనివాస శర్మ అన్నారు. రోజు రోజుకూ శాస్త్ర సాంకేతిక రంగం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. విద్యార్థుల దృష్టి పరిశోధనల వైపు మళ్లించి ఎన్‌జీఆర్‌ఐ ఆవిష్కరణలను ప్రజలకు తెలియ జెప్పాలన్నదే తమ లక్ష్యమన్నారు.

– శ్రీనివాస శర్మ, ఎన్‌జీఆర్‌ఐ చీఫ్ సైంటిస్టు

కొత్త ఆవిష్కరణలు తెలుసుకున్నాం



తరగతి గదుల్లో కేవలం బోధనే ఉంటుంది. ఇక్కడ ప్రయోగాత్మకంగా నేర్చుకునే అవకాశం లభించింది. చాలా అద్భుతంగా ఉంది. కొత్త కొత్త ఆవిష్కరణలను గురించి తెలుసుకున్నాం.

– ప్రణిక, జాన్సన్ గ్రామర్ స్కూల్, హైదరాబాద్



నగరంలో నేడు

- ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలు ఉదయం 11 గంటలకు రవీంద్రభారతిలో జరుగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కార్యక్రమానికి హాజరుకానున్నారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

స్వచ్ఛతా హీ సేవ



సాక్షి, సిటీబ్యూరో: పరిశుభ్రత, పారిశుధ్యంపై అవగాహన కల్పించేందుకు ఎన్టీపీసీ నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పలువురు జీహెచ్‌ఎంసీ, పోలీసులు, గాంధీ ఆస్పత్రి అధికారులు భారీగా పాల్గొన్నారు. ఎన్టీపీసీ సికింద్రాబాద్ కార్యాలయం నుంచి స్వచ్ఛతా ర్యాలీని గాంధీ ఆస్పత్రి వరకు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ జీఎంలు ఎస్ఎస్ పాణిగ్రాహి, రోహిత్ చాబ్రా, సురేశ్ వెంకటేశ్, వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ వాణి, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి పాల్గొన్నారు.

పాడి రైతుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



పాడి రైతుల ధర్నాలో మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్

ఇందిరాపార్కు వద్ద భారీ ధర్నా

కవాడిగూడ: ఐదు నెలలుగా పాడి రైతులకు చెల్లించాల్సిన రూ.150 కోట్ల పాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీ ప్రకారం పాడి రైతుల ఖాతాలలో ఇన్‌సెంటివ్‌లు జమచేయాలన్నారు. గురువారం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ పాడి ఉత్పత్తిదారుల సంఘం, టీజీ విజయ పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో పాడి రైతుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో ముఖ్యఅతిథిగా హాజరైన సాగర్ మాట్లాడుతూ... ప్రతి 15 రోజులకు ఒక్కసారి పాల బిల్లులను రైతుల ఖాతాలలో జమచేయాల్సి ఉండగా ప్రభుత్వం ఐదు నెలలు గడిచినా బిల్లులు చెల్లించకపోవడంతో పాడి ఉత్పత్తి రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. ఒక లీటర్ పాలకు రూ.5 ప్రోత్సాహకం, ఎన్నికల హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాడి సంరక్షణకు మందులు, గడ్డి విత్తనాలపై 50శాతం సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పశుపోషణ పథకాన్ని అమలు చేస్తూ ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల వద్దే పశువైద్య సౌకర్యాన్ని మొబైల్ వ్యాన్‌ల ద్వారా అందించాలని కోరారు. పశుసంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న అన్ని రకాల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల సమస్యలపై దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. టీజీ విజయ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ సాదం రమేష్, పాల ఉత్పత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మంగ నర్సింహులు మాట్లాడుతూ... ప్రభుత్వం గత ఐదు నెలలుగా పాలబిల్లులు చెల్లించకపోవడంతో పశుపోషణ భారమవుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లులు రాకపోవడంతో రైతులు, పాల ఉత్పత్తిదారులకు తమ కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. పాల టెస్టర్లు, చాప్ కట్టర్లు, మిల్క్ అనలైజర్‌లు ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిరసన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. ధర్నాలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం. శోభన్ నాయక్, ప్రొఫెసర్ హరిబండి ప్రసాదరావు, వెంటర్నరి గ్రాడ్యుయేట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాటం శ్రీధర్, తెలంగాణ పోలీస్ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు సంజీవ్, పాల ఉత్పత్తిదారుల సంఘం నాయకులు మరుమాముల బాబు, సురేందర్‌రెడ్డి, నర్సిరెడ్డితోపాటు రాష్ట్ర వ్యాప్తంగా పాల ఉత్పత్తిదారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

సీసీ కెమెరాలే పట్టించాయి



శిశువును కిడ్నాప్ చేసి తీసుకువెళ్తున్న నిందితురాలు (సీసీ ఫుటేజీ దృశ్యం)

- గాంధీలో శిశువు కిడ్నాప్ కేసు ఛేదించిన పోలీసులు
- ఎంసీహెచ్ భవనంలో నిఘా మరింత పటిష్టం

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో శిశువు కిడ్నాప్ కేసులో నిందితురాలిని సీసీ కెమెరాలే పట్టించాయి. గాంధీ మాతా శిశు ఆస్పత్రి భవనంలోని ప్రతి అంతస్తు, కారిడార్లలో ఏర్పాటు చేసిన అత్యంత అధునాతన కెమెరాలు నిందితురాలి కదలికలను స్పష్టంగా రికార్డు చేయడం, చిలకలగూడ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించడంతో కిడ్నాప్ మిస్టరీని కొన్ని గంటల్లోనే ఛేదించి, శిశువును తల్లి ఒడికి క్షేమంగా చేర్చారు.గాంధీ అధికారులు, చిలకలగూడ పోలీసులు తెలిపిన మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన షాహీన గాంధీ ఎంసీహెచ్ ఆస్పత్రిలో మగ శిశువుకు జన్మనిచ్చింది.

- శిశువును బెడ్‌పై పడుకో బెట్టి వైద్యపరీక్షల కోసం మరో విభాగానికి వెళ్లింది. సహాయకురాలిగా ఉన్న అమ్మమ్మ చాతూబీ వాష్‌రూమ్‌కు వెళ్లి వచ్చేసరికి బెడ్‌పై ఉన్న శిశువు కనిపించలేదు.
- సమాచారం అందుకున్న పోలీసులు శిశువు కిడ్నాప్ గురైనట్లు గుర్తించి మాతాశిశు భవనంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు.
- షాహీన బెడ్ పక్కన మరో బెడ్‌పై ఉన్న నాచారానికి చెందిన బాలింతను ఓ మహిళ పరామర్శించేందుకు వచ్చి, రెండు, మూడు సార్లు రెక్కీ నిర్వహించి బెడ్‌పై ఒంటరిగా ఉన్న శిశువును ఎత్తుకుని పరారైనట్లు గుర్తించారు.
- అక్కడ ఉన్న బాలింతను ఆరా తీయగా, బీహార్‌కు చెందిన పూజాదేవి నాచారంలో ఉంటుందని చెప్పి ఫోన్‌నంబరు ఇచ్చింది.
- దీంతో పూజాదేవికి ఫోన్ చేయగా తనకేమీ తెలియదని చెప్పి అపహరించిన శిశువును మరొకరికి అప్పగించి, కొంత సమయం తర్వాత గాంధీ ఎంసీహెచ్ ఆస్పత్రికి తిరిగి వచ్చింది.
- పోలీసులు పలుమార్లు ప్రశ్నించినా తనకే పాపం తెలియదని బుకాయించింది. సీసీ కెమెరాలు ఫుటేజీలను చూపించగా గత్యంతరం లేక చేసిన నేరం ఒప్పుకుంది.
- అనంతరం నాచారం వెళ్లిన పోలీసులు శిశువును తీసుకువచ్చి క్షేమంగా తల్లి ఒడికి చేర్చారు. పూజాదేవిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.
- గాంధీఆస్పత్రిలో సుమారు 200 సీసీ కెమెరాలు ఉన్నాయని, నిఘావ్యవస్థను మరింత పటిష్టపర్చేందుకు మరో 110 అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు సూపరింటెండెంట్ రాజకుమారి, డిప్యూటీ సునీల్‌కుమార్ తెలిపారు.

నేడు ప్రవాసి ప్రజావాణి ప్రత్యేక కౌంటర్ ప్రారంభం

లక్డీకాపూల్ : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల కోసం ' ప్రవాసీ ప్రజావాణి ' కార్యక్రమం లాంఛనంగా ప్రారంభం కానుంది. శుక్రవారం ఉదయం 10గంటలకు ఈ ప్రత్యేక కౌంటర్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ పీసీసీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొంటారు.

ఫెర్టీ9లో రాయితీపై ఐవీఎఫ్ సేవలు

సాక్షి, సిటీ బ్యూరో: ప్రస్తుత పరిస్థితుల్లో సంతానలేమి అనేది అతి పెద్ద సమస్యగా మారింది. దీని ప్రభావంతో దంపతులు మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోంది. ఇటువంటి సమస్యల పరిష్కారం కోసం ఫెర్టీ9 వైద్యుల బృందం సిద్ధంగా ఉందని ఆ సంస్థ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. దశాబ్దాల అనుభవం ఉన్న వైద్యులు అందుబాటులో ఉన్నారన్నారు. ఇన్‌ఫెర్టిలిటీ సమస్యల చికిత్సల్లో భారతదేశంలోనే అగ్రగామిగా ఉన్నామని తెలిపారు. అత్యాధుని వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఐవీఎఫ్‌పై 25 శాతం రాయితీ కల్పిస్తున్నామని వివరించారు. ఉచితంగా ఆల్ట్రా సౌండ్ స్కాన్, డాక్టర్ కన్సల్టేషన్ సదుపాయం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విదేశాల్లో ఉద్యోగాల భర్తీకి 30న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

విజయనగర్‌కాలనీ: విదేశాలలో ఉద్యోగాల భర్తీకి ఈ నెల 30న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఓవర్‌సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టాంకాం) జనరల్ మేనేజర్ కె.నాగభారతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్ట్రేలియా, కెనడా, జర్మని, హంగేరి, జపాన్, పోలండ్, రుమేనియా, యూకే, యునైటెడ్ అరబ్ ఎంమిరేట్స్ తదితర దేశాలలోని మెకానికల్, ఎలక్ట్రికల్, బీఎంఎస్ ఆపరేటర్, ఎంఈపీ టెక్నీషియన్, సూపర్‌వైజర్, కార్పెంటర్, తాపీమేస్త్రీ తదితర ఉద్యోగాల కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఆయా రంగాలలో కనీసం రెండు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సోమవారం ఉదయం 10.30 గంటలకు విజయనగర్ కాలనీలోని టాంకాం కార్యాలయంలో ఫోటోలు, సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. వివరాలకు 70133 61343, 99854 83931, 78935 66493 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

జైనూర్ ఘటనలపై విచారణ జరిపించాలి

లక్డీకాపూల్ : ఆదిలాబాద్ జిల్లా జైనూర్‌లో జరిగిన అల్లర్ల ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జైనూరులో ఉద్దేశ్యపూర్వకంగానే ఒక వర్గంపై దాడులు, దౌర్జన్యాలు జరిగాయని, దీనిపై బీజేపీ అనుబంధ సంఘాలు పనిచేశాయన్నారు. ఘటనపై పోలీసులు తక్షణం స్పందించలేదని ఆరోపించారు. సమావేశంలో సామాజిక, పౌర హక్కుల కార్యకర్తలు ఖలీదా పర్వీన్, సరా మాథ్యూస్, మసూద్, ప్రొఫెసర్ పద్మజాషా తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో నిలువ నీడ లేకుండా చేస్తున్నారు



– ఎంపీ ఈటల రాజేందర్

నిజాంపేట్: సీఎంగా రేవంత్‌రెడ్డిని ఎన్నుకున్నందుకు హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదప్రజలకు నిలువ నీడ లేకుండా చేస్తోందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నిజాంపేట్ మున్సిపాలిటీ, దుండిగల్ మల్లంపేటలలో గురువారం జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పేద ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారన్నారు. జీవో 58, 59 కింద రెగ్యులరైజ్ చేసుకున్న ఇళ్లను సైతం హైడ్రా అధికారులు కూల్చివేస్తున్నారని, వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపించకుండా రాష్ట్ర ప్రభుత్వం దారుణాలకు ఒడిగడుతోందన్నారు. శని, ఆదివారాల్లో కోర్టులకు సెలవు ఉండటంతో నోటీసులు ఇవ్వకుండా పేదల ఇళ్లను కూలుస్తున్నారని, రేవంత్‌రెడ్డిని ఎందుకు ఎన్నుకున్నామా అని ప్రజలు రోధిస్తున్నారన్నారు. పట్టా భూమిని లీజుకు తీసుకుని నిర్మాణాలు చేపట్టిన వాటిని సైతం కూల్చివేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏమిటో అధికారం చేపట్టిన తొమ్మిది నెలల్లోనే తెలిసిపోయిందని, ఎన్నికల హామీలను సైతం సక్రమంగా నెరవేర్చకుండా మహిళలను సీఎం మోసం చేశారన్నారు. అమెరికా నుండి తనకు కూల్చివేతలపై ఫోన్‌కాల్స్ వస్తున్నాయని, ఎంపీగా ఉండి పేదలకు అన్యాయం జరుగుతుంటే ఏం చేస్తున్నావని పలువురు ప్రశ్నిస్తున్నారన్నారు. బాధిత కుటుంబాలకు బీజేపీ అండగా ఉంటుందని, హామీలను అమలయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, పలువురు సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఏదైనా సాధించవచ్చు

– మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

బంజారాహిల్స్: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చునని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన విద్యార్థుల తరగతుల ప్రారంభోత్సవ ఓరియేంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తనకు కాలేజీ లైఫ్ తెలియదని తాను ఇంటర్ దశలోనే మిలిటరీ ట్రైనింగ్‌కు వెళ్లానన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ కంపెనీల్లో ఉన్నతమైన స్థానాల్లో హైదరాబాద్ విద్యార్థులు ఉన్నారని ఇది ఎంతో గర్వకారణమని అన్నారు. ఫాస్టెస్ట్ గ్రోయింగ్ స్టేట్‌గా తెలంగాణ రాష్ట్రం ముందుకు సాగుతోందని, తెలంగాణ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లకు డెస్టినేషన్‌గా హైదరాబాద్ రోజురోజుకు తన స్థానాన్ని పెంచుకుంటున్నదని అన్నారు. యువత బాగా చదువుకొని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సుప్ర 2024 కార్ రేసింగ్‌లో ముఫకంజా ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు తయారు చేసిన రేసింగ్ కారును ప్రారంభించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, బోర్డు సభ్యుడు ఆమెర్ జావెద్, రిజిస్ట్రార్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

30న ఫార్మాసిస్టు పోస్టులకు జాబ్ మేళా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో ఈ నెల 30న ఉదయం 11 గంటలకు ఫార్మాసిస్టుల ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా జరగనుంది. ఫార్మాసీలో డిప్లొమా, డిగ్రీ, మాస్టర్స్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని ఎంప్లాయిమెంట్ బ్యూరో చీఫ్ టి. రాము తెలిపారు. అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్లు ఉద్యోగాల కోసం నిర్వహించే జాబ్‌మేళాకు తగిన సర్టిఫికెట్లతో నేరుగా హాజరుకావాలన్నారు.

ఆపన్నహస్తం కోసం ఆపద్బాంధవుడి ఎదురుచూపులు

అరుదైన వ్యాధితో బాధపడుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి



కృష్ణ ప్రసాద్

సాక్షి, సిటీబ్యూరో: ఆపదలో ఉన్నవారిని ఎప్పుడూ ఆదుకునే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇప్పుడు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. ఆస్పత్రిలో ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. దయార్ధ హృదయుల స్పందన కోసం ఆశగా నిరీక్షిస్తున్నాడు. అతడి పేరు కృష్ణప్రసాద్(48). నగ రంలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగి. అతడు మెదడు, మూత్రపిండాలు వంటి ప్రధాన శరీరభాగాల్లో రక్తనాళాలు చిట్లి పోయే అరుదైన వ్యాధి(థ్రాంబోటిక్ మైక్రో ఆంజియోపతి)తో బాధపడుతున్నాడు. దీని చికిత్సకు ఏకంగా రూ.3 కోట్లు అవసరం పడుతోందని అతడి స్నేహితుడు బాలప్రసాద్ చెబుతున్నాడు. అమెరికా నుంచి ఎక్యులిజుమాబ్ అనే ఇంజెక్షన్లు తెప్పించాలని, వీటిని ఆరు నెలలపాటు ఇవ్వాల్సి వస్తుందని డాక్టర్లు చెబుతున్నారని తెలిపాడు. ఒక్కో ఇంజెక్షన్ ఖరీదు రూ.9 లక్షలు అవుతుందని, మొత్తం 24 ఇంజెక్షన్లు అవసరమని చెప్పాడు. అవసరాల్లో ఉన్నవారిని కృష్ణప్రసాద్ ఆదుకునేవాడని, ఇప్పుడు అతడే ప్రాణాపాయస్థితిలో ఉన్నాడని పేర్కొన్నాడు. కృష్ణప్రసాద్ తల్లి కూడా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని తెలిపాడు. అతడి భార్య ఏడాది కిందటే కన్నుమూసిందని చెప్పా డు. దాతలు ముందుకొచ్చి అకౌంట్ నంబర్: 91001004 2902046, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: UTIB 0000008, బేగంపేట యాక్సిస్ బ్యాంకు, హైదరాబాద్‌కు ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నాడు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్‌ । శుక్రవారం ।
27 । సెప్టెంబర్‌ । 2024



హైదరాబాద్ వైబ్స్

డ్యాన్సింగ్ సిటీ.. హిప్‌హాప్ స్టెప్స్

సిటీలో పెరుగుతున్న బాలీవుడ్ కల్చర్

- డ్యాన్సింగ్ ఈవెంట్స్‌కు పెరుగుతున్న ఆదరణ
- ప్రొఫెషనల్ డ్యాన్సర్లకు ఫుల్ డిమాండ్
- పార్టీలు, సినిమా షోలు, కార్పొరేట్ ఈవెంట్స్‌లో సందడి

అధునాతన జీవన శైలి, మోడ్రన్ ఫ్యాషన్ హంగులను అందిపుచ్చుకోవడంలో నగరం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిసిందే.. ముఖ్యంగా మోడ్రన్ ఆర్ట్స్‌కు నగరంలో విపరీతంగా క్రేజ్ పెరిగిపోతోంది. ఇందులో భాగంగానే సిటీలో ట్రెండీ డ్యాన్స్ స్టెప్పులను ఆహ్వానిస్తున్నారు.. ఆస్వాదిస్తున్నారు. దశాబ్ద కాలం క్రితంతో పోలిస్తే ప్రస్తుతం నగరంలో డ్యాన్సింగ్‌లో ఎన్నో మార్పులు, విభిన్న టెక్నిక్స్ రూపు దిద్దుకున్నాయి. డ్యాన్స్‌లో వెస్ట్రన్ స్టైల్స్‌కు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. అయితే ప్రస్తుత తరుణంలో వేడుక ఏదైనా సరే.., అందులో స్టెప్పు లేనిదే కిక్కు రాదు. కార్పొరేట్ ఈవెంట్స్ మొదలు సినిమా ఫంక్షన్ల వరకు హిప్‌హాప్, జాజ్ వంటి ట్రెండీ స్టెప్పులతో నగరం నృత్యం చేస్తోంది. నృత్యాన్నే కెరీర్‌గా మార్చుకున్న ఎంతో మంది డ్యాన్సర్లకు ఈవెంట్స్ ఉపాధిగా మారాయి. ప్రైవేటు పార్టీలు మొదలు కొత్త సంవత్సర వేడుకల వరకు ఈ డ్యాన్స్ బృందాలకు డిమాండ్ పెరిగిపోయింది.

– సాక్షి, సిటీబ్యూరో



సినిమాల్లో సైడ్ డ్యాన్సర్లుగా చేస్తూనే మిగతా సమయాల్లో ఇలాంటి ఈవెంట్స్‌లో బిజీగా ఉంటున్నారు డ్యాన్స్ ప్రేమికులు. ఇదో ఉపాధిగానూ, అవకాశాలు కల్పించే ప్రత్యామ్నాయ వేదికగానూ డ్యాన్సర్లకు ఉపయోగపడుతుందని పలువురు డ్యాన్సర్లు పేర్కొన్నారు. నగరం నుంచి గోవా ఫిల్మ్ ఫెస్టివల్స్, నూతన సంవత్సర వేడుకలు తదితర కార్యక్రమాలకు వెళ్తున్నామని వారు తెలిపారు.

సిటీ నుంచి.. గోవా ఫెస్టివల్స్‌కు..

నగరంలో ప్రత్యేకంగా నిర్వహించే మ్యూజిక్ కన్సర్ట్స్, నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసే దాండియా ఈవెంట్స్‌లో ఈ డ్యాన్సర్లను ముందస్తుగానే బుక్ చేసుకోవడం విశేషం. ఈ మధ్య కాలంలో సంగీత్స్‌లో డ్యాన్సర్లకు బాగా డిమాండ్ పెరిగింది. ప్రతీ సంగీత్‌లో కనీసం ఒక కొరియోగ్రాఫర్, తనతో పాటు నృత్య బృందం పాల్గొనడమే కాకుండా నిర్వాహకులకు శిక్షణ అందించి సంగీత్‌లో సందడి చేస్తున్నారు.



టాలీవుడ్ టూ బాలీవుడ్

నగరం వేదికగా నిర్వహించే పలు ఈవెంట్లలో వెస్టర్న్, బాలీవుడ్, టాలీవుడ్‌తో పాటు ఎలక్ట్రిక్ జాజ్, లాకింగ్ వంటి డ్యాన్స్ పర్ఫార్మెన్స్ కావాలని నిర్వాహకులు కోరుకుంటున్నారు. ఈ డ్యాన్స్ స్టెప్పులకు నగరవాసుల నుంచి వస్తున్న ఆదరణ అలా పెరిగిపోతుండటం విశేషం. ఇలాంటి డ్యాన్స్ నేర్పించడానికి నగరంలో ప్రత్యేకంగా డ్యాన్సింగ్ స్టూడియోలు సైతం నిర్వహిస్తున్నారు. న్యూ ఇయర్ వేడుకలు, హోలీ వంటి సంబరాల్లో భాగంగా పలు క్లబ్స్‌లో నిర్వహించే వేడుకల్లో, మ్యూజిక్ కన్సర్ట్స్ ముఖ్యంగా సినిమా ఆడియో ఫంక్షన్లు ఇతర కార్పొరేట్ కార్యక్రమాలకు ఈ డ్యాన్సర్లను ఆహ్వానిస్తున్నారు. స్థానికంగానే కాకుండా సీజన్లలో ముంబై, ఢిల్లీ వంటి నగరాల నుంచి ప్రత్యేకంగా ఈ నృత్యకారులను నగరానికి ఆహ్వానిస్తున్నారు. అంతేగాకుండా ఈ మధ్యకాలంలో ఫ్లాష్ మాబ్ కల్చర్ బాగా పెరిగిపోయింది. నగరంలోని పెద్ద పెద్ద మాల్స్‌లో విరివిగా ఫ్లాష్‌మాబ్స్ నిర్వహిస్తూ సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నారు. పేజ్ త్రీ పీపుల్ నిర్వహించే ప్రైవేట్ పార్టీల్లో సాల్సా వంటి డ్యాన్సులను ఆస్వాదిస్తున్నారు.



అవకాశాలెన్నో..

గతంతో పోలిస్తే ప్రస్తుతం డ్యాన్సర్లకు విభిన్న వేదికల్లో అవకాశాలు పెరిగాయి. మోడ్రన్ స్టెప్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగలిగితే చాలు.., స్ట్రీట్ డ్యాన్సింగ్ నుంచి సినిమా ఫంక్షన్ల వరకు ఎన్నో అవకాశాలు. నగరం వేదికగా పలు సినిమా ఆడియో ఫంక్షన్లు, కార్పొరేట్ నైట్ ఈవెంట్స్‌తో పాటు తదితర లైఫ్ స్టైల్ ఈవెంట్లలో డ్యాన్సర్‌గా పాల్గొన్నారు. అంతేగాకుండా గోవా వేదికగా జరిగే డ్యాన్స్ ఫెస్టివల్స్‌లో పాల్గొన్నారు. ఇలాంటి వేదికలు మారుతున్న డ్యాన్స్ కల్చర్ పైన అవగాహన పెంచుతాయి. ఇక్కడ వెస్ట్రన్ డ్యాన్స్‌కు ఆదరణ బాగా పెరిగింది. ఎలక్ట్రిక్ జాజ్, లాకింగ్ వంటి అధునాతన డ్యాన్సింగ్ స్టెప్పులు నగరానికి ఈ మధ్య వస్తున్నాయి.

– శ్రీకాంత్, కొరియోగ్రాఫర్, శ్రీస్ డ్యాన్స్ స్టూడియోస్



సాల్సా సైతం..

20 ఏళ్లుగా నగరం వేదికగా డ్యాన్స్‌లో వస్తున్న మార్పులను గమనిస్తున్నాను. సిటీలో ఎక్కువగా టాలీవుడ్, బాలీవుడ్, హిప్‌హాప్‌కు క్రేజ్ ఉంది. నగరంతో పాటు బెంగళూరు వంటి నగరాల్లో అప్పుడప్పుడూ జాజ్, ఫ్రీక్ స్టైల్ వంటివి సందడి చేస్తున్నాయి. ఇవే కాకుండా ప్రత్యేకంగా సాల్సా, బచ్చాటా వంటి డ్యాన్సులను ఆస్వాదించే నగరవాసులున్నారు. కొంత కాలం పాటు క్లాసికల్ సమ్మిళితమైన బిబాయింగ్ వంటి డ్యాన్సులనూ నగరవాసులు చేసేవారు. డ్యాన్స్ లేకుండా ఈవెంట్స్ లేవు అనేంతలా డ్యాన్స్ పరిణామ క్రమం మారింది. ఈవెంట్స్‌తో పాటు ఫ్రీక్, హిప్ హాప్ వంటి డ్యాన్స్ ఫెస్టివల్స్ సైతం నిర్వహిస్తుంటారు.

– నాగేంద్ర, కొరియోగ్రాఫర్, డ్యాన్సర్





డిసెంబర్ 15న నిర్వహించనున్న హెచ్‌సీఎల్, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా

లాంచింగ్ కార్యక్రమంలో టీషర్ట్ ఆవిష్కరించిన ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్

రయ్యి..రయ్యిమంటూ..

సిటీలో సైక్లోథాన్



సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా హెచ్‌సీఎల్ బృందం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక హెచ్‌సీఎల్ సైక్లోథాన్‌ను నిర్వహించనున్నారు. నోయిడా, చెన్నైలో నిర్వహించి దేశవ్యాప్తంగా విశేష ఆదరణ పొందిన ఈ హెచ్‌సీఎల్ సైక్లోథాన్‌ను రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో నిర్వహించనున్నారు. ఈ సైక్లథాన్‌కు సంబంధించిన లాంచింగ్ కార్యక్రమాన్ని గురువారం హోటల్ తాజ్ డక్కన్‌లో నిర్వహించగా రాష్ట్ర ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొని టీ షర్ట్‌ను ఆవిష్కరించారు. డిసెంబర్ 15న జరగనున్న ఈ హెచ్‌సీఎల్ సైక్లోథాన్‌లో దేశవ్యాప్తంగా విజేతలకు అత్యధికంగా 33.6 లక్షల బహుమతిని అందించనున్నారు. జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. సైక్లింగ్‌ను సుస్థిర రవాణా సాధనంగా ప్రోత్సహించడంలో నగరం గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. దీనికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కూడా క్రమంగా విస్తరిస్తున్నాయని, మొట్టమొదటి సోలార్ రూఫ్ సైక్లింగ్ ట్రాక్‌తో నగరం కొత్త బెంచ్ మార్క్‌ను సెట్ చేసిందని చెప్పారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, పర్యావరణహితం కోసం సైక్లింగ్‌ను స్వీకరించేలా ప్రజలను ప్రోత్సహించడానికి హెచ్‌సీఎల్ సైక్లోథాన్ నగరానికి రావడం అభినందనీయమని ప్రశంసించారు. ఫిట్నెస్, ఆరోగ్యం మాత్రమే కాకుండా మన్నికైన నగర జీవన విధానంగా సైక్లింగ్‌ను ప్రోత్సహించడానికి ఈ సైక్లోథాన్‌ను నిర్వహిస్తున్నామని హెచ్‌సీఎల్ బృంద బ్రాండ్ అధికారి, కో వైస్ ప్రెసిడెంట్ రజత్ ఛందోలియా పేర్కొన్నారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు నవంబర్ 30వ తేదీ వరకు తెరిచి ఉంటాయి, ఔత్సాహికులు www.hclcyclothon.comలో సందర్శించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ పి.మల్లారెడ్డి పాల్గొన్నారు.



నృత్యం.. సమ్మోహనం



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సంగీత నాటక అకాడమీ సౌజన్యంతో నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో గురువారం నిర్వహించిన 49వ అఖిల భారత సంగీత నృత్య పోటీలు ఆకట్టుకున్నాయి. కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రతిభా పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. తెలంగాణ సంగీత నాటక అకాడమి చైర్మన్ అలేఖ్య పుంజాల, రాష్ట్ర గణాంకశాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.వసుంధర, భారత్ బయోటెక్ అధికారి టి.శ్రీనివాస్, ఎస్ఎస్ఎస్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ యువిఎల్ ఆనంద, నాటక సమితి అధ్యక్షుడు వి.విజయకుమార్, ప్రధాన కార్యదర్శి సుధారాణి, కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ ఎస్.సుధామాల, బాలాజీశర్మ పాల్గొన్నారు.



సహజసిద్ధమండి

సిటీలో ఆకట్టుకుంటున్న దుస్తులు

ఎకో ఫ్రెండ్లీ కళాకృతులు కనువిందు



బంజారాహిల్స్: రసాయనాలు లేకుండా సహజ సిద్ధంగా లభించే వనరులతో చేతితో తయారు చేసిన దుస్తులు, కళాకృతుల ప్రదర్శన 'మండి' పేరుతో బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ భవన్‌లో గురువారం ప్రారంభమైంది. ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనను సినీ నటి, యాంకర్ ఝాన్సీ ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా 22 రాష్ట్రాలకు చెందిన ప్రఖ్యాత హస్తకళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. పూర్తిగా చేతితో తయారు చేసిన ఈ ఆకృతులు నగర మహిళలను ఆకట్టుకున్నాయి. ఎలాంటి కెమికల్స్ ఉపయోగించకుండా ప్రకృతి సిద్ధంగా వినియోగించిన సామాగ్రితోనే అల్లిన బుట్టలు, నేసిన దుస్తులు, తయారుచేసిన పర్ఫ్యూమ్‌లో ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నగర నలుమూలల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఈ ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ముఖ్యంగా ఎకోఫ్రెండ్లీ బ్యాగులు, దుస్తులు, ఇతర వస్తువులు ఇక్కడ ఆకట్టుకుంటున్నాయి. ఎంబ్రాయిడరీ వర్క్ మరో ఆకర్షణగా నిలిచింది. సెరామిక్ జ్యువెలరీ, జూట్ బ్యాగులు, కేరళ మురల్ ఆర్ట్, హ్యాండ్‌మేడ్ పేపర్ ప్రొడక్ట్స్, రస్టిక్ సెరామిక్ పీసెస్, పామ్ లీఫ్ ఉత్పత్తులు ఇక్కడ ప్రదర్శించారు. పర్యావరణానికి పెద్దపీట వేస్తూ హస్తకళాకారులు తీర్చిదిద్దిన ఈ ఆకృతులను సదరు కళాకారులు ఒక వైపు ఆన్‌లైన్‌లో విక్రయిస్తూనే మరోవైపు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచుతున్నారు. ఎకోఫ్రెండ్లీ ఉత్పత్తులకు హైదరాబాద్ బ్రాండ్‌గా మారిందని ఈ సందర్భంగా పలువురు హస్తకళాకారులు తెలిపారు. ప్రదర్శనలో సీసీటీ చైర్‌పర్సన్ అనురాధ బిష్ణోయ్ కూడా పాల్గొన్నారు.

థామ్సన్ నుంచి ఆల్ఫాబీట్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ గృహోపకరణాల బ్రాండ్ థామ్సన్ ఇటీవల ఆల్ఫాబీట్ 25, ఆల్ఫాబీట్ 60 అనే పేరిట సౌండ్‌బార్‌లతో తమ కొత్త కేటగిరీ ఆడియోలను సిటీ మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ విషయాన్ని బ్రాండ్ ప్రతినిధులు తెలిపారు. అదేవిధంగా వచ్చే ఆరు నెలల్లో 20కి పైగా మోడళ్లను విడుదల చేసేందుకు థామ్సన్ సన్నాహాలు చేస్తోందని, శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డే సేల్ సందర్భంగా స్మార్ట్ టీవీలు, వాషింగ్ మెషీన్స్, స్పీకర్ తదితర థామ్సన్ ఉత్పత్తుల కొనుగోళ్లపై అనూహ్యమైన రాయితీలు, ఆఫర్లు అందిస్తున్నామన్నారు.



గ్రేట్ టు గెదర్ మీట్.. సక్సెస్

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఆర్ఎంఎస్ ప్లాట్‌ఫార్మ్‌ను అందించే గ్రేట్ హెచ్‌ఆర్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని గ్రీన్ పార్క్ హోటల్‌లో నిర్వహించిన గ్రేట్ 2 గెదర్ మీట్ విజయవంతంగా ముగిసిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ మీట్‌లో భాగంగా నగరవాసులు అందించిన పలు సలహాలు సూచనలు తమ భవిష్యత్తు సేవల డిజైనింగ్‌లో ఎంతైనా ఉపయుక్తంగా ఉంటాయని, కొత్తగా అందుబాటులోకి తెచ్చిన ఏఐ ఆధారిత ఫీచర్లపై వారు అందించిన ప్రశంసలు తమకు ఉత్ప్రేరకంగా పనిచేస్తాయని గ్రేట్ హెచ్‌ఆర్ సీఈఓ గిరీష్ రాజీ ఆశాభావం వ్యక్తం చేశారు.



ఇన్‌ఫ్లుయెన్సర్స్ @ రూ. 5 వేల కోట్లు



సాక్షి, సిటీబ్యూరో: సాంకేతిక యుగంలో అత్యంత ప్రభావం చూపుతున్న సోషల్ మీడియా.. అది పుట్టించిన సెలబ్రిటీల హవా రానున్న రోజుల్లో మరింత పుంజుకోనుంది. నగరంలో సైతం పెద్ద సంఖ్యలో ఇన్‌ఫ్లుయెన్సర్లు సందడి చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో.. సోషల్ బీట్, ఇన్‌ఫ్లుయెన్సర్.ఇన్ తాజాగా ఇన్‌ఫ్లుయెన్సర్స్ మార్కెటింగ్ గురించిన విశేషాలు వెల్లడించింది. నగరంతో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న 100కు పైగా బ్రాండ్‌లు, 500 కంటే ఎక్కువ మంది క్రియేటర్స్– ఇన్‌ఫ్లుయెన్సర్‌ల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ఈ నివేదిక రూపొందించారు. ఈ ఏడాది చివరి నాటికి ఇన్‌ఫ్లుయెన్సర్ ఇండస్ట్రీ రూ.5,500 కోట్లకు చేరుకుంటుందని ఈ నివేదిక అంచనా వేసింది. డిజిటల్ మీడియా పరిశ్రమలో ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ 11 శాతంగా లెక్కించింది. ఈ నివేదికను బ్రాండ్‌లకు వారి మార్కెటింగ్ అవసరంతో పాటు ఈ పరిశ్రమ ఏటా 25% పెరుగుతుందని నివేదిక అంచనా వేసింది.

ఒకప్పుడు ఉచితంగానే..



దాదాపు ఆరేళ్ల క్రితం తొలిసారి నేను ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారినప్పుడు కొన్ని బ్రాండ్స్ మార్కెటింగ్ కోసం సంప్రదించాయి. అయితే అప్పుడు మాకు నామమాత్రంగా ఖర్చులకు తప్ప పారితోషికం రూపంలో ఏమీ ఇచ్చేవారు కాదు. ఇప్పుడు మాత్రం మంచి అమౌంట్స్ ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు. నగరంలో ఉన్న ఇన్‌ఫ్లుయెన్సర్స్‌లో రూ.లక్ష నుంచి రూ.కోటి దాకా డిమాండ్ చేస్తున్నవారు కూడా ఉన్నారు. నాకు వస్తున్న బ్రాండ్స్‌ను బట్టి తొలుత ఫుడ్ ట్రావెలర్‌గా మాత్రమే ఉన్న నేను ఇప్పుడు లైఫ్ స్టైల్ ఉత్పత్తులతో సహా అనేక బ్రాండ్స్‌కు వర్క్ చేస్తున్నాను.

– అమీర్, ఇన్‌ఫ్లుయెన్సర్



అసలే చాలీచాలని రైళ్లు.. ఆపై అదనపు కష్టాలు

కావాల్సింది 3 వేల ట్రిప్పులు.. ఇప్పటి వరకు ప్రకటించింది 600 ట్రిప్పులే ● మరో 200 ట్రిప్పులకు ఏర్పాట్లు

● కాజీపేట రూట్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనులతో 99 రైళ్లు రద్దు..అందులో 47 ప్రత్యేక పండుగ బండ్లే

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పండుగ వేళ హైదరాబాద్ నుంచి సొంతూరు వెళ్లడానికి ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలు పడాల్సి వస్తోంది. దసరా సందర్భంగా దాదాపు 20 లక్షల మంది ఇంటిబాట పడతారు. దూరప్రాంతాలకు వెళ్లేవారు రైళ్లనే నమ్ముకుంటున్నారు. కానీ..అంతమందిని తరలించేంత వ్యవస్థ రైల్వేకు ఉన్నా, అప్పటికప్పుడు ఏర్పాట్లు చేయలేని పరిస్థితి నెలకొంటోంది. దీంతో పండుగ రద్దీలో కేవలం 30 శాతం మందిని మాత్రమే రైళ్లు తరలించగలుగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో దసరా రద్దీ మొదలుకానుంది. వచ్చేనెల 2వ తేదీ నుంచి విద్యాసంస్థలకు పండగ సెలవులు మొదలవుతున్నాయి. దసరా, ఆ తర్వాత దీపావళి కోసం రైల్వేశాఖ క్రమంగా ప్రత్యేక రైళ్లను ప్రకటిస్తోంది. ఇప్పటి వరకు 600 ట్రిప్పులను ప్రకటించింది. మరో 200 వరకు పెంచే అవకాశముంది. రోజువారీ 225 రెగ్యులర్ రైళ్లు కాకుండా ఈ రెండు పెద్ద పండుగలకు సొంతూళ్లకు వెళ్లే జనం కోసం 800 ట్రిప్పుల రైలు సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అయితే ప్రజా అవసరాలకు కనీసం 3 వేల వరకు ప్రత్యేక ట్రిప్పులు అవసరం. ఈ రెండు పండుగలకు దాదాపు నెల రోజుల సమయం ఉంటుంది. రోజుకు వంద ట్రిప్పుల ప్రత్యేక రైళ్లు నడిపితే రద్దీ సునాయసంగా సొంతూళ్లకు చేరుకుంటుంది.



హైదరాబాద్ నుంచి కాజీపేట మీదుగా సాగే గ్రాండ్ ట్రంక్ రూట్, బీబీనగర్–గుంటూరు, మహబూబ్‌నగర్ మీదుగా ఉన్న బెంగళూరు, నిజామాబాద్ రూట్ కూడా సామర్థ్యానికి మించి రైలు ట్రాఫిక్‌తో ఇరుగ్గా మారాయి. ప్రస్తుతం వాటి మీదుగా 160 శాతం మేర రైళ్లు నడుస్తున్నాయి. దీంతో పండగ ప్రత్యేక రైళ్లు వాటి మీదుగా నడపటం కష్టంగా మారింది. దీంతో రద్దీ రోజుల్లో గూడ్సు రైళ్లను రీ షెడ్యూల్ చేసి మరీ ప్రత్యేక పండగ రైళ్లను అతికష్టమ్మీద తిప్పుతున్నారు. ఈ రెండు కారణాలతో సరిపోను ప్రత్యేక రైళ్లు నడపలేకపోతున్నారు. వెరసి వచ్చే దసరా, దీపావళి, సంక్రాంతి సమయాల్లో ఎప్పటిలాగానే ప్రయాణ కష్టాలు తప్పేలా లేవు.

సామర్థ్యానికి మించి రైలు ట్రాఫిక్

సరిగ్గా పండగ వేళ కొత్త కష్టాలు

అసలే చాలినన్ని రేక్స్ లేక, సరిపడా ట్రాక్ లేక అదనపు రైళ్లు నడపటం కష్టంగా మారిన తరుణంలో, ఈసారి దసరా వేళ గ్రాండ్ ట్రంక్ రూట్‌లో కొత్తకష్టం వచ్చి పడింది. వరంగల్, కాజీపేట, హసన్‌పర్తి మధ్య ఇటీవల రెండు బైపాస్ లైన్లు నిర్మించారు. ఉన్న రెండు అప్ అండ్ డౌన్ రూట్లు సరిపోక వాటికి అదనంగా రెండు బైపాస్ లైన్లు నిర్మించారు. ఇప్పుడు వీటిని మెయిన్ లైన్‌లతో అనుసంధానించే నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు జరుగుతున్నాయి పనులు జరిగే సమయంలో ఆ ట్రాక్ మీద రైళ్లు నడపటం సాధ్యం కాదు. దీంతో రోజువారిగా ప్రత్యేక టైమింగ్స్ కేటాయించారు. ప్రధాన రైళ్లు కాకుండా మిగతా వాటిని రద్దు చేసి పనులు చేయిస్తున్నారు. ఇవి వచ్చేనెల ఎనిమిదో తేదీ వరకు జరిగేలా స్లాట్ కేటాయించారు. ఈ నెలాఖరు నుంచి ప్రత్యేక రైళ్లు తిప్పాల్సి ఉంది. ఇందుకోసం ముందుగానే ప్రత్యేక రైళ్ల టైంటేబుల్ ఖరారు చేశారు. నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు జరుగుతున్న ట్రాక్ మీదుగా కూడా ఈ ప్రత్యేక రైళ్లు తిరగాల్సి ఉంది. ఆ పనుల కోసం ఇప్పటికే 99 రైళ్లను రద్దు చేసి మరో 38 రైళ్లను దారి మళ్లించారు. రద్దయిన వాటిల్లో పండుగ ప్రత్యేక రైళ్లు 47 ఉన్నాయి. అసలే ప్రత్యేక రైళ్లు సరిపోని తరుణంలో 47 రైళ్లు రద్దు కావడం వల్ల ఈసారి పండుగ ప్రయాణికులకు మరిన్ని కష్టాలు తప్పేలా లేవు.

ఒక్క రైలు తయారీకి రూ.80 కోట్లకు పైగా వ్యయం

రద్దీ కోసం మరిన్ని రైళ్లు అందుబాటులోకి తేవాల్సి ఉన్నా.. అది రైల్వేపై పెనుభారం మోపుతోంది. ప్రస్తుతం ఒక రైలు రేక్ తయారీకి దాదాపు రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ఖర్చవుతుంది. అందే వందేభారత్ లాంటి రైళ్లకు రూ.120 కోట్ల వరకు ఖర్చవుతుంది. ఇంత భారీ వ్యయంతో రైళ్లను తయారు చేసి ప్రత్యేక రైళ్లుగా నడిపితే, అన్‌సీజన్‌లో అవన్నీ ఖాళీగా ఉండాల్సి ఉంటుంది. దీంతో స్పేర్ రైళ్ల సంఖ్య పెంచటానికి రైల్వే ఆసక్తి చూపటం లేదు. తెలుగు రాష్ట్రాల్లో రద్దీ ఎక్కువగా ఉండే, దసరా, సంక్రాంతి లాంటి సందర్భాల్లో ఉత్తరాది నుంచి స్పేర్ రైళ్లు తెప్పిస్తున్నారు.

రూ.81 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి

మిల్లు యజమానిపై కేసు నమోదు

కొణిజర్ల: ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని మర ఆడించి సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ఇవ్వకుండా ధాన్యాన్ని పక్కదారి పట్టించిన ఓ రైస్‌మిల్ వ్యవహారం బయటపడింది. అధికారుల తనిఖీలో మోసం బయటపడటంతో మిల్ యజమానిపై కేసు నమోదైంది. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం లాలాపురం సమీపంలో ఉన్న ఎస్ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ మిల్లులో పౌరసరఫరాల శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం మంగళ, బుధవారాల్లో తనిఖీలు చేపట్టింది. మిల్లుకు 2022–23 రబీ, 2023–24 ఖరీఫ్‌లో ప్రభుత్వం సుమారు 35,622 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించగా మర ఆడించి సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. కానీ సీఎంఆర్ ఇవ్వకపోగా సుమారు 25,149 మెట్రిక్ టన్నుల ధాన్యం పక్కదారి పట్టినట్లు తేలింది. దీంతో ఈ ధాన్యం విలువతో పాటు వడ్డీ, జరిమానా కలిపి రూ.81,60,90,000 ప్రభుత్వానికి చెల్లించాలని అధికారులు యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. మిల్లు యజమాని మేడంపూడి రమాజ్యోతిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.సూరజ్ తెలిపారు.

విద్యుత్ జేఏసీలో కొనసాగేది లేదు

విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల ప్రయోజనాలకు విరుద్ధంగా పనిచేస్తున్న తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ(టీజీపీఈజేఏసీ)లో ఇకపై కొనసాగబోమని తెలంగాణ బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ ముత్యం వెంకన్న గౌడ్ గురువారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ మేరకు ఇప్పటికే ప్రభుత్వానికి, విద్యుత్ సంస్థల యాజమాన్యాలకు లేఖను అందజేశామని తెలిపారు. టీజీపీఈజేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న, జరగనున్న కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లను లోపభూయిష్టంగా అమలు చేయడంతో బీసీ, ఓసీ ఉద్యోగులకు తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ వచ్చాక ఇచ్చిన పదోన్నతులను రద్దు చేసి మళ్లీ కొత్తగా ప్రమోషన్లు ఇచ్చారని, ఈ క్రమంలో కొందరికి రివర్షన్లు ఇవ్వడానికి బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. పదోన్నతుల్లో బీసీ, ఓసీ ఉద్యోగులకు జరిగిన అన్యాయాన్ని పునఃసమీక్షించాలన్న డిమాండ్‌ను పక్కనబెట్టి కొన్ని సంఘాలు ఉద్యోగులను తప్పుదోవపట్టిస్తున్నాయని ఆరోపించారు.

58,825 కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

మంజూరు చేసిన టీజీఎస్పీడీసీఎల్

సాక్షి, హైదరాబాద్: దక్షిణ తెలంగాణలోని ఐదు ఉమ్మడి జిల్లాలకు కొత్తగా 58,825 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) మంజూరు చేసింది. ఈ మేరకు రూ.508.95 కోట్ల వ్యయంతో పరిపాలన అనుమతులు జారీ చేస్తూ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండ, సూర్యాపేట, సరూర్‌నగర్, మెదక్, వికారాబాద్, యాదాద్రి, నారాయణపేట, రాజేంద్రనగర్, గద్వాల, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ సర్కిళ్ల పరిధిలో ఈ కనెక్షన్లు జారీ చేయనున్నారు. ఒక 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా నాలుగు 5 హెచ్‌పీ పంప్‌సెట్లకు కనెక్షన్ ఇవ్వడానికి రూ.3 లక్షలు ఖర్చు కానుంది. కనెక్షన్‌కు రూ.75 వేల వరకు వ్యయం కానుంది. 11కేవీ కండక్టర్లు, ఎల్టీ కేబుల్స్, పోల్స్, 25కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తారు. రైతుల నుంచి ఒక్కో కనెక్షన్‌కు రూ.5 వేలు వసూలు చేస్తారు. మిగిలిన రూ.70 వేలను రాయితీని సంస్థ భరిస్తుంది.

డిజిటల్ అడిక్షన్‌పై నారాయణ విద్యాసంస్థ గైడ్‌కాస్ట్

సాక్షి, హైదరాబాద్: పిల్లల్లో డిజిటల్ పరికరాల వినియోగం ప్రమాదకర స్థాయిలో పెరిగిపోయిందని, ఇది ఇలాగే కొనసాగితే వారిలో మానసిక ఉల్లాసం, మెదడు పనితీరు తగ్గిపోయే ప్రమాదముందని నారాయణ విద్యాసంస్థ పేర్కొంది. ఈ నేపథ్యంలో డిజిటల్ డిపెండెన్సీ అండ్ అడిక్షన్ పేరుతో ఓ గైడ్‌కాస్ట్‌ను విడుదల చేసింది. అధిక సమయం డిజిటల్ వినియోగం ద్వారా పిల్లలపై కలిగే దుష్పరిణామాలను తల్లిదండ్రులకు తెలియజెప్పాలన్నదే దీని ముఖ్య ఉద్దేశమని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ సింధూర నారాయణ, శరణి నారాయణ వెల్లడించారు.

మూసీ 'రెడ్ మార్క్'!

గూడు వదిలేది లేదంటున్న పేదలు

కడుపు కట్టుకుని కొనుక్కున్నాం.. ఇక్కడే సమాధి అవుతాం

''మావి కబ్జా చేసుకుని కట్టుకున్న ఇళ్లు కావు.. కడుపు కాల్చుకుని దాచుకున్న డబ్బులతో కట్టుకున్న ఇళ్లు మావి. కరెంట్, నీటి, ఇంటి పన్నులు చెల్లిస్తున్నాం. స్థలాలు రిజిస్ట్రేషన్లు చేసుకుని ఇళ్ల నిర్మాణాలు చేసుకున్నాం. వీటిని వదిలి వసతులేవీ లేనిచోట ఎక్కడో అడవులలో కట్టిన డబుల్ బెడ్రూమ్‌లను ఇస్తామంటే వెళ్లే ప్రసక్తే లేదు. ఇక్కడే ఉంటాం. ఇంట్లోనే సమాధి అవుతాం..'' అంటూ అత్తాపూర్ డివిజన్ భరత్‌నగర్ వాసులు అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులు, కుంటలు ఆక్రమించి విల్లాలు నిర్మించుకున్న బడాబాబుల ఫాంహౌస్‌లు కూల్చివేయకుండా సామాన్యులు, పేద, మధ్య తరగతి ప్రజలు నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయడం ఏమిటంటూ మండిపడ్డారు.



మార్కింగ్ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది.



పోలీసులతో కాలనీవాసుల వాగ్వాదం

సాక్షి, హైదరాబాద్: మూసీ కట్టడాలపై రెడ్ మార్క్ పడింది. పరీవాహకంలోని నివాసితుల గుండెల్లో ఆవేదన రేపుతోంది. పునరావాసం కింద ఎక్కడో ఇచ్చే డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మాకెందుకంటూ చాలా మంది గోడు వెళ్లబోసుకుంటున్నారు. కడుపుకట్టుకుని సొమ్ముదాచుకుని ఇళ్లు కట్టుకున్నామని, ఏళ్లకేళ్లుగా అక్కడే బతుకుతున్న తమను వెళ్లిపొమ్మంటే ఎలాగని ఆందోళన చెందుతున్నారు. పరీవాహకం వెంట సర్వే చేసి, ఇళ్లకు మార్కింగ్ చేసేందుకు వచ్చిన అధికారుల బృందాలపై విరుచుకుపడుతున్నారు. దీంతో అధికారులు పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించి సర్వే చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా.. మొదటి విడతగా నదీ గర్భంలో ఉన్న కట్టడాల కూల్చివేతకు రంగం సిద్ధమైంది. సుమారు 25 ప్రత్యేక బృందాలు గత నివేదికల ఆధారంగా ఇళ్లను గుర్తించి 'ఆర్‌బీ–ఎక్స్' పేరుతో ఎరుపు రంగులో మార్కింగ్ చేస్తున్నాయి. ఆయా ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాల సమగ్ర వివరాలను సేకరించి అక్కడికక్కడే ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నాయి.

12 వేల కట్టడాల గుర్తింపు

హైదరాబాద్ నగరంలో సుమారు 55 కిలోమీటర్ల పొడవునా మూసీ పరీవాహక ప్రాంతంలో 12వేలకుపైగా కట్టడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇటీవల రెవెన్యూ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సంయుక్తంగా సర్వే నిర్వహించి.. నదీ గర్భంలో ఉన్న, బఫర్‌జోన్‌లో ఉన్న ఇళ్లు, నిర్మాణాలుగా వర్గీకరించారు. నది గర్భంలో 2,166 కట్టడాలు ఉండగా.. అందులో 288 భారీ నిర్మాణాలు ఉన్నాయి. నది సరిహద్దు నుంచి రెండు వైపులా 50 మీటర్ల వరకు ఉన్న బఫర్‌జోన్ పరిధిలో 7,851 కట్టడాలు ఉండగా.. అందులో 1,032 భారీ నిర్మాణాలు ఉన్నట్టు అధికారులు చెప్తున్నారు. కానీ వాస్తవానికి మొత్తంగా 30వేలకు పైగానే నివాసాలు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు.

తొలివిడతగా నది గర్భంలో..

మూసీ ప్రాజెక్టులో భాగంగా తొలి విడతలో నది గర్భంలో ఉన్న నివాసాల తొలగింపుపై అధికార యంత్రాంగం దృష్టిసారించింది. అందులో హైదరాబాద్ జిల్లా పరిధిలో 1,595, మేడ్చల్–మల్కాజిగిరి పరిధిలో 239, రంగారెడ్డి జిల్లా పరిధిలో 332 కట్టడాలను తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పునరావాసం కింద డబుల్ బెడ్రూమ్ ఇళ్లు

మూసీ పరీవాహకంలో ఇళ్లు తొలగిస్తున్న నేపథ్యంలో.. బాధితులకు పునరావాసం కోసం 15వేల డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయిస్తూ ప్రభుత్వం రెండు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ నది గర్భం, బఫర్ జోన్లలో నివాసం ఏర్పాటు చేసుకున్న అర్హులైన పేద కుటుంబాలకు ఈ డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయించనున్నారు. బఫర్ జోన్‌లో తొలగించే ఇళ్లు, నిర్మాణాలకు సంబంధించి.. పునరావాస చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తామని, దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే నష్టపరిహారం చెల్లించి, భూసేకరణ చేపడతామని వివరిస్తున్నారు. రెండు, మూడు రోజుల్లోనే నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాలు కూడా అందజేస్తామని అంటున్నారు.

ఎక్కడో దూరంగా ఇళ్లు ఇస్తుండటంపై..

మూసీ పరీవాహకంలో తొలి విడతగా ఇళ్ల తొలగింపుతో రెండు వేలకుపైగా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. దీనిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి పెట్టింది. అందులో భాగంగా రెండు రోజుల క్రితం మంత్రి పొన్నం ప్రభాకర్, మున్సిపల్, రెవెన్యూ ఉన్నతాధికారులు సైదాబాద్, వనస్థలిపురం ప్రాంతాల్లోని డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయాలను పరిశీలించారు. ఈ రెండు ప్రాంతాల్లో గతంలో కొందరు మూసీ నిర్వాసితులకు ఇళ్లు కేటాయించినా.. తిరిగి వెనక్కి వచ్చినట్టు అధికార వర్గాలు చెప్తున్నాయి. దూర ప్రాంతాల్లో ఇళ్లు కేటాయిస్తుండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని అంటున్నాయి.

నదీ గర్భం నుంచి తరలింపు ప్రారంభం

మూసీ పరీవాహకంలోని కొత్తపేట భవానీనగర్ రోడ్డు నంబర్ 10లో నివాసం ఉంటున్న పదకొండు కుటుంబాలను అధికారులను తరలించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి వారితో ఆ కుటుంబాలతో మాట్లాడారు. వారి సమ్మతితోనే వనస్థలిపురం, ప్రతాపసింగారం, తిమ్మాయిగూడలలోని డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు ప్రభుత్వ ఖర్చులతో డీసీఎంలలో సామగ్రిని తరలించారు.

మూసీ నది గర్భంలో గుర్తించిన నివాసాలు ఇలా

ప్రాంతం	నిర్మాణాల సంఖ్య
అంబర్‌పేట	64
ఆసిఫ్‌నగర్	14
బహదూర్‌పురా	527
చార్మినార్	03
గోల్కొండ	50
హిమాయత్‌నగర్	263
నాంపల్లి	604
సైదాబాద్	70
గండిపేట	32
రాజేంద్రనగర్	300
ఘట్కేసర్	02
మేడిపల్లి	01
ఉప్పల్	236

ఇళ్ల కూల్చివేతతో పేరు కోసం తాపత్రయం

- ఈ కూల్చివేతలు న్యాయ, చట్టబద్ధంగా చేసి ఉంటే బావుండేదనేది ప్రజాభిప్రాయం
- సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఏ ప్రణాళిక లేకుండానే, హడావుడి చేసి నిత్యం వార్తల్లో ఉండే లక్ష్యంతో అక్రమ కట్టడాల పేరిట ఇళ్ల కూల్చివేతలతో పేరు తెచ్చుకోవాలని భావిస్తోందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అయితే ఈ కూల్చివేతల ప్రక్రియ న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా చేపట్టి ఉంటే బాగుండేదని ప్రజల అభిప్రాయమని సీఎం రేవంత్‌రెడ్డికి గురువారం రాసిన లేఖలో పేర్కొన్నారు. హైడ్రా బాధితులు తన దృష్టికి తీసుకొచ్చిన అంశాలు, మేధావుల ఆలోచనలు, నిత్యం వార్తాపత్రికలు, టీవీ చానళ్ల ద్వారా తెలుసుకుంటున్న అంశాలన్నింటితో ఈ లేఖ రాస్తున్నట్టు తెలిపారు. ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను తాము సమర్థించబోమని, అయితే వీటిపై చర్యలు తీసుకునే సమయంలో సహజ న్యాయ సూత్రాలకు (ప్రిన్సిపుల్స్ ఆఫ్ నేచురల్ జస్టిస్) అనుగుణంగా ఉండాలనేదే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి విషయంలో వీటి ఆధారంగానే పనిచేయాలనేది అందరి అభిప్రాయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో చాలా కేసుల్లో సహజ న్యాయ సూత్రాలను ప్రభుత్వం పాటించడం లేదన్నారు. ఇవాళ అక్రమమని కూల్చేస్తున్న వాటి గురించి సున్నితంగా ఆలోచించాల్సిన అవసరముందని చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం అక్రమ కట్టడాలు అంటున్న ప్రాంతాల్లో వెలసిన ఇళ్లకు ప్రభుత్వ పక్షాన రూ.కోట్లు ఖర్చుచేసి రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం, కరెంటు కనెక్షన్లు, కమ్యూనిటీ హాళ్లు, ఇంటి నంబరు కేటాయింపు వాస్తవం కాదా అని ప్రశ్నించారు. దశాబ్దాలుగా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏల ద్వారా సేవలు పొందుతూ పన్నులు కడుతుండగా, ఇప్పుడు హఠాత్తుగా అక్రమం అంటే వారు ఎక్కడకు వెళ్లాలి? అందులోనూ పేద, మధ్యతరగతి ప్రజలు ఏమైపోవాలి? అని నిలదీశారు. గతంలో అనేకసార్లు కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు అక్రమ నిర్మాణాలను రెగ్యులరైజ్ కూడా చేశాయన్నారు. మూసీ రివర్ బ్యూటిఫికేషన్‌లో భాగంగా గ్రేటర్ పరిధిలో ఇళ్లు కోల్పోయే వారితో చర్చించాలని సూచించారు. మూసీతోపాటు, ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న కూల్చివేతల విషయంలోనూ ఎలాంటి దుందుడుకు విధానాలతో ముందుకెళ్లకూడదన్నారు. హైడ్రా పేరుతో ఏర్పాటు చేసిన విభాగంతో ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకెళుతోందని చెప్పారు. దీనిపై పేద ప్రజలు చేస్తున్న ఆందోళనలను, వారి మనోవేదనను పరిగణనలోకి తీసుకోకుండా హైడ్రాకు మరిన్ని అధికారాలు కల్పించడాన్ని తప్పుబట్టారు.



జిలెటిన్ స్టిక్స్ సహాయంతో భవనాన్ని కూల్చిన దృశ్యం

చెరువులో అక్రమ కట్టడం.. పేల్చివేత


- శిథిలాలు తగిలి హోంగార్డుకు తీవ్ర గాయాలు
- సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో ఘటన

కొండాపూర్ (సంగారెడ్డి): హైడ్రాను స్ఫూర్తిగా తీసుకొని సంగారెడ్డిలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. గురువారం కొండాపూర్ మండలం మల్కాపూర్ చెరువులో ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన బహుళ అంతస్తుల భవనాన్ని కూల్చివేసేందుకు ఉదయం ఘటనాస్థలానికి చేరుకున్నారు. ముందస్తుగా పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన భవనం పూర్తిగా నీటిలో ఉండటంతో బుల్డోజర్ల సహాయంతో కూల్చివేసేందుకు వీలు కాలేదు. దీంతో తహసీల్దార్ జిలెటిన్ స్టిక్స్ స్పెషలిస్టులను పిలిపించి వారి సహాయంతో భవనాన్ని పూర్తిగా కూల్చివేశారు. అయితే భవనం కూలుస్తున్న సమయంలో అక్కడే ఉన్న హోంగార్డు గోపాల్‌కు రాయి ఎగిరి వచ్చి బలంగా తాకడంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

12 ఏళ్ల క్రితమే నిర్మాణం

కొండాపూర్ మండలం కుతుబ్‌షాహీ పేట శివారులోని సర్వే నంబర్ 93లో ఉన్న చెరువుకు సంబంధించిన మూడెకరాల భూమిని సికింద్రాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కొనుగోలు చేశాడు. అక్కడ ఐదంతస్తుల భవనంతోపాటు స్విమ్మింగ్ పూల్, గెస్ట్‌హౌస్‌ను నిర్మించాడు. ఆ భవనం ఎఫ్‌టీఎల్‌లో ఉండటంతో భవనం చుట్టూ నీరు చేరకుండా ప్రత్యేకంగా చిన్నపాటి బ్రిడ్జిని కూడా నిర్మించుకున్నాడు. ఇది నిర్మించి 12 ఏళ్లయింది. అయినా హైడ్రా కూల్చివేతలు ప్రారంభమయ్యాక, గ్రామస్తులు ఫిర్యాదు చేసే వరకు అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువులో నిర్మాణానికి ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. కొత్తగా వచ్చిన అధికారులు భవనాన్ని పరిశీలించడం, మామూళ్లు తీసుకోవడం పరిపాటిగా మారిందని అంటున్నారు.

యూపీఎస్‌తో ఉద్యోగులకు తీవ్ర నష్టం



నిరసనలో స్థితప్రజ్ఞ తదితరులు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన యునైటెడ్ పెన్షన్ విధానం(యూపీఎస్)తో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన యూపీఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తూ గురువారం దేశవ్యాప్తంగా 400కు పైగా జిల్లాల్లో 'పెన్షన్ ఆక్రోష్ మార్చ్'నిర్వహించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని బీమా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్ఎంఓపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ, తెలంగాణ సీపీఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఈ దుఃఖం తీర్చేదెవరు?

ఆ నష్టం పూడ్చేదెవరు? ● హైడ్రా కూల్చివేతల తీరుపై కుటుంబాల్లో కన్నీళ్లు

- గుండెపోటుతో మరణించిన బాధితురాలు అంజలి
- తీవ్ర నష్టంతో రోడ్డునపడ్డ విజయ్‌ప్రతాప్, రవి
- రోడ్డున పడ్డ బతుకులు.. ఇక కోలుకునే మార్గమే లేదంటూ ఆవేదన

(గచ్చిబౌలి, మాదాపూర్, కూకట్‌పల్లి)

'హైడ్రా'తో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో వెలిసిన అక్రమ నిర్మాణాల కూల్చివేతపై తొలుత హర్షం వ్యక్తమైంది. కానీ ఆ తర్వాత హైడ్రా వ్యవహరిస్తున్న తీరు మాత్రం కుటుంబాల్లో కన్నీళ్లు నింపేలా ఉందంటూ బాధితులు మండిపడుతున్నారు. ఇళ్లలోనో, దుకాణాల్లోనో, షెడ్లలోనో నివసిస్తున్న.. వ్యాపారాలు చేసుకుంటున్న వారికి కనీస సమాచారం ఇవ్వకుండా, ఇచ్చినా ఖాళీ చేసేందుకు సమ యం ఇవ్వకుండా కూల్చివేతలు చేపడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమదుఃఖం తీర్చేదెవరని.. తమకు జరిగిన నష్టాన్ని పూడ్చేదెవరంటూ కన్నీళ్లుపెడుతున్నారు.

చాలా వరకు పేదలు, మధ్యతరగతివారే..

ఇళ్లు కట్టుకున్నవారే కాదు.. స్థలాలు, నిర్మాణాలను లీజుకు తీసుకుని వ్యాపారాలు పెట్టుకున్నవారూ హైడ్రా కూల్చివేతల్లో తీవ్రంగా నష్టపోయారు. ఎక్కడెక్కడి నుంచో బతుకుదెరువు కోసం వచ్చి.. కడుపు కట్టుకుని సంపాదించుకుంటున్న తమ బతుకులు రోడ్డున పడ్డాయని వాపోతున్నారు. వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యాపారాలు చేసుకుంటున్న షెడ్లను, భవనాలను ఉన్నట్టుండి కూల్చడంతో.. తీవ్రంగా నష్టపోయామని, ఇక తమ బతుకులు కోలుకునే అవకాశమే కనిపించడం లేదని కన్నీళ్లు పెడుతున్నారు.

ఈ నెల 8న సున్నంచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని ఒక గోడౌన్, మూడు భవనాలు, 20 గుడిసెలను అధికారులు కూల్చివేశారు. అందులో ఒక గుడిసెలో నివాసం ఉంటున్న బలహీనవర్గాలకు చెందిన ఎస్.నర్సింహ, అంజలి దంపతులు ఇరవయ్యేళ్ల క్రితం మాదాపూర్‌కు వలస వచ్చారు. స్థానిక నేతల సూచనతో అక్కడ గుడిసె వేసుకొని కూలిపనులు చేసుకుంటూ బతుకుతున్నారు. వారి కుమారుడు సాయిచరణ్ (17) కేన్సర్ వ్యాధితో బాధపడుతూ రెండు నెలల క్రితమే మృతిచెందాడు. ఆ దుఃఖం నుంచి కోలుకోకముందే వారి గుడిసె నేలమట్టమైంది. తలదాచుకునేందుకు నర్సింహ సోదరి ఇంటికి వెళ్లారు. కానీ అటు కుమారుడిని, ఇటు గూడును కోల్పోయిన ఆవేదనతో.. అంజలి ఈనెల 21న ఛాతీనొప్పికి గురైంది. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అదే రోజు రాత్రి ఆమె మృతి చెందింది. పాత జ్ఞాపకాలను వెతుక్కుంటూ కూల్చిన గుడిసె వద్దకు వచ్చిన నర్సింహ.. కొడుకు, భార్య ఇద్దరూ మరణించాక, తాను ఎవరి కోసం బతకాలో అర్థం కావడం లేదని వెక్కివెక్కి ఏడ్చారు.



కూకట్‌పల్లి నల్ల చెరువు ప్రాంతంలో తమ వస్తువులను వెతుక్కుంటున్న బాధితులు

రోడ్డున పడ్డ బతుకులు..

కూకట్‌పల్లికి చెందిన విజయ్‌ప్రతాప్‌గౌడ్‌ది మరో కన్నీటి వ్యథ. కేటరింగ్ చేసే ఆయన వద్ద 68 మంది పనిచేస్తున్నారు. వారందరికీ అదే జీవనాధారం. విజయ్‌ప్రతాప్ భూమిని లీజుకు తీసుకొని, రూ.40 లక్షల వ్యయంతో షెడ్లు, సామగ్రి ఏర్పాటు చేసుకున్నారు. నల్లచెరువులో హైడ్రా కూల్చివేతల్లో భాగంగా ఆయన షెడ్లనూ కూల్చేశారు. కనీసం కేటరింగ్ సామగ్రి బయటికి తీసుకువెళ్లే అవకాశం ఇవ్వలేదని ఆయన వాపోయారు. తనతో పాటు పనిచేసేవారంతా ఉపాధి లేక రోడ్డునపడ్డామని ఆందోళన వ్యక్తం చేశారు.

కొంత గడువైనా ఇవ్వాల్సింది



బాధితుడు పునారాం

సున్నం చెరువులో హైడ్రా కూల్చివేతలతో తీవ్రంగా నష్టపోయానని మరో బాధితుడు పునారాం పేర్కొన్నారు. అక్కడ లక్షలు ఖర్చుపెట్టి గోడౌన్ నిర్మాణం చేపట్టానని, శానిటరీ సామాగ్రి కొంత అందులోనే ఉండిపోయిందని వాపోయారు. కొన్నిరోజులు గడువు ఇచ్చి ఉంటే సామగ్రిని పూర్తిగా తరలించే అవకాశం ఉండేదన్నారు. గోడౌన్, సామగ్రి కలిపి రూ.50 లక్షలకుపైగా నష్టపోయి.. రోడ్డునపడ్డానని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గర్భవతి అన్నా కనికరించలేదు!

కూకట్‌పల్లిలో రవి జిరాక్స్, ప్రింటింగ్ ప్రెస్‌కు సంబంధించిన దుకాణం నిర్వహిస్తున్నాడు. హైడ్రా ఒక్కసారిగా కూల్చివేతలు చేపట్టడంతో తీవ్రంగా నష్టపోయానని వాపోయాడు. తన భార్య గర్భవతి అని, సామగ్రి తీసుకునేందుకు కాస్త గడువు ఇవ్వాలని కోరినా అధికారులు కనికరించలేదని కన్నీళ్లు పెట్టుకున్నాడు. తాను, మరికొందరు కలసి నాలుగు రోజులు కష్టపడి కొంత సామగ్రిని బయటికి తీసినా.. అది చాలా వరకు పాడైపోయిందని వాపోయారు. తనతో పాటు మరెందరో నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

విజయవాడలో చంద్రబాబు కూల్చివేయించిన ఆలయం



విశాఖలో వైఎస్ జగన్ హయాంలో నిర్మించిన శ్రీవారి ఆలయం



ధర్మ ద్రోహం బాబుదే

పవిత్రతను కాపాడింది వైఎస్, జగన్‌లే

తిరుమలలో వెయ్యి కాళ్ల మండపం.. విజయవాడలో 30 ఆలయాలను కూల్చేసిన చంద్రబాబు

విదేశీ దండయాత్రికులను మించి ఆలయాలను నేలమట్టం చేసిన చరిత్ర సీఎం చంద్రబాబు సొంతం! తిరుమల వేయి కాళ్ల మండపం నుంచి విజయవాడలోని పురాతన ఆలయాల దాకా ఆయన తీరు ఇదే! వదాన్యుల ఔదార్యంతో భక్తులు, బాటసారుల కోసం ఏర్పాటైన సత్రాలను సైతం విక్రయించి సొమ్ము చేసుకునేందుకు వెనుకాడలేదు. బెజవాడ అమ్మవారి ఆలయంలో క్షుద్రపూజల కలకలం బాబు నిర్వాకమే కదా! ఇక చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చితో పుష్కరాల వేళ జరిగిన తొక్కిసలాటతో డజన్ల సంఖ్యలో భక్తుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి! దేవాలయాలను కూలగొట్టి నిర్దాక్షిణ్యంగా వ్యవహరించిన చరిత్ర చంద్రబాబుదైతే వేల ఆలయాలను నిర్మించడంతోపాటు జీర్ణోద్ధారణ పనులు సైతం చేపట్టి హైందవ ధర్మాన్ని గౌరవించిన మనసున్న పాలకుడు వైఎస్ జగన్. ఆలయ నిర్మాణం, ఆధునికీకరణ పనులకు ప్రభుత్వ ఖజానా నుంచి నిధులిచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగనే. ఏడుకొండల వైభవాన్ని చాటి చెబుతూ శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రారంభమైంది నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే. మతాలకు అతీతంగా మానవత్వానికి పెద్దపీట వేసిన పాలకులు వైఎస్సార్, వైఎస్ జగన్. మూడేళ్లకు ఒకసారి ధార్మిక పరిషత్తు కమిటీలను నియమించాల్సి ఉండగా ఇప్పటివరకు రెండుసార్లు మాత్రమే వైఎస్సార్, వైఎస్ జగన్ హయాంలో మాత్రమే ఏర్పాటయ్యాయి. నిత్య పూజలకు నోచుకోని వేలాది దేవాలయాల్లో ధూపదీప నైవేద్య పథకం ద్వారా దీపాలు వెలిగించిన వైఎస్సార్ కుటుంబంపై చంద్రబాబు బరి తెగించి దుష్ప్రచారానికి పాల్పడుతున్నారు. పద్నాలుగేళ్ల పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానంలో గుర్తుండిపోయే కార్యక్రమాలు ఒక్కటైనా చేపట్టని సీఎం చంద్రబాబు అతి పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదంపై నిందలు వేయటంపై భక్తకోటి ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తోంది. ఆయన నిర్వాకాలను సోషల్ మీడియా లో ట్రోల్ చేస్తున్నారు. శ్రీరాముడి పాలనలో ధర్మం నాలుగు పాదాలపై నడిచిందని చెబుతారు... మరి రాముడెవరు? రాక్షసుడెవరు?

సాక్షి, అమరావతి, సాక్షి ప్రతినిధి, తిరుపతి

శరణం అయ్యప్పా..!!

భక్తులు అయ్యప్ప మాల ధరించడం కారణంగా రాష్ట్రంలో మద్యం అమ్మకాలు తగ్గుతున్నాయంటూ చంద్రబాబు గతంలో సీఎంగా ఉన్న సమయంలో ఎగతాళిగా మాట్లాడారు. మద్యం అమ్మకాలు తగ్గి రాష్ట్రం ఆదాయం కోల్పోవాల్సి వస్తోందని నాడు దారుణంగా వ్యాఖ్యానించారు.

బాబు పాలనలో కూల్చివేతలు.. విక్రయాలు.. క్షుద్రపూజలు!

- తిరుమలలో 1472 సంవత్సరంలో నిర్మించిన పురాతనమైన వెయ్యి కాళ్ల మండపాన్ని 2003లో కూల్చివేసింది నాటి చంద్రబాబు ప్రభుత్వమే.
- గతంలో చంద్రబాబు హయాంలో విజయవాడ దుర్గగుడిలో క్షుద్రపూజలు జరిగినట్లు ఆరోపణలున్నాయి.
- బెంజి సర్కిల్ పరిసరాల్లో దుర్గగుడికి చెందిన విలువైన భూములను చంద్రబాబు తన సన్నిహితుడి విద్యా సంస్థకు కారుచౌకగా కట్టబెట్టారు.
- 2014- 19 మధ్య సింహాచలం ఆలయ భూముల రికార్డుల నుంచి వందల ఎకరాల భూమి మాయమైనట్లు దేవదాయ శాఖ ప్రాథమిక విచారణలో తేలింది.
- విజయనగరంలో మెడికల్ కాలేజీ నిర్మాణం పేరుతో మాన్సాస్ ట్రస్టుకు విశాఖ చుట్టుపక్కల ఉన్న విలువైన భూములను 2014లో చంద్రబాబు ప్రభుత్వం విక్రయించింది.
- అమరావతిలోని సదావర్తి సత్రానికి చెన్నై సమీపంలో ఉన్న విలువైన భూములను టీడీపీ నాయకులకు చంద్రబాబు కారుచౌకగా కట్టబెట్టేందుకు చేసిన యత్నాలపై వైఎస్సార్ సీపీ న్యాయ పోరాటం చేసింది.
- చంద్రబాబు హయాంలో ఆలయాల పాలక మండళ్ల సభ్యులుగా నియమించిన టీడీపీ నేతల ఆగడాలతో వివిధ సందర్భాల్లో ఐదుగురు అర్చకులు మృతి చెందినట్లు అర్చక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

అన్న ప్రసాదాలకు వైఎస్సార్ శ్రీకారం..

- రాజకీయ నేతల జోక్యానికి తావు లేకుండా దేవదాయ శాఖలో కీలక నిర్ణయాలు తీసుకునేందుకు 21 మందితో ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేస్తూ 2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం చట్ట సవరణలు చేసింది.
- దేవదాయ శాఖ పరిధిలో కనీస వార్షికాదాయం లేని వేలాది ఆలయాల్లో నిత్య పూజల కోసం ధూప దీప నైవేద్య పథకాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా దివంగత వైఎస్సార్ తెచ్చారు. తొలి విడతగా 3,500 ఆలయాల్లో అమలు చేశారు.
- వైఎస్సార్ హయాంలో భక్తులకు స్వామి వారి అన్న ప్రసాదాలు ఉచితంగా అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. క్యూ లైన్‌లో ఉన్న భక్తులకు పాలు, అన్న ప్రసాదాల పంపిణీ కార్యక్రమం చేపట్టింది కూడా వైఎస్ పాలనలోనే. తిరుమలలో అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమాల ద్వారా భక్తి భావాన్ని పెంపొందించే కార్యక్రమాలను చేపట్టారు. దివ్య దర్శనం టోకెన్లు, చంటి పిల్లలకు దైవ దర్శనం, తిరుమలకు వెళ్లే భక్తులు ప్రతి ఒక్కరూ తిరునామం తిలక ధారణ చేయాలనే నిబంధన తెచ్చారు. తిరుమల మాడవీధుల్లో చెప్పులతో తిరుగాడకుండా పవిత్రతను పరిరక్షించారు. స్వామి వారి వైభవం చాటేందుకు భక్తి చైతన్య రథాలు తెచ్చారు.
- వేద విద్య, విజ్ఞానం, పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యంతో టీటీడీ 2006లో వేద విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించింది. దేశంలో ఆధ్యాత్మిక విద్య అందించే ఏకైక యూనివర్సిటీగా గుర్తింపు పొందింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్సిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని విభాగాలను విస్తరించే దిశగా అడుగులు వేశారు.
- ఏడుకొండల వైభవాన్ని దశదిశలా చాటేందుకు నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సూచనలతో అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి 2008 జూన్‌లో శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్‌ను ప్రారంభించారు. భక్తులను ఆధ్యాత్మిక సాగరంలో ఓలలాడించే కార్యక్రమాలను ప్రత్యేకంగా రూపొందించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను అశేష భక్త కోటి ఎస్వీబీసీ చానల్ ద్వారా వీక్షిస్తోంది.
- వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2006లో కళ్యాణమస్తు పథకానికి రూకల్పన చేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో వివాహం చేసుకునే ప్రతి జంటకు బంగారు మంగళసూత్రాలు, వెండి మెట్టెలు, నూతన వస్త్రాలు, తలంబ్రాలు, పెళ్లి సామగ్రి, ధార్మిక స్తోత్ర పుస్తకాలు, పురోహితుడు, 60 మంది బంధుమిత్రులకు పెళ్లి భోజనాలు ఉచితంగా ఏర్పాటు చేశారు. మంగళసూత్రాలు, మెట్టెలను శ్రీవారి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి సుమారు 36 వేల నూతన జంటలకు పంపిణీ చేసి శ్రీవారి కళ్యాణమస్తు కార్యక్రమం ద్వారా వేడుకగా వివాహం జరిపించారు.
- దళిత, గిరిజన గోవిందం పేరుతో విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది వైఎస్సార్ పాలనలోనే. స్వామి వారినే దళిత, గిరిజన వాడలకు తీసుకెళ్లి శ్రీవారి దర్శన భాగ్యం కల్పించే కార్యక్రమం చేపట్టారు. మత్స్యకారులకు వైదిక కర్మల్లో శిక్షణ ఇచ్చి సమానత్వాన్ని చాటారు.
- శ్రీనివాసుడి వైభవాన్ని చాటిన వాగ్గేయ కారుడు అన్నమయ్య ఉత్సవాలు నిర్వహించింది వైఎస్సార్ హయాంలోనే. 75 మంది వేద పండితులతో విద్వత్తు సదస్సులు కూడా నిర్వహించారు. దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. అలిపిరి వద్ద శ్రీనివాస దివ్యానుగ్రహం పేరుతో నిత్యం హోమం నిర్వహణ కార్యక్రమాన్ని ప్రారంభించింది కూడా వైఎస్సార్ పాలనలోనే.

జగన్ పాలనలో ధర్మ సంరక్షణ ఇలా..

- తిరుమల శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైన నవనీత సేవకు స్వచ్ఛమైన వెన్న సమకూర్చేందుకు నాటి సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో టీటీడీ చైర్మన్ నవనీత సేవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దేశీ ఆవు పాల నుంచి తీసిన వెన్నతో నవనీత సేవ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించేందుకు తిరుమలలోని గోశాలను విస్తరించారు. సుమారు 150 పాలిచ్చే ఆవులను సంరక్షించేందుకు ఏర్పాట్లు చేశారు.
- చిన్నారుల్లో దైవభక్తి పెంపొందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గోవింద కోటి, రామకోటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గోవింద, రామకోటి రాసిన పిల్లలకు వేంకటేశ్వరస్వామి దర్శన భాగ్యం కల్పించింది. గోవింద నామ కోటి పుస్తకాలను భక్తులకు ఉచితంగా అందించింది.
- బ్రహ్మోత్సవాల్లో అతి ముఖ్యమైన గరుడసేవకు భక్తులు అందరూ వచ్చి దర్శించుకోలేరనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రతి పౌర్ణమికి పున్నమి గరుడ సేవ నిర్వహించేలా ఏర్పాట్లు చేసింది.
- వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో సుమారు రూ.350 కోట్లతో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 2,635 నూతన ఆలయాలను నిర్మించారు. మరో 300 ఆలయాలకు మరమ్మతులు చేపట్టి జీర్ణోద్ధారణ చేశారు.
- అమరావతి, విశాఖ, భువనేశ్వర్, జమ్ము కశ్మీర్, చెన్నైతో పాటు అమెరికాలో సైతం శ్రీవారి ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.
- తెలుగు రాష్ట్రాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు అధికంగా నివసించే ప్రాంతాలలో శ్రీవారి ఆలయాల నిర్మాణాన్ని చేపట్టారు.
- వైఎస్సార్ తరహాలో వేద విద్యకు ప్రాధాన్యతనిచ్చారు.
- టీటీడీ ఉద్యోగులకు ఇంటి పట్టాలతో పాటు వేతనాలు పెంచారు. కారుణ్య నియామకాలు చేపట్టి ఉద్యోగుల కుటుంబాలలో వెలుగులు నింపారు.
- గత ప్రభుత్వం తొలగించిన ప్రధాన కైంకర్యాలను పండితులు, వేద విద్వాంసులు, పీఠాధిపతుల సలహాలతో పునరుద్ధరించారు.
- మఠాధిపతులు, ఆగమ పండితులతో 2022లో రెండో విడత ధార్మిక పరిషత్‌ను నియమించి నిర్ణయాధికారాలు కల్పించింది జగన్ ప్రభుత్వమే.
- 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో ధూప దీప నైవేద్య పథకాన్ని 1,600 ఆలయాలకు పరిమితం చేయగా అనంతరం వైఎస్ జగన్ ప్రభుత్వం 5,338 ఆలయాలలో అమలయ్యేలా చర్యలు తీసుకుంది.
- ఆలయ నిర్మాణం, ఆధునికీకరణ పనులకు ప్రభుత్వ ఖజానా నుంచి నిధులిచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగనే.
- దేవదాయ శాఖ భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం విప్లవాత్మక ఆర్డినెన్స్ తెచ్చింది. ఆక్రమణలపై కోర్టు ప్రక్రియ ద్వారా కాలయాపనకు తావు లేకుండా నోటీసు ఇచ్చి వారం తర్వాత భూమిని స్వాధీనం చేసుకునే అధికారాన్ని దేవదాయ శాఖకు కట్టబెట్టారు.
- వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా ఏడాదికి రూ.5 లక్షల లోపు ఆదాయం ఉండే ఆలయాలన్నింటినీ వంశపారంపర్య ధర్మకర్తలు, స్థానిక భక్తుల కమిటీలకు అప్పగిస్తూ జీవో ఇచ్చింది.
- 2014- 19 మధ్య విజయవాడలో కృష్ణా నది ఒడ్డున 30కిపైగా పవిత్ర దేవాలయాలను చంద్రబాబు ప్రభుత్వం కూల్చి వేయగా అనంతరం వైఎస్ జగన్ ప్రభుత్వం వాటిని పునఃనిర్మించింది.
- 2021 మే 14న జీవో నెంబరు 52 జారీ చేయడం ద్వారా గతంలో రూ.5,000 వేతనాలు పొందే వారికి రూ.పది వేల చొప్పున, రూ.పది వేల వేతనం పొందేవారికి రూ. 15,625 చొప్పున వేతనాలను పెంచుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.
- ఈనాం భూములు కలిగి ఉన్న వేలాది మంది అర్చకులకు గత ప్రభుత్వం రైతు భరోసా పథకం అందజేసింది. ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేసింది.
- అర్చక సంక్షేమ ట్రస్టు ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి రూ.48.33 కోట్ల మేర లబ్ధి చేకూర్చింది.
- బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లుగా అర్చక సమాఖ్య నాయకులకు స్థానం కల్పించింది. పాలక మండలి సభ్యులెవరైనా అర్చక స్వాముల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే పదవీ కాలం పూర్తి కాకముందే తొలగించేలా చట్ట సవరణ చేశారు. 16 ఆగమ వేద పాఠశాలల ద్వారా 400 మంది విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలతోపాటు స్టైపండ్‌గా రూ.3.06 కోట్లు అందజేసింది.
- వంశపారంపర్య అర్చకులకు రిటైర్‌మెంట్ లేకుండా వారికి ఓపిక ఉన్నంత కాలం పని చేసుకునే అవకాశం కల్పిస్తూ జీవో ఇచ్చారు.
- రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ విజయవాడలో రాజశ్యామల యాగాన్ని నిర్వహించారు.

నేడు తిరుమలకు వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకోనున్నారు. ఇందుకోసం ఆయన శుక్రవారం రాత్రికి తిరుమల చేరుకుంటారు. వైఎస్ జగన్ శుక్రవారం సాయంత్రం 4 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరి రేణిగుంట చేరుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి రాత్రి 7 గంటలకు తిరుమల చేరుకుని, అక్కడే బస చేస్తారు. శనివారం ఉదయం 10.20 గంటలకు గెస్ట్‌హౌస్ నుంచి బయలుదేరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటారు, అనంతరం తిరుమల నుంచి తిరుగుప్రయాణమవుతారు.

సింగరేణిలో 'వర్చువల్ రియాలిటీ'!



- బొగ్గు తవ్వకాలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్న డిప్యూటీ సీఎం
- లాస్‌వేగాస్‌లో యంత్ర పనితీరును పరిశీలించిన భట్టి

మైనెక్స్-2024 ప్రదర్శనలో యంత్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: కార్మికుల రక్షణ దృష్ట్యా సింగరేణి ప్రస్తుత, భవిష్యత్ గనుల్లో వర్చువల్ రియాలిటీ సాంకేతికతతో బొగ్గు తవ్వకాలు జరిపేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. అమెరికాలోని లాస్‌వేగాస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ గనుల ప్రదర్శన (మైనెక్స్)-2024లో భాగంగా ఏర్పాటైన స్టాల్స్‌ను గురువారం ఆయన సందర్శించారు. శాండ్విక్ కంపెనీ స్టాల్‌లో అత్యాధునిక కంటిన్యూయస్ మైనర్ యంత్రంతోపాటు వర్చువల్ రియాలిటీ మైనింగ్ టెక్నాలజీని పరిశీలించారు. వర్చువల్ రియాలిటీ ద్వారా గని లోపల పరిస్థితుల్ని వెలుపలి నుంచి ప్రత్యక్షంగా చూస్తూ యంత్రాలను నడపొచ్చని కంపెనీ నిర్వాహకులు వివరించారు. యంత్రాల ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఇవి బాగా ఉపయోగపడతాయని తెలిపారు. గని లోపలికి యంత్రాన్ని పంపించి వెలుపల నుంచే వాటిని ఆపరేట్ చేస్తూ బొగ్గు తవ్వొచ్చని చెప్పారు. భట్టి విక్రమార్క స్వయంగా వర్చువల్ రియాలిటీ సాంకేతికతతో పనిచేసే యంత్రానికి సంబంధించిన హెడ్‌గేర్‌ను ధరించి దాని పనితీరును పరిశీలించారు. ఈ పరిజ్ఞానం అద్భుతంగా పనిచేస్తోందని, కార్మికులకు చిన్న ప్రమాదం జరగకుండా బొగ్గు ఉత్పత్తి చేయొచ్చని అభిప్రాయపడ్డారు.

హూవర్ ప్రాజెక్టును ఆదర్శంగా తీసుకోవాలి

అమెరికాలోని నేవడ, అరిజోన రాష్ట్రాల మధ్య ఉన్న హూవర్ డ్యామ్ జలవిద్యుత్ కేంద్రాన్ని భట్టి విక్రమార్క సందర్శించారు. అక్కడి నీటి వినియోగం, రక్షణ చర్యలు ఆచరించదగినవని ప్రశంసించారు. ఫెడరల్ గవర్నమెంట్ అధికారులు ఆయనకు ప్రాజెక్టు గురించి వివరించారు. 17 జనరేటర్ యూనిట్ల ద్వారా 2,080 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి అవుతుందని, తద్వారా మూడు రాష్ట్రాల విద్యుత్ అవసరాలను తీరుస్తుందని అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలోని మూడు ప్రధాన పట్టణాల్లో ఉన్న 80 లక్షల మంది ప్రజల మంచినీటి అవసరాలతోపాటు సాగునీటి అవసరాలను కూడా హూవర్ డ్యామ్ తీరుస్తుందన్నారు. ఏటా 80 లక్షల మంది పర్యాటకులు దీన్ని సందర్శిస్తారని పేర్కొన్నారు. హూవర్ డ్యామ్ జలవిద్యుత్ ఉత్పాదకతను స్ఫూర్తిగా తీసుకొని మన ప్రాజెక్టుల సామర్థ్యం పెంపుదలకు, రక్షణ మెరుగుదలకు గల అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర అధికారులను కోరారు. రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ఉపముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్ భట్టి వెంట ఉన్నారు.

నవంబర్ ఆఖరు కల్లా కొత్త రెవెన్యూ చట్టం

- 29న తహసీల్దార్లతో కీలక భేటీ
- సబ్ రిజిస్ట్రార్ల బదిలీల్లో అవకతవకలపై చర్యలు తీసుకునే యోచన

సాక్షి, హైదరాబాద్: రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్)-2024 చట్టాన్ని వచ్చే నవంబర్ ఆఖరు కల్లా తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించిన ముసాయిదాపై ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయి నెలరోజులు గడుస్తున్న నేపథ్యంలో త్వరలోనే కార్యాచరణను సిద్ధం చేయనుంది. మార్గదర్శకాలను రూపొందించి ఉన్నతస్థాయి సమావేశంలో చర్చించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం కోసం పంపనున్నట్టు తెలుస్తోంది. ఈనెల 29న తహసీల్దార్లతో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమావేశం నిర్వహించిన అనంతరం ఆర్ఓఆర్ చట్టం అమలుకు సంబంధించిన ప్రయత్నాలు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక, సాధారణ బదిలీల్లో భాగంగా స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖలో జరిగిన సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు పారదర్శకంగా జరగలేదన్న ఆరోపణల నేపథ్యంలో వాటిని సరి చేసేందుకు పొంగులేటి సిద్ధమవుతున్నట్టు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా చేసిన బదిలీలపై ఆయన చర్యలు తీసుకునే అవకాశం ఉందనే చర్చ ఆ శాఖ వర్గాల్లో జరుగుతోంది. రాష్ట్రంలోని రెవెన్యూ వ్యవస్థలో కీలకమైన తహసీల్దార్లతో ప్రభుత్వం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తోంది. ఈనెల 29న నల్సార్ యూనివర్సిటీలో ఈ ప్రత్యేక కార్య క్రమం జరగనుంది. ఈ సదస్సులో ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో తీసుకురావాలనుకుంటున్న మార్పులు, ప్రభుత్వ ఆలోచనల గురించి దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశానికి రెవెన్యూ శాఖలో తహసీల్దార్ స్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగులంతా హాజరయ్యేలా చూడాలని కోరుతూ భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్ గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాశారు.

సర్కారు తీరుతో 'రామప్ప'కు పెను ముప్పు

బొగ్గు వెలికితీత ప్రయత్నాలు మానుకోవాలి: బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు



సాక్షి, హైదరాబాద్: శాండ్ ఫిల్లింగ్ టెక్నాలజీతో నిర్మితమైన రామప్ప దేవాలయం దగ్గర బొగ్గు నిక్షేపాలను వెలికితీసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రహస్యంగా ప్రయత్నాలు చేస్తోందని, సర్కారు తీరుతో ఆ దేవాలయానికి పెను ముప్పు వాటిల్లనుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి కలసి విలేకరులతో మాట్లాడారు. 800 ఏళ్ల చరిత్ర ఉన్న రామప్ప దేవాలయం దగ్గర బొగ్గు వెలికితీత ప్రయత్నాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇలాంటి ప్రయత్నాలు జరిగితే కేసీఆర్ గట్టిగా వ్యతిరేకించారని బొగ్గు గని ప్రతిపాదించిన ప్రాంతం రామప్ప దేవాలయానికి కేవలం నాలుగున్నర కిలోమీటర్ల దూరంలోనే ఉందని, ఒకవేళ బొగ్గు గని అక్కడ వస్తే రామప్పకు యునెస్కో రద్దవుతుందని వివరించారు. గతంలో ఓపెన్‌కాస్టును వ్యతిరేకించిన సీతక్క ఇప్పుడు మంత్రికాగానే మౌనం వహించారెందుకని ప్రశ్నించారు. ఢిల్లీ సుల్తానులు దాడి చేసినప్పటికీ రామప్ప దేవాలయం రామప్ప చెరువు జోలికి రాలేదని గుర్తు చేశారు. రామప్ప దేవాలయాన్ని రక్షించుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ ఎంతవరకైనా వెళ్తుందని హెచ్చరించారు.

ఎస్సై కొట్టిందని వ్యక్తి ఆత్మహత్యాయత్నం.. మృతి



జగిత్యాల క్రైం: ఫ్యామిలీ కౌన్సెలింగ్ పేరిట పోలీసు స్టేషన్‌కు పిలిపించి మహిళా ఎస్సై కొట్టిందనే అవమాన భారంతో ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని సోదరి, ఇతర కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన బొల్లారపు శివప్రసాద్ (36), కోరుట్లకు చెందిన కవిత భార్యాభర్తలు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో కవిత పిల్లలతో కలిసి పుట్టింట్లో ఉంటోంది. భర్తపై కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఈ నెల 22న ఎస్సై శ్వేత.. శివప్రసాద్‌ను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ సమయంలో బూతులు తిడుతూ చేయి చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన శివప్రసాద్.. ఈ నెల 23న పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. ఎస్సై కొట్టడంతోనే తన అన్న ఆత్మహత్య చేసుకున్నాడని శివప్రసాద్ సోదరి ప్రశాంతి ఆరోపించింది.

నేటి నుంచి ఎంబీబీఎస్ వెబ్ కౌన్సెలింగ్

కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటన



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ, ప్రైవేటు మైనారిటీ, నాన్ మైనారిటీ మెడికల్ కాలేజీల్లోని ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లకు మొదటి దశ కౌన్సెలింగ్ కోసం శుక్రవారం నుంచి వెబ్ ఆప్షన్లకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం అవకాశం కల్పించింది. ఈ మేరకు గురువారం సాయంత్రం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఇచ్చుకోవాలని కాళోజీ రిజిస్ట్రార్ తెలిపారు. ప్రొవిజనల్ ఫైనల్ మెరిట్ జాబితాలో పేర్లున్న అభ్యర్థులంతా శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు వెబ్ ఆప్షన్లను https:// tsmedadm. tsche. in/ వెబ్‌సైట్ ద్వారా ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈసారి రెండు మల్లారెడ్డి మెడికల్ కాలేజీలు డీమ్డ్ వర్సిటీలుగా మారడంతో ఆ సీట్లు కాళోజీ వర్సిటీ భర్తీ చేయడం లేదు. ఆ కాలేజీనే సొంతంగా భర్తీ చేసుకోనుంది. అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలుంటే 9392685856, 7842136688, 9059672216 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు. అలాగే వెబ్ ఆప్షన్లపై సాంకేతిక సమాచారం కోసం tsmedadm 2024@gmail.comకు ఈ-మెయిల్ చేయొచ్చు. ఇతరత్రా నిబంధనలపై వివరణల కోసం 7901098840, 9490585796 ఫోన్లలో సంప్రదించవచ్చు.

'రక్షణరంగ ఉత్పత్తుల తయారీపై మరింత దృష్టి'

సాక్షి, హైదరాబాద్: దేశాన్ని ఆత్మనిర్భర్ భారత్‌గా మార్చడంలో భాగంగా రక్షణరంగ ఉత్పత్తుల తయారీపై మరింత దృష్టి పెట్టాలని 11వ ఇంజనీర్స్ కాన్‌క్లేవ్-2024లో నిపుణులు సూచించారు. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ), జాతీయ ఇంజనీరింగ్ అకాడమీ (ఐఎన్ఏఈ) సహకారంతో ఏర్పాటు చేసిన రెండు రోజుల కాన్‌క్లేవ్‌ను అటామిక్ ఎనర్జీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ అనిల్ కకోద్కర్, డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ సమీర్ వి. కామత్ గురువారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. డీఆర్‌డీఎల్ హైదరాబాద్ డైరెక్టర్ జి.ఎ. శ్రీనివాసమూర్తి స్వాగతోపన్యాసం చేయగా ఐఎన్ఏఈ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఇంద్రనీల్ మన్నా అధ్యక్ష ప్రసంగం చేశారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తన సందేశాన్ని పంపారు. క్షిపణులు, వ్యూహాత్మక వ్యవస్థల డైరెక్టర్ జనరల్ యు. రాజాబాబు రక్షణ తయారీలో సవాళ్లను ప్రముఖంగా ప్రస్తావించారు.

ఇంజనీరింగ్ విద్యార్థినిపై ప్రేమోన్మాది దాడి

యువకుడికి దేహశుద్ధి చేసిన స్థానికులు



ఉప్పల్ (హైదరాబాద్): ప్రేమ వ్యవహారం బెడిసి కొట్టడంతో మాటామాటా పెరిగి యువతిపై యువకుడు కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. భువనగిరి హనుమపురం ప్రాంతానికి చెందిన రాగల సాయికుమార్ (24) ప్రైవేట్ ఉద్యోగి. అదే ప్రాంతానికి చెందిన యువతి బీటెక్ మూడవ సంవత్సరం చదువుతోంది. వీరిద్దరి మధ్య స్నేహం ప్రేమగా మారింది. కులాలు వేరు కావడంతో కొంతకాలంగా యువతి అతన్ని దూరం పెట్టింది. భరించలేని యువకుడు తాడోపేడో తేల్చుకుందామని గురువారం యువతి చదువుకుంటున్న ప్రాంతం మెహిదీపట్నం వెళ్లాడు. ఇద్దరు కలిసి తిరిగి ఉప్పల్‌కు వచ్చారు. బస్సులో ఉన్నప్పుడు సాయికుమార్ యువతి వద్ద నుంచి సెల్‌ఫోన్ తీసుకుని అందులో చాటింగ్‌లు, మెసేజ్‌లు చెక్ చేశాడు. ఉప్పల్ బస్టాండ్‌లో దిగి సెల్‌ఫోన్ ఇచ్చే విషయంలో ఇద్దరి మధ్య వాగ్వివాదం పెరిగింది. దీంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో యువకుడు తన చేతిని కట్ చేసుకుని గాయపరుచుకున్నాడు. ఈ క్రమంలో యువతి అడ్డుకోగా ఆమెపై కూడా దాడి చేసి గాయపరిచాడు. దీంతో అక్కడే ఉన్న కొందరు స్థానికులు యువకున్ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

కొనసాగుతున్న జానీ మాస్టర్ విచారణ




నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో జానీ మాస్టర్

మణికొండ: తన సహాయకురాలిపై అత్యాచారం, బెదిరింపులకు పాల్పడిన కేసులో నృత్య దర్శకుడు జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ బాషాపై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో విచారణ కొనసాగుతోంది. అతనిపై బాధితురాలు రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటం, జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి నార్సింగి పోలీసులకు వారం రోజుల క్రితం బదిలీ చేసిన విషయం తెలిసిందే. బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకుని, పరారీలో ఉన్న జానీ మాస్టర్‌ను పోలీసులు గోవాలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు రాబట్టాల్సి ఉందని, అతన్ని తమ కస్టడీకి ఐదు రోజులు ఇవ్వాలని నార్సింగి పోలీసులు జిల్లా కోర్టులో పిటిషన్ వేశారు. అందులో భాగంగా బుధవారం నుంచి శనివారం వరకు నాలుగు రోజులపాటు పోలీసు కస్టడీకి కోర్టు అనుమతిచ్చిన విషయం తెలిసిందే. బుధవారం ఆయన జైలు నుంచి నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చే సరికి రాత్రి కావడంతో మొదటి రోజు విచారణ చేయలేదు. గురువారం ముందుగా గోల్కొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య పరీక్షలను నిర్వహించి విచారణ మొదలు పెట్టారు. బాధితురాలు తన స్టేట్‌మెంట్‌లో ఇచ్చిన పలు ఆధారాలను అతని ముందు ఉంచి విచారిస్తున్నట్టు సమాచారం. అవసరం అయితే సీన్ రీక్రియేషన్‌లో భాగంగా అతన్ని ముంబైకి తీసుకువెళ్లే విషయాన్ని పోలీసులు పరిశీలిస్తున్నట్టు తెలిసింది. విచారణలో ఉన్న జానీ మాస్టర్‌ను కలిసేందుకు నార్సింగి పోలీస్ స్టేషన్‌కు అతని భార్య అయేషా వచ్చారు. శనివారంలోపు అతని నుంచి పూర్తి వివరాలను రాబట్టి కేసును కొలిక్కి తెచ్చేందుకు నార్సింగి పోలీసులు శ్రమిస్తున్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 27-9-2024


'సంతోష్'లో ఓ దృశ్యం



మన దేశంలో అందరికీ సమాన న్యాయం జరగడం సులభమేనా?
న్యాయానికి కులం, మతం, ప్రాంతం ఉంటాయా?
కంటికి కనిపించేది, చెవికి వినిపించేదంతా న్యాయమేనా?
సంధ్యా సూరి దర్శకత్వం వహించిన 'సంతోష్' సంధించే ప్రశ్నలివి.
యు.కె. ప్రభుత్వ నిర్మాణ భాగస్వామ్యంతో నిర్మితమైన ఈ సినిమాను ఇప్పుడు ఆ దేశం తన అఫిషియల్ ఎంట్రీగా ఆస్కార్‌కు పంపింది.
'లాపతా లేడీస్'తో పాటు ఆస్కార్‌లో 'సంతోష్' కూడా భారతీయ మహిళల కథను పోటీకి నిలపనుంది.

● 'ఆస్కార్'కు మన లేడీస్

యూకే ఓకే చెప్పిన ఈక్వాలిటీ కథ

ఈ వ్యవస్థ ఎలా నడుస్తోందో వ్యవస్థతో తలపడినప్పుడే సగటు మనిషికి తెలుస్తుంది. సామాజిక వ్యవస్థలో తన కంటే పై వర్గం ఎలా వ్యవహరిస్తుందో తెలిసొస్తే పాలనా వ్యవస్థలో తన కంటే పై అధికారి ఆ పై అధికారి ఎలా వ్యవహరిస్తారో తెలిసొస్తుంది. ప్రతి వ్యవస్థకు వర్షించే కళ్లు, కాటేసే కోరలు ఉంటాయి. ఎవరి మీద వర్షించాలో, ఎప్పుడు కాటేయాలో దానికి తెలుసు. అది మారాలని అందరికీ ఉంటుంది. వ్యవస్థ కూడా తాను మారాలని అనుకోవచ్చు. కాని మారదు. మారాలనుకున్నా మనుషులు మారనివ్వరు. ఏదో కొద్ది వెసులుబాటులో కాసింతో కూసింతో గాలి ఆడి పనులు అవుతుంటాయి అంతే.

డాక్యుమెంటరీ మేకర్ సంధ్యా సూరి తీసిన 'సంతోష్' సినిమా మన భారతీయ వ్యవస్థ– అది కుల వ్యవస్థ కాని పాలనా వ్యవస్థ గాని ఎలా వ్యవహరిస్తుందో ఒక బాలిక చావు ఆధారంగా చర్చిస్తుంది. ఒక మహిళా కానిస్టేబుల్ కళ్లతో సామాజిక వ్యవస్థను, న్యాయ వ్యవస్థను చూసి ప్రేక్షకుల మనసుల్లో ప్రశ్నలు నాటుతుంది.


'సంతోష్' దర్శకురాలు సంధ్యా సూరి

కథ ఏమిటి?

'సంతోష్' సినిమాలో ప్రధాన పాత్రధారి సంతోష్ సైని అనే మహిళా పోలీస్ కానిస్టేబుల్. ఈ పాత్రను చాలా ప్రతిభావంతమైన నటిగా పేరు పొందిన షహానా గోస్వామి పోషించింది. ఉత్తరప్రదేశ్ లాంటి ఒక కల్పిత రాష్ట్రంలో సంతోష్‌కు ఒక కానిస్టేబుల్‌కు పెళ్లవుతుంది. కానీ డ్యూటీలో ఉండగా భర్త హఠాత్తుగా మరణిస్తాడు. 'నా కొడుకును మింగింది' అని అత్తగారు సూటి పోటి మాటలంటే అమ్మగారింట్లోని వారు తిరిగొచ్చిన కూతురిని రకరకాలుగా బాధలు పెడతారు. దాంతో గత్యంతరం లేక భర్త మరణం వల్ల వచ్చే కారుణ్య నియామకంలో ఆమె కానిస్టేబుల్ అవుతుంది. కాని పోలీసులంటే బయట ఉండే మనుషుల్లాంటి వారేనని అక్కడ దారుణమైన పురుష స్వామ్యం, కుల పెత్తనం, అవినీతి, మత ద్వేషం ఉంటాయని తెలుసుకుంటుంది. ఆ సమయంలోనే ఒక అట్టడుగు వర్గం బాలిక శవం ఊరి బావిలో దొరుకుతుంది. అగ్ర కులాల వారే ఆమెను చంపి బావిలో వేశారని గ్రామస్తులు విచారణకు వెళ్లిన సంతోష్‌కు చెబుతారు. అక్కడి నుంచి ఆమె ఎలాంటి ప్రయాణం చేసిందనేదే కథ.

మహిళలపై హింసకు వ్యతిరేకంగా

లండన్‌లో పుట్టి పెరిగిన బ్రిటిష్ ఇండియన్ సంధ్యా సూరి గతంలో 'ఐ ఫర్ ఇండియా' డాక్యుమెంటరీలో 'ఫీల్డ్' అనే షార్ట్‌ఫిల్మ్‌తో చాలా అవార్డులు పొందింది. భారతదేశంలో స్త్రీలపై సాగే హింస మీద ఒక డాక్యుమెంటరీ తీయాలని ఇండియాలోని ఎన్‌జీఓలతో పని చేస్తున్నప్పుడు 'నిర్భయ' ఘటన ఆమెను హతాశురాలిని చేసింది. ఆ సమయంలో నిరసనలు చేస్తున్న స్త్రీలను అదుపు చేసే మహిళా కానిస్టేబుళ్ల కళ్లలోని బాధ, ఆవేదన చూసినప్పుడు ఆమెకు 'సంతోష్' సినిమా తీయాలని అనిపించింది. అయితే దీని నిర్మాణం కోసం ఆమె యు.కె/జర్మన్/ఫ్రెంచ్ దేశాల ఫిల్మ్ ఫండింగ్ ఏజెన్సీల భాగస్వామ్యం కోరింది. సునీతా రాజ్‌వర్ (పంచాయత్ ఫేమ్), సంజయ్ బిష్ణోయ్ తదితరులు ఇందులో నటించారు.

ఆస్కార్ ఎంట్రీ

మేలో జరిగిన 77వ కాన్స్‌లో బహు ప్రశంసలు పొందిన 'సంతోష్'ను 97వ ఆస్కార్ అవార్డుల పోటీలో తన దేశ అఫిషియల్ ఎంట్రీగా పంపాలని యూకే భావించడం ఈ కథకు, దర్శకురాలికి దక్కిన గౌరవంగా భావించాలి. ఇప్పటికే మన దేశం నుంచి వెళుతున్న లాపతా లేడీస్ స్త్రీల కథకాగా 'సంతోష్' కూడా స్త్రీల కథే కావడం విశేషం. ●

నేడు వరల్డ్ టూరిజం డే



సదుపాయాలిస్తే సాహసిస్తాం

మునుపటి కాలం కాదు ఇది.
సెలవులు, తీరిక దొరకగానే ఇంటి నాలుగు గోడలకు పరిమితం కావాలనుకోవడం లేదు మహిళలు.
సోలో ట్రావెలర్స్‌గా అవుట్‌డోర్ ట్రిప్స్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.
ఒక కోణంలో చూస్తే....'ఆహా... ఎంత మార్పు' అనిపిస్తుంది.
మరో కోణంలో చూస్తే అవుట్‌డోర్ అడ్వెంచర్‌లలో మహిళలకు సౌకర్యాలు, భద్రతాపరంగా ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి...

గత కొన్ని దశాబ్దాలుగా మన దేశంలో మహిళా సాహస బృందాలు, సోలో ఉమెన్ ట్రావెలర్‌లు పెరిగారు. చాలా మంది మహిళలు సెలవుల్లో ఇంటికి పరిమితం కావడానికి బదులు అవుట్‌డోర్ ట్రిప్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. మన దేశంలో పర్వతారోహణ, స్కీయింగ్, స్కూబా డైవింగ్, పారాగ్లైడింగ్... మొదలైన సాహస విభాగాల్లో శిక్షణను అందించే సంస్థల నుండి ప్రతి సంవత్సరం మహిళలు పెద్ద సంఖ్యలో శిక్షణ తీసుకుంటున్నారు.

అయినప్పటికీ మహిళల నేతృత్వంలోని అడ్వెంచర్ టూరిజం కంపెనీలు కొన్ని మాత్రమే ఉన్నాయి. టూరిజం ఇండస్ట్రీ ఉమెన్ ట్రావెలర్‌ల అవసరాలను పూర్తిగా తీర్చడం లేదు.

మహిళా గైడ్లు, సహాయ సిబ్బంది కొరత గణనీయంగా ఉంది. ప్రస్తుతం కొన్ని కంపెనీలు మాత్రమే మహిళా గైడ్‌లను నియమించుకుంటున్నాయి. 'గైడ్ అంటే పురుషులు మాత్రమే' అనే భావనను పునర్నిర్వచించడమే కాకుండా మహిళా ప్రయాణికులకు భరోసాగా నిలుస్తున్నారు ఫిమేల్ గైడ్‌లు. మారుమూల ప్రాంతాలలో సౌకర్యవంతమైన వాతావరణానికి కృషి చేస్తున్నారు.

మహిళా భద్రతా కోణంలో జెండర్ సెన్సిటివిటీ ట్రైనింగ్ అనేది కీలకంగా మారింది. ఈ శిక్షణ మేల్ గైడ్స్ 'జెండర్ డైనమిక్స్'ను అర్థం చేసుకోవడానికి మాత్రమే కాదు లైంగిక వేధింపులను నివారించడానికి సహాయపడుతుంది. భద్రత, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఉమెన్ ట్రావెలర్స్‌కు అవసరమయ్యే ఎక్విప్‌మెంట్‌ను రూపొందించాల్సిన బాధ్యత టూరిజం కంపెనీలపై ఉంది. శానిటరీ ప్రొడక్ట్స్, మెన్‌స్ట్రువల్ క్రాంప్స్ కోసం పెయిన్ రిలీఫ్ మందులు, ఆరోగ్యం, ఇతర అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్టాండర్డ్ మెడికల్ కిట్‌లు అందుబాటులోకి తేవాలి.

'సోలో ట్రావెలర్, అవుట్ డోర్ ప్రొఫెషనల్‌గా ఎన్నోసార్లు అసౌకర్యానికి గురయ్యాను. మహిళల సాహస ప్రయాణాలలో మౌలిక సదుపాయాల తక్షణ అవసరం ఉంది' అంటుంది మౌంటెనీర్, ఎంటర్‌ప్రెన్యూర్ అనూష సుబ్రమణ్యియన్.

మహిళల భద్రతకు సంబంధించి ప్రొటోకాల్‌ను మెరుగుపరచాలని అడ్వెంచర్ టూర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏటీఓఏఐ) కోరుతోంది. ప్రొటోకాల్‌ను మెరుగుపరచడం అనేది సోలో ఉమెన్ ట్రావెలర్స్ ఎదుర్కొంటున్న ప్రత్యేకమైన సవాళ్లను అధిగమించడంలో మొదటి అడుగు అవుతుంది అంటుంది ఏటీఓఏఐ.

'సాహసంలోని థ్రిల్‌ను సొంతం చేసుకోవడానికి గతంలో కంటే ఎక్కువ మంది మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో అడ్వెంచర్ ఇండస్ట్రీ వారిలోని సంకోచాలు, భయాలను తొలిగించాలి. అవుట్‌డోర్ ఆనందాన్ని ఎలాంటి భయాలు, అసౌకర్యాలు లేకుండా సొంతం చేసుకోవాలి' అంటుంది అనూష సుబ్రమణియన్. ●

ఇలా అంటున్నారు...

ఇటీవల ఒక సంస్థ సోలో ఉమెన్ ట్రావెలర్స్ గురించి నిర్వహించిన సర్వేలో పాల్గొన్న వారిలో 29 శాతం మంది భద్రత గురించి ఆందోళన చెందారు. మరో 29 శాతం మంది శారీరక సౌకర్యం (ఫిజికల్ కంఫర్ట్), 23 శాతం మంది వెహికిల్ బ్రేక్ డౌన్స్, 13 శాతం మంది లైంగిక వేధింపుల గురించి ఆందోళన చెందారు. ఎవరి అభిప్రాయం మాట ఎలా ఉన్నా అడ్వెంచర్ టూరిజం ఇండస్ట్రీ మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలనేది అందరి నోటి నుంచి వినిపించిన మాట.



లైట్ కలర్స్‌తో లగ్జరీ లుక్

మై వార్డ్‌రోబ్

తమ క్రియేటివ్ డిజైన్స్‌తో ఇతరులను అందంగా చూపే ఫ్యాషన్ డిజైనర్లు తమ కోసం వార్డ్ రోబ్‌ను ఎంత ఘనంగా తీర్చిదిద్దుకుంటారు. ఈ విషయమై హైదరాబాద్‌లో మోడల్స్‌కి, ఫ్యాషన్ షోల కోసం డిజైన్స్ క్రియేట్ చేసే హేమంత్ సిరి 'లెస్ ఈజ్ క్లాసీ' అంటూ సింపుల్‌గా ఉండే తన వార్డ్ రోబ్‌ను పరిచయం చేస్తున్నారు.



''చిన్నప్పటి నుంచి చేనేతలు అంటే బాగా ఇష్టం ఉండేది. దీంతో మా అమ్మ, అమ్మమ్మల చీరలను నాకు అనువుగా డిజైన్ చేసుకునేదాన్ని. నేను డిజైన్ చేసిన దుస్తులను వేసుకున్నవారు అందంగా కనిపించాలనే తపన ఎప్పుడూ ఉంటుంది. అయితే, నన్ను నేను కూడా బెస్ట్‌గా చూసుకోవాలి. నా విషయానికి వచ్చేసరికి కొన్ని ఎక్స్‌పర్‌మెంట్స్‌తో పాటు సౌకర్యంగా ఉండేలా చూసుకుంటాను. మోడల్స్‌కి, ఫ్యాషన్ షోస్ కోసం డిజైన్ చేయడంలో ఫ్యాబ్రిక్, కలర్స్ మీద ప్రత్యేక దృష్టి పెడతాను. నాకోసం అయితే ఇండోవెస్ట్రన్ లుక్ ఉండేలా చూసుకుంటాను. కొంచెం ప్రొఫెషనల్‌గా ఉండాలి అనుకుంటే హ్యాండ్లూమ్ శారీస్ ఎంచుకుంటాను.



■ లెస్ ఈజ్ క్లాసీ

ఏదైనా ఈవెంట్‌కి వెళ్లాలి అనుకుంటే ముందు నన్ను నేను తెలుపు, క్రీమ్ కలర్ డ్రెస్‌లో ఊహించుకుంటాను. అంతేకాదు, ఆర్గానిక్ కలర్స్, ఆర్గానిక్ ఫ్యాబ్రిక్స్‌తో సింపుల్‌గా ఫార్మల్ లుక్‌ని ఇష్టపడతాను. హెవీ శారీస్ అయినా సరే సింపుల్‌గా ఉండే బ్లౌజ్‌నే ఉపయోగిస్తుంటాను. లెస్ ఈజ్ క్లాసీ అనిపించేలా ఉంటాను.



■ లగ్జరీ కలర్స్

పేస్టల్ కలర్స్‌లో లైట్ క్రీమ్, పింక్, గోల్డ్.. ఇష్టపడతాను. ఈ రంగులు ఒక లగ్జరీ లుక్‌తో ఆకట్టుకుంటాయి. క్రీమ్ లేదా ఐవరీ అంటేనే లగ్జరీ కలర్స్. లైట్ బ్లూ, లైట్ గ్రీన్.. వంటివి డే ఫంక్షన్స్‌కి, లైట్ సిల్వర్, లైట్ క్రీమ్ డ్రెస్సులు, శారీస్ నైట్ ఈవెంట్స్‌కి వాడతాను.

■ ప్రయాణాల్లో సౌకర్యం

ఖఫ్తాన్స్ ఎక్కువ సౌకర్యంగా ఉంటాయి. పలాజోలు, జీన్స్, లైట్, ఫ్లోరల్ కలర్ నీ లెంగ్త్ ఫ్రాక్స్‌ని ఉపయోగిస్తాను.

■ బొట్టుతో గుర్తింపు

నా పర్సనల్ స్టైలింగ్‌లో బొట్టు సిగ్నేచర్ అయిపోయింది. ముందు స్టికర్స్ వాడేదాన్ని. ఆర్గానిక్ కలర్స్‌పైన గ్రిప్ వచ్చాక కుంకుమ తయారు చేసుకుని, వాడుతున్నాను. వివాహవేడుకల వంటి ఎంత పెద్ద ఈవెంట్ అయినా సింపుల్ జ్యువెలరీనే ఉపయోగిస్తాను'' అని వివరించారు ఈ డిజైనర్.

– నిర్మలారెడ్డి, 'సాక్షి' ఫీచర్స్ ప్రతినిధి

హెల్దీ డైట్

క్యారమెల్ బార్స్

వంటిల్లు

కావలసినవి: కోకో పౌడర్ – అరకప్పు; మొక్కజొన్న పిండి– 1 1/4 కప్పు; చక్కెర పొడి– కప్పు; క్రీమ్– 4 టేబుల్ స్పూన్‌లు; వేరుశనగ పప్పు పలుకులు– పావు కప్పు; వాల్ నట్ పలుకులు – పావు కప్పు; క్యారమెల్ చిప్స్ – కప్పు; కండెన్స్‌డ్ మిల్క్ – ఒక టిన్ (14 ఓజెడ్); వెనిలా ఎసెన్స్ – 2 టీ స్పూన్‌లు; ఉప్పు – టీ స్పూన్; బటర్ – 3 టేబుల్ స్పూన్‌లు (ఉప్పు లేనిది)

తయారీ:

● ఒక పాత్రలో 2 టీ స్పూన్‌ల బటర్, చక్కెర వేసి బీటర్‌తో చిలకాలి. అందులో కోకో, మొక్కజొన్న పిండి కలిపి మళ్లీ చిలకాలి

● ఒవెన్‌ను 350 డిగ్రీ ఫారన్‌హీట్‌లో వేడి చేయాలి. బేకింగ్ ట్రేలో మందపాటి పేపర్‌ను పరిచి అంచులకు సరిగ్గా సర్దాలి.




● పైన సిద్ధం చేసుకున్న మిశ్రమాన్ని పోసి సమంగా సర్ది ఒవెన్‌లో పెట్టి 15 నిమిషాల సేపు బేక్ చేసి ట్రేని బయటకు తీయాలి.

● పాత్రలో 2 టేబుల్ స్పూన్‌ల బటర్, కండెన్స్‌డ్ మిల్క్, వెనిల్లా ఎసెన్స్ వేసి కలపాలి. బేకింగ్ ట్రేలో బేక్ అయిన కోకో మిశ్రమం మీద కండెన్స్‌డ్ మిల్క్ మిశ్రమాన్ని పోయాలి. ఇప్పుడు ఆ ట్రేని మళ్లీ ఒవెన్‌లో పెట్టి పదినిమిషాల సేపు బేక్ చేయాలి. ఇది వేడి తగ్గే లోపు వేరుశనగపప్పు పలుకులు, వాల్‌నట్ పలుకులను ఒక మోస్తరుగా వేయించి పక్కన పెట్టాలి. క్యారమెల్ చిప్స్, క్రీమ్‌తో కలిపి కరిగించి అందులో ఉప్పు, వేయించిన గింజలను కలపాలి. బేక్ చేసిన మిశ్రమం మీద క్యారమెల్, నట్స్ మిశ్రమాన్ని పై నుంచి పోసి చల్లారేలోపు స్లయిస్‌లుగా కట్ చేయాలి.

ఇవి గోరు వెచ్చగా తినవచ్చు, పూర్తిగా చల్లారిన తర్వాత కూడా తినవచ్చు.

పోషకాలు: క్యాలరీలు – 285; ప్రొటీన్ – 4 గ్రాములు; కార్బోహైడ్రేట్‌లు – 40 గ్రాములు; చక్కెర – 28 గ్రాములు; ఫ్యాట్ – 14 గ్రాములు; సాచురేటెడ్ ఫ్యాట్ – 7 గ్రాములు; ఫైబర్ – 1.5 గ్రాములు; సోడియం – 180 మిల్లీగ్రాములు.


డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

ఇంటిప్స్

పురుగు పట్టకుండా...

బియ్యం, గోధుమపిండి, కంది, పెసర, మినప్పప్పు లాంటి వాటి విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా సరే, చిన్న చిన్న కీటకాలు చేరుతాయి. వీటిని తింటే కడుపునొప్పి, ఫుడ్ పాయిజనింగ్ సమస్యలు, కొన్నిసార్లు అలర్జీలు కూడా రావచ్చు. అయితే కొన్ని చిన్న చిట్కాలు పాటించడం ద్వారా వాటికి పురుగులు పట్టకుండా కాపాడుకోవచ్చు.



ఎండు వెల్లుల్లి రెబ్బలు

పప్పు, బియ్యం పురుగు పట్టకుండా ఉండాలంటే, అందులో కొన్ని ఎండు వెల్లుల్లి రెబ్బలు కలపాలి. వెల్లుల్లి నుంచి వెలువడే గాఢమైన వాసన వల్ల పురుగులు పప్పు, బియ్యం గింజల వైపు రాలేవు.



వాము కలపడం

బియ్యం డబ్బా లేదా బస్తాలో కాస్తంత వాము వేస్తే, అందులో పురుగులు పట్టవు. ఎందుకంటే వాము వాసన కూడా పురుగులకు పడదు.



ఎండు మిరపకాయలు

బియ్యం లేదా గోధుమలు నిల్వ చేసేటప్పుడు, కాసిని ఎండు మిరపకాయలు ఉంచితే, పురుగు పట్టకుండా చాలాకాలం పాటు తాజాగా ఉంటాయి.



వేపాకులు

వేపాకులకు ఉండే చేదు గుణం, ఘాటైన వాసన వల్ల పురుగులు దూరంగా ఉంటాయి. అందుకే, బియ్యం నిల్వ చేసే పాత్రలో కొన్ని వేపాకులు వేస్తే పురుగులు పట్టవు.



మిరియాలు

బియ్యం నిల్వచేసే డబ్బాల్లో కొన్ని మిరియాలు వేస్తే, అందులో పురుగులు పట్టవు. మిరియాల వాసన చాలా ఘాటుగా ఉంటుంది.

వీటిని గోధుమల్లో కలిపి, వాటికి కూడా పురుగులు పట్టకుండా జాగ్రత్త పడొచ్చు.



లవంగాలు

లవంగాల ఘాటు వాసనను పురుగులు, కీటకాలు భరించలేవు. అందుకే, బియ్యం నిల్వ ఉంచే పాత్రలో కాసిని లవంగాలు వేయాలి. లవంగ నూనె కూడా కీటకాలను దూరం చేస్తుంది.

బ్యూటిప్స్

చర్మ సౌందర్యానికి కొబ్బరిపాలు





● ఒక బకెట్ వేడి నీటిలో ఓ కప్పు గులాబీ రెక్కలు వేయాలి. ఆ తర్వాత ఒక కప్పు కొబ్బరి పాలు, అర కప్పు పన్నీరు కలిపి ఆ నీటితో స్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తుంటే చర్మం మృదువుగా మారుతుంది. సువాసనలీనుతుంది.

● ఒక కప్పు కొబ్బరి పాలు తీసుకుని అందులో దూదిని ముంచి ముఖం, మెడ, చేతులకు పట్టించాలి. ఆ తర్వాత సుమారు పది నిమిషాల సేపు (కొబ్బరి పాలు చర్మంలో ఇంకే వరకు) మర్దన చేయాలి. రోజుకొకసారి ఇలా మూడు వారాల పాటు చేస్తుంటే చర్మకాంతి పెరుగుతుంది, నలుపుదనం తగ్గుతుంది.

● అరకప్పు కొబ్బరిపాలలో టేబుల్ స్పూన్ ఓట్స్ పొడి కలిపి ముఖానికి, మెడకు, చేతులకు పట్టించి వలయాకారంగా మర్దన చేస్తే మృతకణాలు తొలగిపోతాయి. చర్మం మృదువుగా మారుతుంది.



● టెక్.. టాక్

గూగుల్ పిక్సెల్ 9 ప్రో



డిస్‌ప్లే: 6.30 అంగుళాలు ; బరువు: 199 గ్రా.
మెమోరీ: 128జీబీ 16జీబీ ర్యామ్/ 256జీబీ 16జీబీ ర్యామ్/ 512 జీబీ 16జీబీ ర్యామ్
బ్యాటరీ: 4700 ఎంఏహెచ్
ఫ్రంట్ కెమెరా: 42 ఎంపీ

డిజిటెక్ స్మార్ట్‌ఫోన్ జింబల్

బ్రాండ్: డిజిటెక్ బరువు: 400 గ్రా.
కలర్: లైట్ గ్రే 3 క్రియేటివ్ ఆపరేషన్ మోడ్స్:
● ఆల్ ఫాలో మోడ్ ● హాఫ్ ఫాలో మోడ్
● ఆల్ లాక్ మోడ్ ● పోర్టబుల్ అండ్ ఫోల్డబుల్

ఇన్‌స్టా 'రీల్స్' (ఆండ్రాయిడ్) డౌన్‌లోడ్ చేయడానికి...



'వీడియో డౌన్‌లోడర్ ఫర్ ఇన్‌స్టాగ్రామ్'లాంటి యాప్‌లను ఉపయోగించి 'రీల్స్'ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంది. 'రీల్స్' లింక్‌ను కాపీ చేసి యాప్‌లో పేస్ట్ చేయడం ద్వారా ఫోన్ గ్యాలరీలో డైరెక్ట్‌గా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇక ఐఫోన్ యూజర్‌లు 'రీల్స్'ను డౌన్‌లోడ్ చేసుకోవడానికి 'ఇన్‌సేవర్:రీపోస్ట్ ఫర్ ఇన్‌స్టాగ్రామ్' లాంటి యాప్‌లను ఉపయోగించవచ్చు. థర్డ్–పార్టీ యాప్‌లపై మీకు ఆసక్తి లేకపోతే 'స్క్రీన్ రికార్డింగ్' అనేది ఒక ఆప్షన్.

కొత్త ఇమోజీలు



మన భావోద్వేగాలను వేగంగా వ్యక్తీకరించడానికి ఇమోజీ అనేది చక్కటి మార్గం. కోపం, నిరాశ, నిరుత్సాహం, ఉత్సాహం... ఇలా ప్రతి భావోద్వేగానికి ఒక ఇమోజీ ఉంది. ఇప్పుడు ఉన్న ఎన్నో ఇమోజీలకు కొత్తగా మరో 8 యాడ్ కానున్నాయి. దీంతో ఇమోజీల ప్రపంచం మరింతగా విస్తరించనుంది. కొత్త ఇమోజీలను సృష్టించే బాధ్యత యూనికోడ్ స్టాండర్డ్ తీసుకుంటుంది. సార్క్ అధికారిక జెండా, పార, రూట్ వెజిటేబుల్, కంటికింద సంచులతో అలిసిపోయిన ముఖం, పెయింట్ స్ప్లాట్, చెట్టు కొమ్మ, వేలిముద్ర, హర్ప్ (మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్)... ఇలాంటి కొత్త ఐకాన్‌లను యూనికోడ్ ఎనౌన్స్ చేసింది.

యూట్యూబ్‌లో ఇన్నోవేటివ్ ఫీచర్స్



క్రియేటర్‌లను దృష్టిలో పెట్టుకొని యూట్యూబ్ ఇన్నోవేటివ్ ఫీచర్‌లను ప్రకటించింది. కంటెంట్ క్రియేషన్ ప్రక్రియను సులభతరం చేయడానికి ఈ అధునాతన వీడియో జనరేషన్ టెక్నాలజీ, కమ్యూనిటీ ఫీచర్‌లు ఉపయోగపడతాయి.

వీయో ఇన్ డ్రీమ్ స్క్రీన్: షార్ట్స్‌లో బ్యాక్‌గ్రౌండ్ జనరేట్ చేయడం కోసం రూపొందించిన యూట్యూబ్ డ్రీమ్‌స్క్రీన్ ఫీచర్ ఇప్పుడు గూగుల్ డీప్‌మైండ్ వీయోను ఇంటిగ్రేట్ చేస్తుంది. ఈ అప్‌గ్రేడ్ క్రియేటర్‌లకు సహజత్వంతో కూడిన బ్యాక్‌గ్రౌండ్, స్టాండ్‌లోన్ వీడియో క్లిప్‌లను క్రియేట్ చేయడానికి వీలు కల్పిస్తుంది. షార్ట్–ఫామ్ కంటెంట్ నాణ్యతను పెంచుతుంది.

ఇన్‌స్పిరేషన్ ట్యాబ్ అప్‌గ్రేడ్: ఐడియాలు, టైటిల్స్, థంబ్ నెయిల్స్, ఔట్‌లైన్స్‌ను మెరుగుపరచడానికి ఉపకరిస్తుంది. **కమ్యూనిటీస్:** ఈ సరికొత్త కమ్యూనిటీస్ ఫీచర్ ద్వారా క్రియేటర్‌లు, సబ్‌స్క్రైబర్‌లు వీడియోలు, టాపిక్స్ గురించి చర్చించుకోవచ్చు.

ఆటో డబ్బింగ్: యూట్యూబ్ 'ఆటో డబ్బింగ్' ఫీచర్‌ని విస్తరించనుంది. డబ్బింగ్ ఆడియో ట్రాక్‌లను ఆటోమేటిక్‌గా యాడ్ చేయడానికి క్రియేటర్‌లకు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. ఇది వీడియోలను ప్రపంచ ప్రేక్షకులకు చేరువ చేస్తుంది. భాష అడ్డంకులు లేకుండా చేస్తుంది.

హైప్ ఫీచర్: 'హైప్' ఫీచర్ ద్వారా ఔత్సాహిక క్రియేటర్‌లు కొత్త ఆడియెన్స్‌తో కనెక్ట్ కావచ్చు. అయిదు లక్షల కంటే తక్కువ చందాదారులు ఉన్న క్రియేటర్‌ల నుంచి వీడియోలను హైప్ చేయడానికి ఈ ఫీచర్ వినియోగదారులకు ఉపయోగపడుతుంది.

చిన్న, మధ్యతరహా క్రియేయేటర్‌ల అభివృద్ధికి ఉపయోగపడే ఫీచర్‌ను తీసుకురావాలనే జెన్ జెడ్‌లోని అత్యధికుల విన్నపం మేరకు 'హైప్' ఫీచర్‌ని తీసుకువచ్చారు.

యంగ్ టాలెంట్

ఆలోచించాలేగానీ....
శతకోటి సమస్యలకు అనంత కోటి పరిష్కారాలు ఉంటాయి.
మామయ్యను అనారోగ్యానికి గురి చేసిన సమస్యపై దృష్టి పెట్టిన హరిత ఆ సమస్యకు పరిష్కారం కనుక్కుంది. శాస్త్రప్రపంచంలో తొలి అడుగు వేసింది...

కామన్ మ్యాన్ ఫ్రెండ్



● హెల్మెట్

పెద్దపల్లి జిల్లా మంథని మండలం దుబ్బపల్లి గ్రామానికి చెందిన హర్షిత చిన్ననాటి నుంచి తెలివైన విద్యార్థి. జెడ్పీ హెచ్ఎస్ చందనాపూర్‌లో చదువుతుండేది. క్రమం తప్పకుండా బడికి వచ్చే హర్షిత ఒకసారి వరుసగా వారంరోజులు రాలేదు. ఆ తరువాత బడికి వచ్చిన హర్షితను సైన్స్ టీచర్‌తో పాటు క్లాస్ టీచర్‌గా ఉన్న సంపత్ కారణం అడిగారు.

తన మామయ్య వెల్డింగ్ పనిచేస్తాడని, వెల్డింగ్ పొగ పీల్చి ఊపిరితిత్తులు జబ్బు పడ్డాయని, ఆయనకు సహాయంగా ఉండేందుకు స్కూలుకు రాలేదని చెప్పింది. 'మామయ్య మరోసారి జబ్బు పడకుండా ఏదైనా చేయాలని ఉంది' అని తన మనసులోని మాట చెప్పింది.

ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రోత్సాహంతో హరిత ఒక హెల్మెట్ తయారుచేసింది. చిన్న ఫ్యాన్ అమర్చి రూపొందించిన ఈ హెల్మెట్ వెల్డింగ్ సమయంలో పొగను ముఖం వరకు చేరనివ్వదు. హరిత రూపొందించిన హెల్మెట్ చూసి సైన్స్ టీచర్ ఆశ్చర్యపోయారు. హరితను అభినందించారు.

తొలుత ప్రోటోటైప్‌గా రూపొందించిన ఈ హెల్మెట్‌ను ఉపాధ్యాయుల సలహాలు, సూచనలతో మరింత మెరుగు పరిచింది. హెల్మెట్‌కు ఒక సెన్సార్ బిగించి, వెల్డింగ్ చేస్తున్న వ్యక్తి ముఖం పైకి పొగ రాగానే హెల్మెట్‌పై ఉన్న ఫ్యాన్ దానంతట అదే తిరిగేలా డిజైన్ చేసింది. సిమెంటు, ఇటుక, పిండిమర.... మొదలైన పరిశ్రమలలో పని చేసే కార్మికులు, నిరంతరం దుమ్ములో పనిచేసే ట్రాఫిక్ పోలీసులకు ఎలాంటి శ్వాసకోశ సమస్యలు రాకుండా రక్షణ ఇస్తుంది. దీనికి 'కామన్ మ్యాన్ ఫ్రెండ్లీ హెల్మెట్'గా నామకరణం చేసింది. ఈ హెల్మెట్ జపాన్ సకురా ఇంటర్నేషనల్ సైన్స్ ప్రోగ్రాం, ఇండియన్ ఇంటర్నేషన్ ఇన్నోవేషన్ ప్రోగ్రాం, ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్‌లకు ఎంపికైంది.

స్మార్ట్ ఫ్రెండ్లీ వాటర్‌బాటిల్

కరోనా టైమ్‌లో స్మార్ట్ ఫ్రెండ్లీ వాటర్ బాటిల్‌ను తయారు చేసింది హర్షిత. ఈ బాటిల్‌ను మూడు అరలుగా విభజించారు. మొదటి అరలో శానిటైజర్, రెండో అరలో తాగునీరు, మూడో అరలో సబ్బు/స్నాక్స్ పెట్టుకునేలా ఈ బాటిల్‌ను రూపొందించింది. ప్రతీ అరగంటకు ఒకసారి నీరు తాగే విషయాన్ని మనకు రెడ్‌లైట్‌తో లేదా వైబ్రేషన్, సౌండ్ సదుపాయాల ద్వారా గుర్తు చేస్తుంటుంది. హర్షిత కరీంనగర్‌లోని 'సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్'లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది.

– బాషబోయిన అనిల్ కుమార్,
సాక్షి, కరీంనగర్



స్టడీ


యువత... మరింత క్రియాశీలంగా

కౌమారదశ అనేది మానవ అభివృద్ధిలో ప్రత్యేకమైన, క్లిష్టమైన దశ. మంచి ఆరోగ్యానికి దీర్ఘకాలిక పునాదులు వేయడానికి కీలకమైన దశ. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) 'ఫ్యూచర్ సమ్మిట్'లో 'ట్రెండ్స్ ఇన్ అడల్‌సెంట్ హెల్త్: సక్సెస్ అండ్ చాలెంజెస్ ఫ్రమ్ 2010 టు ది ప్రజెంట్' పేరుతో తాజాగా ఒక నివేదిక విడుదల చేశారు. కౌమరుల ఆరోగ్యం, అలవాట్లను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన నివేదిక ఇది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే... కౌమారదశలో ఉన్న ఏడుమందిలో ఒకరు మానసిక రుగ్మతతో బాధపడుతున్నారు. నిరాశ, ఆందోళన అనేవి వారిలో తీవ్రంగా కనిపిస్తున్నాయి.

కౌమార బాలికలలో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉంది. కౌమారదశలో ఉన్న పది మందిలో ఒకరు ఊబకాయంతో ఇబ్బంది పడుతున్నారు. యువతలో లైంగిక సంక్రమణ అంటువ్యాధులు పెరుగుతున్నాయని, హింసాత్మక ఘటనలు యువత శారీరక, మానసిక ఆరోగ్యంపై వినాశకరమైన ప్రభావాన్ని చూపుతున్నాయని ఈ నివేదిక చెబుతుంది. కౌమారుల ఆరోగ్యం, హక్కులను పరిరక్షించే చట్టాలను అమలు చేయాలని, పరిశోధన, విధాన రూపకల్పనలో యువత నిమగ్నం కావాలని అధ్యయన కర్తలు కోరుతున్నారు. యువత ఏం కోరుకుంటున్నారో నాయకులు వినాలని, వారు క్రియాశీల భాగస్వాములుగా, నిర్ణయాలు తీసుకునే వారిగా ఉండేలా చూడాలన్నారు.

● గేమింగ్

యోధుల కోసం...



టర్న్–బేస్డ్ గ్రాండ్ స్ట్రాటజీ వీడియోగేమ్ 'ఆర: హిస్టరీ అన్‌టోల్డ్' రెండు రోజుల క్రితం విడుదలైంది. ఈ ఆటలో ప్లేయర్స్ ముందున్న సవాలు విషయానికి వస్తే...ప్రత్యామ్నాయ చరిత్ర ద్వారా ఒక దేశాన్ని నిర్మించి ముందుకు నడిపించాలి. ప్లేయర్స్ కొత్త ప్రదేశాల గురించి అన్వేషించవచ్చు. కళలు, సంస్కృతిని అభివృద్ధి చేయవచ్చు. దౌత్యం జరపవచ్చు. పొత్తులు ఏర్పాటు చేసుకోవచ్చు. సైనిక దళాలను నిర్వహించవచ్చు. వ్యూహాత్మక యుద్ధాలలో పాల్గొనవచ్చు. ఒక్కటా...రెండా....ఈ గేమ్‌లోకి అడుగు పెడితే ఎన్నో సవాళ్లు ఉన్నాయి. ఆ సవాళ్లను అధిగమించే సాహసం మీలో ఉంటే 'హిస్టరీ అన్ టోల్డ్'లోకి వచ్చేయండి.

జానర్: టర్న్–బేస్డ్ గ్రాండ్ స్ట్రాటజీ
మోడ్స్: సింగిల్–ప్లేయర్, మల్టీప్లేయర్
ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్



గ్రీన్ ఐడ్ మాన్‌స్టర్

జెలసీగా ఫీలయ్యే వారిని ఉద్దేశించి చెప్పే మాట....గ్రీన్ ఐడ్ మాన్‌స్టర్.
ఉదా: ఆఫ్టర్ సీయింగ్ హర్ ఫ్రెండ్స్ న్యూ కార్, కవిత ఫెల్ట్ ది గ్రీన్–ఐడ్ మాన్‌స్టర్. క్రీపింగ్ అప్ ఇన్‌సైడ్ హర్.
మూలం: అసూయకు సంబంధించి 'గ్రీన్ ఐడ్' అనేది షేక్స్పియర్ నాటకం 'ది మర్చంట్ ఆఫ్ వెనిస్'లో కనిపిస్తుంది. దీనిలో 'ఆకుపచ్చ కళ్ళ అసూయ' అనే పదబంధాన్ని ఉపయోగించారు. 'ఆకుపచ్చ కళ్ళ రాక్షసుడు' అనేది 'ఒథెల్లో' నాటకంలో కనిపిస్తుంది.

క్లోజ్ ఫిస్టెడ్

ఇతరులకు డబ్బు ఇవ్వడానికి, దానం చేయడానికి సంకోచించే వారి విషయంలో వాడే మాట... క్లోజ్ ఫిస్టెడ్.
ఉదా: బీయింగ్ క్లోజ్–ఫిస్టెడ్, హీ అవాయిడ్స్ బైయింగ్ గిఫ్ట్స్ ఈవెన్ ఫర్ హిజ్ క్లోజ్ ఫ్రెండ్స్.

సినిమా

'మనం సినిమా చూసేవాళ్లమే కానీ తీసేవాళ్లం కాదు'... భార్య వెంకట నర్సమ్మతో భర్త చెన్నైబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఒక్క సినిమా అయినా నిర్మించాలనే తల్లి ఆలోచనను కాదన్నాడు కుమారుడు వెంకట రవీంద్రనాథ్. రెండేళ్లు ఇంటికి దూరంగా ఎక్కడికో వెళ్లిపోయాడు కూడా. కొడుకు ఆచూకీ తెలుసుకుని ఇంటికి పిలిపించుకున్న నర్సమ్మ మళ్లీ సినిమా పాటే పాడారు. ఇక చేసేదేం లేక సినిమా నిర్మించాలని ఫిక్స్ అయిపోయారు. నర్సమ్మ వేలి ముద్ర మాత్రమే వేయగలరు. కానీ వెండితెరపై నిర్మాతగా ఓ ముద్రగా మిగిలిపోవాలని కూలి చేసి సంపాదించిన డబ్బు, రాగి సంగటి హోటలు పెట్టి, దాని ద్వారా వచ్చిన ఆదాయం... ఇలా కష్టం చేసిన డబ్బుతో 'స్పిరిట్' (ఈజ్ నాట్ వన్) సినిమాని ఆరంభించారు. ఇక... మిగతా విశేషాలు నిర్మాత చెన్నైబోయిన వెంకట నర్సమ్మ, ఆమె భర్త చెన్నైబోయిన వెంకటేశ్వరరావు మాటల్లో తెలుసుకుందాం.

ఎగతాళి చేసినవాళ్లే గౌరవిస్తున్నారు

– నిర్మాత చెన్నైబోయిన వెంకట నర్సమ్మ



● చెన్నైబోయిన వెంకటేశ్వరరావు, వెంకట నర్సమ్మ

''నాకు చిన్నప్పటి నుంచే సినిమాలంటే ఇష్టం. పొలం పనులకు వెళ్లి వచ్చిన డబ్బులతో నేను, నా స్నేహితులు కలిసి సినిమాలు చూసేవాళ్లం. 'బ్రహ్మంగారి చరిత్ర, పొట్టేలు పున్నమ్మ' సినిమాలు నా మనసుని బాగా కదిలించాయి. సినిమాలపై ఇష్టంతో ఎప్పటికైనా ఓ సినిమా నిర్మించాలనుకున్నాను. అందుకోసం పట్టుదలగా పదేళ్లు శ్రమించాను. ఆ కల ఇన్నేళ్లకు 'స్పిరిట్' (ఈజ్ నాట్ వన్) చిత్రంతో నెరవేరడం చాలా సంతోషంగా ఉంది'' అని నిర్మాత చెన్నైబోయిన వెంకట నర్సమ్మ అన్నారు. రవిబాబు, సత్యప్రకాశ్, 'చిత్రం' శ్రీను, చిట్టిబాబు, రమ్య, ప్రియ, పింకీ, జబర్దస్త్ నాగేతేజ్, జూనియర్ రాజశేఖర్, సైదులు కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'స్పిరిట్' ఈజ్ నాట్ వన్). తన కుమారుడు వెంకట రవీంద్రనాథ్‌ని దర్శకునిగా పరిచయం చేస్తూ ఎయిత్ వండర్ సినిమా పతాకంపై చెన్నైబోయిన వెంకట నర్సమ్మ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది.

నా కల ఇన్నేళ్లకు నెరవేరింది

ఈ సందర్భంగా నిర్మాత చెన్నైబోయిన వెంకట నర్సమ్మ 'సాక్షి'తో మాట్లాడుతూ– ''మాది ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం పెదారికట్ల గ్రామం. నేను చదువుకోలేదు కాబట్టి చదవడం, రాయడం రాదు. చెన్నైబోయిన వెంకటేశ్వరరావుతో నా పెళ్లయింది. పెళ్లి తర్వాత ఆయనతో కలిసి సినిమాలు చూసేదాన్ని. మాది వ్యవసాయ కుటుంబం. మాకున్న పొలంలో వ్యవసాయం చేసుకోవడంతో పాటు కూలి పనులకు వెళ్లేదాన్ని. బర్రెలు, మేకలు, పొట్టేళ్లు కూడా పెంచేవాళ్లం. ఓ చిన్నపాటి హోటల్ కూడా నడుపుతున్నాం. సినిమా నిర్మించాలనే నా ఆలోచనని ముందు నా భర్తకి చెప్పాను. ఆ తర్వాత నా పెద్ద కుమారుడు వెంకట రవీంద్రనాథ్‌కి చెప్పాను. సినిమా నిర్మాణం అంటే మాటలా? కోట్ల రూపాయలు కావాలి? మన ఆర్థిక పరిస్థితి ఏంటి? వద్దని వారించారు. ఆ తర్వాత నా పట్టుదల, ఆత్మవిశ్వాసం చూసి ఒప్పుకున్నారు. నా ఆలోచన నుంచి వచ్చిందే 'స్పిరిట్' సినిమా కథ. నా ఆలోచనలని వెంకట రవీంద్రనాథ్ చక్కగా తెరపై చూపించగలడనే నమ్మకంతో తననే డైరెక్షన్ చేయమన్నా. ఈ సినిమా కోసం మాకున్న పొలం, పశువులు, పొట్టేళ్లు, మేకలు, ఇల్లు అమ్మేశాం. సినిమా నిర్మాణం, పోస్ట్ ప్రొడక్షన్ పనులు, సెన్సార్ వంటి వాటికి ఇప్పటికే రూ. 90 లక్షలైంది. దాదాపు 40 లక్షలు దాకా అప్పులు చేశాం. సినిమా విడుదల చేసేందుకు పబ్లిసిటీ ఖర్చుల కోసం మరో రూ. 10 లక్షలు కావాల్సి ఉంది. ఇక ఈ సినిమా కథ విషయానికి వస్తే... తెలంగాణాలోని దేవదాసీ వ్యవస్థలానే కోస్తాంధ్రలో మాతంగులు ఉండేవారు. ఇప్పుడూ ఉత్సవాలు, జాతర్లు, ఎల్లమ్మ తిరునాళ్ల వంటి సమయాల్లో వారిని డ్యాన్స్ చేయటానికి తీసుకొస్తుంటారు. వారి కష్టాలను కళ్లారా చూశాం. మాతంగుల జీవితాలు ప్రస్తుతం దుర్భరంగా ఉన్నాయి. వారిపై జరిగే దురాచారాలు పోవాలి. వారి పిల్లలు మాతంగుల వృత్తిలోకి రాకుండా చదువుకుని, ఉద్యోగాలు చేసుకోవాలనే సంకల్పంతో ఈ సినిమా తీశాం. త్వరలో ఆడియో రిలీజ్ చేసి, సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం. అయితే మా బంధువులు, తెలిసినవారు, ఊర్లోని వారు 'మీరేంటి? సినిమా నిర్మించేదేంటి?' అంటూ హేళనగా, చులకనగా మాట్లాడేవారు. అన్నింటినీ భరించి, ఈ సినిమా నిర్మించాం. దీంతో ఎగతాళిగా మాట్లాడినవారే అనుకున్నది సాధించావంటూ ఆప్యాయంగా మాట్లాడుతున్నారు... గౌరవంగా చూస్తున్నారు. సినిమా నిర్మించాలనే నా కల నెరవేరింది. ఇకపై సినిమా నిర్మించను. ఇండస్ట్రీలోనే ఉండాలా? వద్దా అన్నది మా అబ్బాయి వెంకట రవీంద్రనాథ్ ఇష్టం. మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు.

ఆత్మస్థైర్యం కోల్పోలేదు

– చెన్నైబోయిన వెంకటేశ్వరరావు

సినిమా నిర్మించాలని ఉందని నా భార్య అన్నప్పుడు మొదట్లో నేను కూడా నవ్వుతూ, ఎగతాళి చేసేవాణ్ణి. అయితే తన పట్టుదల చూసి ఆ తర్వాత ఒప్పుకున్నాను. ఎన్ని కష్టాలు వచ్చినా ఆత్మస్థైర్యం కోల్పోకుండా ఈ సినిమా నిర్మించింది. ఈ సినిమా నిర్మాణం మాకో మధురానుభూతి. అలాగే ఓ విషాదం కూడా నింపింది. ఈ చిత్రంలో నటించిన మా రెండో అబ్బాయి పాముకాటుకు గురై మృతి చెందడం మమ్మల్ని కలిచివేసింది. మా అబ్బాయి నటించిన సన్నివేశాలు వచ్చినప్పుడు నా భార్య చూడదు... బాధపడాల్సి వస్తుందని. ఈ సినిమాలో నేనో పాత్ర చేశాను. 'స్పిరిట్' మాకు లాభాలు తీసుకురాకపోయినా పర్లేదు. కానీ, చేసిన అప్పులు తీర్చేలా డబ్బులు వస్తే చాలు. ఏది ఏమైనా సినిమా నిర్మించామన్న తృప్తి ఎప్పటికీ ఉంటుంది.

నేను రెడీ!



● అజయ్

ఫైట్ చేయడానికి రెడీ అన్నట్లుగా సీరియస్‌గా చూస్తున్నారు అజయ్. మరి... ఎవరితో ఫైట్ చేయనున్నారు? కథేంటి అనేది 'పొట్టేల్' చిత్రం చూసి తెలుసుకోవాల్సిందే. యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పొట్టేల్. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రంలో అజయ్ పవర్‌ఫుల్ కీ రోల్ చేస్తున్నారు. గురువారం (సెప్టెంబర్ 26) అజయ్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రంలోని తన పోస్టర్‌ని విడుదల చేశారు. నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగే నిర్మిస్తున్న 'పొట్టేల్' దసరాకి విడుదల కానుంది.

మా మనవడ్ని ఆదరించాలని కోరుకుంటున్నాం

– పరుచూరి బ్రదర్స్



● పరుచూరి సుదర్శన్, గోపాలకృష్ణ, వెంకటేశ్వరరావు

ప్రముఖ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు పరుచూరి సుదర్శన్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'మిస్టర్ సెలెబ్రిటీ'. చందిన రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్. పాండు రంగారావు నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ విడుదల చేసి, మాట్లాడుతూ– ''మమ్మల్ని ఆదరించినట్లుగానే మా మనవడు సుదర్శన్‌ని కూడా ఆదరించాలని కోరుకుంటున్నాను. రవికిశోర్ కొత్త దర్శకుడైనా సినిమాను బాగా తీశారు. ఈ చిత్రం అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది'' అన్నారు. ''నలభై ఏళ్లుగా మమ్మల్ని ఆదరిస్తూనే ఉన్నారు. రాజీపడకుండా నిర్మించిన నిర్మాతలను, అద్భుతంగా తెరకెక్కించిన దర్శకుడ్ని, తొలిసారి వెండితెరపై కనిపించనున్న మా మనవడ్ని ఆదరించి ఈ సినిమాకి విజయం చేకూర్చాలని కోరుకుంటున్నాను'' అని పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు.

తల్లి మనసు పూర్తి



● షూటింగ్ పూర్తయిన సందర్భంగా 'తల్లి మనసు' యూనిట్

ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మిస్తున్న తొలి చిత్రం 'తల్లి మనసు'. వి. శ్రీనివాస్ (సిప్పీ) దర్శకత్వంలో రచితా మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం ఇది. కాగా ఈ చిత్రం షూటింగ్ పూర్తయిందని గురువారం నిర్మాతలు తెలిపారు. ఈ సందర్భంగా ముత్యాల అనంత కిశోర్ మాట్లాడుతూ– ''సినిమా ప్రారంభోత్సవం రోజున సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేయాలనుకున్నాం. అలాగే చేయగలిగాం. మా నాన్నగారి పర్యవేక్షణలో దర్శకుడు ఈ సినిమాని అద్భుతంగా తీశారు'' అన్నారు. ''వాస్తవ జీవితానికి అద్దం పట్టేలా ఈ సినిమా ఉంటుంది'' అని ముత్యాల సుబ్బయ్య అన్నారు. ''ఓ మధ్య తరగతి తల్లి చుట్టూ తిరిగే కుటుంబ కథతో ఈ చిత్రాన్ని రూపొందించాం'' అన్నారు వి. శ్రీనివాస్ (సిప్పీ).

ఓటీటీ
ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'రన్ హైడ్ ఫైట్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

పరిగెట్టు... పసిగట్టు.... పని పట్టు



యుద్ధమనేది అనివార్యమైతేనే ఆయుధం గురించి ఆలోచించు అన్న నానుడిని పూర్తిగా అలక్ష్యం చేసి అనవసరంగా ఆయుధాలను సమకూర్చుకోవడంలో మునిగిపోయింది నేటి కొంత సమాజం. కొన్ని ప్రదేశాల్లో గల్లీల్లో ఆడుకునే పిల్లల దగ్గర కూడా గన్స్ ఉంటున్నాయంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. అడపా దడపా ఈ గన్ కల్చర్ గురించి వింటూనే ఉన్నాం. అగ్రరాజ్యమైన అమెరికాలో ఈ గన్ కల్చర్ విపరీతంగా ఉంది. ఆ దేశంలో మూతి మీద మీసం కూడా రాని విద్యార్థులు చేతిలో తుపాకీతో ఉంటున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అక్కడి సంప్రదాయం ప్రకారం రక్షణ కవచంగా తుపాకీని ఎవరైనా లైసెన్స్ పొంది తమ దగ్గర ఉంచుకోవచ్చు. కాని ఇదే గన్ కల్చర్ విపరీత ధోరణిగా మారితే ఎలా ఉంటుందన్న ఇతివృత్తంతో వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కైల్ రాంకిన్ 'రన్ హైడ్ ఫైట్' సినిమా తీశారు. విమర్శకుల ప్రశంసలు అందుకున్న సినిమా ఇది. కొన్ని ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమైంది. అంతలా ఏముంది ఈ సినిమాలో ఓసారి విశ్లేషించుకుందాం. కథాపరంగా అమెరికాలోని ఓ విశ్వవిద్యాలయంలోకి కొందరు విద్యార్థులు చొరబడతారు. వారందరూ సాయుధులై భారీ మందుగుండు సామాగ్రితో విద్యాలయంలోని తోటి విద్యార్థులను, స్టాఫ్‌ను బందీలుగా చేసుకుని విద్యాలయాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకుంటారు. విద్యార్థులలో ఒకరైన జో తనను, తనతో పాటు ఆ విద్యాలయంలోని కొందరిని ఎలా రక్షించిందనేదే ఈ 'రన్ హైడ్ ఫైట్' సినిమా. ఉత్కంఠ భరితం అన్న దానికి పై మాటే ఈ సినిమా స్క్రీన్‌ప్లే. థ్రిల్లర్ జోనర్ ఇష్టపడేవారికి ఈ సినిమా కన్నులపండగ. అలాగే కొందరు తల్లిదండ్రులకు ఓ కనువిప్పు ఈ సినిమా. ఇసబెల్ మే ప్రధాన పాత్రలో నటించి మెప్పించింది. ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమాని ఈ వీకెండ్ చూసెయ్యండి.

– ఇంటూరు హరికృష్ణ

తండ్రీ కొడుకుల బంధం నేపథ్యంలో...



● కషికా, శ్రీహర్ష

శ్రీహర్ష, కషికా కపూర్ జంటగా పవన్ కేతరాజు దర్శకత్వం వహించిన చిత్రం 'లైఫ్: లవ్ యువర్ ఫాదర్'. కిశోర్ రాఠీ, మహేశ్ రాఠీ, ఎ. రామస్వామి రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా పవన్ కేతరాజు మాట్లాడుతూ– ''కొడుకు బాధ్యత తీర్చేందుకు తండ్రి పడే ఆరాటం, తండ్రి కోసం కొడుకు చేసే పోరాటమే మా 'లైఫ్' సినిమా. కాశీ నేపథ్యంలో సాగే ఈ కథలో శివతత్వాన్ని చూపించాం'' అని తెలిపారు. ''మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన మా సినిమాని త్వరలో విడుదల చేస్తాం'' అని నిర్మాతల్లో ఒకరైన అన్నపరెడ్డి రామస్వామి రెడ్డి చెప్పారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
666	212
85,836	26,216

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	18,084	▲	2
డోజోన్స్	42,090	▲	176
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,285	▲	16
డాక్స్	19,238	▲	320
షాంఘై	3,001	▲	105
నికాయ్	38,926	▲	1,055

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	75,750 ▲	502
బంగారం (99.5 స్వచ్ఛత)	75,447 ▲	500
వెండి (కేజీ)	92,522 ▲	1,792

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.25	84.27
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	110.41	113.04
€	యూరో	ఎస్‌బీఐ	92.14	94.53
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.16	58.47
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.34	58.30
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.83	67.48
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.41	22.96
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.88	23.66
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.05	12.88

టెక్ హైరింగ్‌లో బ్యాం‘కింగ్’!

- సైబర్ సెక్యూరిటీ, సరికొత్త టెక్నాలజీలకు దన్ను
- ఐటీ నిపుణులకు భారీ డిమాండ్...
- ఈ ఏడాది 12% పెరగనున్న బీఎఫ్‌ఎస్‌ఐ ఐటీ వ్యయం
- 2026 నాటికి దాదాపు 5 లక్షలకు చేరనున్న టెక్ సిబ్బంది

దేశ ఐటీ రంగంలో హైరింగ్ ఇంకా మందకొడిగానే ఉన్నప్పటికీ... దీనికి భిన్నంగా బ్యాంకులు మాత్రం రారమ్మంటూ టెకీలకు స్వాగతం పలుకుతున్నాయి. సైబర్ సెక్యూరిటీ ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో బీఎఫ్‌ఎస్‌ఐ రంగంలో టెక్నాలజీ నిపుణులకు ఫుల్ డిమాండ్ నడుస్తోంది. పరిశ్రమ అంచనాల ప్రకారం ఈ ఏడాది బీఎఫ్‌ఎస్‌ఐ సంస్థలు తమ ఐటీ వ్యయాలను 12% పెంచుకోనున్నట్లు అంచనా. ఎనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) ఆధారిత సొల్యూషన్లతో పాటు ఆటోమేషన్ టెక్నాలజీలపై ఆయా సంస్థలు ఫోకస్ చేస్తున్నాయి. దీనికి అనుగుణంగానే హైరింగ్ కూడా జోరందుకుందని హెచ్‌ఆర్ నిపుణులు చెబుతున్నారు. ‘బీఎఫ్‌ఎస్‌ఐలో ప్రత్యేకమైన విభాగాల్లో హైరింగ్ డిమాండ్ ఉంది. క్లౌడ్‌కు మారుతున్న సంస్థలు అత్యవసరంగా టెక్నాలజీ నిపుణులు కావాలని కోరుతున్నాయి. సైబర్ సెక్యూరిటీలో కూడా భారీగానే నియామకాలు కొనసాగనున్నాయి’ అని క్వెస్ ఐటీ స్టాఫింగ్ డిప్యూటీ సీఈఓ కపిల్ జోషి పేర్కొన్నారు. ఈ ఏడాది బీఎఫ్‌ఎస్‌ఐ రంగం టెక్ హైరింగ్ 6–8% వృద్ధి చెందనుందని, ఫ్రెషర్లతో పాటు టెక్నాలజీపై పట్టున్న ప్రొఫెషనల్స్‌కు కూడా అవకాశాలు లభిస్తాయని టీమ్‌లీజ్ తెలిపింది.


తయారీ తర్వాత అత్యధిక జాబ్స్...

టెక్నాలజీయేతర కంపెనీల్లో అత్యధికంగా టెక్ ఉద్యోగులను నియమించుకుంటున్న రంగంగా త్వరలో బీఎఫ్‌ఎస్‌ఐ అగ్రస్థానానికి ఎగబాకనుంది. ప్రస్తుతం టాప్‌లో తయారీ రంగం ఉంది. 2023 నాటికి బీఎఫ్‌ఎస్‌ఐ సంస్థల మొత్తం టెక్ సిబ్బంది సంఖ్య 4 లక్షల స్థాయిలో ఉండగా.. 2026 కల్లా 4.9 లక్షలకు ఎగబాకుతుందనేది టీమ్‌లీజ్ అంచనా. అంటే 22.5 శాతం వృద్ధి చెందనుంది. మరోపక్క, బీఎఫ్‌ఎస్‌ఐలో మొత్తం సిబ్బంది సంఖ్య ఇప్పుడున్న 71 లక్షల నుంచి 2026 నాటికి 12 శాతం వృద్ధితో 80 లక్షలకు చేరుకుంటుందని లెక్కగట్టింది. కాగా, ఈ ఏడాది జూన్‌లో బీఎఫ్‌ఎస్‌ఐ రంగంలో జరిగిన మొత్తం నియామకాల్లో 8% పైగా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ విభాగానికి చెందినవే. 15% ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, 11% సైబర్ సెక్యూరిటీలో నమోదయ్యాయి. ఇక డేటా సైన్స్– ఎనలిటిక్స్ జాబ్స్‌లో హైరింగ్ 7% వృద్ధి చెందగా, ఏఐ/ఎంఎల్ ఇంజనీర్లకు 10% అధికంగా జాబ్స్ లభించాయి. ఈ రెండు విభాగాల్లో బీఎఫ్‌ఎస్‌ఐ కంటే ఎక్కువగా ఉద్యోగాలిచ్చిన రంగాల్లో సాఫ్ట్‌వేర్ సేవలు, ఇంటర్నెట్–ఈకామర్స్, అడ్వర్టయిజింగ్–పబ్లిక్ రిలేషన్స్ ఉన్నాయి.


ఆన్‌లైన్ మోసగాళ్లు.. డేటా హ్యాకర్ల రిస్కును మరింత సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేసుకోవాలని ఒకపక్క ఆర్‌బీఐ పదేపదే హెచ్చరికలు. మరోపక్క తీవ్ర పోటీ నేపథ్యంలో సరికొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవాల్సిన పరిస్థితి. దీంతో బ్యాంకులు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) వ్యయాలతో పాటు టెక్ సిబ్బంది సంఖ్యను కూడా భారీగా పెంచుకునే పనిలో పడ్డాయి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ ఇప్పుడు బ్యాంకింగ్-ఫైనాన్షియల్ సర్వీసులు- ఇన్సూరెన్స్ (బీఎఫ్‌ఎస్‌ఐ) రంగంలో కూడా మరిన్ని ఐటీ కొలువులు సృష్టించనుంది.

– సాక్షి, బిజినెస్ డెస్క్









టెక్నాలజీకి పెద్దపీట...

నెట్ బ్యాంకింగ్‌కు తోడు యాప్స్, యూపీఐ పేమెంట్స్ ఇలా బ్యాంకింగ్ లావాదేవీలకు ఇప్పుడు ఆన్‌లైన్ కీలకంగా మారింది. దీంతో బ్యాంకులు సిబ్బంది నియామకాల్లో టెకీలకు పెద్దపీట వేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ ప్రొబేషనరీ ఆఫీసర్లు (పీఓ)గా సుమారు 12,000 మంది ఫ్రెషర్లను నియమించుకునే సన్నాహాల్లో ఉంది. ఇందులో 85 శాతం ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్‌లకే అవకాశాలు లభించనున్నాయని అంచనా. గడిచిన మూడేళ్లలో యస్ బ్యాంక్ ఏటా 200 మంది టెక్ నిపుణులను నియమించుకోవడం గమనార్హం.



“కస్టమర్లకు మరింత మెరుగైన సేవలందించేందుకు, నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా బ్యాంకింగ్-ఇన్వెస్ట్‌మెంట్ సర్వీసెస్ సంస్థలన్నీ జెనరేటివ్ ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీపై పెద్దమొత్తంలో పెట్టుబడి పెడుతున్నాయి. ఈ రంగంలో ప్రతిభ గల ప్రొఫెషనల్స్‌కు డిమాండ్ పుంజుకోవడానికి ఇదే ప్రధాన కారణం.

– కపిల్ జోషి, డిప్యూటీ సీఈఓ, క్వెస్ ఐటీ స్టాఫింగ్

రూ.21 వేల కోట్లతో మేఘా భారీ ప్రాజెక్టులు

- మహారాష్ట్ర సర్కారుతో ఒప్పందం
- పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్ కేంద్రాల నిర్మాణం
- 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిర్మాణ రంగ దిగ్గజం మేఘా ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) మహారాష్ట్రలో 4,000 మెగావాట్ల సామర్థ్యంగల రెండు భారీ పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్ కేంద్రాలను నిర్మించనుంది. ఇందుకోసం రూ.21 వేల కోట్లు పెట్టుబడి చేయనున్నట్టు కంపెనీ గురువారం ప్రకటించింది. ఈ మేరకు ఒప్పందంపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో జల వనరుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి దీపక్ కపూర్, మేఘా ప్రెసిడెంట్ ఆర్.వి.ఆర్.కిషోర్ సంతకాలు చేశారు. ఎంఈఐఎల్ బిల్డ్–ఓన్–మెయింటెనెన్స్ విధానంలో నిర్మిస్తున్న తొలి ప్రాజెక్టులు ఇవి. మహారాష్ట్రలోని నందుర్బార్ జిల్లాలోని కామోడ్ వద్ద పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును అయిదేళ్లలో, ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలోని ఘోస్లా వద్ద రెండవ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని మేఘా పూర్తి చేయనుంది. ఈ ప్రాజెక్టుల ద్వారా రెండున్నర వేల మందికి ఉపాధి లభిస్తుందని ఫడ్నవీస్ తెలిపారు. ఒక్కో ప్రాజెక్టులో ప్రధానంగా 2 రిజర్వాయర్లు, విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్, వాటర్ కండక్టర్ సిస్టం ఏర్పాటు చేస్తారు.



ఒప్పంద కార్యక్రమంలో దీపక్ కపూర్, ఫడ్నవీస్, ఆర్.వి.ఆర్.కిషోర్ (ఎడమ నుంచి కుడికి)

అజియోలో హెచ్అండ్ఎం ఉత్పత్తులు



న్యూఢిల్లీ: స్వీడిష్ ఫ్యాషన్ సంస్థ హెచ్అండ్ఎం ఉత్పత్తులు ఇకపై రిలయన్స్ రిటైల్‌కి చెందిన ఫ్యాషన్ ఈ–టైలర్ ప్లాట్‌ఫాం అజియోలో లభించనున్నాయి. ఇందుకు సంబంధించి ఇరు సంస్థలు భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీనితో హెచ్అండ్ఎం ఉత్పత్తులు ఆన్‌లైన్‌లో మరింత అందుబాటులోకి వస్తాయని ఇరు సంస్థలు ఒక ప్రకటనలో తెలిపాయి. కంపెనీకి ఇప్పటికే మరో ఫ్యాషన్ ఈ–టైలర్ మింత్రాతో ఒప్పందం ఉంది. అజియోలో హెచ్అండ్ఎంకి చెందిన ఉమెన్స్‌వేర్, మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్ మొదలైనవి 10,000కు పైగా స్టయిల్స్‌తో లభిస్తాయి.

చిన్న నగరాలకూ ఓలా ఎలక్ట్రిక్ విస్తరణ

వచ్చే ఏడాదికల్లా 10,000 స్టోర్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహన తయారీలో ఉన్న ఓలా ఎలక్ట్రిక్ చిన్న పట్టణాలకూ విస్తరిస్తోంది. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచడం లక్ష్యంగా నెట్‌వర్క్ పార్ట్‌నర్ ప్రోగ్రాం కింద దేశవ్యాప్తంగా 2025 డిసెంబర్ కల్లా 10,000 సేల్స్, సర్వీస్ కేంద్రాలను నెలకొల్పనున్నట్టు గురువారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా విక్రయశాలలను పెంచుకోవడానికి 625 మంది భాగస్వాములను ఈ ప్రోగ్రాం కిందకు చేర్చింది. పండుగల సీజన్‌లో మరో 1,000 మందిని చేర్చుకోనున్నట్టు వెల్లడించింది. ప్రస్తుతం ఓలా ఎలక్ట్రిక్ సొంతంగా సుమారు 800 స్టోర్లను నిర్వహిస్తోంది. నెట్‌వర్క్ పార్ట్‌నర్ ప్రోగ్రాంతో రాబోయే పండుగ సీజన్‌లో ఈ సంఖ్య 1,800లకు చేరుతుందని కంపెనీ వివరించింది.

OLA ELECTRIC

మార్కెట్ రికార్డుల ర్యాలీ

సెన్సెక్స్ 666 పాయింట్లు ప్లస్ • నిఫ్టీ 212 పాయింట్లు అప్

ముంబై: ప్రపంచ మార్కెట్ల దన్ను, సానుకూల సెంటిమెంటు నేపథ్యంలో దేశీ సూచీల రికార్డుల ర్యాలీ కొనసాగింది. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో సెన్సెక్స్ 666 పాయింట్లు జమ చేసుకుని 85,836 వద్ద నిలిచింది. నిఫ్టీ సైతం 212 పాయింట్లు బలపడి 26,216 వద్ద ముగిసింది. చైనా ఆర్థిక సహాయక ప్యాకేజీ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లకు ప్రోత్సాహం లభించినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. మరోవైపు యూఎస్ ఆర్థిక గణాంకాలు సైతం సానుకూల సెంటిమెంటుకు కారణమైనట్లు తెలియజేశారు.



ఆటో, మెటల్ జోరు: ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా ఆటో, మెటల్ రంగాలు 2.2 శాతం చొప్పున లాభపడ్డాయి. ప్రభుత్వ బ్యాంకులు, ఎఫ్‌ఎంసీజీ 1 శాతం పుంజుకోగా.. కన్జూమర్ డ్యూరబుల్స్ ఇదేస్థాయిలో నీరసించింది. నిఫ్టీలో మారుతీ, గ్రాసిమ్, టాటా మోటార్స్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ద్వయం, ఎంఅండ్ఎం, టాటా స్టీల్, హిందాల్కో, అల్ట్రాటెక్, ఐషర్, టాటా కన్జూమర్, జేఎస్‌డబ్ల్యూ, నెస్లే, బజాజ్ ఆటో 4.5–1.6% మధ్య ఎగశాయి. అయితే సిప్లా, ఓఎన్‌జీసీ, ఎల్అండ్‌టీ, ఎన్‌టీపీసీ, దివీస్ 1.5–0.6 శాతం మధ్య డీలాపడ్డాయి.

- ఆరేళ్లపాటు 37 సినిమాలకు శాటిలైట్, మీడియా హక్కుల కోసం జీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో డీల్ నేపథ్యంలో ముక్తా ఆర్ట్స్ తొలుత 20% వరకూ దూసుకెళ్లింది. చివరికి 14% లాభపడి రూ. 110 వద్ద ముగిసింది.
- ఈ నెలాఖరు నుంచి ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ–50లో చోటు పొందనుండటంతో టాటా గ్రూప్ దిగ్గజం ట్రెంట్ షేరు 3.2 శాతం ఎగసి రూ. 7,850 వద్ద ముగిసింది.

‘సాక్షి ప్లస్’ ఈ-పేపర్‌లో ..
పీఎస్ఎంసీతో టాటా ఎలక్ట్రానిక్స్ ఒప్పందం | పసిడి @ రూ. 78,000

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా...



నేటి నుంచి బంగ్లాదేశ్‌తో భారత్ రెండో టెస్టు

- సమరోత్సాహంతో టీమిండియా
- ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

కాన్పూర్: వరసగా మూడోసారి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు చేరాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న భారత క్రికెట్ జట్టు మరో సమరానికి సన్నద్ధమైంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో ఘన విజయం సాధించిన టీమిండియా అదే జోరు కొనసాగించాలనే లక్ష్యంతో నేటి నుంచి జరిగే రెండో టెస్టులో బరిలోకి దిగనుంది. డబ్ల్యూటీసీ 2023–25 పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతున్న రోహిత్ శర్మ బృందం దాన్ని మరింత పటిష్టం చేసుకోవాలనే ఉద్దేశంతో ఉండగా... టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలకనున్నట్లు ప్రకటించిన స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్‌కు విజయాన్ని కానుకగా ఇవ్వాలని బంగ్లాదేశ్ జట్టు భావిస్తోంది. ఇప్పటి వరకు ఇరు జట్ల మధ్య 14 మ్యాచ్‌లు జరగగా... అందులో టీమిండియా 12 విజయాలు సాధించింది. మిగిలిన రెండు మ్యాచ్‌లు ‘డ్రా’గా ముగిశాయి. ఇటీవల పాకిస్తాన్‌లో పాకిస్తాన్‌ను ఓడించిన బంగ్లాదేశ్ జట్టు భారత గడ్డపై కూడా సంచలన ప్రదర్శన కొనసాగించాలని భావించినా... రోహిత్ జట్టు దూకుడు ముందు నిలవలేకపోయింది. చెన్నై వేదికగా జరిగిన తొలి టెస్టు ఆరంభంలో కాస్త ప్రభావం చూపగలిగిన ఆ జట్టు ఆ తర్వాత ఆకట్టుకోలేకపోయింది. ఇప్పటి వరకు స్వదేశంలో వరుసగా 17 టెస్టు సిరీస్ విజయాలు సాధించిన టీమిండియా.. ఇది కూడా గెలిస్తే ఆ సంఖ్య 18కి పెరగనుంది. ప్రపంచ క్రికెట్‌లో ఒక జట్టు స్వదేశంలో వరసగా అత్యధిక సిరీస్ విజయాలు సాధించిన జాబితాలో టీమిండియా అగ్రస్థానంలో ఉండగా... ఆస్ట్రేలియా రెండుసార్లు స్వదేశంలో వరసగా పదేసి సిరీస్‌లు గెలిచి రెండో స్థానంలో ఉంది. 2012లో ఇంగ్లండ్ చేతిలో టెస్టు సిరీస్ ఓడిన అనంతరం స్వదేశంలో టీమిండియా ఒక్క సిరీస్ కూడా కోల్పోలేదు.

రోహిత్, కోహ్లి కూడా రాణిస్తే...

తొలి మ్యాచ్‌లో భారత జట్టు అదరగొట్టింది. ముఖ్యంగా ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. అతడికి రవీంద్ర జడేజా అండగా నిలిచాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో యువ ఆటగాళ్లు శుబ్‌మన్ గిల్, రిషభ్ పంత్ సెంచరీలతో సత్తా చాటారు. అయితే స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి మాత్రమే స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయారు. దీంతో ఈ ఇద్దరు కూడా కదంతొక్కాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. గత మ్యాచ్‌లో ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగిన భారత్... ఈసారి ఒక పేసర్‌ను తగ్గించి స్పిన్నర్‌ను తీసుకునే అవకాశం ఉంది. దీంతో ఆకాశ్‌దీప్ స్థానంలో కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్‌లో ఒకరు తుది జట్టులోకి రానున్నారు. కాన్పూర్‌లో చివరిసారిగా 2021లో భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన టెస్టు ఐదు రోజులు సాగి చివరకు ‘డ్రా’గా ముగిసింది. ప్రస్తుతం టీమిండియాకు బ్యాటింగ్‌లో పెద్దగా సమస్యలు లేకపోయినా... ముందు న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో కీలక సిరీస్‌లు ఆడనున్న నేపథ్యంలో ప్లేయర్లంతా ఫామ్ అందుకునేందుకు ఈ మ్యాచ్ ఉపయోగపడనుంది.

బంగ్లాదేశ్ పోటీనిచ్చేనా...

పాకిస్తాన్‌పై టెస్టు సిరీస్ విజయంతో భారత్‌లో అడుగుపెట్టిన బంగ్లాదేశ్ ఇక్కడ మాత్రం అదే జోరు కొనసాగించలేకపోయింది. తొలి మ్యాచ్‌లో సాధారణ ప్రదర్శనతో టీమిండియాకు కనీస పోటీనివ్వలేకపోయింది. ఇక ఈ మ్యాచ్‌లోనైనా నెగ్గి సిరీస్ సమం చేయాలని భావిస్తోంది. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ కూడా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగనుంది. ఇప్పటి వరకు భారత్‌పై ఒక్క టెస్టు మ్యాచ్ కూడా గెలవని బంగ్లాదేశ్ ఆ రికార్డును తిరగరాయాలంటే శక్తికి మించి పోరాడక తప్పదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, పంత్, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, అశ్విన్, కుల్దీప్/అక్షర్, బుమ్రా, సిరాజ్.

బంగ్లాదేశ్: నజ్ముల్ (కెప్టెన్), షాద్‌మన్, జాకీర్, మోమినుల్, ముష్ఫికర్, షకీబ్, లిటన్ దాస్, మెహిది హసన్, తైజుల్, హసన్ మహమూద్, తస్కీన్ అహ్మద్.

పిచ్, వాతావరణం

చెన్నై పిచ్‌తో పోల్చుకుంటే కాన్పూర్ పిచ్ మందకొడిగా ఉండనుంది. నల్లమట్టితో రూపొందించిన పిచ్‌పై బంతి ఆగి వస్తుంది. ఉక్కపోత అధికంగా ఉండనుంది. మ్యాచ్‌కు తొలి రోజు, మూడో రోజు వర్షం ముప్పు పొంచి ఉండగా... వెలుతురు లేమి కారణంగా ఆటకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది.

11 మరొక్క వికెట్ తీస్తే భారత ఆల్‌రౌండర్ జడేజా టెస్టు క్రికెట్‌లో 300 వికెట్లు తీయడంతోపాటు 3000 పరుగులు చేసిన 11వ క్రికెటర్‌గా గుర్తింపు పొందుతాడు. భారత్ నుంచి కపిల్‌దేవ్, అశ్విన్ ఈ ఘనత సాధించారు.

23 కాన్పూర్‌లో భారత జట్టు ఇప్పటి వరకు 23 టెస్టులు ఆడింది. 7 విజయాలు సాధించింది. మూడింటిలో ఓడిపోయింది. మరో 13 మ్యాచ్‌లు ‘డ్రా’గా ముగిశాయి.

129 మరో 129 పరుగులు సాధిస్తే విరాట్ కోహ్లి టెస్టుల్లో 9000 పరుగులు పూర్తి చేసుకుంటాడు. ఈ ఘనత సాధించిన 18వ క్రికెటర్‌గా నిలుస్తాడు.



షకీబ్ అల్ హసన్

మీర్పూర్‌లో కాకపోతే... కాన్పూర్ టెస్టే ఆఖరిది

టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు చెప్పనున్న బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్ షకీబ్ అల్ హసన్

- అంతర్జాతీయ టి20లకు గుడ్‌బై చెప్పిన మాజీ కెప్టెన్
- వచ్చే ఏడాది వన్డేలకూ టాటా

కాన్పూర్: బంగ్లాదేశ్ సీనియర్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ అంతర్జాతీయ టి20 క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అంతా అనుకున్నట్లు జరగకపోతే... కాన్పూర్‌లో నేటి నుంచి భారత జట్టుతో జరిగే రెండో టెస్టే తన కెరీర్‌లో చివరి టెస్టు అవుతుందని 37 ఏళ్ల షకీబ్ పేర్కొన్నాడు. స్వదేశంలో ఢాకా వేదికగా చివరిసారి ఆడి అంతర్జాతీయ టెస్టులకు కూడా గుడ్‌బై చెప్పాలని షకీబ్ అనుకుంటున్నాడు. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చిత పరిస్థితుల సందర్భంగా ఇటీవల షకీబ్‌పై హత్యానేరం కింద కేసు నమోదు అయింది. మరోవైపు వచ్చే నెలలో బంగ్లాదేశ్‌లో దక్షిణాఫ్రికా పర్యటించాల్సి ఉంది. ఈ సిరీస్‌కు గ్రీన్ సిగ్నల్ లభిస్తే దక్షిణాఫ్రికాతో మీర్పూర్‌లో జరిగే టెస్టులో షకీబ్ బరిలోకి దిగుతాడు. ఒకవేళ ఈ సిరీస్ కార్యరూపం దాల్చకపోతే మాత్రం... భారత్‌తో రెండో టెస్టు తర్వాత ఈ ఫార్మాట్ నుంచి వీడ్కోలు తీసుకుంటానని గురువారం జరిగిన మీడియా సమావేశంలో షకీబ్ వివరించాడు. ఈ ఏడాది టి20 ప్రపంచకప్‌లోనే తన చివరి అంతర్జాతీయ టి20 మ్యాచ్ ఆడేసినట్లు షకీబ్ వెల్లడించాడు. ‘ఈ ఏడాది ప్రపంచకప్ సందర్భంగానే నా చివరి టి20 మ్యాచ్ ఆడా. సెలెక్టర్లతో చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నా. జట్టును ముందుకు తీసుకెళ్లే సత్తా యువ ఆటగాళ్లకు ఉంది. కెరీర్‌లో చివరి టెస్టు మీర్పూర్‌లో ఆడాలనుకుంటున్నట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు చెప్పా. దానికి వాళ్లు అంగీకారం తెలిపారు. కానీ పరిస్థితుల కారణంగా అది సాధ్యమవుతుందో లేదో చెప్పలేను. వచ్చే ఏడాది పాకిస్తాన్‌లో జరిగే చాంపియన్స్ ట్రోఫీ తర్వాత వన్డే ఫార్మాట్ నుంచి కూడా తప్పుకుంటా’ అని షకీబ్ తెలిపాడు. బంగ్లాదేశ్ తరఫున ఇప్పటి వరకు 70 టెస్టు మ్యాచ్‌లాడిన షకీబ్ 38.33 సగటుతో 4600 పరుగులు చేయడంతో పాటు 242 వికెట్లు పడగొట్టాడు. ఇక టి20 ఫార్మాట్‌లో 129 మ్యాచ్‌లాడిన షకీబ్... 2551 పరుగులు చేయడంతో పాటు 149 వికెట్లు తీశాడు. అంతర్జాతీయ టి20లకు దూరమైనా ఫ్రాంచైజీ లీగ్ క్రికెట్‌లో కొనసాగుతానని షకీబ్ వెల్లడించాడు. షేక్ హసీనా ప్రభుత్వంలో పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగిన షకీబ్ అల్ హసన్... మైదానంలో దురుసు ప్రవర్తనతో పలుమార్లు జరిమానాలు ఎదుర్కొన్నాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

30 రోజుల్లో డిజిటల్ హెల్త్‌కార్డులు

- రెనోవా కేన్సర్ సెంటర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఆ కార్డులో రోగి పూర్వ చికిత్సలు, వైద్య పరీక్షల సమాచారం
- పేదలకు అతితక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- సమర్థుడైన వ్యక్తి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నారని కితాబు



సీఎం రేవంత్ రెడ్డికి రెనోవా కేన్సర్ సెంటర్‌లో చికిత్సలు ఎలా అందిస్తారో వివరిస్తున్న రెనోవా గ్రూప్ ఆఫ్ ఆసుపత్రుల ఎండీ శ్రీధర్ పెద్దిరెడ్డి. చిత్రంలో మంత్రి దామోదర, షబ్బీర్‌అలీ, వీహెచ్

నల్లకుంట: రాష్ట్రంలోని తమ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మరో 30 రోజుల్లో ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ (ఎఫ్‌డీహెచ్‌పీ) కార్డులను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. నల్లకుంట ఓయూ రోడ్డులోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఆసుపత్రి ఆవరణలో కొత్తగా నిర్మించిన రెనోవా కేన్సర్ సెంటర్‌ను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి సీఎం రేవంత్ గురువారం ప్రారంభించారు. అనంతరం అక్కడి ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ 4 కోట్ల మంది ప్రజల హెల్త్ ప్రొఫైల్‌ను డిజిటైజ్ చేయాల్సి ఉందన్నారు. ఆ హెల్త్ కార్డులో రోగి గత చికిత్సల వివరాలన్నీ ఉంటాయని.. తద్వారా భవిష్యత్తులో ఆ వ్యక్తి ఏదైనా జబ్బు బారినపడితే పూర్వ చికిత్సలు, రోగ నిర్ధారణ పరీక్షలు, మందుల వివరాలను వైద్యులు కేవలం ఒక క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకోవడానికి వీలవుతుందని వివరించారు. పేదలకు అతితక్కువ ఖర్చుతో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అధికారంలోకి రాగానే తమ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద వైద్య ఖర్చును రూ. 10 లక్షలకు పెంచిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. సమర్థుడైన వ్యక్తి ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నారని.. ప్రజలకు సేవ చేసేందుకు గుర్తింపు పొందిన ఎన్జీవోలతో త్వరలో మంత్రి దామోదర సమావేశం ఏర్పాటు చేస్తారన్నారు. పేదలకు వైద్యం అందించడంలో దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఆసుపత్రి మరో అడుగు ముందుకు వేయడం అభినందనీయమని కొనియాడారు. కేన్సర్ వ్యాధికి వైద్య సేవలు అందరికీ అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని.. రెనోవా గ్రూప్ ఆఫ్ ఆసుపత్రులు ప్రజాసేవ చేసేందుకు ముందడుగు వేయడం అభినందనీయమని ప్రశంసించారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సంఘం ప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలని సీఎం కోరారు.

డీడీఎంఎస్ స్పోర్ట్స్ స్కూల్‌కు అనుమతి ఇస్తాం..
దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు అనుమతులు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అలాగే ఓయూ ఆవరణలోని డీడీఎంఎస్ విద్యాసంస్థ స్థలంలో కొంతభాగం రోడ్డు విస్తరణలో పోయిందని ట్రస్ట్ ప్రతినిధులు తన దృష్టికి తెచ్చారని.. ఆ పక్కనే ఓయూ స్థలం ఉంటే డీడీఎంఎస్‌కు ఇవ్వడానికి వీలవుతోందో లేదో అధికారులతో మాట్లాడతానని చెప్పారు. గతంలో కాసు బ్రహ్మానందరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు డీడీఎంఎస్‌కు నాటి ఎంసీహెచ్ ద్వారా ఇచ్చిన పన్ను మినహాయింపులను తిరిగి కొనసాగించే విషయమై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు.

జిల్లాల్లో త్వరలో కేన్సర్ సెంటర్లు: దామోదర
రాష్ట్రంలో కేన్సర్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయని.. కానీ చివరి దశలోనే కేసులు బయటపడుతున్నాయని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. తొలి దశలోనే కేన్సర్ వ్యాధిని నిర్ధారించి చికిత్సలు అందించేందుకు వీలుగా త్వరలో జిల్లా స్థాయిలో దశలవారీగా కేన్సర్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎండీ శ్రీధర్‌రెడ్డి పెద్దిరెడ్డి, డీడీఎంఎస్ చైర్మన్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ టాప్

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

అనలిటికా అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్‌ఎక్స్‌పో, ఫార్మాప్రో ప్యాక్ ఎక్స్‌పో 2024 ప్రారంభం



మాదాపూర్ (హైదరాబాద్): ప్రపంచ ఔషధ ఉత్పత్తిలో భారత్ వాటా 35 శాతంగా ఉందని, రానున్న రోజులలో 50 శాతానికి పెరుగుతుందని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో గురువారం అనలిటికా అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్ ఎక్స్‌పో, ఫార్మాప్రో ప్యాక్ ఎక్స్‌పో–2024ను నిర్వాహకులతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, ఫార్మా ఉత్పత్తుల రంగంలో, ఫార్మా సంబంధిత పరిశోధన, రూపకల్పనలో భారతదేశం ప్రాధాన్యతను కలిగిఉందన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగం అభివృద్ధికోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. ఫార్మస్యూటికల్స్, లైఫ్ సైన్సెస్ రంగాలకు మంచి వనరులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ అగ్రగామిగా ఉందని పేర్కొన్నారు. మన దేశంలోని సంస్థలు ప్రపంచ దేశాలతో పోటీపడేలా, స్వతహాగా సంస్థలు అభివృద్ధి చెందేలా వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో 500లకు పైగా ఎగ్జిబిటర్లు, 7 వేలకు పైగా ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్టు మెస్సె మూంచెస్ ఇండియా సీఈఓ భూపిందర్‌సింగ్ తెలిపారు.

ఆస్పత్రులకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు ప్రభుత్వ వైద్య కళాశాలలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లు, బోధనాస్పత్రులకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల సాధారణ బదిలీల్లో పలు ఆస్పత్రులు, కళాశాలల నుంచి సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఇన్‌చార్జిలను నియమించింది. త్వరలోనే అడిషనల్ డీఎంఈలకు పదోన్నతులిచ్చి, పూర్తిస్థాయి ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లను నియమిస్తామంది. ఉస్మానియా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాకేశ్ కుమార్ సహాయ్‌ను, నిలోఫర్ ఆస్పత్రికి ఎస్.రవికుమార్, ఈఎన్‌టీ ఆస్పత్రికి ఆనంద్, సరోజిని దేవి కంటి దవాఖానకు పి.మోదిని, ఫీవర్ ఆస్పత్రికి రాజేంద్రప్రసాద్, ఎంజీఎం ఆస్పత్రికి మురళిని ఇన్‌చార్జి సూపరింటెండెంట్లుగా నియమించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
శుక్రవారం। 27-9-2024

కొండా లక్ష్మణ్ సేవలు చిరస్మరణీయం

- బాపూజీ సేవల్ని కొనియాడిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: మలి దశ తెలంగాణ ఉద్యమానికి తన ఇంటిని, ఆస్తులను దానం చేసిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి సందర్భంగా వారు నివాళులర్పించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అయిదు దశాబ్దాలుగా అలుపెరుగని కృషి చేసిన మహనీయుడని ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. బహుభాషాకోవిదుడైన బాపూజీ జీవితాంతం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని వివరించారు. తెలంగాణ సమాజం సదా ఆయన సేవలను స్మరించుకునేందుకు వీలుగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం, బడుగు బలహీనవర్గాల చైతన్యం, వారి ఆత్మగౌరవం కోసం బాపూజీ చేసిన కృషి మరువలేనిదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

రాజీలేని యోధుడు 'కొండా'

సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్య సమరయోధునిగా, అనంతర కాలంలో తెలంగాణ స్వయంపాలన, ఆత్మగౌరవం కోసం, పోరాటాలు నడిపిన తొలితరం ఉద్యమ నేతగా కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి అజరామరమని బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు అన్నారు. రాజకీయవేత్తగా తెలంగాణ అస్తిత్వాన్ని చాటేందుకు బాపూజీ నడిపిన రాజీలేని పోరాటాలు.. తెలంగాణ సోయి కలిగిన ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కొనియాడారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని ఆయన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. మంత్రి పదవిని త్యాగం చేసి నాటి తెలంగాణ వ్యతిరేకులకు సవాల్ విసిరిన బాపూజీ పట్టుదల.. తన మలిదశ రాష్ట్ర సాధన పోరాటంలో స్ఫూర్తి నింపిందన్నారు. తెలంగాణ ప్రజల హక్కుల రక్షణ స్వరాష్ట్ర సాధనతోనే సాధ్యమని, తాను రాజీనామా చేసి ఉద్యమాన్ని ప్రారంభించినప్పుడు బాపూజీ అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. స్వయం పాలన కోసం తాను తొలి అడుగు వేసినప్పటి నుంచి జలదృశ్యం ఉద్యమ ప్రస్థానం, స్వరాష్ట్రంగా నిలిపి పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన సాధించిన ప్రగతి ప్రస్థానం ఒక చారిత్రక ఘట్టమని కేసీఆర్ అభివర్ణించారు. బడుగు బలహీన వర్గాల అభున్నతే లక్ష్యంగా జీవిత కాలం పోరాడిన బాపూజీ ఆకాంక్షలకు అనుగుణంగా పదేళ్ల పాలన కొనసాగిందని కేసీఆర్ స్పష్టం చేశారు. బాపూజీ కృషిని భావి తరాలకు నిత్య స్ఫూర్తిగా నిలిపేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. తెలంగాణ సబ్బండ కులాల ఆత్మగౌరవాన్ని కాపాడటం, అన్ని రంగాల్లో వారి హక్కులకు రక్షణ కల్పించడం, వారిని స్వయంపాలనలో భాగస్వాములను చేయడం ద్వారానే కొండా లక్ష్మణ్ బాపూజీకి మనమందించే ఘన నివాళి అని కేసీఆర్ పేర్కొన్నారు.

రైలొస్తేనే బతుక్కి పట్టాభిషేకం

ఆ గ్రామాలు, గిరిజన తండాలన్నీ రైల్వే పట్టాల వెంబడే ఉంటాయి.. అందుకే వారి జీవన ప్రయాణం రైలు పరుగులపై ఆధారపడి ఉంటుంది. విధివంచితులు.. చిన్నతనంలోనే భర్తను కోల్పోయి.. కుటుంబ భారం మీదపడి పిల్లలను పోషించుకునేందుకు కొందరు.. జీవనోపాధి లేక మరికొందరు.. రైళ్లలో పల్లీ, బఠాణీలు, సీజన్ పండ్లు అమ్ముకొని వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. రైలు బండి నడిస్తేనే.. కుటుంబానికి తిండి దొరుకుతుంది.

సాక్షి, మహబూబాబాద్

రైలు పట్టాల వెంబడే గిరిజన తండాలు

- రైళ్లలో పల్లీ, బఠాణీలు, సీజన్ పండ్ల అమ్మకంతోనే ఉపాధి
- మానుకోటలో దశాబ్దాలుగా ఇదే జీవనం
- వీరిలో సగానికిపైగా గిరిజన వితంతువులే..

రైలులోనే ప్రయాణం

మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్, గార్ల, గుండ్రాతి మడుగు, మహబూబాబాద్, తాళ్లపూసపల్లి, కేసముద్రం స్టేషన్ల పరిధిలోని తండాలతోపాటు, అటు విజయవాడ, ఇటు సికింద్రాబాద్, బల్లార్షా వరకు ఉన్న తండాల్లో మహిళలకు వ్యాపారమే ప్రధానాధారం. పండించిన పల్లీలు, తమ గ్రామాలు, తండాల పరిసరాలలో దొరికే సపోటా, ఈతపండ్లు, తాటిముంజలు, జామకాయలు ఇలా సీజన్ల వారీగా సేకరించి వాటిని విక్రయించి కుటుంబాలను పోషించుకునేందుకు గిరిజన మహిళలు రోజూ రైలులో ప్రయాణిస్తారు. ఇలా రోజూ ఉదయం ఆరు గంటలకు ప్రారంభమయ్యే వీరి ప్రయాణం రాత్రి 10 గంటల వరకు ఉంటుంది. ఒక్కోరోజు రాత్రి 12 గంటల వరకు సరుకులు అమ్ముకొని ఇంటికి వస్తారు. కొన్ని సందర్భాల్లో రైల్వేస్టేషన్లలో తలదాచుకొని మర్నాడు ఇంటికి చేరిన సందర్భాలు ఉన్నాయి. ఇలా రోజూ 200 మంది వరకు ఈ వ్యాపారం చేస్తున్నారు. రోజుకు రూ.300 నుంచి రూ.1,000 వరకు సంపాదిస్తున్నారు.

గుర్తింపు కార్డులివ్వాలి..



నా భర్త 14 ఏళ్ల క్రితం చనిపోయాడు. అప్పటినుంచి పల్లీలు అమ్ముకుంటూ నాకున్న ముగ్గురు బిడ్డలు, ముగ్గురు కుమారులను కష్టపడి సాదుకుంటూ వచ్చా. పొట్టకూటి కోసం పల్లీలు అమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నా. రైలు బండి నడిస్తేనే తిండి దొరుకుతుంది. పెద్దసార్లు దయ ఉంచి గుర్తింపు కార్డులు ఇస్తే భయం లేకుండా వ్యాపారం చేసుకుంటాం.

– బానోతు హచ్చి, బడితండా, కేసముద్రం మండలం



పల్లీలు అమ్మేందుకు కేసముద్రం రైల్వేస్టేషన్‌కు వచ్చిన మహిళలు

బొగ్గు బండి ఉన్నప్పటి నుంచి..



నలభయ్యేళ్లుగా రైలులో పల్లీలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ వచ్చా. బొగ్గు బండి ఉన్నప్పటి నుంచి పల్లీలు అమ్మడం మొదలుపెట్టా. పల్లి గ్లాసు.. పైస నుంచి అమ్మిన. రైలులో ఎన్నో మార్లు ఆర్పీఎఫ్ అధికారులు పట్టుకున్నారు. కోర్టులో జరిమానా కట్టి వచ్చేవాళ్లం. ఆర్పీఎఫ్ అధికారులు పట్టుకున్న ప్రతిసారీ తిరిగి ఇంటికి వచ్చే సరికి అర్ధరాత్రి అయ్యేది. పొట్టకూటికోసం పల్లీలు అమ్ముకుంటూ ఇబ్బందులు పడుతూ వచ్చాం. నాకు ముగ్గురు బిడ్డలు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. పల్లీలు అమ్మి అందరి పెళ్లిళ్లు చేసిన. మగ పిల్లలను చదివించిన.

– బానోతు చాంది, బడితండా, కేసముద్రం

వితంతువులే అధికం

మహబూబాబాద్ జిల్లాలో ఏ తండాను కదిలించినా కన్నీళ్లే ఉబుకుతాయి. గుడుంబాకు బానిసలు కావడం, తండాలను కబళించే వింత వ్యాధులతో పాతికేళ్లు నిండక ముందే మృత్యువాత పడిన మగవారు ఎక్కువగా ఉన్నారు. అప్పటికే వివాహాలు చేసుకొని ఇద్దరు, ముగ్గురు పిల్లలతో 20 ఏళ్లు కూడా నిండని భార్యపై పిల్లలు, వృద్ధ అత్తామామల భారం పడుతుంది. ఈ సంసార సాగరాన్ని దాటేందుకు రైళ్లలో వ్యాపారం చేసుకోవడం సాధారణమవుతోంది. ఇలా పల్లీలు, బఠాణీలు, పండ్లు అమ్ముకొని పిల్లలను పెద్ద చదువులు చదివించి ప్రభుత్వ కొలువుల్లో చేర్పించిన వారు కొందరైతే.. ఆడపిల్లల పెళ్లిళ్లు చేసి భారం తీర్చుకున్నవారు మరికొందరు ఉన్నారు.

అవమానాలు.. ఆప్యాయతలు

నిత్యం రైలులో ప్రయాణం చేసుకుంటూ సరుకులు అమ్మే మహిళలకు అవమానాలు.. అప్యాయతలు ఎదురవుతుంటాయి. టికెట్ లేదని కేసులు పెట్టి జైలుకు పంపిన రైల్వే అధికారులు ఉన్నారు. మహిళలు కావడంతో ఆకతాయిలు ఇబ్బంది పెట్టడం, సూటిపోటి మాటలు, లైంగిక వేధింపులు కూడా చవిచూడాల్సి వస్తుందని గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం రోజూ ప్రయాణం చేసే వారి ఆప్యాయత కూడా ఉంటుందంటున్నారు. దశాబ్దాలుగా రైలునే నమ్ముకొని జీవించే తమకు గుర్తింపు కార్డులు ఇచ్చి స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి మరువలేనిది: మంత్రి పొన్నం



సాక్షి,హైదరాబాద్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం, బడుగు బలహీనవర్గాల చైతన్యం, వారి ఆత్మగౌరవం కోసం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి మరువలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి సందర్భంగా..ఆయన త్యాగాలు, సేవలు స్మరిస్తూ గురువారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

రాష్ట్ర వేడుకగా వెంకటస్వామి జయంతి, వర్ధంతి



సాక్షి, హైదరాబాద్: కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతిని అక్టోబర్ 5వ తేదీన రాష్ట్ర వేడుకగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిసెంబర్ 22న ఆయన వర్ధంతిని కూడా రాష్ట్ర వేడుకగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. ఏటా అక్టోబర్ 5వ తేదీన ఆయన జయంతి ఉత్సవాలు, డిసెంబర్ 22వ తేదీన వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలుగా నిర్వహించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఈమేరకు చర్యలు తీసుకోవాలని యువజన సర్వీసుల శాఖకు సూచించారు.

ఐలమ్మకు మండలి చైర్మన్, స్పీకర్ నివాళులు



చాకలి ఐలమ్మకు నివాళులు అర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, గడ్డం ప్రసాద్, కోదండరాం

సాక్షి, హైదరాబాద్: చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని గురువారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అసెంబ్లీ ప్రాంగణంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ 'నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వీరవనిత చాకలి ఐలమ్మ'అని అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమన్నారు. ఆ వీరమహిళ త్యాగాన్ని గుర్తించి కోఠిలోని మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం గొప్ప విషయమన్నారు. ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీలు కోదండరాం, బస్వరాజు సారయ్య, దయానంద్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు పాల్గొన్నారు.

ఐలమ్మ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

సాక్షి, హైదరాబాద్: భావితరాలకు తెలిసేలా వీరనారి చాకలి ఐలమ్మ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం గర్వించదగిన విషయమేనని, కానీ ఎంఐఎం రాజకీయ ఒత్తిళ్లకు లొంగి తెలంగాణ ఉద్యమాన్ని, విమోచన దినోత్సవాన్ని విస్మరించడం తెలంగాణ విద్రోహ చర్యగా భావిస్తున్నామన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఐలమ్మ 129వ జయంతి ఉత్సవాల్లో ఆమె చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ ప్రసంగించారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ తివారీ (సంస్థాగత), డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో ఐలమ్మకి నివాళి

సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్‌లో చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలను పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. గాంధీభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. టీపీసీసీ కో–ఆర్డినేటర్ మిద్దె శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ టి.కుమార్ రావు, కాంగ్రెస్ సీనియర్ నేత బొల్లు కిషన్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్వరాజు సారయ్య, వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కోఠి మహిళా కళాశాలకు ఐలమ్మ పేరు పెట్టడం హర్షణీయమన్నారు.

నేడు గాంధీభవన్‌కు మంత్రి ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: గాంధీ భవన్‌లో నిర్వహిస్తున్న ప్రజా పాలనలో భాగంగా.. మంత్రులతో ముఖాముఖి కార్యక్రమానికి శుక్రవారం నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరవుతారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గాంధీభవన్‌లో అందుబాటులో ఉంటారు. ప్రతి బుధ, శుక్రవారాల్లో మంత్రులు గాంధీభవన్‌లో అందుబాటులో ఉండాలని పార్టీ నిర్ణయించడం తెలిసిందే. ఇందులో భాగంగా తొలిరోజు బుధవారం మంత్రి దామోదర రాజనర్సింహ గాంధీభవన్‌లో ప్రజలకు అందుబాటులో ఉన్నారు.



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం తన నివాసంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తే ఐదేళ్ల జైలు

- డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: నివాస ప్రాంతాల్లో, వ్యాపార సముదాయాల్లో, పారిశ్రామిక వాడల్లో ఎక్కడైనా అనుమతులు లేకుండా మందులు తయారు చేస్తున్నట్టు గుర్తిస్తే డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులకు ఫిర్యాదు చేయాలని డీసీఏ డీజీ వీబీ కమలాసన్ రెడ్డి సూచించారు. అన్ని ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ టోల్ ఫ్రీ నంబర్ 1800–599–6969లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సరైన డ్రగ్ లైసెన్స్‌లు లేకుండా మందుల తయారీ, విక్రయం సైతం నేరమని.. ఇందుకు డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ కింద ఐదేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో నకిలీ క్లినిక్ గుర్తింపు

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం, వెల్గొండ గ్రామంలో నకిలీ క్లినిక్ నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు డీసీఏ అధికారులు సోదాలు నిర్వహించినట్టు కమలాసన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన వి.రవికుమార్ ఎలాంటి అర్హత లేకుండానే ఈ క్లినిక్‌ను నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. క్లినిక్‌లో సోదాల్లో భాగంగా రూ.10 వేల విలువైన 20 రకాల మందులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

'స్థానికత'పై వర్సిటీ తీరు సరికాదు

వైద్య విద్యా సీట్ల భర్తీలో కాళోజీ వర్సిటీపై హైకోర్టు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: వైద్య విద్యా అడ్మిషన్లకు సంబంధించి కాళోజీ నారాయణరావు హెల్త్ వర్సిటీ 'స్థానికత'పై వ్యవహరిస్తున్న తీరును హైకోర్టు తప్పుబట్టింది. నేరుగా ప్రభుత్వం సిఫార్సు చేసిన సైనిక పాఠశాల విద్యార్థిని స్థానిక అభ్యర్థిగా పరిగణించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై వెంటనే జోక్యం చేసుకుని విద్యార్థిని స్థానికుడిగా పరిగణించే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ప్రభుత్వ సిఫార్సు మేరకు రంగారెడ్డి జిల్లా వనస్థలిపురానికి చెందిన చేపూరి అవినాశ్ డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ స్కూల్‌లో 8 నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసించారు. రాష్ట్ర కోటా నుంచి అతను ఎంపికయ్యారు. ఆ తర్వాత ఇంటర్మీడియట్ తెలంగాణలో పూర్తి చేశారు. ఎంబీబీఎస్ అడ్మిషన్ల సమయంలో అతను తెలంగాణలో 9, 10 చదవలేదని పేర్కొంటూ స్థానిక అభ్యర్థిగా పరిగణించడానికి విశ్వవిద్యాలయం నిరాకరించింది. దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో అవినాశ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపున ఎ.వెంకటేశ్, ప్రభుత్వం తరపున ఏజీపీ స్వప్న, కాళోజీ వర్సి టీ తరఫున ఎ.ప్రభాకర్‌రావు హాజరయ్యారు. రెండు రోజుల క్రితం విచారణ సందర్భంగా పిటిషనర్ స్థానిక అభ్యర్థే కదా అని ధర్మాసనం అభిప్రాయపడింది. సమస్యను పరిష్కరించాలని వర్సిటీకి సూ చించింది. అయితే గురువారం విచారణ సందర్భంగా స్థానికుడిగా పరిగణించలేమని వర్సిటీ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. వర్సిటీ తీరుపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసిన అభ్యర్థి నాన్ లోకల్ ఎలా అవుతారో సర్కార్‌ను అడిగి చెప్పాలని ఏఏజీని ఆదేశించింది. తదుపరి విచారణ నేటికి వాయిదా వేసింది.

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల నియామకం

రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా సీఎం రమేష్

- గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా మాగుంట
- వివిధ స్టాండింగ్ కమిటీల్లో తెలుగు రాష్ట్రాల ఎంపీలకు చోటు

సాక్షి, న్యూఢిల్లీ: 17వ లోక్‌సభ ఏర్పడిన దాదాపు నాలుగు నెలల తర్వాత కేంద్ర ప్రభుత్వం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలను ప్రకటించింది. రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా సీఎం రమేష్, గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా మాగుంట శ్రీనివాసులురెడ్డికి కేంద్రం అవకాశం ఇచ్చింది. వైఎస్సార్‌సీపీ ఎంపీలు పరిమళ్ నత్వానికి (సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పు), వి.విజయసాయిరెడ్డికి (ట్రాన్స్‌పోర్ట్, టూరిజం, కల్చర్), వై.ఎస్.అవినాష్ రెడ్డికి (విదేశీ వ్యవహారాలు), వైవీ సుబ్బారెడ్డికి (ఆర్థికం), పీవీ మిథున్‌రెడ్డికి (ఆర్థికం), ఎస్.నిరంజన్‌రెడ్డికి (కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), ఆళ్ల అయోధ్యరామిరెడ్డికి (గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలు), డా.గుమ్మ తనూజ రాణికి (గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలు) స్టాండింగ్ కమిటీల్లో చోటు కల్పించారు. బీజేపీ ఎంపీలు డీకే అరుణ, డా.కె.లక్ష్మణ్‌ను విదేశీ వ్యవహారాల స్టాండింగ్ కమిటీలో సభ్యులుగా నియమించారు.

స్టాండింగ్ కమిటీల్లో తెలంగాణ, ఏపీకి చెందిన ఎంపీలు

1) రేణుకా చౌదరి (వాణిజ్యం) సభ్యురాలు
2) పురందేశ్వరి – (విద్య, మహిళలు, శిశు, యువత, క్రీడ) సభ్యురాలు
3) బి. పార్థసారథిరెడ్డి (వైద్యం, కుటుంబ సంక్షేమం) సభ్యుడు
4) కడియం కావ్య (వైద్యం, కుటుంబ సంక్షేమం) సభ్యురాలు
5) డా. బైరెడ్డి శబరి (వైద్యం, కుటుంబ సంక్షేమం) సభ్యురాలు
6) కేశినేని శివనాథ్ (హోం) సభ్యుడు
7) అభిషేక్ మను సింఘ్వీ (ఇండస్ట్రీ) సభ్యుడు
8) అర్వింద్ ధర్మపురి (ఇండస్ట్రీ) సభ్యుడు
9) మల్లు రవి (ఇండస్ట్రీ) సభ్యుడు
10) కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (ఇండస్ట్రీ) సభ్యుడు
11) కె. ఆర్. సురేష్‌రెడ్డి (పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, లా అండ్ జస్టిస్) సభ్యుడు
12) ఎం. రఘునందన్ రావు (పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, లా అండ్ జస్టిస్) సభ్యుడు
13) దామోదర్‌రావు దివికొండ (సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, అడవులు, వాతావరణం మార్పు) సభ్యుడు
14) గడ్డం వంశీకృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, అడవులు, వాతావరణం మార్పు) సభ్యుడు
15) పరిమళ్ నత్వాని (సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, అడవులు, వాతావరణం మార్పు) సభ్యుడు
16) వి.విజయసాయిరెడ్డి (ట్రాన్స్‌పోర్ట్, టూరిజం, కల్చర్) సభ్యుడు
17) సురేష్ కుమార్ షెట్కర్ (ట్రాన్స్‌పోర్ట్, టూరిజం, కల్చర్) సభ్యుడు
18) మేడ రఘునాథ్‌రెడ్డి (రసాయనాలు, ఎరువులు) సభ్యుడు
19) పోరిక బలరాం నాయక్ (రసాయనాలు, ఎరువులు) సభ్యుడు
20) ఈటల రాజేందర్ (రసాయనాలు, ఎరువులు) సభ్యుడు
21) దగ్గుమల్ల ప్రసాద్‌రావ్ (రసాయనాలు, ఎరువులు) సభ్యుడు
22) అనిల్ కుమార్ యాదవ్ (బొగ్గు, గనులు, స్టీల్) సభ్యుడు
23) బి.కె.పార్థసారథి (బొగ్గు, గనులు, స్టీల్) సభ్యుడు
24) వి.విజయేంద్ర ప్రసాద్ (కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) సభ్యుడు
25) ఎస్.నిరంజన్‌రెడ్డి (కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) సభ్యుడు
26) అప్పలనాయుడు కలిశెట్టి (కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) సభ్యుడు
27) రామసహాయం రఘురాంరెడ్డి (కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) సభ్యుడు
28) బస్తిపాటి నాగరాజు (వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ) సభ్యుడు
29) కేశినేని శివనాథ్ (రక్షణ) సభ్యుడు
30) కుందూరు రఘువీర్ (ఎనర్జీ) సభ్యుడు
31) డా.కె.లక్ష్మణ్ (విదేశీ వ్యవహారాలు) సభ్యుడు (రైల్వే) సభ్యుడు
32) డీకే అరుణ (విదేశీ వ్యవహారాలు) సభ్యుడు
33) అసదుద్దీన్ ఓవైసీ (విదేశీ వ్యవహారాలు) సభ్యుడు
34) వై.ఎస్.అవినాష్‌రెడ్డి (విదేశీ వ్యవహారాలు) సభ్యుడు
35) వైవీ సుబ్బారెడ్డి (ఆర్థికం) సభ్యుడు
36) పీవీ మిథున్‌రెడ్డి (ఆర్థికం) సభ్యుడు
37) లావు శ్రీకృష్ణదేవరాయలు (ఆర్థికం) సభ్యుడు
38) సీఎం రమేష్ (రైల్వే) చైర్మన్, (ఆర్థికం) సభ్యుడు
39) వల్లభనేని బాలశౌరి (ఆర్థికం) సభ్యుడు, (పెట్రోలియం, న్యాచురల్ గ్యాస్) సభ్యుడు
40) వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (ఆర్థికం) సభ్యుడు
41) ఆళ్ల అయోధ్యరామిరెడ్డి (గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలు) సభ్యుడు
42) డా.గుమ్మ తనూజరాణి (గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలు) సభ్యుడు
43) చామల కిరణ్ కుమార్ రెడ్డి (గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలు) సభ్యుడు
44) మాగుంట శ్రీనివాసులు రెడ్డి (గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలు) చైర్మన్
45) జీఎం హరీష్ బాలయోగి (కార్మిక, జౌళి, స్కిల్ డెవలప్‌మెంట్) సభ్యుడు
46) జి.లక్ష్మీనారాయణ (కార్మిక, జౌళి, స్కిల్ డెవలప్‌మెంట్) సభ్యుడు
47) వద్దిరాజు రవిచంద్ర (పెట్రోలియం, న్యాచురల్ గ్యాస్) సభ్యుడు
48) మద్దిళ్ల గురుమూర్తి (పెట్రోలియం, న్యాచురల్ గ్యాస్) సభ్యుడు
49) పుట్టా మహేష్ కుమార్ (పెట్రోలియం, న్యాచురల్ గ్యాస్) సభ్యుడు

క్లుప్తంగా...

ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో మాలి దేశ బృందం

రామచంద్రాపురం: తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, రామచంద్రాపురం మండలం లోని సి.కాళేపల్లి, టీవీ సపార్లు గ్రామాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను మాలి దేశ బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా సూర్య మండలం పద్ధతి, జీవామృతం, బీజామృతం గురించి ఆ బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే సి.రామాపురంలోని రామాలయం వద్ద మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. కంద, చామగడ్డ పొలాలను సందర్శించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముగం మాట్లాడుతూ సి.రామాపురంలోని 30 మహిళా సంఘాల్లో 298 మంది సభ్యులు ఉన్నారని, ఇందులో 90 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం ఆచరిస్తున్నారని తెలిపారు.

రేపు దేవాలయాల్లో పూజలు నిర్వహించాలి

వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ రాజ్



భవానీపురం(విజయవాడ పశ్చిమ): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని దేవాలయాల్లో పూజలు నిర్వహించాలన్న మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఈ నెల 28న పార్టీకి చెందిన దివ్యాంగులంతా అందుబాటులో ఉన్న ఆలయాల్లో పూజలు నిర్వహించాలని పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు బందెల కిరణ్ రాజ్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేవలం నీచ రాజకీయ ప్రయోజనాల కోసమే సీఎం చంద్రబాబు తిరుమల పవిత్రత, స్వామివారి లడ్డూ ప్రసాదం విశిష్టత, టీటీడీ పేరు ప్రఖ్యాతులకు అపకీర్తి తీసుకువచ్చారని పేర్కొన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో ఉపయోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని అసత్య ప్రచారం చేస్తూ కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారని అన్నారు. సనాతన ధర్మం గురించి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు నాటి మనువాదం గుర్తుకు వస్తుందని పేర్కొన్నారు. ప్రజల్లో కుల, మతాలను రెచ్చగొట్టే విధంగా ఉన్న పవన్ కల్యాణ్ ప్రవచనాలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు.

టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో పదిమంది విచారణ

మంగళగిరి: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ఇప్పటివరకు మాజీమంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, దేవినేని అవినాష్, గవాస్కర్‌లను విచారించిన అధికారులు గురువారం జోగి రమేష్ అనుచరులు 10 మందిని కూడా విచారించారు. ఈ సందర్భంగా సాంకేతిక అంశాలు, నగదు లావాదేవీలపై అధికారులు లోతుగా విచారించినట్లు తెలిసింది. విచారణకు హాజరైన వారిలో జోగి రమేష్ సోదరుడు జోగి రామ్, చెరుకు మాధవరావు, బొర్రా రాంబుజ్జి, షేక్ ముబారక్ బాషా, మహ్మద్ షఫీ, నల్లమోతు రవితేజ, మునిగోటి నారాయణ, ఆరేపల్లి రామారావు, అవుటుపల్లి ధీరజ్ సింహా, మేడపాటి వెంకటనాగిరెడ్డి ఉన్నారు.

ఏపీసీసీ నూతన కార్యవర్గ సమావేశం

పాల్గొన్న ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో కొత్తగా నియమితులైన సభ్యుల తొలి సమావేశం గురువారం జరిగింది. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్, ఏపీసీసీ చీఫ్ షర్మిల, ఏఐసీసీ సెక్రటరీ పాలక్ వర్మ, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డితో పాటు సీనియర్ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాల అజెండాను రూపొందించారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమేనని సింగిల్ అజెండా అని నేతలు ప్రకటించారు. తెలంగాణలో ప్రస్తుతం తన అవసరం లేదని, అందుకే రాజ్యసభ పదవిని తీసుకోలేదని షర్మిల తెలిపారు. జగన్ మీద వ్యతిరేకత వల్లే కూటమికి ఓట్లు పడ్డాయిగానీ చంద్రబాబు మీద ఇష్టంతో కాదని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రానికి బీజేపీ చేస్తున్న అన్యాయంపై గాంధీ జయంతి రోజు నిరసన తెలియజేయనున్నట్లు ఆమె వెల్లడించారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపండి

కేంద్ర మంత్రికి అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం వినతి

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవిందరావు కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని డిమాండ్ చేశారు. నెలల తరబడి విశాఖలో ఎంతో మంది ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు, ధర్నాలు చేస్తున్నా..కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కేంద్రం ఈ విషయంలో వెనక్కు తగ్గకపోతే మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కుమారస్వామితో గోవిందరావు భేటీ అయ్యారు. విశాఖ ఉక్కుకు సంబంధించిన అంశంపై చర్చించి, ప్రైవేటీకరణను ఆపాలని వినతిపత్రం అందజేశారు. ఈ అంశంతో పాటు స్థానిక పరిశ్రమల్లో 371డి ప్రకారం స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

దోపిడీకి అడ్డొస్తుందనే.. జ్యుడిషియల్ ప్రివ్యూ రద్దు!



ప్రజాధనం దోపిడీకి కూటమి పెద్దల కుతంత్రం

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-2019 చట్టం రద్దుకు తీర్మానం

- పాత విధానంలోనే టెండర్లకు సన్నాహాలు
- తద్వారా అంచనాలు అడ్డగోలుగా పెంచుకోవచ్చు
- నచ్చిన వారికి కాంట్రాక్టులిచ్చి కమీషన్లు దండుకోవచ్చు
- జగన్ ప్రవేశపెట్టిన జ్యుడిషియల్ ప్రివ్యూ వ్యవస్థలో ఈ కుతంత్రాలు కుదరవు
- అడ్డగోలు అంచనాలను, నిబంధనలను ప్రజలు ఎత్తిచూపే అవకాశం
- ప్రజల సూచనలతో నోటిఫికేషన్‌లో మార్పులకు జడ్జి సిఫార్సులు
- వాటి ప్రకారం మళ్లీ టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాల్సిందే
- ఇలా గత ఐదేళ్లలో వేల కోట్ల ప్రజాధనం ఆదా చేసిన జగన్ సర్కారు
- జ్యుడిషియల్ ప్రివ్యూ అన్ని రాష్ట్రాలకు ఆదర్శమన్న నీతి ఆయోగ్

సాక్షి, అమరావతి: దోచుకో.. పంచుకో.. తినుకో (డీపీటీ) పద్ధతిలో 2014–19 మధ్య ఖజానాను దోచేసిన కూటమి ప్రభుత్వ పెద్దలు.. ఇప్పుడు దోపిడీకి అడ్డొస్తున్న జ్యుడిషియల్ ప్రివ్యూ వ్యవస్థను రద్దు చేసి, పాత విధానాన్ని ప్రవేశపెట్టడానికి ఉపక్రమించారు. ప్రజా ధనం దోపిడీకి కుటంత్రం పన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (జ్యుడిషియల్ ప్రివ్యూ ద్వారా పారదర్శకత) చట్టం–2019ను రద్దు చేస్తూ తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఆ చట్టాన్ని రద్దు చేసిన తర్వాత రూ.వంద కోట్లు, అంతకంటే ఎక్కువ వ్యయం ఉన్న పనులకు టెండర్ నోటిఫికేషన్ జారీ చేస్తారు. జ్యుడిషియల్ ప్రివ్యూ వ్యవస్థ ఉంటే టెండర్ నోటిఫికేషన్ జారీకి ముందే అడ్డగోలుగా అంచనాలు పెంచినా, కోరుకున్న కాంట్రాక్టర్‌కే పనులు దక్కేలా నిబంధనలు పెట్టినా ప్రజలు ఎత్తిచూపే అవకాశం ఉంటుందన్నది ప్రభుత్వ పెద్దల భయం. వివిధ వర్గాల ప్రజలు, మేధావులు, ఇంజినీర్ల నుంచి వచ్చిన ఫిర్యాదులు, సూచనల ఆధారంగా జ్యుడిషియల్ ప్రివ్యూ జడ్జి టెండర్ షెడ్యూలులో మార్పులు సూచిస్తే ఆ మేరకు మార్చి టెండర్ నోటిఫికేషన్ మళ్లీ జారీ చేయాలి. అప్పుడు కమీషన్లు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్న కాంట్రాక్టర్‌కు పనులు దక్కవన్నది ప్రభుత్వ పెద్దల భయం. అందుకే తమ అడ్డగోలు దోపిడీకి అడ్డుగా ఉండే జ్యుడిషియల్ ప్రివ్యూను లేకుండా చేసేందుకు సిద్ధమయ్యారని అధికారవర్గాలు చెబుతున్నాయి.

అంచనాల్లో వంచనకు, దోపిడీకి అవకాశం ఉండదనే..

రాష్ట్ర విభజన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు.. కోట్ల రూపాయలు వెదజల్లి కేవలం 5 లక్షల ఓట్ల తేడాతో అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చేందుకు పెట్టిన పెట్టుబడికి వంద రెట్లు ప్రభుత్వ ఖజానా నుంచి కొల్లగొట్టేందుకు టెండర్ విధానాన్ని ఓ అస్త్రంగా మల్చుకున్నారు. పనుల ప్రతిపాదన దశలోనే అధికారులపై ఒత్తిడి తెచ్చి.. అంచనా వ్యయాన్ని పెంచేయించడం, అధికంగా కమీషన్లు ఇచ్చే కాంట్రాక్టర్‌కు పనులు దక్కేలా నిబంధనలు పెట్టి టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడం, అధిక ధరలకు పనులను కట్టబెట్టి.. ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసి కాంట్రాక్టర్లకు దోచిపెట్టడం.. ఆ కాంట్రాక్టర్లకు ప్రభుత్వ ఖజానా నుంచి మొబిలైజేషన్ అడ్వాన్సుగా అప్పగించిన మొత్తాన్నే కమీషన్‌గా జేబులో వేసుకోవడం నిత్య కృత్యంగా చంద్రబాబు మార్చుకున్నారు.

ఆనాటి దోపిడీకి సాక్ష్యాలు ఇవిగో..

- **గాలేరు–నగరి సుజల స్రవంతి** పథకం తొలి దశలో 27వ ప్యాకేజీలో 2014 నాటికి రూ.11 కోట్ల విలువైన పని మాత్రమే మిగిలింది. ఆ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై 60–సి నిబంధన కింద వేటు వేసి.. అంచనా వ్యయాన్ని రూ.112.83 కోట్లకు పెంచేసి.. దొడ్డిదారిన సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్‌కు అప్పగించారు.
- హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకం రెండో దశలో 2–బీ ప్యాకేజీలో 2014 నాటికి రూ.99 లక్షల విలువైన పనులు మాత్రమే మిగిలాయి. ఆ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై 60–సి నిబంధన కింద వేటు వేసి, వాటి వ్యయాన్ని రూ.115.08 కోట్లకు పెంచేసి.. సీఎం రమేష్‌కు అప్పగించారు. అంటే పెంచిన మొత్తం రూ.114.09 కోట్లు సీఎం రమేష్‌కు చెల్లించినట్లు స్పష్టమవుతోంది.
- హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకం రెండో దశలో 3–బీ ప్యాకేజీలో 2014 నాటికి కేవలం రూ.8.69 కోట్ల విలువైన పని మాత్రమే మిగింది. ఆ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పైనా 60–సి నిబంధన కింద వేటు వేసిన చంద్రబాబు.. ఆ పనుల అంచనా వ్యయాన్ని రూ.149.14 కోట్లకు పెంచేశారు. అంటే పెంచిన రూ.140.45 కోట్లు సీఎం రమేష్‌కు చెల్లించారు.
- హంద్రీ–నీవా రెండో దశలో 2014 నాటికి 4–బి ప్యాకేజీలో రూ.1.34 కోట్లు, 5–బి ప్యాకేజీలో రూ.11.87 కోట్ల విలువైన పనులు మాత్రమే మిగిలాయి. ఆ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లపై 60–సి నిబంధన కింద వేటు వేసిన చంద్రబాబు.. 4–బి ప్యాకేజీ పనుల అంచనా వ్యయాన్ని రూ.73.26 కోట్లకు, 5–బి ప్యాకేజీ పనుల అంచనా వ్యయాన్ని రూ.97.40 కోట్లకు పెంచేసి, వాటిని తన సన్నిహితుడైన ఆర్. మహేశ్వరనాయుడు, ఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పగించారు. ఆ మేరకు బిల్లులు చెల్లించి కమీషన్లు వసూలు చేసుకున్నారు.
- వెలిగొండ ప్రాజెక్టు రెండో టన్నెల్‌లో 2014 నాటికి రూ.299.48 కోట్ల విలువైన పనులే మిగిలాయి. ఆ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పైనా 60–సి నిబంధన కింద వేటు వేసిన చంద్రబాబు.. జీవో 22, జీవో 63లను వర్తింపజేసి.. అంచనా వ్యయాన్ని రూ.597.11 కోట్లకు పెంచేశారు. ఆ పనులను సీఎం రమేష్‌కు కట్టబెట్టి కమీషన్లు వసూలు చేసుకున్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ఈ పనులను రద్దు చేసి రివర్స్ టెండరింగ్ నిర్వహించి.. సీఎం రమేష్ సంస్థకంటే రూ.61.76 కోట్లకు తక్కువ ధరకు మరో కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. ఆ టన్నెల్ పనిని పూర్తి చేయించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను తనిఖీ చేసిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) జీవో 22, జీవో 63లను వర్తింపజేయడం ద్వారా కాంట్రాక్టర్లకు రూ.630.57 కోట్లను దోచిపెట్టినట్లు తేల్చడం టీడీపీ ప్రభుత్వ అవినీతికి తార్కాణం.
- వంశధార స్టేజ్–2 ఫేజ్–2, తోటపల్లి, మడ్డువలస, గుండ్లకమ్మ నుంచి హంద్రీ–నీవా, మిడ్ పెన్నార్ ఆధునికీకరణ పనుల్లోనూ చంద్రబాబుది ఇదే తీరు.
- 2019 ఎన్నికలకు నాలుగు నెలల ముందు ప్రకాశం బ్యారేజ్‌కు 21 కిలోమీటర్ల ఎగువన కృష్ణా నదిపై వైకుంఠపురం వద్ద బ్యారేజి నిర్మాణానికి 2018లో తొలుత రూ.801.88 కోట్లతో చంద్రబాబు సర్కారు నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తర్వాత దాన్ని రద్దు చేసి అంచనా వ్యయాన్ని రూ.1,376 కోట్లకు పెంచేసి టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. అంటే.. అంచనాల్లోనే రూ.574.12 కోట్లు పెంచేశారు. ఈ పనులను రామోజీరావు కుమారుడి వియ్యంకుడికి చెందిన నవయుగకు దక్కేలా టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ పనులను నిబంధనలకు విరుద్ధంగా 13.19 శాతం అధిక ధరకు రూ.1,554.88 కోట్లకు నవయుగకు అప్పగించారు. అంటే.. అంచనాలు పెంచడం ద్వారా, అధిక ధరకు పనులు అప్పగించడం ద్వారా నవయుగకు ప్రభుత్వ ఖజానా నుంచి ఉత్తినే రూ.753 కోట్లు దోచిపెట్టడానికి రంగం సిద్ధం చేసినట్లు స్పష్టమవుతోంది. ఈ పనులను 2019లో ప్రభుత్వం రద్దు చేసింది.
- మళ్లీ ఇప్పుడూ అదే రీతిలో ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టేందుకు సిద్ధమైన ప్రభుత్వం.. అక్రమాలకు అడ్డొస్తుందనే నెపంతోనే జ్యుడిషియల్ ప్రివ్యూను రద్దు చేయాలని నిర్ణయించారు.

ఆదర్శవంతమైన జ్యుడిషియల్ ప్రివ్యూ

రాష్ట్రంలో 2014–19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం నీరుగార్చిన టెండర్ల వ్యవస్థకు జవసత్వాలు చేకూర్చుతూ 2019 ఆగస్టు 20న ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యాక్ట్ (జ్యుడిషియల్ ప్రివ్యూ ద్వారా పారదర్శకత) – 2019 చట్టాన్ని నాటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తిని జ్యుడిషియల్ ప్రివ్యూ జడ్జిగా నియమించింది. ఈ చట్టం ప్రకారం.. రూ.వంద కోట్లు అంతకంటే ఎక్కువ వ్యయం ఉన్న పనుల టెండర్ ముసాయిదా షెడ్యూల్‌ను ముందుగా జ్యుడిషియల్ ప్రివ్యూ జడ్జి పరిశీలనకు పంపుతారు. ఆ ముసాయిదాపై జ్యుడిషియల్ ప్రివ్యూ జడ్జి ఆన్‌లైన్‌లో అన్ని వర్గాల ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తారు. వాటిని పరిగణనలోకి తీసుకుని జడ్జి మార్పులు సూచిస్తారు. ఎలాంటి మార్పులు అవసరం లేదని భావిస్తే.. దానిని యధాతథంగా ఆమోదిస్తారు. ఇలా జ్యుడిషియల్ ప్రివ్యూ జడ్జి ఆమోదించిన టెండర్ ముసాయిదా షెడ్యూల్‌తోనే రివర్స్ టెండరింగ్ విధానంలో టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాలి. ఈ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ. వంద కోట్లు, అంతకంటే ఎక్కువ వ్యయం ఉన్న పనులన్నింటినీ ఇదే విధానంలో నిర్వహించారు. ఈ విధానంలో టెండర్ల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించడం వల్లే కాంట్రాక్టర్లు భారీ సంఖ్యలో పోటీ పడి.. కాంట్రాక్టు విలువకంటే తక్కువకే పనులు చేయడానికి ముందుకొచ్చారు. దీని వల్ల రూ.7,500 కోట్లకు పైగా ప్రభుత్వానికి ఆదా అయ్యింది. జ్యుడిషియల్ ప్రివ్యూ వ్యవస్థను నీతి ఆయోగ్ కూడా ప్రశంసించింది. ఈ విధానాన్ని అమలు చేయడాన్ని పరిశీలించాలని అన్ని రాష్ట్రాలకు సూచించింది.

ప్రపంచానికి పెను సవాలుగా మానవ అక్రమ రవాణా

టెక్నాలజీ దుర్వినియోగంతో సులభంగా ట్రాఫికింగ్

- మానవ అక్రమ రవాణాను కలసికట్టుగా ఎదుర్కోవాలి
- సైబర్ సెక్యూరిటీపై అన్ని స్థాయిల్లో అవగాహన పెరగాలి
- యూఎస్ కాన్సులేట్ జనరల్ లార్సన్
- విజయవాడలో జాతీయ సదస్సు



సైబర్ ఆధారిత మానవ అక్రమ రవాణాపై ప్రజ్వల్ ఫౌండేషన్ అధ్యయన నివేదికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, అమరావతి: సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ సులభంగా మానవ అక్రమ రవాణా చేస్తున్నారని, ఇది ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అని యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ చెప్పారు. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు సైబర్ సెక్యూరిటీపై పౌర సమాజాన్ని చైతన్యం చేయాలని, మానవ అక్రమ రవాణా నిరోధానికి నిరంతర నిఘా పెంచాలని తెలిపారు. ప్రజ్వల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహిస్తున్న 'సైబర్ ఆధారిత మానవ అక్రమ రవాణా'పై రెండు రోజుల జాతీయ స్థాయి సంప్రదింపుల సదస్సు గురువారం ప్రారంభమైంది. ప్రారంభ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణాను ఎదుర్కోవడంలో భారత్, అమెరికా సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. మానవ అక్రమ రవాణా దుష్పరిణామాలను అధిగమించేలా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశాతో కలిసి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని, కీలక ప్రతినిధులను భాగస్వామ్యం చేసి ప్రభావవంతమైన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. దీనిలో భాగంగానే సైబర్ ఆధారిత మానవ అక్రమ రవాణాపై జాతీయ స్థాయి సంప్రదింపుల సదస్సు నిర్వహించి జాతీయ కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేసి భారత ప్రభుత్వానికి అందిస్తామని చెప్పారు. ఇంటర్నెట్, డిజిటల్ టెక్నాలజీ వినియోగించి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు, డార్క్ వెబ్ మార్కెట్ ప్లేస్‌లు, ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ ఛానెళ్ల ద్వారా మోసగాళ్లు బాధితులకు ఎర వేస్తున్నారన్నారు. ప్రధానంగా లైంగిక దోపిడీ, బలవంతపు శ్రమ, మైనర్ల అక్రమ రవాణాలో సైబర్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నారన్నారు. ఈ నేరం ప్రపంచానికి పెద్ద సవాలుగా మారిందని తెలిపారు. మానవ అక్రమ రవాణా నిర్మూలనకు బలమైన, ప్రణాళికాబద్ధమైన పోరాటాన్ని రూపొందించగల ప్రపంచ భాగస్వామ్యాలు అవసరమని చెప్పారు.

పౌరసమాజం చేతులు కలపాలి

అంటువ్యాధిలా వ్యాప్తి చెందుతున్న మానవ అక్రమ రవాణాను రూపుమాపేందుకు పౌర సమాజం కూడా చేతులు కలపాలని ప్రజ్వల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సునీత కృష్ణన్ పిలుపునిచ్చారు. మానవ అక్రమ రవాణా జీవితాలను, సమాజాన్ని నాశనం చేసే నేరమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు అన్ని స్థాయిల్లో సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చెప్పారు. మానవ అక్రమ రవాణా ప్రాచీన కాలం నుంచి ఉందని డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు అన్నారు. దీనికి అడ్డుకట్ట వేయడం కష్టమైనప్పటికీ, జాతీయ కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సదస్సులో రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి, సుప్రీంకోర్టు న్యాయవాది అపర్ణ భట్ తదితరులు మాట్లాడారు. ఏపీ సీఐడీ ఏడీజీ రవిశంకర్ అయ్యన్నార్, ఏపీ బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావుతోపాటు 27 రాష్ట్రాలకు చెందిన సీనియర్ పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జ్యుడిషియల్ అకాడెమీ డైరెక్టర్లు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు.

పోస్ట్‌మార్టంలో ఆధునిక సాంకేతికత

- త్వరలో అందుబాటులోకి
- డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కాకినాడ క్రైం: మృతదేహాన్ని కోయకుండానే పోస్టుమార్టం నిర్వహించే అధునాతన సాంకేతికత అందుబాటులోకి రానున్నదని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి తెలిపారు. ఆ దిశగా జరుగుతున్న పరిశోధనలు సఫలీకృతం అవుతున్నాయన్నారు. గురువారం కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో సౌత్ ఇండియా మెడికో లీగల్ అసోసియేషన్ వార్షిక సదస్సు, సిమ్లా–2024 అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. పొరుగు రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది ఫోరెన్సిక్ వైద్య నిపుణులు హాజరయ్యారు. ఆర్గనైజింగ్ చైర్మన్, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫణికిరణ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సదస్సుకు విశిష్ట అతిథిగా డీఎంఈ అకడమిక్ డాక్టర్ రఘునందన్ హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ, ఫోరెన్సిక్ మెడిసిన్ దిశదశ సమూలంగా మారిపోనుందన్నారు. వర్చువల్ పోస్ట్‌మార్టంకు ప్రాధాన్యం పెరుగుతోందని తెలిపారు. దేశ, విదేశాల్లో ఇప్పటికే అధునాతన సాంకేతిక అనుబంధ అటాప్సీ విధానాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. సాంకేతికతను జోడించి చేసే అటాప్సీలో కచ్చితత్వానికి ఎక్కువ అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంసీ క్యాంపస్ ఆఫీసర్, ఫోరెన్సిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్ సహా ఫోరెన్సిక్ విభాగం బోధనా సిబ్బంది, పీజీలు పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థి ఆత్మహత్యపై పూర్తి నివేదిక ఇవ్వండి..

నెల్లూరు జిల్లా కలెక్టర్‌కు ఎన్‌సీపీసీఆర్ ఆదేశం

నెల్లూరు(క్రైమ్): నారాయణ విద్యార్థి జయధర్ ఆత్మహత్య ఘటనపై నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్(ఎన్‌సీపీసీఆర్) స్పందించింది. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులు, కేసు నమోదు, తదుపరి విచారణ తదితర అంశాలకు సంబంధించిన పూర్తి నివేదికను అందజేయాలని కమిషన్ సీనియర్ కన్సల్టెంట్ బలదేవ్‌రాజ్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు విద్యార్థి ఆత్మహత్య ఘటనపై సమగ్ర నివేదిక అందజేయాలని ఎస్పీ, నెల్లూరు ఆర్డీవో, డీఈవో, ఐసీడీఎస్ పీడీలను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ఇస్కాన్‌సిటీకి చెందిన రామిశెట్టి కృష్ణమూర్తి, అపర్ణ దంపతుల కుమారుడు జయధర్ నెల్లూరులోని నారాయణ ఒలంపియాడ్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. జయధర్ సరిగా చదవడం లేదని, మంచి మార్కులు వస్తున్నా రావట్లేదని రోజూ ఏదో ఒక సాకుతో ఉపాధ్యాయులు తిడుతుండేవారు. ఈ ఏడాది జూలై 16న అందరి ముందు జయధర్‌ను కొట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురై అదే నెల 17న ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి బుధవారం సోమవారం అర్ధరాత్రి వరకు 77,939 మంది స్వామివారిని దర్శించుకోగా 22,668 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.50 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



తిరుచ్చిపై సీతారాములు



చంద్రగిరి: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీనివాసమంగాపురం లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సీతారామలక్ష్మణ సమేత హనుమంతులు వారు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడ వీధుల్లో గురువారం భక్తులకు దర్శనమిచ్చారు.

పార్వతీ పుత్రుడికి పూలంగి సేవ!

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ప్రత్యేక బ్రహ్మోత్సాలను భక్తిశ్రద్ధలతో జరిపిస్తున్నారు. ఈ ఉత్సవంలో భాగంగా ప్రతిరోజు పలు సేవల్లో భక్తులకు అభయమిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం పూలంగిసేవలో కనువిందు చేశారు. ఉదయం విఘ్నేశ్వరునికి అభిషేకం చేశారు. సుగంధ పుష్పాలు, గరిక మాలలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి అలంకార మండపంలో ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం కనుల పండువగా పూలంగి సేవను నిర్వహించారు.

ఘనంగా పునర్వసు నక్షత్ర హోమం



సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో గురువారం హోమాన్ని విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హోమగుండం వద్ద సీతారాముల ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధాన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు.


నేటినుంచి పారిజాతగిరిలో పవిత్రోత్సవాలు

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలోని గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 27 నుంచి 30 వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో మాణికల రాంబాబు గురువారం తెలిపారు. ఆలయంలో నిత్య, వార, మాస, వార్షిక కైంకర్యాల్లో తెలిసి కానీ తెలియక కానీ ఏవైనా దోషాలు సంభవిస్తే వాటి పరిహారం కోసం ఈ కార్యక్రమాలు ప్రసిద్ధ క్షేత్రాల్లో నిర్వహిస్తారని చెప్పారు.

భీమేశ్వరస్వామికి రూ.38.08 లక్షల ఆదాయం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో గురువారం లెక్కించారు. ఈ లెక్కింపులో 53 రోజులకు గాను రూ.38,08,336 ఆదాయం వచ్చినట్లు ఈఓ దుర్గా భవాని తెలిపారు.

నేటి నుంచి ఎస్వీయూలో క్యాంపస్ డ్రైవ్



తిరుపతి సిటీ: ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జీవీ రమేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపల్ నరసయ్య ఆధ్వర్యంలో ప్రముఖ ఎమ్ఎన్‌సీ కంపెనీ ప్రతినిధులు రెండు రోజుల పాటు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని తెలిపారు. ఎమ్మెస్సీ కంప్యూటర్స్, ఎంసీఏతో పాటు 2021కి ముందు కంప్యూటర్‌లో డిగ్రీ చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



వెటర్నరీ కళాశాల ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ

తిరుపతి సిటీ: తిరుపతి వెటర్నరీ కళాశాల ఆధ్వర్యంలో స్థానిక పట్టణ పశువైద్యశాల పరిసరప్రాంతాల్లో విద్యార్థులు, సిబ్బంది గురువారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యశాల ఆవరణలోని వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పట్టణ పశువైద్యశాల నుంచి తుడా కార్యాలయం వరకు ర్యాలీ చేశారు.

విద్యార్థులకు హెల్త్ ఇన్సూరెన్స్

అమలాపురం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలు, అనాథాశ్రమాలు, సాంఘిక, వెనుకబడిన తరగతుల సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం ద్వారా రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకూ ప్రమాద బీమా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. గురువారం వివిధ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సంక్షేమ శాఖల అధికారులు, వైద్యాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.

తెలుగు సాహిత్యంలో హాస్యంపై సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): తెలుగు సాహిత్యంలో హాస్యం అనే అంశంపై నెల్లూరు పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక నిర్వాహకులు సుబ్రహ్మణ్యం, శేషగిరీశం గురువారం ఒక ప్రకటనను విడుదల చేశారు.



● రామ్‌చరణ్
● శర్వానంద్
● విజయ్ దేవరకొండ

పల్లెకు పోదాం చలో... చలో...

పల్లె కథలు, మట్టి కథలకు ప్రేక్షకులు పట్టం కడుతున్నారు. గత ఏడాది థియేటర్స్‌లోకి వచ్చిన నాని 'దసరా', సాయిధరమ్ తేజ్ 'విరూపాక్ష', సందీప్ కిషన్ 'ఊరిపేరు భైరవకోన', కార్తికేయ 'బెదురు లంక 2012', ప్రియదర్శి 'బలగం' వంటి పూర్తి స్థాయి పల్లెటూరి చిత్రాలు ప్రేక్షకులను మెప్పించడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద హిట్స్‌గా నిలిచాయి.

ఇటీవల హిట్స్‌గా నిలిచిన 'ఆయ్, కమిటీ కుర్రోళ్ళు' కూడా పల్లె కథలే. దీంతో ఓ హిట్‌ని ఖాతాలో వేసుకోవడానికి పల్లెకు పోదాం చలో... చలో అంటూ కొందరు హీరోలు పల్లె కథలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఇక ఏయే హీరోలను పల్లె పిలిచిందో తెలుసుకుందాం.


● 'బచ్చల మల్లి'లో 'అల్లరి' నరేశ్
● విశ్వక్ సేన్


● కిరణ్ అబ్బవరం


● ఈషా రెబ్బా, తరుణ్ భాస్కర్

పల్లె ఆట

రామ్‌చరణ్ కెరీర్‌లోని పర్ఫెక్ట్ రూరల్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్ 'రంగస్థలం'. 2018లో విడుదలైన ఈ మూవీ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. 'రంగస్థలం'కు దర్శకత్వం వహించిన సుకుమార్ వద్ద ఆ సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసిన బుచ్చిబాబు సాన ఇప్పుడు రామ్‌చరణ్‌తో సినిమా చేసేందుకు ఓ పల్లెటూరి కథను రెడీ చేశారు. ఈ సినిమాకు 'పెద్ది' అనే టైటిల్‌ను అనుకుంటున్నారని తెలిసింది. ఉత్తరాంధ్ర నేపథ్యంలో విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా సాగే ఈ సినిమాలో రామ్‌చరణ్ అన్నదమ్ములుగా ద్విపాత్రాభినయం చేయనున్నారని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా మేకోవర్ పనులతో బిజీగా ఉన్నారు రామ్‌చరణ్. కథ రీత్యా పాత్ర కోసం బరువు పెరుగుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. స్పెషల్ డైట్ ఫాలో అవుతున్నారు. దసరా తర్వాత ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించాలనుకుంటున్నారు. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు నిర్మించనున్న చిత్రం ఇది. జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటించనున్న ఈ సినిమాలో కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్ ఓ కీలక పాత్రలో కనిపిస్తారు. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.

తెలంగాణ కుర్రాడు

తెలంగాణ పల్లెటూరి అబ్బాయిలా హీరో శర్వానంద్‌ను రెడీ చేస్తున్నారు దర్శకుడు సంపత్ నంది. వీరి కాంబినేషన్‌లో ఓ పల్లె కథ తెరకెక్కనుంది. కేకే రాధామోహన్ నిర్మిస్తారు. యాక్షన్, ఎమోషన్ ప్రధానాంశాలుగా ఈ చిత్రం 1960 కాలంలో సాగుతుంది. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెలంగాణ, తెలంగాణ–మహారాష్ట్రల సరిహద్దు ప్రాంతాల నేపథ్యంలో కథనం ఉంటుంది. శర్వానంద్ కెరీర్‌లోని ఈ 38వ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఈ సినిమా లుక్‌కు సంబంధించిన మేకోవర్ పనుల్లో ఉన్నారు శర్వానంద్. భీమ్స్ సిసిరోలియో ఈ సినిమాకు సంగీతం అందిస్తారు.

బచ్చల మల్లి కథ

వీలైనప్పుడల్లా సీరియస్ కథల్లోనూ నటిస్తుంటారు హీరో 'అల్లరి' నరేశ్. అలా ఆయన టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'బచ్చల మల్లి'. 1990 నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది. ఈ చిత్రానికి సంబంధించిన మేజర్ సన్నివేశాలు విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటాయని తెలిసింది. ఆంధ్రప్రదేశ్‌లో దొంగగా పేరుగాంచిన బచ్చలమల్లి అనే వ్యక్తి జీవితం ఆధారంగా ఈ సినిమా కథనం ఉంటుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయింది. అమృతా అయ్యర్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాను 'సోలో బతుకే సో బెటర్' సినిమా ఫేమ్ సుబ్బు దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మిస్తున్నారు.

పల్లె బాటలో తొలిసారి...

హీరో విజయ్ దేవరకొండ పల్లెటూరి బాట పట్టారు. కెరీర్‌లో తొలిసారిగా పల్లెటూరి కుర్రాడిగా సెట్స్‌కు వెళ్లనున్నారు. విజయ్ దేవరకొండ హీరోగా 'రాజావారు రాణివారు' ఫేమ్ రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. పక్కా పల్లెటూరి యాక్షన్ డ్రామాగా రానున్న ఈ సినిమాను 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తారు. ఈ పీరియాడికల్ ఫిల్మ్ చిత్రీకరణ ఈ ఏడాదిలోనే ప్రారంభం కానుంది. ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి సినిమాతో బిజీగా ఉన్నారు విజయ్. ఈ సినిమా షూటింగ్ పూర్తి కాగానే విలేజ్ బ్యాక్‌డ్రాప్ సినిమా సెట్స్‌లోకి అడుగుపెడతారు విజయ్ దేవరకొండ.

పల్లెటూరి పోలీస్

పల్లెటూరి రాజకీయాల్లో విశ్వక్ సేన్ జోక్యం చేసుకుంటున్నారు. విశ్వక్ సేన్ హీరోగా ఓ విలేజ్ పొలిటికల్ యాక్షన్ డ్రామా ఫిల్మ్ తెరకెక్కనుంది. విశ్వక్ కెరీర్‌లోని ఈ 13వ సినిమాతో శ్రీధర్ గంటా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రంలో కన్నడ బ్యూటీ సంపద హీరోయిన్‌గా కనిపిస్తారు. సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో విశ్వక్ సేన్ పోలీస్ ఆఫీసర్ రోల్ చేస్తున్నారు. విశ్వక్ కెరీర్‌లో పూర్తి స్థాయి విలేజ్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్‌గా ఈ చిత్రం ఉండబోతోందని ఫిల్మ్‌నగర్ సమాచారం.

అమ్మాయి కథ

యాక్షన్... లవ్‌స్టోరీ... పొలిటికల్... ఇవేవీ కాదు... భార్యాభర్తల అనుబంధం, స్త్రీ సాధికారత వంటి అంశాలతో సరికొత్తగా ఓ సినిమా చేస్తున్నారు తరుణ్ భాస్కర్. ఈ సినిమాలో తరుణ్ భాస్కర్‌తో పాటు ఈషా రెబ్బా మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమాను సంజీవ్ ఏఆర్ దర్శకత్వంలో సృజన్ యరబోలు, వివేక్ కృష్ణ, సాధిక్, ఆదిత్య పిట్టీ నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీపై స్పష్టత రానుంది. కాగా మలయాళ సూపర్ హిట్ 'జయ జయ జయ జయ హే' సినిమాకు తెలుగు రీమేక్‌గా ఈ చిత్రం రూపొందిందనే టాక్ వినిపిస్తోంది. కాలేజ్ సమయంలో ప్రేమించి, మోసపోయిన ఓ అమ్మాయి వివాహ జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాత అత్తింట్లో కొత్త సమస్యలు ఎదుర్కొంటుంది. ఆ తర్వాత భర్తకు ఎదురు తిరిగి, సొంతంగా వ్యాపారం పెట్టుకుని జీవితాన్ని ఎలా లీడ్ చేస్తుంది? అనే అంశాలతో 'జయ జయ జయ జయ హే' సినిమా కథనం సాగుతుంది.

పోస్ట్‌మ్యాన్ స్టోరీ

'క' అనే ఓ డిఫరెంట్ టైటిల్‌తో విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ థ్రిల్లర్‌గా కిరణ్ అబ్బవరం ఓ సినిమా చేశారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ తెరకెక్కించిన ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఓ గ్రామంలో సాగే ఈ సినిమా కథలో కిరణ్ అబ్బవరం పోస్ట్‌మ్యాన్ రోల్ చేసినట్లుగా తెలుస్తోంది. అయితే హీరో క్యారెక్టరైజేషన్‌లో డిఫరెంట్ షేడ్స్ కనిపిస్తాయి. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాను చింతా గోపాలకృష్ణ నిర్మించారు. ఈ సినిమా విడుదల తేదీపై త్వరలో స్పష్టత రానుంది.

ఇలా పల్లెటూరి కథలతో రూపొందుతున్న చిత్రాలు మరికొన్ని ఉన్నాయి.

- ముసిమి శివాంజనేయులు


● కమల్‌హాసన్

థగ్ లైఫ్ పూర్తి

'థగ్ లైఫ్'కు గుడ్ బై చెప్పారు కమల్ హాసన్. 'నాయగన్' (తెలుగులో 'నాయకుడు' – 1987) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'థగ్ లైఫ్'. పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ సినిమాలో శింబు, త్రిష, అశోక్ సెల్వన్, ఐశ్వర్యా లక్ష్మి, నాజర్ కీలక పాత్రలు పోషించారు. ఇందులో రంగరాయ శక్తివేల్ నాయగర్ పాత్రలో కనిపిస్తారు కమల్‌హాసన్. ఓ నాలుగైదు రోజుల క్రితం కమల్ పాత్రకు సంబంధించిన చిత్రీకరణ పూర్తయింది. తాజాగా 'థగ్ లైఫ్' సినిమా షూటింగ్ మొత్తం పూర్తయినట్లుగా అధికారికంగా వెల్లడించి, ఓ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్, మణిరత్నం, శివ అన్నాత్తై నిర్మించిన ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతదర్శకుడు. 'థగ్ లైఫ్' చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

ఉడుకు రగతాల హోరతులియ్యాలా రారా!


● ఎన్టీఆర్

'ఎర్రటి సంద్రం ఎగిసిపడే అద్దరి ఇద్దరి అద్దిరిపడే హోరు... రణధీరుల పండగ నేడు...' అంటూ మొదలవుతుంది 'దేవర' సినిమాలోని 'ఆయుధ పూజ' సాంగ్. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'దేవర'. రెండు భాగాలుగా విడుదల కానున్న ఈ సినిమాను కల్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్. కొసరాజు హరికృష్ణ నిర్మించారు. తొలి భాగం 'దేవర: పార్టు 1' నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'ఆయుధ పూజ' పాట లిరికల్ వీడియోను తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో గురువారం రాత్రి విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను కాలభైరవ పాడారు. అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందించారు. ''హైలారే హైలా ఇయ్యాల ఆయుధ పూజలు సెయ్యాల... జబ్బలు చరచాల... జరుపుకోవాల జాతర... వీరాధి వీరుల జాతి తిరణాల... ఉడుకు రగతాల హోరతులియ్యాలా రారా వీర' అనే లిరిక్స్‌తో 'ఆయుధ పూజ' పాట సాగుతుంది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో సైఫ్ అలీఖాన్, శ్రీకాంత్, ప్రకాశ్‌రాజ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు.

ఐశ్వర్యకు ఏమైంది?

ఐశ్వర్యా రాయ్ ఆరోగ్యం గురించి బాలీవుడ్‌లో చర్చ జరుగుతోంది. ఈ చర్చ హఠాత్తుగా తెరపైకి రావడానికి ఓ కారణం ఉంది. ఇటీవల ప్యారిస్‌లో జరిగిన ఓ ఫ్యాషన్ షోలో ఐశ్వర్యా రాయ్ పాల్గొన్నారు. అయితే ఈ షోలో ఐశ్వర్యా రాయ్ కాస్ట్యూమ్, ఆమె ఫ్యాషన్ లుక్స్ పట్ల సోషల్ మీడియాలో నెగిటివ్ కామెంట్స్ పోస్ట్ చేశారు నెటిజన్లు. ఐశ్వర్యా రాయ్ ఆరోగ్యం బాగాలేదని, రెండేళ్లుగా ఆమె అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారని, అందుకే ఆమె లుక్స్ సరిగా లేవని ఓ యాప్‌లో పోస్ట్ కనిపించింది. అంతేకాదు... అనారోగ్యం కారణంగా ఆమె డైట్‌ను ఫాలో కాలేకపోతున్నారని, వర్కవుట్స్ కూడా పెద్దగా చేయలేకపోతున్నారని, ఈ కారణంగానే ఆమె లుక్స్‌లో తేడా కనిపిస్తోందని ఓ పోస్ట్‌లో ఉంది. ఐశ్వర్యా రాయ్ వంటి టాప్ సెలబ్రిటీ గురించి ఇలాంటి తరహా వార్త బయటకు రావడంతో అది నెట్టింట్లో ఫుల్ వైరల్ అయిపోయింది. ఈ విషయంపై కొంతమంది నెటిజన్లు, ఐశ్వర్యా రాయ్ అభిమానులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అసలే బచ్చన్ ఫ్యామిలీతో ఐశ్వర్యా రాయ్‌కు పొసగడం లేదని, అభిషేక్–ఐశ్వర్య త్వరలోనే విడాకులు తీసుకోనున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఇప్పుడు ఐశ్వర్యా రాయ్ బచ్చన్ ఆరోగ్యం గురించి ఈ తరహా వార్తలు రావడం ఆమె అభిమానులను కలవరపెడుతోంది. మరి... ఈ విషయంపై ఐశ్వర్యా రాయ్ తరఫు నుంచి అధికారిక ప్రకటన వస్తే కానీ నిజమేంటో తెలుస్తుంది.


● ప్యారిస్ ఫ్యాషన్ షోలో ఐశ్వర్యా రాయ్


● సూర్య


● 'తుంబాడ్' పోస్టర్

డైరెక్టర్ చేంజ్

హిందీ హిట్ ఫిల్మ్ 'తుంబాడ్' (2018)కు సీక్వెల్‌గా 'తుంబాడ్ 2' రానున్న సంగతి తెలిసిందే. ఇటీవల 'తుంబాడ్' సినిమా రీ–రిలీజ్ సమయంలో 'తుంబాడ్ 2' సినిమా అనౌన్స్‌మెంట్ వీడియోను రిలీజ్ చేశారు ఈ చిత్రకథానాయకుడు సోహమ్ షా. అయితే తొలి భాగం 'తుంబాడ్'కు దర్శకత్వం వహించిన రహీ అనిల్ బార్వే మాత్రం మలి భాగం 'తుంబాడ్ 2'కు దర్శకత్వం వహించడం లేదు. ''తుంబాడ్'ను ఓ ట్రయాలజీగా (తుంబాడ్, 'పహడ్‌పంగిర, పక్షితీర్థ') అనుకున్నాను. పదేళ్లుగా ఈ ట్రయాలజీ గురించి పని చేస్తున్నాను. తొలి భాగం మళ్లీ ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయం సాధించింది. అయితే 'తుంబాడ్ 2'కు నేను దర్శకత్వం వహించడం లేదు. సోహమ్, ఆదేశ్ ప్రసాద్‌లకు ఆల్ ది బెస్ట్. 'తుంబాడ్ 2' విజయం సాధించాలి. నా ప్రస్తుత ప్రాజెక్ట్స్ పూర్తయిన తర్వాత వచ్చే ఏడాది 'పహడ్ పంగిర' పనులు ప్రారంభిస్తాను'' అని పేర్కొన్నారు అనిల్ బార్వే. కాగా 'తుంబాడ్'కు క్రియేటివ్ కో డైరెక్టర్‌గా పని చేసిన ఆదేశ్ ప్రసాద్ 'తుంబాడ్ 2'కి దర్శకత్వం వహిస్తారనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది.

కథ విన్నారా?

హీరో సూర్య, దర్శకుడు ఆర్‌జే బాలాజీ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనుందా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. ఇటీవల సూర్యకు ఆర్‌జే బాలాజీ ఓ కథను వినిపించగా, సూర్య ఇంప్రెస్ అయ్యారట. ప్రస్తుతం ఈ కథకు మెరుగులు దిద్దే పనిలో బాలాజీ ఉన్నారని, ఈ ఏడాదిలోనే ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన వెల్లడి కానుందని కోలీవుడ్ టాక్. ప్రస్తుతం కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలోని సినిమాతో బిజీగా ఉన్నారు సూర్య. అలాగే సూర్య హీరోగా నటించిన మరో పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్ 'కంగువ' నవంబరు 14న విడుదల కానున్న సంగతి తెలిసిందే.


● ఆలియా భట్

అంత ధైర్యం ఎవరికి ఉంది?

ఆలియా భట్ ప్రధాన పాత్రధారిగా, వేదంగ్ రైనా మరో కీలక పాత్రలో నటించిన హిందీ చిత్రం 'జిగ్రా'. 'మోనిక ఓ మై డార్లింగ్, పెడ్లర్స్' వంటి సినిమాలకు దర్శకత్వం వహించిన వాసన్ బాల 'జిగ్రా' చిత్రాన్ని తెరకెక్కించారు. కరణ్ జోహార్, అపూర్వ మెహతా, ఆలియా భట్, షాహిన్ భట్, సోమెన్ మిశ్రా నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో సత్యా ఆనంద్ పాత్రలో ఆలియా భట్, అంకుర్ ఆనంద్ పాత్రలో వేదంగ్ రైనా నటించారు. మరణ శిక్ష విధించబడి, జైల్లో మూడు నెలల్లో మరణించనున్న తన తమ్ముణ్ణి ఓ అక్క ఏ విధంగా కాపాడుకుంది? అనే కోణంలో 'జిగ్రా' కథ ఉండబోతున్నట్లుగా తెలుస్తోంది. 'నన్ను నేను ఓ ఎథికల్ పర్సన్‌గా ఎప్పుడూ అనుకోలేదు. అంకుర్‌కి సిస్టర్‌గానే అనుకున్నాను, లోపల ఎవరైనా నిన్ను ఇబ్బంది పెడుతున్నారా?, అంత ధైర్యం ఎవరికి ఉంది? నువ్వు నా సిస్టర్‌గా ఉన్నప్పుడు' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ట్రైలర్‌లో ఆలియా యాక్షన్, ఎమోషనల్ సీన్స్ ఆకట్టుకునే విధంగా ఉన్నాయి.

బిజినెస్ రీల్

పసిడి @ రూ. 78,000



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలతో పసిడి రికార్డు పరుగు కొనసాగుతోంది. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం గురువారం దేశీయంగా న్యూఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర రూ. 78,000 మార్కును అధిగమించింది. రూ. 400 పెరిగి కొత్తగా మరో జీవితకాల గరిష్ట స్థాయి రూ. 78,250ని తాకింది. స్థానికంగా డిమాండ్‌తో పాటు అంతర్జాతీయంగా కూడా పసిడికి అనుకూల పరిస్థితులు కూడా ఇందుకు కారణమని ట్రేడర్లు తెలిపారు. మరోవైపు, పరిశ్రమల నుంచి డిమాండ్ కారణంగా వెండి ధర కూడా కేజీకి రూ. 1,000 పెరిగి రూ. 94,000కి చేరింది.

మహిళలకు కోర్టివా అగ్రిసైన్స్ ప్రాధాన్యం

న్యూఢిల్లీ: వ్యవసాయ రంగంలోని వివిధ విభాగాల్లో 2030 నాటికి దాదాపు 20 లక్షల మంది మహిళలకు సాధికారత కల్పించే దిశగా సమగ్ర ప్రోగ్రాంను ప్రారంభించినట్లు కోర్టివా అగ్రిసైన్స్ వెల్లడించింది. రైతులుగా, పరిశోధకులుగా, వ్యాపారవేత్తలుగా పురోగమించేందుకు వారికి అవసరమైన మద్దతు, సాధనాలు, వనరులను కల్పించనున్నట్లు సంస్థ ప్రెసిడెంట్ (దక్షిణాసియా) సుబ్రతో గీడ్ తెలిపారు. ఇందులో భాగంగా మహిళల సారథ్యంలో రైతు ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేయడం, సైన్స్ ..టెక్నాలజీ తదితర విభాగాల్లో విద్యార్థినులకు మెంటార్‌షిప్ అందించడం మొదలైనవి చేపట్టనున్నట్లు వివరించారు. ఆవిష్కరణలు, ఆర్థికాభివృద్ధి, ఆహార భద్రతకు ఈ ప్రోగ్రాం తోడ్పడుతుందని పేర్కొన్నారు.

ఈజ్ మై ట్రిప్‌లో ప్రమోటర్ల వాటాల అమ్మకం

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ట్రావెల్ బుకింగ్ ప్లాట్ ఫామ్ 'ఈజ్ మై ట్రిప్ ప్లానర్స్'లో నిషాంత్ పిట్టి తనకున్న వాటాల నుంచి 14 శాతాన్ని ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో విక్రయించారు. 24,65,49,833 షేర్లను, ఒక్కోటీ రూ.37.22-38.28 మధ్య ధరలో విక్రయించారు. ఈ లావాదేవీల విలువ రూ.920 కోట్లుగా ఉంది. ఈ విక్రయం తర్వాత కంపెనీలో నిషాంత్ పిట్టీ వాటా 28.13%నుంచి 14.22 శాతానికి తగ్గింది. మొత్తం ప్రమోటర్ల వాటా 64.30% నుంచి 50.39 శాతానికి పరిమితమైంది. కోర్4 మార్కామ్ 5 శాతం వాటాలను కొనుగోలు చేసింది. క్రాఫ్ట్ ఎమర్జింగ్ మార్కెట్ ఫండ్ పీసీసీ - ఎలైట్ క్యాపిటల్ ఫండ్ 1.05 కోట్ల షేర్లను సొంతం చేసుకుంది.

ఎన్ఎస్ఈలో కంపెనీ షేరు 7 శాతం పెరిగి రూ.37 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-9-2024	
విశాఖ	530-00
చిత్తూరు	543-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	530-00
విజయవాడ	530-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	505-00
వరంగల్	507-00
రిటైల్ ధర	5.65

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
MARUTI	13,358.65	4.48
GRASIM	2,747.00	3.19
TATAMOTORS	990.9	2.83
SHRIRAMFIN	3,622.00	2.78
BAJAJFINSV	1,978.40	2.59

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
CIPLA	1,619.00	-1.47
ONGC	295	-1.24
LT	3,760.00	-0.89
HEROMOTOCO	6,039.70	-0.8
NTPC	433.5	-0.6

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	11,515
ఎన్ఎస్ఈ	1,26,555
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,45,108
ఎఫ్ఐఐ	+ 699
డీఐఐ	+ 2,406

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.05	$ 69.69
బ్రెంట్	71.38	$ 72.90

వయాకామ్18 బోర్డులో అంబానీలు

ఆకాశ్, నీతా అంబానీ చేరిక



న్యూఢిల్లీ: గ్లోబల్ మీడియా దిగ్గజం వాల్ట్ డిస్నీ దేశీ బిజినెస్‌తో విలీనం నేపథ్యంలో తాజాగా ముకేశ్ అంబానీ కుటుంబ సభ్యులు వయాకామ్18 బోర్డులో చేరారు. ముకేశ్ సతీమణి, రిలయన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ నీతా అంబానీ, కుమారుడు ఆకాశ్ అంబానీ బోర్డు సభ్యులుగా చేరినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. పారిశ్రామిక దిగ్గజం ముకేశ్ అంబానీ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్, బోధి ట్రీ సిస్టమ్స్‌కు చెందిన మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ బిజినెస్‌లకు హోల్డింగ్ కంపెనీగా వయాకామ్18 వ్యవహరిస్తోంది. స్టార్ ఇండియా విలీనానికి సీసీఐ, ఎన్‌సీఎల్‌టీ అనుమతులు లభించడంతో వాల్ట్ డిస్నీ, వయాకామ్18 బోర్డులో సర్దుబాట్లకు తెరలేచినట్లు తెలుస్తోంది. బోధి ట్రీ సిస్టమ్స్ సహవ్యవస్థాపకుడు జేమ్స్ మర్డోక్, కీలక ఇన్వెస్టర్ మహమ్మద్ అహ్మద్ అల్‌హర్దన్, ఆర్ఐఎల్ మీడియా, కంటెంట్ బిజినెస్ ప్రెసిడెంట్ జ్యోతి దేశ్‌పాండే,



అనాగ్రామ్ పార్ట్‌నర్స్ పార్ట్‌నర్ శువ మండల్ సైతం బోర్డులో చేరనున్నారు. స్టార్ ఇండియాతో వయాకామ్18 మీడియా, డిజిటల్ 18 మీడియా విలీనానికి గత నెల(ఆగస్టు) 30న ఎన్‌సీఎల్‌టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే.

స్టార్ హెల్త్ కస్టమర్ల డేటా లీక్

- 3.1 కోట్ల కస్టమర్ల డేటాను విక్రయించిన ఉద్యోగి
- సైబర్ సెక్యూరిటీ రీసెర్చర్ ఆరోపణ



న్యూఢిల్లీ: స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీకి చెందిన 3.1 కోట్ల కస్టమర్ల వ్యక్తిగత డేటా ఉల్లంఘన పాలైనట్టు యూకే కేంద్రంగా పనిచేసే సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు జేసన్ పార్కర్ ఆరోపించారు. కంపెనీకి చెందిన ఓ సీనియర్ ఉద్యోగి 3.1 కోట్ల కస్టమర్లకు సంబంధించి మొబైల్ నంబర్లు, చిరునామా తదితర వివరాలను విక్రయించినట్టు సంచలన విషయాన్ని బయటపెట్టారు. మూడో పక్షం నుంచి మోసపూరిత చర్యలకు (ఉల్లంఘనైన డేటా ఆధారంగా) అవకాశం ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలంటూ కస్టమర్లకు స్టార్ హెల్త్ సంస్థ ఈ మెయిల్ ద్వారా హెచ్చరించడం ఉల్లంఘన ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. యూకేకు చెందిన సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు జేసన్ పార్కర్ షెంజెన్ అనే హ్యాకర్ స్టార్ హెల్త్ నుంచి పొందిన డేటాను వెబ్‌సైట్‌లో పెట్టినట్టు ప్రకటించారు. ''స్టార్ హెల్త్ ఇండియా కస్టమర్ల ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లకు సంబంధించి సున్నితమైన డేటాను లీక్ చేస్తున్నాను. ఈ డేటాను నాకు నేరుగా విక్రయించిన స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీదే ఇందుకు బాధ్యత''అంటూ షెంజెన్ పోస్టును పార్కర్ ప్రస్తావించారు. టెలిగ్రామ్ బోట్‌లను సృష్టించడం ద్వారా 2024 జూలై నాటికి 3,12,16,953 మంది కస్టమర్ల డేటాను, 57,58,425 క్లెయిమ్‌ల డేటాను హ్యాకర్ పొందినట్టు చెప్పారు. డేటా లీకేజీకి గాను 1,50,000 డాలర్ల డీల్ కుదిరినట్టు కూడా పార్కర్ తెలిపారు.

అప్రమత్తత..

స్టార్ హెల్త్ ఉద్యోగులమని చెబుతూ ప్రస్తుత పాలసీని నిలిపివేయండనే చర్యలకు థర్డ్ పార్టీలు పాల్పడొచ్చంటూ స్టార్ హెల్త్ తన కస్టమర్లను అప్రమత్తం చేసింది. ఈ తరహా మోసపూరిత చర్యలు వ్యక్తిగత సమాచారానికి ముప్పు కలిగించడంతో పాటు, దీర్ఘకాలంలో పాలసీ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తాయని హెచ్చరించింది. క్లెయిమ్‌ల డేటాను అనధికారికంగా పొందినట్టు గుర్తు తెలియని వ్యక్తి నుంచి తమకు మెయిల్స్ కూడా వచ్చినట్టు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ సమాచారం ఇచ్చింది. ఐఆర్‌డీఏఐ నిబంధనలకు అనుగుణంగా తగిన సైబర్ భద్రతా వ్యవస్థలు, నియంత్రణలను అమలు చేస్తున్నామని, దీనిపై మళ్లీ తాజా సమాచారం విడుదల చేస్తామని తెలిపింది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ప్రకటించింది.

2 బిలియన్ డాలర్ల స్థాయికి పిరామల్ ఫార్మా

2030 నాటికి కంపెనీ లక్ష్యం



న్యూఢిల్లీ: 2030 ఆర్థిక సంవత్సరం నాటికి 2 బిలియన్ డాలర్ల విలువ చేసే అంతర్జాతీయ ఫార్మా, హెల్త్, వెల్‌నెస్ దిగ్గజంగా ఎదగాలని పిరామల్ ఫార్మా నిర్దేశించుకుంది. వచ్చే అయిదేళ్లలో తమ కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, తయారీ విభాగం (సీడీఎంవో) 1.2 బిలియన్ డాలర్ల స్థాయిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ చైర్‌పర్సన్ నందిని పిరామల్ తెలిపారు. ఈ దశాబ్దం ఆఖరు నాటికి క్రిటికల్ కేర్ విభాగాన్ని 600 మిలియన్ డాలర్లకు, కన్జూమర్ హెల్త్‌కేర్ విభాగాన్ని 200 మిలియన్ డాలర్ల స్థాయికి చేర్చుకోవాలని నిర్దేశించుకున్నట్లు ఆమె వివరించారు. సమగ్ర సర్వీసులు, క్రాస్-సెల్లింగ్, వైవిధ్యమైన ఉత్పత్తుల ద్వారా ఈ లక్ష్యాలను సాధించనున్నట్లు పిరామల్ చెప్పారు. సంక్లిష్టమైన హాస్పిటల్ జనరిక్స్ (సీహెచ్‌జీ) వ్యాపారానికి సంబంధించి రెండంకెల స్థాయిలో ఆదాయ వృద్ధిని అంచనా వేస్తున్నట్లు, యూరప్, చైనా తదితర మార్కెట్లలో స్థానాన్ని పటిష్టం చేసుకోనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇక కన్జూమర్ హెల్త్‌కేర్ భారత విభాగం (ఐసీహెచ్) విషయంలో లాక్టో క్యాలమైన్, లిటిల్స్, ఐ-యాక్టివ్ వంటి బ్రాండ్లపై మరింతగా దృష్టి పెట్టనున్నట్లు వివరించారు. వివిధ మాధ్యమాల్లో విస్తరించడం ద్వారా వచ్చే అయిదేళ్లలో పరిశ్రమను మించి రెట్టింపు స్థాయిలో వృద్ధిని సాధించాలని ఐసీహెచ్ విభాగం నిర్దేశించుకున్నట్లు పిరామల్ చెప్పారు.

హాస్పిటల్స్ రంగంలో మూడింతలైన ఎఫ్‌డీఐలు

454 మిలియన్ డాలర్ల పెట్టుబడులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశంలో హాస్పిటల్స్, డయాగ్నోస్టిక్ సెంటర్స్ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) జూన్ త్రైమాసికంలో మూడింతలయ్యాయి. ఈ కాలంలో 454 మిలియన్ డాలర్ల నిధులు వెల్లువెత్తాయి. 2023 ఏప్రిల్-జూన్‌లో 155 మిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు భారత్‌కు వచ్చాయి. 2024 జనవరి-మార్చిలో ఇది 86.7 శాతం వృద్ధితో 446.4 డాలర్లుగా ఉంది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. 2020 ఏప్రిల్ నుంచి 2024 జూన్ మధ్య ఈ రంగంలోకి 10.72 బిలియన్ డాలర్ల ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ (ఎఫ్‌డీఐ) వచ్చి చేరాయి. మెడికల్, సర్జికల్ ఉపకరణాల విభాగం 6.8 శాతం దూసుకెళ్లి 2024 జూన్ త్రైమాసికంలో 320.4 మిలియన్ డాలర్లు నమోదు చేసింది. ఈ విభాగంలోకి 2020 ఏప్రిల్ నుంచి 2024 జూన్ నాటికి 3.61 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వరద పారింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే హాస్పిటల్స్, డయాగ్నోస్టిక్ సెంటర్స్ రంగం 2023-24లో 89 శాతం వృద్ధితో 1.53 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలను అందుకుంది. అంత క్రితం అయిదు సంవత్సరాల్లో ఇదే అత్యధిక వృద్ధి. 2018-19 తర్వాత బిలియన్ డాలర్ల మార్కును దాటింది. మెడికల్, సర్జికల్ అప్లయాన్సెస్ విభాగం 21.5 శాతం ఎగసి 483 మిలియన్ డాలర్లుగా ఉంది. ఈ విభాగం వృద్ధి అంత క్రితం మూడు ఆర్థిక సంవత్సరాలతో పోలిస్తే ఇదే తక్కువ.

స్కోడా ఆటోపై మహీంద్రా ఆసక్తి

50% వాటా కొనుగోలుకు చర్చలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా తాజాగా స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియాలో 50 శాతం వాటా కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తోంది. ఇరు సంస్థల మధ్య చర్చలు పురోగతిలో ఉన్నాయని, వాటా విషయంలో ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చినట్టు సమాచారం. అన్నీ అనుకూలిస్తే త్వరలోనే ఒప్పంద ప్రకటన వెలువడనుంది. స్కోడా ఆటో బృందం భారత్‌లోనే ఉంది. స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియాను 800 మిలియన్ డాలర్ల నుంచి ఒక బిలియన్ డాలర్లుగా విలువ కట్టినట్టు తెలుస్తోంది. భారత్‌లో ఉన్న స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియా ప్లాంటు వార్షిక సామర్థ్యం సుమారు 3 లక్షల యూనిట్లు. అలాగే మరో ప్లాంటు ఏర్పాటుకు కావాల్సిన స్థలం కూడా ఉంది. డీల్‌లో భాగంగా మహీంద్రా అభివృద్ధి చేసిన న్యూ ఫ్లెక్సిబుల్ ఆర్కిటెక్చర్ ప్లాట్‌ఫామ్‌ను స్కోడా ఫోక్స్‌వ్యాగన్‌కు ఆఫర్ చేసే అవకాశం ఉంది. అలాగే చకన్ ప్లాంటు విస్తరణకు మహీంద్రా రూ.4,000-5,000 కోట్లు పెట్టుబడి చేయవచ్చని సమాచారం. ఆడి, పోర్ష, లంబోర్గీని వంటి గ్లోబల్ బ్రాండ్‌లను కలిగి ఉన్న స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ యొక్క సేల్స్, మార్కెటింగ్ విభాగాన్ని జేవీ వెలుపల ఒక ప్రత్యేక సంస్థగా రూపొందిస్తారు. కాగా, ఎంఈబీ ప్లాట్‌ఫామ్‌కు కావాల్సిన విడిభాగాల సరఫరాకై 2024 ఫిబ్రవరి 16న ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్‌తో మహీంద్రా ఒప్పందం చేసుకుంది. సహకార సామర్థ్యాన్ని విస్తరించడానికి విభిన్న అవకాశాలను అన్వేషించడం కొనసాగిస్తామని ఇరు సంస్థలు ఇప్పటికే ప్రకటించాయి.

జియో-బీపీ 500వ ఈవీ చార్జింగ్ స్టేషన్ ప్రారంభం



న్యూఢిల్లీ: జియో-బీపీ 500వ పల్స్ ఈవీ-చార్జింగ్ స్టేషన్‌ను రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ అనంత్ ముకేశ్ అంబానీ, బీపీ సీఈవో ముర్రే ఆషిన్‌క్లాస్ గురువారం ప్రారంభించారు. ముంబై బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని నీతా ముకేశ్ అంబానీ కల్చరల్ సెంటర్, జియో వరల్డ్ ప్లాజా, జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌కి వచ్చే వారికి ఇది అందుబాటులో ఉంటుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. రిలయన్స్-బీపీ కలిసి ఇంధనాల విక్రయం, చార్జింగ్ ఇన్‌ఫ్రా కోసం జాయింట్ వెంచర్‌గా జియో-బీపీని ఏర్పాటు చేశాయి. కంపెనీ అత్యంత వేగంగా ఈవీ చార్జింగ్ పాయింట్లను విస్తరించింది. ఏడాది వ్యవధిలోనే 1,300 నుంచి 5,000కు పెంచుకుంది. దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వేగవంతమయ్యేందుకు జియో-బీపీ కృషి చేస్తున్నాయని అనంత్ అంబానీ తెలిపారు. కస్టమర్లకు మెరుగైన అనుభూతిని అందించేందుకు వ్యూహాత్మక ప్రాంతాల్లో వేగవంతమైన చార్జింగ్ సదుపాయాలను ఏర్పాటు చేయడంపై దృష్టి పెడుతున్నట్లు ముర్రే వివరించారు.

హైదరాబాద్‌లో ఇళ్ల అమ్మకాలు డౌన్

- జూలై-సెప్టెంబర్ మధ్య 22 శాతం తక్కువ
- దేశవ్యాప్తంగా ఏడు పట్టణాల్లోనూ ఇదే తీరు
- రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ నివేదిక



న్యూఢిల్లీ: హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా ఏడు ప్రముఖ పట్టణాల్లో ఇళ్ల అమ్మకాలు జూలై-సెప్టెంబర్ మధ్య కాలంలో 11 శాతం మేర క్షీణించాయి. మొత్తం 1.07 లక్షల యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో విక్రయాలు 1,20,290 యూనిట్లుగా ఉన్నాయి. ఈ వివరాలను రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ ఓ నివేదిక రూపంలో విడుదల చేసింది. కొత్త ఆవిష్కరణలు తక్కువగా ఉండడం, అదే సమయంలో ఇళ్ల ధరలు సగటున 23 శాతం పెరగడం అమ్మకాల క్షీణతకు కారణాలుగా పేర్కొంది. ముఖ్యంగా హైదరాబాద్ మార్కెట్లో అమ్మకాలు ఏకంగా 22 శాతం తగ్గి 12,735 యూనిట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో 16,375 యూనిట్లు అమ్ముడుపోవడం గమనార్హం.

పట్టణాల వారీగా..

- పుణెలో క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చితే 17 శాతం తక్కువగా 19,050 యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి.
- ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో అమ్మకాలు 15,570 యూనిట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో విక్రయాల కంటే 2% తక్కువ.
- బెంగళూరులో ఇళ్ల విక్రయాలు 8 శాతం క్షీణించి 15,025 యూనిట్లుగా ఉన్నాయి.
- కోల్‌కతా పట్టణంలో 25 తక్కువగా 3,980 యూనిట్ల విక్రయాలు జరిగాయి.
- చెన్నైలో 4,510 యూనిట్ల ఇళ్లు అమ్ముడయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో విక్రయాలు 4,945 యూనిట్ల కంటే 9% తగ్గాయి.

హైదరాబాద్‌లో ధరల పెరుగుదల అధికం

ఏడు ప్రముఖ పట్టణాల్లో హైదరాబాద్‌లోనే ఇళ్ల ధరల పెరుగుదల అధికంగా 32 శాతం మేర నమోదైంది. ''నిర్మాణంలోకి వినియోగించే ఉత్పత్తుల ధరలు పెరగడం, అమ్మకాల్లోనూ గణనీయమైన వృద్ధితో.. ఏడు ప్రధాన పట్టణాల్లో ఇళ్ల ధరలు మొత్తం మీద 23 శాతం మేర పెరిగాయి. చదరపు అడుగు ధర రూ.6,800 నుంచి రూ.8,390కు పెరిగింది''అని అనరాక్ నివేదిక తెలిపింది.

పండుగల కాలంలో డిమాండ్

''అన్ని ప్రముఖ పట్టణాల్లోనూ ఇళ్ల అమ్మకాలు క్షీణించాయి. టాప్-7 పట్టణాల్లో నూతన ఇళ్ల యూనిట్ల సరఫరా జూలై-సెప్టెంబర్ మధ్య 19 శాతం తగ్గి 93,750 యూనిట్లుగానే ఉంది. క్రితం ఏడాది ఇదే కాలంలో 1,16,220 కొత్త యూనిట్ల సరఫరా నమోదైంది. ఆవిష్కరణల కంటే విక్రయాలు ఎక్కువగా ఉండడం.. డిమాండ్-సరఫరా సమీకరణం బలంగా ఉండడాన్ని సూచిస్తోంది''అని అనరాక్ చైర్మన్ అనుజ్‌పురి తెలిపారు. అధిక ధరలకు తోడు, వర్షాకాలం కావడం విక్రయాలు తగ్గడం వెనుక ఉన్న అంశాలుగా పేర్కొన్నారు.

పీఎస్ఎంసీతో టాటా ఎలక్ట్రానిక్స్ ఒప్పందం

న్యూఢిల్లీ: ధొలేరా చిప్ తయారీ ప్లాంటు కోసం తైవాన్‌కి చెందిన పవర్‌చిప్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్‌తో (పీఎస్ఎంసీ) ఒప్పందం కుదుర్చుకున్నట్లు టాటా ఎలక్ట్రానిక్స్ తెలిపింది. దీని ప్రకారం ఈ ప్లాంటుకు సంబంధించి డిజైన్, నిర్మాణ, సాంకేతికాంశాల్లో పీఎస్ఎంసీ సహాయ, సహకారాలు అందిస్తుంది. పీఎస్ఎంసీ సాంకేతికత, నైపుణ్యాలు భారత్‌లో సెమీకండక్టర్ల తయారీని వేగవంతం చేయగలవని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తెలిపారు. గుజరాత్‌లోని ధొలేరాలో టాటా గ్రూప్ రూ. 91,000 కోట్లతో చిప్‌ల తయారీ ప్లాంటును నెలకొల్పుతోంది. నెలకు 50,000 వేఫర్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఇది ఏర్పాటవుతోంది. దీనితో 1,00,000 పైచిలుకు నిపుణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది.

అక్టోబర్ 10 నుంచి ప్రీ-బడ్జెట్ సమావేశాలు

న్యూఢిల్లీ: రాబోయే ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌పై కసరత్తు ప్రారంభమవుతోంది. అక్టోబర్ 10 నుంచి ఆర్థిక శాఖ వివిధ విభాగాలతో ప్రీ-బడ్జెట్ సమావేశాలు నిర్వహించనుంది. ఇవి నవంబర్ 11 వరకు కొనసాగుతాయి. బడ్జెట్ రూపకల్పన, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరించిన అంచనాలను ఖరారు చేయడం ఈ సమావేశాల అజెండా. చివరి రోజున ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, రైల్వే శాఖలతో సమావేశాలు ఉంటాయి. 2025-26 బడ్జెట్ ప్రధానంగా వృద్ధిని వేగవంతం చేసేందుకు ఉపయోగపడే సంస్కరణలు, ఉద్యోగాల కల్పనకు తోడ్పడే చర్యల అమలుపై దృష్టి పెట్టే అవకాశం ఉందని అంచనా. వరుసగా ఎనిమిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రిగా సీతారామన్ అరుదైన ఘనత దక్కించుకోనున్నారు.

మౌరిటెక్ రూ. 1,500 కోట్ల ఐపీవో

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎంటర్‌ప్రైజ్ ఐటీ సొల్యూషన్స్, సర్వీసులు అందించే మౌరిటెక్ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 1,500 కోట్లు సమీకరించనుంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. దీని ప్రకారం తాజాగా రూ. 440 కోట్ల విలువ చేసే షేర్లను జారీ చేయనుండగా, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ప్రస్తుత షేర్‌హోల్డర్లు రూ. 1,060 కోట్లు విలువ చేసే షేర్లను విక్రయించనున్నారు. ప్రమోటర్లు పి. సుజయ్ , అనిల్ రెడ్డి యెర్రంరెడ్డి వరుసగా రూ. 615 కోట్లు, రూ. 316 కోట్ల షేర్లను ఓఎఫ్ఎస్‌లో విక్రయిస్తున్నారు. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్లో అనుబంధ సంస్థల్లో ఇన్వెస్ట్ చేసేందుకు, రుణాలను తీర్చేందుకు, ఇతర సంస్థల కొనుగోలు, కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించుకోనుంది.

కాక్స్ అండ్ కింగ్స్‌పై సీబీఐ కేసు



న్యూఢిల్లీ: ట్రావెల్ కంపెనీ కాక్స్ అండ్ కింగ్స్ ప్రమోటర్లు, డైరెక్టర్లపై సీబీఐ కేసు నమోదు చేసింది. వీరిలో ప్రమోటర్లు/డైరెక్టర్లు అజయ్ అజిత్ పీటర్ కేర్కర్, ఉషా కేర్కర్, సీఎఫ్‌వో అనిల్ ఖండేల్‌వాల్, డైరెక్టర్లు మహాలింగ నారాయణన్, పెసి పటేల్ ఉన్నారు. రూ.525 కోట్లు రుణం తీసుకుని మోసం చేశారన్న ఆరోపణలపై యస్ బ్యాంక్ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. ముంబై పోలీసుల నుండి ఈ కేసును సీబీఐ స్వీకరించింది. అవినీతి నిరోధక చట్టంలోని నిబంధనలతోపాటు మోసం, ఫోర్జరీ, నేరపూరిత దుష్ప్రవర్తనకు సంబంధించిన ఐపీసీ సెక్షన్ల కింద వ్యక్తులందరిపై కేంద్రం ద్వారా మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచనపై సీబీఐ కేసు నమోదు చేసింది. యస్ బ్యాంక్ నుంచి రుణ సదుపాయం పొందేందుకు కంపెనీ రికార్డులను తారుమారు చేసిందన్నది ఆరోపణ.

క్రెడిట్ డిఫాల్ట్ స్వాప్‌ల్లో క్రయ, విక్రయాలు

మ్యూచువల్ ఫండ్స్‌కు అనుమతి



న్యూఢిల్లీ: క్రెడిట్ డిఫాల్ట్ స్వాప్ (సీడీఎస్) కొనుగోలు, విక్రయాలకు మ్యూచువల్ ఫండ్స్ సంస్థలకు అనుమతిస్తూ సెబీ నిర్ణయాన్ని ప్రకటించింది. దీంతో సీడీఎస్‌లను మరింత మెరుగ్గా వినియోగించుకునే వెసులుబాటు మ్యూచువల్ ఫండ్స్‌కు వచ్చినట్లయింది. ఇప్పటి వరకు మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు తమ పోర్ట్‌ఫోలియోలోని కార్పొరేట్ బాండ్లకు సంబంధించి.. క్రెడిట్ రిస్క్‌ను హెడ్జ్ చేసుకునేందుకు వీలుగానే సీడీఎస్‌ల కొనుగోలుకు అనుమతి ఉండేది. కార్పొరేట్ బాండ్ మార్కెట్‌లో లిక్విడిటీ పెంచే లక్ష్యంతో సెబీ తాజా చర్య తీసుకుంది. క్రెడిట్ డిఫాల్ట్ స్వాప్ అనేది ఒక ఆర్థిక సాధనం. ఉదాహరణకు ఒక మ్యూచువల్ ఫండ్ సంస్థ ఎక్స్ అనే కంపెనీ కార్పొరేట్ బాండ్‌లో ఇన్వెస్ట్ చేసిందనుకుందాం. ఒకవేళ ఎక్స్ కంపెనీ తిరిగి చెల్లించడంలో చేతులు ఎత్తేస్తే అప్పుడు మ్యూచువల్ ఫండ్ సంస్థ నష్టపోవాల్సి వస్తుంది. ఈ రిస్క్‌ను సీడీఎస్‌తో అధిగమించొచ్చు. కార్పొరేట్ బాండ్ చెల్లింపుల్లో ఎగవేత ఎదురైతే సీడీఎస్‌ను విక్రయించిన సంస్థ ఆ మేరకు నష్టాన్ని భర్తీ చేస్తుంది. ఒక విధంగా ఇది బీమా సాధనంలా పనిచేస్తుంది. ఇకపై సీడీఎస్‌లలో క్రయ, విక్రయాలకూ అనుమతించడం సానుకూల నిర్ణయంగా మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. తగినంత రిస్క్ నిర్వహణలో భాగంగానే సీడీఎస్‌ల్లో కొనుగోళ్లు, విక్రయాలకు మ్యూచువల్ ఫండ్స్ సంస్థలను అనుమతిస్తున్నట్టు సెబీ ప్రకటించింది. డెట్ సెక్యూరిటీలో పెట్టుబడుల విలువకు మించి సీడీఎస్‌లలో ఎక్స్‌పోజర్ తీసుకోరాదని సెబీ షరతు పెట్టింది.

పూర్వపు స్థితికి విదేశీ పర్యాటకుల రాక

- కరోనా ముందస్తు స్థాయికి చేరువ
- విదేశీ మారకంలో వృద్ధి
- ఆరు నెలల్లో రూ.2లక్షల కోట్లు
- క్రిసిల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ నివేదిక



ముంబై: దేశానికి వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య కరోనా పూర్వపు స్థాయికి చేరువ అయినట్టు క్రిసిల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ అండ్ అనలైటిక్స్ తెలిపింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు మొత్తం 47.8లక్షల మంది విదేశీ పర్యాటకులు భారత్‌ను సందర్శించారు. 2019లో మొదటి ఆరు నెలల్లో వచ్చిన సంఖ్యలో ఇది 90 శాతానికి సమానమని పేర్కొంది. అయితే కరోనా ముందు నాటితో పోల్చితే విదేశీ పర్యాటకుల ద్వారా సమకూరే ఆదాయంలో (విదేశీ మారకం ఆదాయం) 23 శాతం వృద్ధి కనిపించిందని, పర్యాటకులు గతంతో పోల్చితే చేసే ఖర్చు పెరిగిందని తెలిపింది. ఈ మేరకు క్రిసిల్ ఓ నివేదిక విడుదల చేసింది. అంతర్జాతీయంగా చూస్తే ఈ ఏడాది మొదటి ఏడు నెలల్లో వివిధ దేశాలను సందర్శించే విదేశీ పర్యాటకులు 2019లోని ఇదే కాలంతో పోల్చి చూస్తే 96 శాతానికి చేరారు. అంతర్జాతీయ సగటు కంటే భారత్‌లో కొంత తక్కువగా 90 శాతానికి చేరడం గమనార్హం.

బంగ్లా, చైనా నుంచి తగ్గిన డిమాండ్

బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ పరిస్థితుల కారణంగా అక్కడి నుంచి వచ్చే వారు తగ్గడం, చైనా నుంచి నేరుగా విమాన సర్వీసులు నిలిపివేయడం డిమాండ్‌పై ప్రభావం చూపించినట్టు క్రిసిల్ నివేదిక తెలిపింది. 2019లో ఈ రెండు దేశాల నుంచే 27 శాతం మేర విదేశీ పర్యాటకులు భారత్‌ను సందర్శించడం గమనార్హం. ఖతార్, దుబాయ్, వియత్నాం, శ్రీలంక నుంచి వచ్చే సందర్శకులు 2019తో పోల్చితే పెరిగారు. సానుకూల వీసా విధానాలు, అందుబాటు ధరల్లో ఆప్షన్లు పెరగడం ఇందుకు మద్దతుగా నిలుస్తున్నాయి. ఖతార్ నుంచి వచ్చే సందర్శకుల్లో 47 శాతం పెరుగుదల కనిపించగా, దుబాయ్ నుంచి 11 శాతం, వియత్నాం నుంచి 4 శాతం, శ్రీలంక నుంచి 0.2 శాతం మేర అధికంగా 2019తో పోల్చితే ఈ ఏడాది జనవరి-జూన్‌లో భారత్‌ను సందర్శించారు.

ఖర్చు చేస్తున్నారు..

ఫైవ్ స్టార్ హోటల్ రేట్లు 2019 నుంచి చూస్తే 20 శాతం పెరిగాయి. విలాసవంతమైన ఆతిథ్యం, ఆహార అనుభవానికి పర్యాటకులు ప్రాధాన్యమిస్తున్నారు. ఫలితంగా 2019లో మొదటి ఆరు నెలల్లో విదేశీ పర్యాటకుల ద్వారా రూ.1.5 లక్షల కోట్లు రాగా, ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో రూ.2 లక్షల కోట్లు సమకూరినట్టు క్రిసిల్ నివేదిక వెల్లడించింది. ఇక మన దేశం నుంచి విదేశాలను సందర్శించే పర్యాటకులు కరోనా ముందు నాటితో పోల్చి చూస్తే ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో 12 శాతం అధికంగా ఉండడం గమనార్హం. అంతర్జాతీయ పర్యాటక వృద్ధికి భారత పర్యాటకులు చోదకంగా నిలుస్తున్నారు. ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం పర్యాటకంపై ప్రభావం చూపిస్తోంది. భారత పర్యాటకులు ఒకటికి మించిన విదేశీ ట్రిప్‌లకు ఆసక్తి చూపిస్తున్నారు. ఖర్చు చేసే ఆదాయం పెరగడం, చార్జీలు మరింత అందుబాటులోకి రావడం, విమానయాన అనుసంధానత పెరగడం, వీసా జారీ ప్రక్రియ సులభంగా మారడం వృద్ధికి మద్దతిస్తున్నట్టు క్రిసిల్ నివేదిక వివరించింది.

క్వార్టర్స్‌లో శ్రీకాంత్

మకావ్: భారత బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్ మకావ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 టోర్నీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 38వ ర్యాంకర్ శ్రీకాంత్ 21–13, 21–18తో భారత్‌కే చెందిన ప్రపంచ 57వ ర్యాంకర్ ఆయుశ్ శెట్టిపై గెలుపొందాడు. 37 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్‌కు కొంత ప్రతిఘటన ఎదురైనా కీలకదశలో పాయింట్లు సాధించి వరుస గేముల్లో విజయాన్ని అందుకున్నాడు. తొలి గేమ్‌లో స్కోరు 12–10 వద్ద శ్రీకాంత్ వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి 16–10తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అదే జోరులో గేమ్‌ను దక్కించుకున్నాడు. రెండో గేమ్‌లో తేరుకున్న ఆయుశ్ ఒకదశలో 14–10తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అయితే ప్రపంచ మాజీ నంబర్‌వన్ శ్రీకాంత్ ఒక్కసారిగా విజృంభించి వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి అంతరాన్ని తగ్గించాడు. ఆ తర్వాత ఆయుశ్ ఒక పాయింట్ నెగ్గగా... ఆ వెంటనే శ్రీకాంత్ చెలరేగి వరుసగా ఐదు పాయింట్లు సాధించి 19–16తో ఆధిక్యంలోకి వచ్చాడు. ఈ దశలో ఆయుశ్ రెండు పాయింట్లు సాధించినా, మరోవైపు శ్రీకాంత్ మూడు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. మహిళల సింగిల్స్ విభాగంలో భారత కథ ముగిసింది. బరిలో మిగిలిన ఏకైక ప్లేయర్ తస్నిమ్ మీర్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయింది. ప్రపంచ 18వ ర్యాంకర్ తొమోకా మియజాకి (జపాన్)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 67వ ర్యాంకర్ తస్నిమ్ 17–21, 21–13, 10–21తో పరాజయం పాలైంది.





గాయత్రి–త్రిసా జోడీ విజయం

మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి–త్రిసా జాలీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి–త్రిసా ద్వయం 22–20, 21–11తో లిన్ చి చున్–టింగ్ చున్ సున్ (చైనీస్ తైపీ) ద్వయంపై విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి (భారత్) జంట 17–21, 14–21తో వోంగ్ టియెన్ సి–లిమ్ చియెవ్ సియెన్ (మలేసియా) జోడీ చేతిలో ఓడిపోయింది.



చండీమల్ సెంచరీ: శ్రీలంక 306/3

గాలె: న్యూజిలాండ్‌పై తొలి టెస్టులో చక్కటి విజయాన్నందుకున్న శ్రీలంక జట్టు... రెండో టెస్టులోనూ అదే జోరు కొనసాగిస్తోంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం ప్రారంభమైన ఆఖరి టెస్టులో శ్రీలంక టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 306 పరుగులు చేసి భారీ స్కోరు దిశగా సాగుతోంది. దినేశ్ చండీమల్ (208 బంతుల్లో 116; 15 ఫోర్లు) సెంచరీతో చెలరేగగా... ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్ (166 బంతుల్లో 78 బ్యాటింగ్; 6 ఫోర్లు), కమిందు మెండిస్ (56 బంతుల్లో 51 బ్యాటింగ్, 8 ఫోర్లు, ఒక సిక్సర్) అజేయ అర్ధశతకాలతో రాణించారు. దిముత్ కరుణరత్నె (46) ఫర్వాలేదనిపించాడు. ఓపెనర్ పాథుమ్ నిసాంక (1) తొలి ఓవర్‌లోనే వెనుదిరగగా... దిముత్ కరుణరత్నెతో కలిసి చండీమల్ రెండో వికెట్‌కు 122 పరుగులు జోడించాడు. అనంతరం దిముత్ వెనుదిరిగినా... మాథ్యూస్ సహకారంతో చండీమల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. మూడో వికెట్‌కు 97 పరుగులు జతచేసిన అనంతరం చండీమాల్ ఔట్ కాగా.. కమిందు మెండిస్‌తో కలిసి మాథ్యూస్ తొలి రోజు ఆటను సంతృప్తికరంగా ముగించాడు. వీరిద్దరూ అబేధ్యమైన నాలుగో వికెట్‌కు 85 పరుగులు జోడించారు. న్యూజిలాండ్ బౌలర్లలో టిమ్ సౌతీ, గ్లెన్ ఫిలిప్స్ చెరో వికెట్ పడగొట్టారు.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ హెడ్ కోచ్‌గా రుయ్ అమోరిమ్



సాక్షి, హైదరాబాద్: దేశవాళీ ఐ–లీగ్ టోర్నీలో గత రెండు సీజన్‌లలో రన్నరప్‌గా నిలిచిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు కొత్త హెడ్ కోచ్ వచ్చాడు. పోర్చుగల్‌కు చెందిన రుయ్ అమోరిమ్ తక్షణమే హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించి రాబోయే సీజన్ కోసం శ్రీనిధి జట్టును సిద్ధం చేయనున్నాడు. గత సీజన్‌లో హెడ్ కోచ్‌గా ఉన్న డొమింగొ ఒరామస్ ఇటీవల రాజీనామా చేయడంతో అతని స్థానంలో అమోరిమ్ వచ్చాడు. 2008 నుంచి అంతర్జాతీయ క్లబ్ ఫుట్‌బాల్‌లో కోచ్‌గా పని చేస్తున్న 47 ఏళ్ల అమోరిమ్ ఇప్పటి వరకు 10 క్లబ్‌కు కోచ్‌గా వ్యవహరించాడు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన ఎస్‌సీ నోజ్నో క్లబ్ జట్టుకు ఈనెల 14 వరకు అమోరిమ్ కోచ్‌గా పని చేసి అక్కడి నుంచి శ్రీనిధి డెక్కన్ క్లబ్‌కు రానున్నారు. 'శ్రీనిధి డెక్కన్ జట్టులో చేరేందుకు ఉత్సాహంగా ఉన్నాను. నా అనుభవాన్ని పంచుకొని జట్టు మరింత ఉన్నతస్థితికి ఎదిగేందుకు కృషి చేస్తా' అని అమోరిమ్ వ్యాఖ్యానించాడు.

యువ భారత్‌దే వన్డే సిరీస్

మూడో మ్యాచ్‌లోనూ ఆస్ట్రేలియాపై విజయం

పుదుచ్చేరి: సొంతగడ్డపై సమష్టిగా కదంతొక్కిన భారత **అండర్–19** జట్టు ఆస్ట్రేలియాపై వన్డే సిరీస్ ను 3–0తో క్లీన్ స్వీప్ **చేసింది.** గురువారం జరిగిన చివరి వన్డేలో భారత జట్టు 7 పరు**గుల** తేడాతో ఆస్ట్రేలియా జట్టును ఓడించింది. మొదట యు**వ** భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 324 పరుగులు చేసింది. కెప్టెన్ మహమ్మద్ అమాన్ (71; 6 ఫోర్లు, ఒక సిక్సర్), రుద్ర పటేల్ (77; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకాలతో రాణించారు. వికెట్ కీపర్ హర్‌వన్ష్ పంగలియా (46; 5 ఫోర్లు), కిరణ్ చోర్మలే (30; ఒక ఫోర్, 2 సిక్సర్లు), హార్దిక్ రాజ్ (30; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఫర్వాలేదనిపించారు. ఆసీస్ బౌలర్లలో ఎయిడెన్ ఓ కానర్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 317 పరుగులకు పరిమితమైంది. ఆస్ట్రేలియా అండర్–19 జట్టు కెప్టెన్ ఒలీవర్ పీక్ (111; 9 ఫోర్లు, 2 సిక్సర్లు), స్టీవ్ హొగన్ (104; 10 ఫోర్లు, 4 సిక్సర్లు) సెంచరీలతో అదరగొట్టారు. వీరిద్ద**రి** దెబ్బకు ఆస్ట్రేలియా 41 ఓవర్లలో 241/2తో పటిష్ట స్థి**తిలో** నిలిచింది. ఇక ఆ జట్టు గెలవడం ఖాయమే అనుకు**ంటున్న** దశలో భారత యువ బౌలర్లు సత్తాచాటి ప్రత్యర్థికి **జోరుకు** బ్రేకులు వేశారు. చివర్లో ఎయిడెన్ ఓ కానర్ (20 బం**తుల్లో 35; 3** ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుపులు మెరిపించినా ఫలితం లేక**పోయింది. భారత** బౌలర్లలో హార్దిక్ రాజ్ 3, కిరణ్, యుధజిత్ చెరో రెండు **వికెట్లు పడగొట్టారు.**



మాంట్రియాల్: భారత సంతతి గోల్ఫర్ తీగల సాహిత్ రెడ్డి ప్రతిష్టాత్మక ప్రెసిడెంట్స్ కప్‌లో అమెరికా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని దక్కించుకున్నాడు. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారత సంతతి గోల్ఫర్‌గా సాహిత్ చరిత్రకెక్కాడు. గురువారం ప్రారంభమైన ఈ టోర్నీలో అమెరికా జట్టు... యూరోప్ దేశాల మినహా ఇతర దేశాల ఆటగాళ్లతో కూడిన రెస్ట్ ఆఫ్ వరల్డ్ జట్టుతో పోటీపడుతోంది. రాయల్ మాంట్రియాల్ గోల్ఫ్ క్లబ్‌లో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో ఆడటం చాలా సంతోషంగా ఉందని పీజీఏ టూర్ టైటిల్ సాధించిన సాహిత్ పేర్కొన్నాడు. సాహిత్ తల్లిదండ్రులు మురళీధర్, కరుణ 1980 దశకంలో హైదరాబాద్ నుంచి అమెరికాకు వెళ్లి స్థిరపడ్డారు. సాహిత్ కాలిఫోర్నియాలో పుట్టి పెరిగాడు.

ప్రెసిడెంట్స్ కప్‌లో తీగల సాహిత్ రెడ్డి

'మా నాన్న భారత్ నుంచి అమెరికాకు వచ్చినప్పుడు ఇలాంటి ఒక రోజు వస్తుందని కచ్చితంగా ఊహించి ఉండడు. ప్రెసిడెంట్స్ కప్‌లో పాల్గొనడం అంటే మామూలు విషయం కాదు. వచ్చిన అవకాశాలను వినియోగించుకుంటూ ముందుకు ఎలా సాగాలో మా నాన్న నుంచే నేర్చుకున్నా. ప్రతిష్టాత్మక టోర్నీలో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడానికి మించి ఏం ఉంటుంది. మెరుగైన ప్రదర్శన కనబర్చేందుకు ప్రయత్నిస్తా. కుటుంబ సభ్యుల సమక్షంలో ఆడనుండటం మరింత ఉత్సాహాన్నిస్తోంది'అని సాహిత్ పేర్కొన్నాడు. 1994 నుంచి ఈ టోర్నీని నిర్వహిస్తుండగా... ఇప్పటి వరకు 14 ఎడిషన్‌లు జరిగాయి. అందులో 12 సార్లు గెలిచిన అమెరికా జట్టు ఒకసారి ఓడిపోయింది. మరో మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది.



సెమీఫైనల్లో రిత్విక్ చౌదరీ జోడీ

సాక్షి, హైదరాబాద్: బ్యాంకాక్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ డబుల్స్‌లో సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు. థాయ్‌లాండ్‌లోని నొంతాబురి పట్టణంలో ఈ టోర్నీ జరుగుతోంది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రిత్విక్–అర్జున్ ఖడే (భారత్) ద్వయం 7–6 (7/3), 7–6 (7/5)తో గాబ్రియెల్ డియాలో (కెనడా)–సీటా వతనాబె (జపాన్) జోడీని ఓడించింది. గంటా 47 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రెండు జంటలు తమ సర్వీస్‌ను రెండు సార్లు చొప్పున కోల్పోయాయి. అయితే టైబ్రేక్‌లో రిత్విక్–అర్జున్ ద్వయం పైచేయి సాధించి విజయాన్ని దక్కించుకుంది. ఇదే టోర్నీలో ఆడుతున్న రామ్‌కుమార్ రామనాథన్ (భారత్)–తొషిహిడె మత్సుయ్ (జపాన్) జోడీ కూడా సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో రామ్–తొషిహిడె జంట 6–3, 6–4తో అలెజాండ్రో మొరో కనాస్ (స్పెయిన్)–మార్కో ట్రునగెలిటి (అర్జెంటీనా) జోడీపై గెలిచింది.

మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్ బోణీ

చెన్నై: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టోర్నీలో తొలిసారి బరిలోకి దిగిన మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్ జట్టు మొదటి విజయాన్ని అందుకుంది. భారత్‌లోని అతి పురాతన ఫుట్‌బాల్ క్లబ్‌లలో ఒకటైన మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్... గురువారం జరిగిన తమ మూడో లీగ్ మ్యాచ్‌లో 1–0 గోల్ తేడాతో చెన్నైయిన్ ఫుట్‌బాల్ క్లబ్‌ను ఓడించింది. ఆట 39వ నిమిషంలో లాల్‌రెమ్‌సంగా ఫనాయ్ గోల్ సాధించి మొహమ్మదాన్ జట్టుకు విజయాన్ని అందించాడు. కోల్‌కతాలో 1889లో ఏర్పాటైన మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్ గత ఏడాది భారత దేశవాళీ టోర్నీ ఐ–లీగ్‌లో విజేతగా నిలిచి ఐఎస్‌ఎల్‌లో పోటీపడే అవకాశాన్ని దక్కించుకుంది. మొత్తం 13 జట్లు పోటీపడుతున్న ఐఎస్‌ఎల్‌లో ప్రస్తుతం మొహమ్మదాన్ జట్టు మూడు మ్యాచ్‌లు ఆడింది. ఒక మ్యాచ్‌లో గెలిచి, మరో మ్యాచ్‌లో ఓడి, ఇంకో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకొని నాలుగు పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. కోల్‌కతా వేదికగా నేడు జరిగే మ్యాచ్‌లో గోవా ఎఫ్‌సీ జట్టుతో ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సీ జట్టు తలపడుతుంది.


లాల్‌రెమ్‌సంగా

క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో స్నేహిత్ ఓటమి


స్నేహిత్

బీజింగ్: చైనా స్మాష్–2024 వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నీలో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. గురువారం మొదలైన ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్‌లో భారత్ తరఫున నలుగురు ప్లేయర్లు బరిలోకి దిగారు. మనుశ్ ఉత్పల్‌భాయ్ షా మినహా మిగతా ముగ్గురు తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో తెలంగాణ ప్లేయర్ సూరావజ్జుల స్నేహిత్ 11–6, 7–11, 3–11, 3–11తో మా జిన్‌బావో (అమెరికా) చేతిలో... హర్మీత్ దేశాయ్ 6–11, 11–9, 6–11, 11–8, 5–11తో కార్ల్‌సన్ (స్వీడన్) చేతిలో... సత్యన్ 9–11, 13–11, 6–11, 11–9, 4–11తో జు హైడాంగ్ (చైనా) చేతిలో ఓటమి చవిచూశారు. మనుశ్ షా 4–11, 11–5, 11–4, 3–11, 11–8తో చాన్ బాల్డ్‌విన్ (హాంకాంగ్)పై నెగ్గాడు. మహిళల క్వాలిఫయింగ్ సింగిల్స్‌లో తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో అహిక ముఖర్జీ, సుతీర్థ ముఖర్జీ తమ ప్రత్యర్థులను ఓడించి రెండో రౌండ్‌కు చేరారు.

'యువతరానికి బ్రాండ్ అంబాసిడర్‌లు'

చెస్ ప్లేయర్లకు కేంద్ర క్రీడాశాఖ మంత్రి మాండవీయ కితాబు



అర్జున్‌కు చెక్ అందజేస్తున్న కేంద్ర క్రీడా మంత్రులు రక్షా ఖాడ్సే, మన్‌సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ: చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణ పతకాలు సాధించిన భారత పురుషుల, మహిళల జట్లను కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియా ప్రత్యేకంగా అభినందించారు. బుడాపెస్ట్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో చాంపియన్‌లుగా నిలిచి భారత చదరంగ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించిన ప్లేయర్లను మన్‌సుఖ్‌తోపాటు కేంద్ర క్రీడా సహాయ మంత్రి రక్షా ఖాడ్సే గురువారం న్యూఢిల్లీలో సన్మానించారు. 'అంతర్జాతీయ స్థాయిలో పతకాలు గెలవడం ద్వారా దేశ ప్రజలను గర్వపడేలా చేశారు. దీంతో పాటు వారసత్వ క్రీడలో మన సత్తా ఏంటో నిరూపించారు. ఏ ఆటలోనైనా నైపుణ్యాన్ని గుర్తించి వారికి అండగా నిలవడంలో కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది. అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతున్న క్రమంలో క్రీడారంగంలో మన అథ్లెట్లు సాధించే విజయాలు దేశానికి మరింత గుర్తింపు తెచ్చిపెడతాయి. ఒలింపియాడ్‌లో పతకాలు నెగ్గిన ప్లేయర్లు దేశంలో యువతరానికి బ్రాండ్ అంబాసిడర్‌ల వంటి వాళ్లు' అని మాండవీయ తెలిపారు. వందేళ్ల చరిత్ర ఉన్న చెస్ ఒలింపియాడ్‌లో భారత జట్లు పసిడి పతకాలు సాధించడం ఇదే తొలిసారి కాగా.. ఈ ప్రదర్శనతో దేశంలో చిన్నారులు, యువతలో ఆటల పట్ల ఆకర్షణ మరింత పెరుగుతుందని కేంద్ర మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దొమ్మరాజు గుకేశ్, ద్రోణవల్లి హారికలతో మాండవీయ సరదాగా చెస్ ఆడారు. స్వర్ణ పతకాలు నెగ్గిన భారత జట్ల సభ్యులకు కేంద్ర క్రీడా శాఖ రూ. 20 లక్షల చొప్పున నగదు పురస్కారాన్ని చెక్‌ల రూపంలో అందించింది.



ద్రోణవల్లి హారికకు చెక్ అందజేస్తున్న కేంద్ర క్రీడా మంత్రులు రక్షా ఖాడ్సే, మన్‌సుఖ్ మాండవీయ

సాక్షి ప్లస్
శుక్రవారం। 27-9-2024



అంతరిక్షంలో పిజ్జా తయారీ

వ్యోమగాములు బుచ్ విల్మోర్, సునీతా విలియమ్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో పిజ్జా తయారు చేస్తున్న దృశ్యమిది. ఐఎస్ఎస్‌లోని యూనిటీ మాడ్యూల్ లోపలున్న గ్యాలీలో వీరు ఈ నెల 9న పిజ్జా తయారు చేశారని నాసా తెలిపింది. గురుత్వాకర్షణ శక్తి శూన్యం కావడంతో వంట సామగ్రి ఎగిరిపోకుండా గ్యాలీకి టేప్‌తో అంటించారని తెలిపింది.

సియాచిన్‌లో ముర్ము



సైనిక దుస్తుల్లో అమరులకు నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ: భారత సర్వసైన్యాధ్యక్షురాలు, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం ప్రపంచంలోనే అతి ఎత్తైన యుద్ధ క్షేత్రం సియాచిన్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె సైనికులతో మాట్లాడారు. దేశం యావత్తూ వారి ధైర్య సాహసాలకు సెల్యూట్ చేస్తోందంటూ కొనియాడారు. మాతృభూమి కోసం మైనస్ 50 డిగ్రీల ఉష్ణోగ్రతలు, భారీ మంచు వంటి అత్యంత క్లిష్టమైన వాతావరణం మధ్య విధులు నిర్వరిస్తున్న సైనికుల అసమాన త్యాగనిరతికి, సహనానికి ప్రతీకలుగా నిలిచారని ప్రశంసలు కురిపించారు. సాయుధ దళాల సుప్రీం కమాండర్‌గా వారిని చూసి తాను గర్విస్తున్నానన్నారు. మిలటరీ దుస్తులు ధరించిన రాష్ట్రపతి ముర్ము..అక్కడున్న వార్ మెమోరియల్ వద్ద నివాళులర్పించారని రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. అంతకుముందు, థోయిస్ ఎయిర్‌ఫీల్డ్‌కు చేరుకున్న రాష్ట్రపతి ముర్ముకు లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ బ్రిగేడియర్ బీడీ మిశ్రా స్వాగతం పలికారు. సియాచిన్ సైనిక శిబిరాన్ని సందర్శించిన మూడో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. గతంలో ఏపీజే అబ్దుల్ కలాం 2004 ఏప్రిల్‌లో, రామ్ నాథ్ కోవింద్ మే 2018లో సియాచిన్‌కు వెళ్లారు. కారకోరమ్ పర్వత శ్రేణిలో 20 వేల అడుగుల ఎత్తులో సియాచిన్ హిమానీనదం ఉంది.

హరియాణాలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ విఫలం



అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ మాదే విజయం: మోదీ

చండీగఢ్: హరియాణాలో నిత్యం అంతర్గత కుమ్ములాటల్లో మునిగితేలే కాంగ్రెస్‌కు ప్రజా సంక్షేమం పట్ల శ్రద్ధ ఉంటుందా? అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశ్నించారు. కాంగ్రెస్ సంగతి రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ తెలుసని చెప్పారు. రాష్ట్రానికి సేవ చేయడానికి బీజేపీకి మరో అవకాశం ఇవ్వాలని ప్రజలు నిర్ణయించుకున్నారని, త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తమ పార్టీదేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ గురువారం 'నమో యాప్'ద్వారా హరియాణా బీజేపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. వారితో సంభాషించారు. బూత్ స్థాయిలో పార్టీ కార్యాచరణపై చర్చించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచేలా పటిష్టమైన ప్రణాళికతో ముందుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా విపక్ష కాంగ్రెస్‌పై మోదీ నిప్పులు చెరిగారు. హరియాణాలో కాంగ్రెస్ గత పదేళ్లపాటు ప్రతిపక్షంగా ఘోరంగా విఫలమైందని అన్నారు. ఒకరినొకరు తన్నుకోవడానికి ఆ పార్టీ నాయకులకు సమయం చాలడం లేదని ఎద్దేవా చేశారు. హరియాణా ఎన్నికల్లో అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ తమపై పోరాటం చేస్తోందని అన్నారు. ఆ పార్టీ పెద్దలు పదేపదే అబద్ధాలు చెబుతున్నారని, జనాన్ని మాయ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల మాటలకు తలా తోక లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ లౌడ్‌స్పీకర్లు బలహీనపడ్డాయన్నారు. విపక్ష నేతలు పదేళ్లపాటు ప్రజలకు దూరంగా ఉన్నారని, వారికి అధికారం దక్కదని తేల్చిచెప్పారు. 1990వ దశకంలో హరియాణాలో బీజేపీ కోసం విస్తృతంగా పనిచేశానని నరేంద్ర మోదీ గుర్తుచేసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి పోలింగ్ బూత్‌లో బీజేపీ అభ్యర్థులకు మెజార్టీ దక్కేలా కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మన జెండా సగర్వంగా రెపరెపలాడాలని చెప్పారు. పాత తరమైనా, కొత్త తరమైనా.. బీజేపీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలను చూసి తాను స్ఫూర్తి పొందుతూ ఉంటానని వివరించారు.

ఉపాధి రంగాన్ని నాశనం చేశారు



పక్కా ప్రణాళికతో చేసిన కుట్ర ఇది : రాహుల్

చండీగఢ్/హిసార్: పక్కా ప్రణాళికతో దేశంలో ఉపాధి రంగాన్ని ప్రధాని మోదీ సర్వ నాశనం చేశారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. గురువారం హరియాణా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అసంద్ పట్టణం, హిసార్ జిల్లాలోని బర్వాలా పట్టణాల్లో రాహుల్ ప్రచార ర్యాలీల్లో మాట్లాడారు. ''రాష్ట్ర బీజేపీ సర్కార్ హరియాణాలో విధ్వంసం సృష్టించింది. ఈసారి ఎన్నికల్లో తుపాను రాబోతోంది. కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుంది. మేం ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయబోతున్నాం'అని అన్నారు. అమెరికా పర్యటనలో హరియాణాకు చెందిన యువతను కలిసిన విషయాన్ని రాహుల్ ప్రస్తావించారు. ''హరియాణా నుంచి బతుకుదెరువు కోసం అమెరికాకు వచ్చి డలాస్, టెక్సాస్ వంటి రాష్ట్రాల్లో తలదాచుకుంటున్న యువతను కలిశా. ఒకే గదిలో 15-20 మంది ఉంటున్నారు. అమెరికాకు ఎలా రాగలిగారు? అసలు ఎందుకు వచ్చారు? అని ప్రశ్నించా. కజకిస్తాన్, తుర్కియే మీదుగా దక్షిణ అమెరికా దేశాలకు, ఆ తర్వాత పనామా అడవులను దాటుకుని ఎట్టకేలకు అమెరికాకు చేరుకున్నారు. మార్గమధ్యంలో రవాణా మాఫియా చేతుల్లో లూటీకి గురయ్యారు. కొందరు ప్రాణాలు కోల్పోయారని వాళ్లు చెప్పారు. అమెరికా రావాలంటే కనీసం రూ.35 లక్షలు ఖర్చవతుందని, అత్యధిక వడ్డీకి రుణం తెచ్చుకోవడమో, ఉన్న పొలాన్ని అమ్ముకోవడమే చేశామని వాపోయారు. హరియాణాలోనే ఏదైనా వ్యాపారాలు చేసుకోబోయారా? అని అడిగా. హరియాణాలో రూ.50 లక్షలతో వ్యాపారం మొదలెట్టినా కలిసిరాలేదని ఒకరు చెప్పారు. అస్తవ్యస్తంగా తయారైన జీఎస్‌టీ విధానంతో వ్యాపారంలో లాభాలు రావట్లేదని ఇంకొకరు చెప్పారు. చివరకు చైనా ఉత్పత్తులను విక్రయించినా లాభంలేక అమెరికా బాట పట్టామని వేరే వ్యక్తి చెప్పారు''అని రాహుల్ అక్కడి హరియాణా యువత వ్యథలను వెల్లడించారు. ''యువతకు ఉపాధి కల్పించకుండా చేసి రాష్ట్ర బీజేపీ సర్కార్ హరియాణాను నాశనం చేసింది. మా పోరాటం ఒక్క హరియాణా కోసం కాదు. యావత్ భారతావని కోసం. రాజ్యాంగం అమలుకాకుండా ఆర్ఎస్ఎస్ చేసే కుట్రలు సాగనివ్వం''అని అన్నారు.

కశ్మీర్‌పై ఉగ్ర నీడ కూడా పడనివ్వం



ఆయుధాలు వీడి చర్చలకు రండి..లేదా చావుకు సిద్ధమవ్వండి: అమిత్ షా

ఉధంపూర్/చెనాని: 'జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని బొందపెట్టాం, మళ్లీ పెరిగే అవకాశమే లేకుండా చేస్తాం. ఆ నీడ కూడా పడనివ్వం'అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుండబద్దలు కొట్టారు. బీజేపీ హయాంలో కశ్మీర్‌ను ఉగ్రవాద రహితంగా మారుతుందని స్పష్టం చేశారు. ఉగ్రమూకలు ఆయుధాలను వీడి ప్రభుత్వంతో చర్చలకు రావాలి లేదా చావుకు సిద్ధమవ్వాలని గట్టి హెచ్చరికలు చేశారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని పెంచిపోషించే వారికి ఉరి తప్పదని, పార్లమెంట్‌పై దాడి కేసులో దోషి అఫ్జల్ గురును ఉదహరిస్తూ అమిత్ షా హెచ్చరించారు. అఫ్జల్ గురును ఉరి తీయాల్సింది కాదంటూ ఇప్పుడు కాంగ్రెస్, ఎన్‌సీ నేతలు మాటమార్చడాన్ని ఆయన ఖండించారు. 'ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్న నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ), కాంగ్రెస్‌లు ఉగ్రవాదులతో చర్చలంటూ మాట్లాడుతున్నాయి. వారు చర్చలకు రావాలనుకుంటే ముందుగా ఆయుధాలను వదిలేయాలి. లేకుంటే మన బలగాలు వెంటాడి చంపుతాయి'అని అమిత్ షా తీవ్ర స్వరంతో అన్నారు. 'ఉగ్రవాదులు, బలగాలపైకి రాళ్లు రువ్విన వారిని జైలు నుంచి విడుదల చేయాలని కాంగ్రెస్, ఎన్‌సీలు కోరుకుంటున్నాయి. అలాంటి కలలు కనడం మానాలని ఎన్‌సీ నేత ఒమర్ అబ్దుల్లాను కోరుతున్నా. దోషులను విడుదల చేయాలా వద్దా అనేది తేలాల్సింది కోర్టులోనే. రాళ్లు విసిరే ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు తీసుకొచ్చాం'అని అమిత్ షా చెప్పారు. ఉధంపూర్, కథువా, జమ్మూ జిల్లాల్లో గురువారం జరిగిన ఐదు ఎన్నికల ర్యాలీల్లో అమిత్ షా మాట్లాడారు. అననుకూల వాతావరణం కారణంగా చెనానిలో ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ల్యాండవ్వలేదు. దీంతో, ఉధంపూర్ వెళ్లి అక్కడి నుంచి రోడ్డు మార్గంలో చనానీకి మంత్రి అమిత్ షా చేరుకున్నారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ ఆయన... కొండ ప్రాంతాల్లో సైతం ఢిల్లీ, గుజరాత్‌లతో మాదిరి రహదారులను నిర్మించిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ)ల కూటమి అధికారంలోకి వస్తే పాకిస్తాన్ ఎజెండాయే ఇక్కడ అమలవుతుందని హెచ్చరించారు.

అవార్డును తిరస్కరించిన జుంపా లాహిరి



న్యూయార్క్: అమెరికాలోని క్వీన్స్ పట్టణంలోని ప్రముఖ ఇసాము నొగుచి మ్యూజియం తనకు ప్రకటించిన నొగుచి అవార్డ్‌ను భారతీయ మూలాలున్న రచయిత్రి జుంపా లహిరి తిరస్కరించారు. ఇజ్రాయెల్ దాడులతో రక్తమోడుతున్న పాలస్తీనియన్లకు సంఘీభావంగా తలకు అరబ్ వస్త్ర(కఫియా) ధరించినందుకు ముగ్గురు ఉద్యోగులను నొగుచి మ్యూజియం విధుల నుంచి తొలగించింది. ఈ తొలగింపునకు నిరసనగా తాను ఈ అవార్డ్‌ను తిరస్కరిస్తున్న పులిట్జర్ గ్రహీత అయిన జుంపా లాహిరి గురువారం ప్రకటించారు. దీనిపై మ్యూజియం నిర్వహణసంస్థ స్పందించింది. ''సిబ్బంది వేషధారణపై నియమాలను కఠినతరం చేశాం. ఆ నియమాలను ఉల్లంఘించినందుకే ఆ ముగ్గురిని తొలగించాం. అయితే ఈ ఉదంతంలో లాహిరి సొంత దృక్పథాన్ని గౌరవిస్తున్నాం''అని సంస్థ స్పష్టం చేసింది. జపాన్ అమెరికన్ శిల్పి, డిజైనర్ ఇసాము నొగుచి ఈ మ్యూజియంను 40 ఏళ్ల క్రితం నెలకొల్పారు. కొరియా సూక్ష్మ చిత్రకారుడు, రచయిత లీ ఉఫాన్‌తో కలిసి షెడ్యూల్ ప్రకారం వచ్చే నెలలో లాహిరి ఈ నొగుచి అవార్డ్‌ను తీసుకోవాల్సి ఉంది.

ఉరిశిక్ష నుంచి 56 ఏళ్ల తర్వాత విముక్తి



టోక్యో: హత్య కేసులో ఉరిశిక్ష ఖరారైన తర్వాత 56 ఏళ్లకు ఖైదీకి విముక్తి లభించిన ఘటన జపాన్‌లో చోటుచేసుకుంది. ఇవావో హకమదా వయసు ఇప్పుడు 88 ఏళ్లు. 1966లో అతడు తన యజమానిని, అతడి భార్యను, ఇద్దరు పిల్లలను హత్య చేసినట్లు కేసు నమోదైంది. విచారణ తర్వాత 1968లో ఇవావోను న్యాయస్థానం దోషిగా తేల్చింది. ఉరిశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. పోలీసులు అతడిని జైలుకు తరలించారు. అయితే, తాను నిర్దోషినని పేర్కొంటూ ఇవావో జైలు నుంచే న్యాయ పోరాటం సాగించాడు. ప్రజలు కూడా అతడికి మద్దతు పలికారు. రీట్రయల్‌కు కోర్టు అనుమతి ఇచ్చింది. అతడిని 2014లో జైలు నుంచి విడుదల చేసింది. అప్పట్లో ఇవావోపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు సాక్ష్యాలు సృష్టించినట్లు న్యాయస్థానం గుర్తించింది. అతడి నిర్దోషి అని గురువారం తీర్పు చెప్పింది. ఉరిశిక్ష పడి సుదీర్ఘకాలం ఖైదీగా కొనసాగి, కేసు నుంచి విముక్తి పొందిన మొదటి వ్యక్తి ప్రపంచంలో ఇవావో ఒక్కడే కావడం గమనార్హం. గురువారం తీర్పు సందర్భంగా 500 మందికిపైగా జనం కోర్టుకు తరలివచ్చారు. తీర్పు వెలువడిన తర్వాత వారంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఇవావో ప్రస్తుతం 91 ఏళ్ల తన వృద్ధ సోదరితో కలిసి ఉంటున్నాడు. అనారోగ్యం కారణంగా కోర్టుకు హాజరు కాలేకపోయాడు. ప్రొఫెషనల్ బాక్సర్ కూడా అయిన ఇవావో సాస్ తయారీ కంపెనీలో పనిచేసేవాడు. ఆ కంపెనీ యజమానిని, కుటుంబ సభ్యులను ఎవరో కత్తితో పొడిచి హత్యచేశారు. ఆ నేరం ఇవావోపై పడింది.

ఫైనాన్స్ ఛైర్మన్‌గా మహతాబ్

విదేశీ వ్యవహారాల కమిటీకి శశిథరూర్ ● పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల నియామకం

న్యూఢిల్లీ: పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల నియామకం పూర్తయ్యింది. బీజేపీ ఎంపీ భర్తృహరి మహతాబ్ ఫైనాన్స్ కమిటీ ఛైర్మన్ నియమితులయ్యారు. కాంగ్రెస్‌తో కుదిరిన అవగాహన మేరకు కీలకమైన విదేశాంగ శాఖకు శశిథరూర్‌ను ఛైర్మన్‌గా నియమించారు. హోంశాఖ స్టాండింగ్ కమిటీకి బీజేపీ ఎంపీ రాధామోహన్ దాస్ అగర్వాల్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ రక్షణశాఖ స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా ఉంటారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ ఏ కమిటీలోనూ సభ్యురాలిగా లేరు. పార్లమెంటులో మొత్తం 24 శాఖాపరమైన స్టాండింగ్ కమిటీలు ఉంటాయి. వీటిలో 16 కమిటీలు లోక్‌సభ సెక్రటేరియట్ పరిధిలో, 8 కమిటీలు రాజ్యసభ సెక్రటేరియట్ పరిధిలో పనిచేస్తాయి. ఆయా మంత్రిత్వశాఖల పనితీరును మదింపు చేస్తాయి. 24 కమిటీల్లో బీజేపీకి 11 ఛైర్మన్‌షిప్‌లు దక్కగా, మిత్రపక్షాలకు నాలుగు లభించాయి. కాంగ్రెస్ నాలుగు, డీఎంకే రెండు, తృణమూల్ కాంగ్రెస్ 2, సమాజ్‌వాది 1 స్టాండింగ్ కమిటీలకు నేతృత్వం వహించనున్నాయి.

రక్షణ కమిటీ: రాధామోహన్ సింగ్ (బీజేపీ); **ఇంధన కమిటీ:** శ్రీరంగ్ అప్పా బార్నే (శివసేన); **పెట్రోలియం, సహజవాయువు కమిటీ:** సునీల్ తత్కారే (ఎన్సీపీ); **బొగ్గు, గనులు, ఉక్కు కమిటీ:** అనురాగ్ ఠాకూర్ (బీజేపీ); **విద్యా కమిటీ:** దిగ్విజయ్ సింగ్ (కాంగ్రెస్); **రవాణా, టూరిజం, సాంస్కృతిక కమిటీ:** సంజయ్ ఝా (జేడీయూ); **హౌజింగ్, పట్టణాభివృద్ధి:** మాగుంట శ్రీనివాసులు రెడ్డి (టీడీపీ); **వ్యవసాయ, ఫుడ్ ప్రాసెసింగ్:** చరణ్‌జిత్ సింగ్ చన్నీ (కాంగ్రెస్); **గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్:** సప్తగిరి ఉలాకా (కాంగ్రెస్); **పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు:** తిరుచ్చి శివ (డీఎంకే) **ఆహార, ప్రజా పంపిణీ:** కె.కనిమొళి (డీఎంకే); **జలవనరుల కమిటీ:** రాజీవ్ ప్రతాప్ రూడీ (బీజేపీ); **కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ:** నిశికాంత్ దూబే (బీజేపీ); **ఆరోగ్య కమిటీ:** రామ్‌గోపాల్ యాదవ్ (సమాజ్‌వాది); **వాణిజ్యం:** డోలా సేన్ (టీఎంసీ); **ఎరువులు, రసాయనాలు:** కీర్తి ఆజాద్ (టీఎంసీ); **లా అండ్ జస్టిస్:** బ్రిజ్‌లాల్ (బీజేపీ); **శాస్త్ర, సాంకేతిక, పర్యావరణం, అడవులు:** భువనేశ్వర్ కాలితా (బీజేపీ); **కార్మిక కమిటీ:** బస్వరాజ బొమ్మై (బీజేపీ); **సామాజిక న్యాయం, సాధికారికత:** పి.సి.మోహన్ (బీజేపీ); **రైల్వే కమిటీ:** సి.ఎం.రమేష్ (బీజేపీ).

విద్యార్థికి సాయపడేందుకు ముందుకొచ్చిన సుప్రీంకోర్టు

సమయానికి ఇంజనీరింగ్ ప్రవేశ ఫీజు కట్టలేకపోయిన పేద విద్యార్థి

ముజఫర్‌నగర్: ఉత్తరప్రదేశ్‌లోని పేద విద్యార్థికి ఇంజనీరింగ్ సీటు ఖరారులో సాయపడేందుకు సుప్రీంకోర్టు ముందుకొచ్చింది. చదువుల్లో మేటి అయిన దళిత పేద విద్యార్థి అతుల్ కుమార్ కష్టపడి చదివి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించాడు. ప్రతిష్టాత్మక ఐఐటీ ధన్‌బాద్ కాలేజీలో ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో సీటు సాధించాడు. అయితే సీటును ఖరారుచేసుకునేందుకు తొలుత రూ.17,500 జూన్ 24వ తేదీన సాయంత్రం ఐదింటికల్లా చెల్లించాలి. టిటోరా గ్రామంలో వీళ్లది నిరుపేద కుటుంబం. దీంతో సమయానికి అంత డబ్బు జమచేయలేకపోయారు. చిట్టచివరికి అప్పులు చేసి ఆన్‌లైన్‌లో నాలుగు నిమిషాల ముందు చెల్లింపు చేయబోతే చెల్లింపు సాధ్యపడలేదు. గడువులోపు ఫీజు చెల్లించలేకపోయాడు. దీంతో తొలుత జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించగా పరీక్షను ఐఐటీ మద్రాస్ నిర్వహించినందున మద్రాస్ హైకోర్టుకు వెళ్లాలని సూచించింది. దీంతో మద్రాస్ హైకోర్టుకు వెళ్లారు. అక్కడ విచారణ నెమ్మదించడంతో ఈసారి నేరుగా సుప్రీంకోర్టు తలుపు తట్టారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ ఈ కేసును విచారించింది. ''ఈ విషయంలో మేం సాయంచేస్తాం'అని హామీ ఇచ్చింది. ఐఐటీ మద్రాస్‌కు కోర్టు నోటీసులు జారీచేసింది. కేసు తదుపరి విచారణ ఈనెల 30వ తేదీకి వాయిదావేసింది. అతుల్ సోదరులు కూడా చదువుల్లో మేటి. మంచి ర్యాంకులతో ఒకరు ఐఐటీ ఖరగ్‌పూర్‌లో, మరొకరు ఎన్ఐటీ హమీర్‌పూర్‌లో ఇంజనీరింగ్ చదువుతున్నారు. అప్పులుచేసి మరీ చదివిస్తున్నామని వీళ్ల తల్లిదండ్రులు తెలిపారు.

కార్మికుల కనీస వేతనాలు పెంచిన కేంద్రం

అక్టోబర్ ఒకటో తేదీ నుంచి అమలు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం కార్మికుల కనీస వేతనాలు పెంచింది. పెరుగుతున్న ధరలు, జీవన వ్యయాలను అసంఘటిత కార్మికులు తట్టుకునేందుకు వీలుగా వేతనాలను సవరిస్తూ గురువారం నిర్ణయం తీసుకుంది. సవరించిన తర్వాత నిర్మాణరంగ, పారిశుద్ధ్య కార్మికులు, సరకులు ఎక్కించే వాళ్లు, దించేవాళ్లు సహా 'ఏ'కేటగిరీలోని కార్మికులందరికీ కనీస వేతన రోజుకు రూ.783 దక్కనుంది. అంటే నెలకు రూ.20,358 వేతనం లభించనుంది. తక్కువ నైపుణ్యమున్న కార్మికులకు రోజుకు రూ.868 అంటే నెలకు రూ.22,568 కనీస వేతనం లభించనుంది. నైపుణ్యమున్న కార్మికులు అంటే ఆయుధం ధరించకుండా విధులు నిర్వర్తించే పర్యవేక్షకులు, పరిరక్షకులకు రోజుకు రూ.954 అంటే నెలకు రూ. 24,804 కనీస వేతనం దక్కనుంది. అత్యధిక నైపుణ్యముండే, సాయుధులైన పర్యవేక్షకులు, పరిరక్షకులకు రోజుకు రూ.1,035 అంటే నెలకు రూ.26,910 కనీస వేతనం అందనుంది. సవరించిన కొత్త వేతనాలు అక్టోబర్ 1 నుంచి అమలులోకి వస్తాయని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ తెలిపింది. చివరిసారిగా ఈఏడాది ఏప్రిల్‌లో సవరించారు.

'జీవిత్‌పుత్రిక' పండుగ.. నదీ స్నానానికెళ్లి 46 మంది మునక
వీరిలో 37 మంది చిన్నారులు

పట్నా: బిహార్‌లో 'జీవిత్‌పుత్రిక'వేడుక సందర్భంగా బుధవారం నదీ స్నానాలకు వెళ్లి 46 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 37 మంది చిన్నారులే కావడం గమనార్హం. తమ కుమారులు క్షేమంగా ఉండాలని కోరుకుంటూ తల్లులు ఉపవాసం ఉండి, నదీ స్నానాలు, పూజలు చేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 జిల్లాల్లో ప్రమాద ఘటనలు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఔరంగాబాద్‌లో అత్యధికంగా 8 మరణాలు నమోదయ్యాయన్నారు.

21 రోజులు కాల్పులు విరమించండి

ఇజ్రాయెల్, హెజ్‌బొల్లాకు అమెరికా, మిత్రదేశాలు పిలుపు

ఐరాస సమావేశం సందర్భంగా సంయుక్త ప్రకటన విడుదల

లెబనాన్‌లో వందల మంది అమాయకుల ప్రాణాలు బలితీసుకుంటున్న ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా పరస్పర దాడులను ఇకనైనా ఆపేసి, కాల్పుల విరమణ అమల్లోకి తేవాలని అమెరికా, ఇతర మిత్రదేశాలు పిలుపునిచ్చాయి. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా బుధవారం సంయుక్త ప్రకటన చేశాయి. 21 రోజులపాటు కాల్పులు ఆపేయాలని పిలుపునిచ్చాయి. యుద్ధం సహించరానిదని, ఇది ఆ ప్రాంతమంతా విస్తరించే ప్రమాదముందని హెచ్చరించాయి. కాల్పుల విరమణకు పిలుపునిచ్చిన దేశాల్లో అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, యురోపియన్ యూనియన్, ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ, ఇటలీ, జపాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్ ఉన్నాయి. "దౌత్యానికి చోటు కల్పించేందుకు లెబనాన్-ఇజ్రాయెల్ సరిహద్దుల్లో తక్షణమే 21 రోజుల పాటు కాల్పుల విరమణకు పిలుపునిచ్చాం. ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలపాలని ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభుత్వాలతో సహా అన్ని పక్షాలను కోరుతున్నాం"అని ప్రకటనలో పేర్కొన్నాయి. కాల్పులు ఆగితే చర్చలకు మార్గం సుగమం అవుతుందని ఆశాభావం వ్యక్తంచేశాయి.

- న్యూయార్క్/టెల్ అవీవ్

చర్చలే పరిష్కారం..

కాల్పుల విరమణకు హెజ్‌బొల్లా అంగీకరించదని, ఈ బృందంతో లెబనాన్ ప్రభుత్వం సమన్వయం చేస్తుందని తాము విశ్వసిస్తున్నామని అధికారులు తెలిపారు. కాల్పుల విరమణ పిలుపు ఇజ్రాయెల్-లెబనాన్ సరిహద్దుకు మాత్రమే వర్తిస్తుందని అమెరికా సీనియర్ అధికారులు స్పష్టంచేశారు. ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ, బందీల విడుదల ఒప్పందం కోసం నిలిచిపోయిన చర్చలను తిరిగి ప్రారంభించడానికి వీలుగా గాజాలో ఇజ్రాయెల్, హమాస్ మూడు వారాల కాల్పుల విరమణ ప్రకటించాలని సూచిస్తామని అధికారులు చెప్పారు. విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, జాతీయ భద్రతా సలహాదారు జాక్ సలేవాన్ నేతృత్వంలోని అమెరికా జాతీయ భద్రతా బృందం మిత్రదేశాలతో కలిసి ఈ ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు కృషి చేస్తోందని అమెరికా అధికారి తెలిపారు. ఆలస్యం చేయకుండా రెండు పక్షాలు దీనిని ఆమోదించాలని తాము ఆశిస్తున్నామని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీన్ నోయెల్ బరోట్ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశంలో చెప్పారు. ఈ సంక్షోభం నుంచి బయటపడటానికి లెబనాన్‌కు పూర్వపు వలసరాజ్య శక్తిగా ఉన్న ఫ్రాన్స్, అమెరికాలు ఇరు పక్షాలతో సంప్రదింపులు జరిపాయని, యుద్ధం అనివార్యం కాదని బరోట్ చెప్పారు.

కాల్పుల విరమణకు అవకాశం లేదన్న ఇజ్రాయెల్

కాల్పుల విరమణ పిలుపుపై ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ స్పందించారు. ప్రధాని నెతన్యాహూ విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఈయనే తాత్కాలిక ప్రధానిగా వ్యవహరిస్తారు. ''లెబనాన్‌తో సరిహద్దు పంచుకుంటున్న ఉత్తర ఇజ్రాయెల్ వద్ద కాల్పుల విరమణ కుదరదు. విజయం సాధించేదాకా పోరాటం కొనసాగిస్తాం. ఉత్తర ప్రాంతాల నుంచి తరలిపోయిన స్థానికులను తిరిగి వాళ్ల ఇళ్లకు వచ్చేలా చేస్తాం. దాడులు తగ్గించుకోవాలని మాకు నెతన్యాహూ నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు'' అని కట్జ్ అన్నారు. మరోవైపు లెబనాన్, గాజాల్లోని యుద్ధక్షేత్రాల్లో హెజ్‌బొల్లాపై దాడులు కొనసాగిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం బుధవారం ప్రకటించింది. కాల్పుల విరమణ అనేది అమెరికా, మిత్రదేశాల వైపు నుంచి ఉన్న ప్రతిపాదన మాత్రమేనని, దానికి నెతన్యాహూ ఇంకా స్పందించలేదని ప్రధాని కార్యాలయం తెలిపింది. ఈ ప్రతిపాదనపై ఇంకా హెజ్‌బొల్లా స్పందించలేదు.

సంక్షోభాన్ని అంతం చేయండి: బైడెన్

ఇజ్రాయెల్- హెజ్‌బొల్లా పరస్పర దాడులపై ఏబీసీ చాట్ షో 'ది వ్యూ'లో బైడెన్ మాట్లాడారు. యుద్ధం మధ్యప్రాచ్యం అంతటా విస్తరించే అవకాశం ఉందని హెచ్చరించారు. సంక్షోభాన్ని అంతం చేయడానికి స్వతంత్ర పాలస్తీనా దేశం పట్ల వ్యతిరేకతను మానుకోవాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూకు బైడెన్ సూచించారు. ఘర్షణలతో అతలాకుతలమైన ఈ ప్రాంతంలో అప్పుడే పరిష్కారం లభిస్తుందని బైడెన్ ఆశాభావం వ్యక్తం చేశారు. లెబనాన్‌లో ప్రవేశించేందుకు సైన్యాన్ని ఇజ్రాయెల్ అప్రమత్తం చేసిన నేపథ్యంలో బైడెన్ స్పందించడం గమనార్హం. లెబనాన్‌లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకోగలిగితే వెస్ట్‌బ్యాంక్‌తోనూ సంప్రదింపులు జరిపే అవకాశం ఉందని బైడెన్ అన్నారు. ''ఇది సాధ్యమే. దీనిని సాధించడానికి నేను నా బృందంలో ఉన్న ప్రతి శక్తిని ఉపయోగిస్తున్నాను. ఈ ప్రాంతంలో మార్పు చూడాలనే నా ఆకాంక్ష. నెతన్యాహు వైఖరితో నేను ఏకీభవించను. రెండు దేశాలు పరిష్కారం కోసం ముందుకు రావాలి'' అని బైడెన్ స్పష్టం చేశారు.

వీరనారి.. పరిపాలనాదక్షురాలు.. రాణి రుద్రమదేవి

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ హిస్టరీ

క్రీ.శ.1262లో పూర్తి రాజ్యభారాన్ని స్వీకరించిన రుద్రమదేవి కాకతీయ సామ్రాజ్యాన్ని సుమారు మూడు దశాబ్దాలపాటు పరిపాలించింది. స్త్రీలు రాజ్యాధికారం చేపట్టడం అరుదైన ఆ కాలంలో.. తండ్రి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా రుద్రమదేవి వీరనారిగా, పరిపాలనాదక్షురాలిగా చరిత్రలో నిలిచింది.



కాకతీయులు

గణపతిదేవుడు(క్రీ.శ.1199-1262)

దక్షిణ భారతదేశాన్ని ఏలిన గొప్ప చక్రవర్తుల్లో గణపతిదేవుడు ఒకరు. యాదవ రాజుల చెర నుంచి విడుదలైన గణపతిదేవుడు క్రీ.శ.1199 నుంచి రాజ్యపాలన చేశాడని శాసనాల ద్వారా తెలుస్తోంది. ఆయన రాజ్యానికి వచ్చినప్పుడు ఆంధ్రదేశ పరిస్థితులు రాజ్య విస్తరణకు అనుకూలంగా ఉన్నాయి. తీరాంధ్రలో గోదావరికి దక్షిణంగా ఉన్న ప్రాంతం చిన్న చిన్న రాజ్యాలుగా చీలిపోయింది. దీంతో గణపతిదేవుడు తీరాంధ్రపై దండెత్తాడు. రెండో రాజేంద్ర చోళుడి కుమారుడైన పృథ్వీశ్వరుడితో యుద్ధం చేశాడు.

క్రీ.శ.1201లో బెజవాడను ఆక్రమించిన కాకతీయ సైన్యం దివి ద్వీపాన్ని ముట్టడించింది. కానీ గణపతిదేవుడు ఆ ద్వీపాన్ని అయ్యవంశ రాజైన అయ్య పినచోడుకు తిరిగి ఇచ్చివేశాడు. అతడి కుమార్తెలైన నారాంబ, పేరాంబలను వివాహమాడాడు. బావమరిదైన జాయపుడికి తన కొలువులో గజసాహిణి అనే పదవిని ఇచ్చాడు. ఈ యుద్ధంతో గోదావరి నుంచి పెన్నా నది వరకు ఉన్న వెలనాటి చోళుల రాజ్యం కాకతీయుల హస్తగతమైంది. నెల్లూరు తెలుగు చోళులతో కాకతీయులకు స్నేహం ఉండేది. ఇది కాకతీయ రాజ్య విస్తరణకు తోడ్పడింది. పృథ్వీశ్వరుడిపై యుద్ధంలో గణపతిదేవుడికి చోడ తిక్కన సహాయం చేశాడు. దీనికి ప్రతిఫలంగా గణపతిదేవుడు నెల్లూరుపై దండెత్తాడు. తమ్ముసిద్ధిని ఓడించి చోడ తిక్కనకు సింహాసనం కట్టబెట్టాడు. ఈ యుద్ధాల వల్ల నెల్లూరు తెలుగు చోళుల రాజ్యంపై కాకతీయుల ఆధిపత్యం ఏర్పడింది.

కళింగ దండయాత్ర

పృథ్వీశ్వరుడిపై విజయం సాధించిన గణపతి దేవుడు కళింగ దండయాత్రను ప్రారంభించాడు. ఈ దండయాత్ర చేసిన వారిలో రేచర్ల రాజనాయకుడు, ఏరువ తెలుగు చోడ భీముడు ముఖ్యులు. ఉదయగిరి ఆక్రమణ తర్వాత కాకతీయ సైన్యం బస్తర్‌లో ప్రవేశించి చక్రకోటను జయించింది. తర్వాత గోదావరిని దాటి ద్రాక్షారామం చేరింది. కళింగ దండయాత్రతో కాకతీయ సైన్యం ప్రతిష్ఠ పెరిగింది. కానీ శాశ్వత ప్రయోజనం చేకూరలేదు. కాకతీయుల చేతిలో ఓడిన గాంగ సైన్యం కోల్పోయిన ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకుంది.

కమ్మనాడును పరిపాలిస్తున్న కొణిదెన చోళులు గణపతిదేవుణ్ని ఎదిరించి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు. తెలుగు చోళరాజు కుమారుడైన ఓబిలిసిద్ధి 'పొత్తపి'ని పరిపాలించేవాడు. కమ్మనాడును జయించాలని గణపతిదేవుడు ఇతణ్ని ఆజ్ఞాపించాడు. ఓబిలిసిద్ధి కొణిదెన చోళులతోపాటు అద్దంకి చక్రనారాయణ వంశ రాజులనూ ఓడించాడు. దీంతో గణపతిదేవుడు ఓబిలిసిద్ధిని కమ్మనాడుకు పాలకుడిగా నియమించాడు. గోదావరి మండలం కాకతీయుల వశమైంది. గణపతిదేవుడు జీవించి ఉన్నంత కాలం కళింగులు మళ్లీ యుద్ధం మాట ఎత్తలేదు.

క్రీ.శ.1248లో నెల్లూరుని పాలించే చోడ తిక్కన మరణించాడు. ఇతడి కుమారుడైన రెండో మనుమసిద్ధి(వీరగండ గోపాలుడు), అతడి దాయాది విజయగండ గోపాలుడి మధ్య రాజ్యం కోసం తగాదా వచ్చింది. ఈ పరిస్థితుల్లో రెండో మనుమసిద్ధి గణపతిదేవుడి సహాయం కోరాడు. మహాకవి తిక్కన సోమయాజితో రాయబారం పంపాడు.

దీంతో గణపతిదేవుడు సామంతభోజుని నాయకత్వంలో తన సైన్యాన్ని పంపాడు. గణపతి దేవుడు స్వయంగా నెల్లూరు వెళ్లి మనుమసిద్ధిని సింహాసనంపై అధిష్ఠింపజేశాడు. ఆ తర్వాత కాకతీయ సైన్యం ద్రావిడ మండలంలో ప్రవేశించింది. పళ్లైయూరు(తంజావూరు జిల్లా) యుద్ధంలో విజయగండ గోపాలుడిని, కర్ణాటక సైన్యాన్ని ఓడించింది. ఈ విజయాలతో కాకతీయ సామ్రాజ్యం దక్షిణదేశంలో కాంచీపురం వరకు విస్తరించింది.

క్రీ.శ.1263లో జరిగిన ముత్తుకూరు యుద్ధం మినహా తన జీవిత కాలంలో గణపతిదేవుడు అపజయం పొందలేదు. క్రీ.శ.1199 నుంచి క్రీ.శ.1262 వరకు అఖిలాంధ్ర సామ్రాజ్యాన్ని ఏకఛత్రాధిపత్యం కిందికి తెచ్చిన గొప్ప రాజనీతిజ్ఞుడు. ఓరుగల్లు కోట నిర్మాణాన్ని పూర్తి చేసి రాజధానిని ఓరుగల్లుకు మార్చాడు. గణపతిదేవుడికి ఇద్దరు కూతుళ్లు రుద్రమదేవి, గణపాంబ. రుద్రమదేవి గణపతి దేవుడి కూతురని కొలనుపాక, పానగల్లు శాసనాలు తెలుపుతున్నాయి. గణపతి దేవుడు రాజకీయ చతురతతో రుద్రమదేవిని తూర్పు చాళుక్య వంశ రాజు వీరభద్రుడికిచ్చి వివాహం చేశాడు. గణపాంబను కోట వంశ రాజైన బేతనకిచ్చి వివాహం చేశాడు.

రుద్రమదేవి(క్రీ.శ.1262-1289)

గణపతిదేవుడు రుద్రమదేవిని క్రీ.శ.1259లోనే రాజప్రతినిధిగా నియమించినప్పటికీ.. క్రీ.శ.1262లో పూర్తి రాజ్య భారాన్ని అప్పగించాడు. అయితే క్రీ.శ.1269లో గణపతిదేవుడు మరణించిన తర్వాత రుద్రమదేవి కాకతీయ రాజ్య కిరీటాన్ని ధరించింది. గణపతి దేవుడు రుద్రమాంబను రాణిని చేయడం నచ్చని కొంత మంది సామంత రాజులు, రాజబంధువులు ఆమెపై తిరుగుబాటు చేశారు. రుద్రమాంబ సవతి సోదరులైన హరిహర దేవుడు, మురారి దేవుడు ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. రుద్రమాంబ వారిని ఓడించి, మరణ శిక్ష విధించినట్లు 'ప్రతాపరుద్ర చరిత్ర' ద్వారా తెలుస్తోంది. కాయస్థరాజులైన జన్నిగదేవుడు, త్రిపురారి, వెలమనాయకుడైన ప్రసాదిత్యుడు, మల్యాల గుండియ నాయకుడు తదితరుల మద్దతుతో రుద్రమదేవి సింహాసనం దక్కించుకుంది. కాకతీయ రాజ్యంలో తిరుగుబాటు జరిగిన సమయంలో కళింగరాజు మొదటి నరసింహుడు గోదావరి మండలంపై దండెత్తి చాలా ప్రాంతాన్ని ఆక్రమించాడు. అనంతరం అతడి కుమారుడు గజపతి మొదటి వీర భానుదేవుడు ఒడ్డాది మత్స్యదేవుడితో కలిసి వేంగిపై దండెత్తాడు. పోతినాయకుడు, పోలినాయకుడు అనే సేనానుల నాయకత్వంలో రుద్రమదేవి ఈ దండయాత్రను ఎదుర్కొంది. గోదావరి తీరంలో జరిగిన భీకర యుద్ధంలో కళింగులను ఓడించిన కాకతీయ సేనానులు గజపతి మత్తమాతంగ సింహ, ఒడ్డియ రాయమర్దన బిరుదులు పొందారు.

తర్వాతి కాలంలో యాదవ మహాదేవుడు కాకతీయ రాజ్యంపై దండెత్తాడు. ఓరుగల్లు కోటను 15 రోజులు ముట్టడించాడు. రుద్రమదేవి అతడితో భీకరంగా పోరాడింది. మహాదేవుడికి చెందిన మూడు లక్షల సేవణ కాల్బలాన్ని, ఒక లక్ష అశ్విక దళాన్ని నాశనం చేసింది. మహాదేవుడు ఓడిపోయి పారిపోగా రుద్రమాంబ అతణ్ని దేవగిరి వరకు వెంటాడింది. యాదవ మహాదేవుడు కోటి సువర్ణాలను నష్టపరిహారంగా ఇచ్చి సంధి చేసుకున్నాడు. ఈ సొమ్మును రుద్రమాంబ తన సేనానులకు పంచిపెట్టింది. రుద్రమదేవి దేవగిరి వద్ద విజయస్తంభం నాటిందని 'ప్రతాపరుద్ర చరిత్ర' గ్రంథం ద్వారా తెలుస్తోంది. అయితే 'హేమాద్రి వ్రతఖండం' మాత్రం రుద్రమదేవిని మహాదేవుడు ఓడించాడని తెలుపుతోంది. కానీ 'ప్రతాపరుద్రచరిత్ర' కథనంలో యుద్ధంలో చనిపోయిన సేవణుల సైనిక సంఖ్య మినహా మిగతావన్నీ నిజాలేనని శాసనాలు, నాణేలు బలపరుస్తున్నాయి. నల్గొండ జిల్లా పానుగల్లులోని ఛాయా సోమనాథుడికి భూమిని దానం చేసిన సారంగపాణి దేవుడు రుద్రమదేవి సామంతుడు. ఇతడు యాదవ మహాదేవుని పినతండ్రి. ఇతడు సామంతుడు కావడం మహాదేవుని ఓటమిని సూచిస్తోంది. బీదర్ ప్రాంతాన్ని రుద్రమ కాకతీయ రాజ్యంలో చేర్చుకోవడం కూడా ఆమె విజయాన్నీ, మహాదేవుడి ఓటమినీ సూచిస్తోంది.

కడప మార్జవాడి రాజ్యంలో కాయస్థ జన్నిగదేవుడి తర్వాత అతని పెద్ద కుమారుడు త్రిపురారిదేవుడు, తర్వాత అతడి తమ్ముడు అంబదేవుడు కాకతీయుల సామంతులుగా పాలించారు. క్రీ.శ.1272లో రాజ్యానికొచ్చిన కాయస్థ అంబదేవుడు రుద్రమదేవిని ఎదిరించి స్వతంత్ర కాయస్థ రాజ్య నిర్మాణానికి పూనుకున్నాడు. రుద్రమదేవి మల్లికార్జున సేనాని నాయకత్వంలో సైన్యాన్ని నడిపింది. ఈ యుద్ధంలో రుద్రమ జయించిందనీ, మరణించిందనీ భిన్న కథనాలున్నాయి. రుద్రమదేవి క్రీ.శ.1289లో మరణించినట్లు నకిరేకల్ సమీపంలోని చందుపట్ల శాసనం ద్వారా తెలుస్తోంది. దీన్ని బట్టి ఆ యుద్ధంలో రుద్రమదేవి మరణించిందని చెప్పొచ్చు.

ప్రతాపరుద్రుడు (క్రీ.శ.1289-1323)

రుద్రమదేవికి ముగ్గురు కుమార్తెలు. వారు.. ముమ్మడమ్మ, రుద్రమ్మ, రుయ్యమ్మ. పెద్ద కుమార్తె ముమ్మడమ్మ మహాదేవుడి భార్య. వీరి కుమారుడే ప్రతాపరుద్రుడు. ఇతడి కాలంలో కాకతీయుల అధికారం ఉచ్ఛస్థితికి చేరి, ఓ వెలుగు వెలిగి అస్తమించింది.

రుద్రమదేవి కాలం నుంచే స్వతంత్రించిన అంబదేవుడు, అతడి కొడుకు రెండో త్రిపురారి లు ప్రతాపరుద్రుడి సార్వభౌమాధికారాన్ని అంగీకరించలేదు. దీన్ని సహించని ప్రతాపరుద్రుడు నాయంకర వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి సైన్యాన్ని పటిష్ఠం చేసి అంబదేవుడిపై దండెత్తడానికి సమాయత్తమయ్యాడు. ఇది ఊహించిన అంబదేవుడు దక్షిణాన పాండ్యరాజులతో, ఉత్తరాన సేవుణుల(దేవగిరి యాదవులు)తో పొత్తు పెట్టుకున్నాడు. ప్రతాపరుద్రుడు క్రీ.శ.1291లో అంబదేవుని రాజధాని త్రిపురాంతకంపై ప్రచండ సైన్యాన్ని పంపాడు. కొలని సోమనమంత్రి కుమారుడు మనుమగన్నయ, ఇందులూరి పెదగన్నయమంత్రి కుమారుడు అన్నయదేవులు ఈ సైన్యానికి నాయకత్వం వహించారు. వీరు అంబదేవుణ్ని ఓడించి ములికినాడు వరకు తరిమికొట్టి కాయస్థ రాజ్యాన్ని కాకతీయ రాజ్యంలో కలిపారు. అంబదేవుణ్ని ఓడించిన తర్వాత ప్రతాపరుద్రుడు నెల్లూరుపై రెండుసార్లు దండెత్తాడు. నెల్లూరురాజు రాజగండగోపాలుడికి మద్దతునిచ్చిన పాండ్యులను ఓడించాడు. రుద్రమదేవి చివరి కాలంలో కాకతీయులు కృష్ణానది దక్షిణాన ప్రాభవాన్ని కోల్పోగా, ప్రతాపరుద్రుడు దాన్ని తిరిగి నిలబెట్టాడు. ప్రతాపరుద్రుడి మూడో దండయాత్ర అంబదేవుడికి మద్దతు నిలిచిన దేవగిరి యాదవరాజులపై జరిగింది. మనమగండగోపాలుడు, వర్ధమానపుర(మహబూబ్‌నగర్ జిల్లా) పాలకుడైన గోన వితలుల నాయకత్వంలో ఈ యుద్ధం జరిగింది. గోనవితలుడు కృష్ణా, తుంగభద్ర ప్రాంతాన్ని దేవగిరి రాజుల నుంచి వశం చేసుకున్నాడు. .

మాదిరి ప్రశ్నలు

1. గణపతిదేవుడు మొదటగా ఎవరిపై దండెత్తాడు?
   1) రాజేంద్రచోళుడిపై
   2) అయ్య పినచోళుడిపై
   3) పృథ్వీశ్వరుడిపై
   4) చోడతిక్కనపై
2. ఎవరి కాలంలో వెలనాటి చోళ రాజ్యం కాకతీయ సామ్రాజ్యంలో అంతర్భాగమైంది?
   1) ప్రతాపరుద్రుడు 2) రుద్రమదేవి
   3) గణపతిదేవుడు 4) రుద్రదేవుడు
3. గణపతిదేవుడి దగ్గరకి తిక్కన సోమయాజిని రాయబారిగా పంపిన రాజు?
   1) రక్కసగంగ
   2) విజయ గండగోపాలుడు
   3) చోడతిక్కన
   4) రెండో మనుమసిద్ధి
4. నెల్లూరు మనుమసిద్ధికి సహాయంగా గణపతిదేవుడు ఎవరి నాయకత్వంలో తన సైన్యాన్ని పంపాడు?
   1) సామంతభోజుడు 2) జాయప్ప
   3) రేచర్ల బేతిరెడ్డి 4) ఓబిలిసి
5. గణపతిదేవుడు అపజయం పొందిన ఏకైన యుద్ధం?
   1) కడప 2) కాంచీపురం
   3) ముత్తుకూరు 4) పళ్లైయూరు
6. ముత్తుకూరు యుద్ధం ఏ సంవత్సరంలో జరిగింది?
   1) క్రీ.శ.1262 2) క్రీ.శ.1263
   3) క్రీ.శ.1261 4) క్రీ.శ.1264
7. రుద్రమదేవి గణపతిదేవుడి కుమార్తె అని మొదట పేర్కొన్నవారు?
   1) నరహరి కవి 2) మార్కోపోలో
   3) గంగాధర కవి
   4) శేషాద్రి రమణ కవులు
8. రుద్రమదేవిని వివాహం చేసుకున్న వీరభద్రుడు ఏ వంశ రాజు?
   1) కోటవంశ 2) తూర్పు చాళుక్య
   3) యాదవ 4) వెలనాటి చోళ
9. రుద్రమదేవి క్రీ.శ.1259లో రాజ్యపాలనకు వచ్చి, ఏ సంవత్సరంలో రాజ్య కిరీటాన్ని ధరించింది?
   1) క్రీ.శ.1265 2) క్రీ.శ.1266
   3) క్రీ.శ.1269 4) క్రీ.శ.1267
10. ఓరుగల్లు కోట నిర్మాణాన్ని పూర్తిచేసినవారు?
    1) గణపతిదేవుడు 2) ప్రతాపరుద్రుడు
    3) రుద్రమదేవి 4) రుద్రదేవుడు
11. కాకతీయుల రాజధానిని హన్మకొండ నుంచి ఓరుగల్లుకు మార్చింది?
    1) ప్రతాపరుద్రుడు
    2) రుద్రమదేవి 3) గణపతిదేవుడు 4) రుద్రదేవుడు
12. ఏ యుద్ధ విజయం తర్వాత కాకతీయ సేనానులు గజపతిమత్త మాతంగ సింహ, ఒడ్డియ రాయమర్దన అనే బిరుదులను పొందారు?
    1) వేంగి 2) కళింగ
    3) నెల్లూరు 4) కడప

సమాధానాలు

1) 3 2) 3 3) 4 4) 1
5) 3 6) 2 7) 4 8) 2
9) 3 10) 1 11) 3 12) 2

శిశు గీతాలకు ఉండాల్సిన ప్రత్యేకతలు?



టెట్/డీఎస్సీ
తెలుగు మెథడాలజీ

1. కనీస అభ్యసనస్థాయి ప్రాతిపదికాంశాల్లో ఒకటి?
   ఎ) అభ్యసనకాలం బి) ఇంటిపని
   సి) జవాబుదారీతనం
   డి) బోధన సమయం
2. క్షుణ్ణ, విస్తార పఠనాలకు చిత్తాన్ని ఆయత్త పరిచే పఠనం?
   ఎ) ఆదర్శ పఠనం బి) మౌన పఠనం
   సి) ప్రకాశ పఠనం
   డి) మండూకప్లుతిపఠనం
3. నిలువు గీతలు, అడ్డ గీతలు, ఏటవాలు గీత లు, అర్ధచంద్రాకార గీతలు, వృత్తాలు మొద లైన వాటిని మొదట నేర్పి, తర్వాత రాత నేర్పే విధానం?
   ఎ) ప్రాచీనం బి) అతి పురాతనం
   సి) ఆధునికం డి) అతి నవీనం
4. బోధనాభ్యసన ప్రక్రియలను విశ్లేషించి ఉత్తమమైన వాటిని ఉపాధ్యాయులు స్వీకరించేందుకు తోడ్పడే శాస్త్రం?
   ఎ) భాషా శాస్త్రం బి) విద్యాతత్వ శాస్త్రం
   సి) విద్యా సాంఖ్యక శాస్త్రం
   డి) విద్యా సాంకేతిక శాస్త్రం
5. విద్యలో స్థాయి అంటే?
   ఎ) దీర్ఘకాలంలో సాధించాల్సిన లక్ష్యాలు
   బి) అనతి కాలంలో సాధించాల్సిన గమ్యాలు
   సి) నిర్ణీత సమయంలో సాధించాల్సిన సామర్థ్యాల అనుక్రమం
   డి) నిర్ణీత సమయంలో సాధించాల్సిన ప్రగతి
6. విరామకాల సద్వినియోగానికి ఉపకరించేది?
   ఎ) క్షుణ్ణ పఠనం బి) విస్తార పఠనం
   సి) దూర శ్రవణం డి) దృష్ట లేఖనం
7. ఉక్త లేఖనం కలిగించే ప్రయోజనం?
   ఎ) లేఖనంలో సమత బి) రాతలో స్పష్టత
   సి) లేఖనంలో వేగం డి) రాతలో భంగిమ
8. విద్యాసాంకేతిక శాస్త్రం విద్యాబోధనకు అందించిన వరం?
   ఎ) రేడియో బి) టెలివిజన్
   సి) టేప్ రికార్డర్
   డి) భాషా ప్రయోగశాల
9. భాషా ప్రయోగశాలలో ప్రధాన టేపులు, అభ్యాసకులను పర్యవేక్షించడానికి అవసరమైన సామగ్రి ఉండే అర?
   ఎ) పఠన అర బి) నియంత్రణ అర
   సి) సలహాదారు అర డి) వినికిడి అర
10. భాషా ప్రయోగశాలలో ఉండే సామగ్రి?
    ఎ) వినే బూత్ బి) సలహాదారు బూత్
    సి) కంట్రోల్ రూం డి) పైవన్నీ
11. ఓ చిత్రం లేదా దృశ్యాన్ని ప్రదర్శించి దానిపై విద్యార్థులను వ్యాసం రాయాలని కోరే పద్ధతి?
    ఎ) సన్నివేశ పద్ధతి బి) అభివర్ణన పద్ధతి
    సి) అనుకరణ పద్ధతి డి) క్రీడా పద్ధతి
12. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, స్వయంకృషి, నాయకత్వ లక్షణాలను పెంపొందించేవి?
    ఎ) పద క్రీడలు బి) వైయక్తిక క్రీడలు
    సి) వక్తృత్వపు పోటీలు
    డి) సాహిత్య ప్రహేళికలు
13. విద్యార్థుల్లో భాషాభినివేశం, సాహిత్యాభిలాషను పెంపొందించేందుకు తోడ్పడే యాత్రలు?
    ఎ) విజ్ఞాన యాత్రలు
    బి) భాషా విహార యాత్రలు
    సి) వినోద యాత్రలు
    డి) విహార యాత్రలు
14. పాఠశాల బోధనాభ్యసన ప్రక్రియలో భాగంగా విద్యార్థులు సంవత్సరమంతా నిర్వహించే తోట పని, పాఠశాల బ్యాంకు... అనేవి?
    ఎ) సాంస్కృతిక ఉద్యమాలు
    బి) పర్యావరణ ఉద్యమాలు
    సి) సంకీర్ణ ఉద్యమాలు
    డి) భాషోద్యమాలు
15. సారస్వత సంఘాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు కలిగే ప్రయోజనం?
    ఎ) సమయ పాలన నిర్వహణ తెలుస్తుంది
    బి) సభా నిర్వహణ సామర్థ్యం అలవడుతుంది
    సి) కాలం విలువ తెలుస్తుంది
    డి) ఆత్మవిశ్వాసం పెరుగుతుంది
16. స్వల్పకాల వ్యవధిలో నిర్వహించడానికి, బోధించిన అంశాన్ని వెంటనే పరీక్షించడానికి అనువైన పద్ధతి?
    ఎ) పరీక్ష బి) పరిపృచ్ఛ
    సి) నికష డి) అభిప్రాయావళి
17. కింది వాటిలో ఉత్తమ నికష లక్షణం?
    ఎ) క్లుప్తత బి) సమగ్రత
    సి) స్వాభావికత డి) లాక్షణికత
18. విద్యార్థికి సంబంధించిన శారీరక, మానసి క, నైతిక, సామాజిక మూర్తిమత్వాన్ని నమో దు చేసి ప్రగతిని సూచించే రికార్డు?
    ఎ) విద్యార్థి స్వీయ వివరాల రికార్డు
    బి) క్యుములేటివ్ రికార్డు
    సి) పాఠశాల ప్రవేశ రికార్డు
    డి) పాఠశాల విడుదల రికార్డు
19. యూనిట్, నికషలతోపాటు తయారు చేయాల్సిన పట్టిక?
    ఎ) సూచనల పట్టిక
    బి) లక్ష్యాల భారత్వ పట్టిక
    సి) వివరణ పట్టిక
    డి) అంశాల పట్టిక
20. విద్యార్థుల సమాధాన పత్రాలను ఎవరు దిద్దినా, ఒకేవిధమైన మార్కులు రావాలనే మూల్యాంకన లక్షణాన్ని ఏమంటారు?
    ఎ) విశ్వసనీయత బి) నిబద్ధత
    సి) ప్రామాణికత డి) విషయ నిష్ఠత
21. అంతర్గత మూల్యాంకనం చేసేది?
    ఎ) ప్రధానోపాధ్యాయులు
    బి) ఇతర పాఠశాల ఉపాధ్యాయులు
    సి) సహ విద్యార్థులు
    డి) బోధించిన ఉపాధ్యాయులు
22. విద్యార్థుల ప్రవర్తనలను తెలుసుకోవడానికి ఉపకరించే పరీక్షా సాధనం?
    ఎ) ప్రాయోగిక పరీక్ష బి) పరిశీలన
    సి) పరిపృచ్ఛ డి) రాత పరీక్ష
23. లక్ష్యాధార బోధనలో సమప్రాధాన్యం ఉన్న అంశాలు?
    ఎ) ఉద్దేశాలు - బోధన అభ్యసనం
    బి) లక్ష్యాలు-మూల్యాంకనం-పర్యవేక్షణ
    సి) లక్ష్యాలు-బోధనాభ్యసన కృత్యాలు - మూల్యాంకనం
    డి) గమ్యాలు-మూల్యాంకనం - స్వీయ అధ్యయనం
24. ప-ఫ-బ-భలను ఏమంటారు?
    ఎ) దంత్యాలు బి) ఓష్ఠ్యాలు
    సి) నాదాలు డి) తాలవ్యాలు
25. వర్గ ద్వితీయ, చతుర్థాక్షరాలను ఏమంటారు?
    ఎ) పరుషాలు బి) సరళాలు
    సి) వర్గయుక్కులు డి) శ్వాసాలు
26. వర్గ పంచమాక్షరాలను ఏమంటారు?
    ఎ) పరుషాలు బి) స్థిరాలు
    సి) నాదాలు డి) అనునాసికాలు
27. పరుష, సరళేతర హల్లులను ఏమంటారు?
    ఎ) శ్వాసాలు బి) నాదాలు
    సి) స్థిరాలు డి) అంతస్థాలు
28. చాప - చలి- జాజి - జొన్న - జాదం పదాల్లో చ,జలను ఏమంటారు?
    ఎ) దంత్యాలు బి) తాలవ్యాలు
    సి) పరుషాలు డి) సరళాలు
29. చిలుక - చీమ - చేను - జిల - జీడి - జేజే పదాల్లో చ,జలను ఏమంటారు?
    ఎ) దంత్యాలు బి) సరళాలు
    సి) తాలవ్యాలు డి) నాదాలు
30. బోధనాంశాలకు సంబంధించిన అదనపు సమాచారాన్ని విద్యార్థులకు అందించేం దుకు ఉపాధ్యాయులకు తోడ్పడేవి?
    ఎ) పారిభాషిక పదకోశాలు
    బి) నిఘంటువులు
    సి) మాండలిక పదకోశాలు
    డి) పరామర్శ గ్రంథాలు
31. అర్థ కాఠిన్యతను తొలగించడానికి ఉపాధ్యాయుడు తరగతి గదిలో అనుసరించే బోధన పద్ధతి?
    ఎ) విశ్లేషణ పద్ధతి బి) ప్రశ్నోత్తర పద్ధతి
    సి) ఉదాహరణ వాక్య పద్ధతి
    డి) వివరణ పద్ధతి
32. ఉపాధ్యాయుల మార్గదర్శనంలో... శోధనా దృక్పథంతో, స్వయంకృషితో విద్యార్థులు పూర్తిచేసేవి?
    ఎ) తోటపనులు బి) నిర్దేశ్యాలు
    సి) అనువాదాలు
    డి) తరగతి అలంకరణలు
33. వ్యాకరణ బోధనలో ఉదాహరణలు చెప్పి సూత్రాన్ని నిర్మింపజేసేందుకు అనుసరించే పద్ధతి?
    ఎ) అర్థ వివేచన పద్ధతి బి) శాస్త్ర పద్ధతి
    సి) అనుమానోపపత్తి పద్ధతి
    డి) నిగమోపపత్తి పద్ధతి
34. విద్యార్థుల వయసు, మానసిక స్థాయిని బట్టి సంవత్సరం వారీగా, తరగతి వారీగా విభజించేవి?
    ఎ) క్రీడానుభవాలు
    బి) అభ్యసనానుభవాలు
    సి) బోధనానుభవాలు
    డి) సామాజిక అనుభవాలు
35. ప్రాంతీయ భాషలను అధికార భాషలుగా స్వీకరించడానికి రాష్ట్రాలను అనుమతించిన భారత రాజ్యాంగ అధికరణం?
    ఎ) 342 బి) 343
    సి) 345 డి) 346
36. శిశు గీతాలకు ఉండాల్సిన ప్రత్యేకతలు?
    ఎ) గుణాత్మకత, యతి
    బి) ప్రామాణికత, యతి
    సి) లక్ష్యాత్మకత, ప్రాస
    డి) లయాత్మకత, అనుప్రాసలు
37. పద్యబోధన ప్రధాన లక్ష్యాల్లో... రసానుభూతి, ఆనందానుభూతులతోపాటు పేర్కొనదగింది?
    ఎ) ధ్వని విజ్ఞానం బి) సముచిత వైఖరి
    సి) హృదయ ద్రవీకరణం
    డి) భాషాంతరీకరణం
38. గద్యబోధనలో రచయిత పరిచయం, పూర్వాంశ పరిచయం చేయడానికి ఉపాధ్యాయుడు అనుసరించాల్సిన బోధన పద్ధతి?
    ఎ) చర్చా పద్ధతి బి) వివరణ పద్ధతి
    సి) ప్రశ్నోత్తర పద్ధతి డి) ఉపన్యాస పద్ధతి
39. సమగ్ర పాఠ్య ప్రణాళిక అంటే?
    ఎ) పాఠశాలలో జరిగే కార్యక్రమాలన్నింటికి సంబంధించింది
    బి) ఒక రోజు పాఠ్యాంశానికి సంబంధించింది
    సి) ఒక రోజు జరిగే బోధన కార్యక్రమానికి సంబంధించింది
    డి) ఒక పాఠానికి లేదా ఒక యూనిట్‌కు సంబంధించింది
40. వ్యాఖ్యాన పద్ధతి ఏ ప్రక్రియ బోధనకు ఉపకరిస్తుంది?
    ఎ) కథా బోధన బి) నాటక బోధన
    సి) వ్యాకరణ బోధన
    డి) ఉపవాచక బోధన
41. నిగూఢార్థాన్ని తెలుసుకోవడం, సూచనలను అనుసరించడం అనే స్పష్టీకరణలున్న బోధన లక్ష్యం?
    ఎ) భాషాభిరుచి బి) రసానుభూతి
    సి) అవగాహన
    డి) సంస్కృతి-సంప్రదాయాలు
42. తెలుగును ద్వితీయ భాషగా బోధిస్తున్న ప్పుడు మొదట సాధించాల్సిన విలువలు?
    ఎ) పరోక్ష విలువలు
    బి) పరిమిత విలువలు
    సి) హృదయగత విలువలు
    డి) అగణిత విలువలు
43. ట - ఠ - డ - ఢ - ణలను ఏమంటారు?
    ఎ) కంఠ్యాలు బి) తాలవ్యాలు
    సి) మూర్ధన్యాలు డి) ఓష్ఠ్యాలు
44. శ - ష - స - హలను ఏమంటారు?
    ఎ) ఊష్మాలు బి) శ్వాసాలు
    సి) నాదాలు డి) తాలవ్యాలు
45. య - ర - ల - వలను ఏమంటారు?
    ఎ) శ్వాసాలు బి) సరళాలు
    సి) అంతస్థాలు డి) పరుషాలు
46. హల్లులకు మరోపేరు?
    ఎ) స్వరాలు బి) స్థిరాలు
    సి) వ్యంజనాలు డి) శ్వాసాలు
47. దంత్యోచ్చారణ ఉన్న హల్లులు?
    ఎ) క - ఖ -గ - ఘ- ఙ
    బి) త - థ - ద - ధ - న
    సి) ప - ఫ - బ - భ - మ
    డి) చ - ఛ - జ - ఝ - ఞ
48. 'నయితాలీమ్' విద్యావిధానంలో మాతృభాష మాధ్యమం మంచిదని ప్రశంసించిన విద్యావేత్త?
    ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్
    బి) కొమర్రాజు లక్ష్మణరావు
    సి) రామచంద్ర శుక్లా
    డి) మహాత్మా గాంధీ
49. విజయనగర కాలంలో అధికార భాషగా తెలుగు అమల్లో ఉందని తెలిపే గ్రంథం?
    ఎ) ఆముక్త మాల్యద
    బి) క్రీడాభిరామం
    సి) రాయవాచకం డి) మను చరిత్ర
50. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేసిన సంవత్సరం?
    ఎ) 1966 బి) 1974
    సి) 1975 డి) 1978
51. అధికార భాషా సంఘం తొలి అధ్యక్షుడు?
    ఎ) డా. సి. నారాయణరెడ్డి
    బి) టి. అనసూయమ్మ
    సి) వావిలాల గోపాలకృష్ణయ్య
    డి) యశోధారెడ్డి
52. అధికారభాషా సంఘం ప్రస్తుత అధ్యక్షుడు?
    ఎ) డా.ఏ.బి.కె. ప్రసాద్
    బి) డా. పరుచూరి గోపాలకృష్ణ
    సి) డా. మాడుగుల నాగఫణిశర్మ
    డి) మండలి బుద్ధ ప్రసాద్
53. తెలుగు అకాడమీ ప్రస్తుత సంచాలకుడు?
    ఎ) డా. అనుమాండ్ల భూమయ్య
    బి) ఆచార్య ప్రతాపరెడ్డి
    సి) ఆచార్య కె. యాదగిరి
    డి) డా. ఆవుల మంజులత
54. లఘూత్తర ప్రశ్నలను తయారుచేసే క్రమంలో ఉపాధ్యాయుడు దృష్టిలో ఉంచుకోవాల్సిన అంశం?
    ఎ) ప్రతి ప్రశ్నను ఫలితాల ఆధారంగా రూపొందించాలి
    బి) మాదిరి సమాధానాలు ముందే రాసి ఉంచుకోవాలి
    సి) ప్రతి ప్రశ్నకు స్పష్టమైన ఒకే సమాధానం రావాలి
    డి) కాదు, రాదు వంటి ప్రశ్నలను అడగాలి
55. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఉపయోగపడే బోధనా పద్ధతి?
    ఎ) చర్చా పద్ధతి
    బి) ప్రశ్నోత్తర పద్ధతి
    సి) వివరణ పద్ధతి
    డి) ఉపన్యాస పద్ధతి

సమాధానాలు

1) సి; 2) బి; 3) సి; 4) డి; 5) సి;
6) బి; 7) సి; 8) డి; 9) సి; 10) డి;
11) బి; 12) సి; 13) బి; 14) సి; 15) బి;
16) సి; 17) ఎ; 18) బి; 19) బి; 20) సి;
21) డి; 22) బి; 23) సి; 24) బి; 25) సి;
26) డి; 27) సి; 28) ఎ; 29) సి; 30) డి;
31) సి; 32) బి; 33) సి; 34) బి; 35) సి;
36) డి; 37) సి; 38) బి; 39) డి; 40)బి;
41) సి; 42) బి; 43) సి; 44) ఎ; 45)సి;
46) సి; 47) బి; 48) డి; 49) సి; 50)బి;
51)సి; 52) డి; 53) సి 54) సి; 55)బి;.

బైకు, కారు, బస్సులలో... దేని జడత్వం ఎక్కువ?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

యాంత్రిక శాస్త్రం

- వస్తువుల స్థితిగతులను అధ్యయనం చేసే శాస్త్రాన్ని యాంత్రిక శాస్త్రం అంటారు.
- ఈ శాస్త్రానికి అరిస్టాటిల్ పితామహుడిగా పేరుగాంచారు.
- **రేఖీయ చలనం:** ఒక వస్తువు సరళరేఖ మార్గంలో ప్రయాణిస్తే దానిని రేఖీయ చలనం అంటారు.

ఉదా॥ రుజుమార్గంలో కదులుతున్న బస్సు లేదా రైలు రేఖీయ చలనాన్ని కలిగి ఉంటుంది.

ప్రాథమిక అంశాలు

- **దూరం:** గమనంలో ఒక వస్తువు ప్రయాణించే మార్గాన్ని దూరం అంటారు.

ప్రమాణాలు: సెంటీమీటర్, మీటర్స్ (ఇది అంతర్జాతీయ ప్రమాణం)

- **స్థానభ్రంశం:** ఒక వస్తువు తొలిస్థానం, తుదిస్థానాలను కలిపే సరళరేఖను స్థాన భ్రంశం అంటారు.

ప్రమాణాలు: సెంటీమీటర్, మీటర్స్

- దూరం అనేది అదిశరాశి. ఎందుకంటే దూరం అనే భౌతిక రాశికి కేవలం పరిమాణం మాత్రమే ఉంటుంది. దిశ ఉండదు.
- స్థానభ్రంశం అనేది సదిశరాశి. ఎందు కంటే స్థానభ్రంశం అనే భౌతికరాశికి పరిమాణం, దిశ ఉంటాయి.

దూరం, స్థానభ్రంశంల మధ్య సంబంధాలు

- ఒక వస్తువు వృత్తాకార మార్గంలో ఒక భ్రమణం పూర్తిచేసిన తర్వాత అది ప్రయాణించే దూరం అనేది వృత్త పరిధికి సమానం.

$$S = 2\pi r$$

కాని స్థానభ్రంశం శూన్యంగా ఉంటుంది.

$$\therefore \bar{S} = 0$$

- ఎందుకంటే ఈ సందర్భంలో వస్తువు తొలిస్థానం, తుదిస్థానాలు ఒకదానితో మరొకటి ఏకీభవిస్తున్నాయి.
- ఒకవేళ వస్తువు అర్ధభ్రమణాన్ని పూర్తి చేసిన తరువాత అది ప్రయాణించే దూరం $S=\pi r$, స్థానభ్రంశం $S=2r$ వృత్త వ్యాసా నికి సమానంగా ఉంటాయి.
- నిట్టనిలువుగా పైకి విసిరిన వస్తువు కొంత ఎత్తును పొందిన పిమ్మట తిరిగి తన యథాస్థానాన్ని చేరుతుంది. ఈ సందర్భంలో వస్తువు ప్రయాణించే దూరం $S= 2h$; కానీ $\bar{s}=0$
- ఒక వస్తువు సరళరేఖ మార్గంలో ప్రయాణిస్తే.. అది ప్రయాణించే దూరం, పొందిన స్థానభ్రంశం పరస్పరం సమానంగా ఉంటాయి.

$$s=\bar{s}\ (or)\ \frac{s}{\bar{s}}=1$$

- ఒక వస్తువు క్రమరహిత మార్గంలో చలిస్తే అది ప్రయాణించిన దూరం పొందిన స్థానభ్రంశం కంటే ఎక్కువగా ఉంటుంది.

$$s > \bar{s}$$

∴ ఒక వస్తువు ప్రయాణించిన దూరం పొందిన స్థానభ్రంశానికి సమానంగా లేదా ఎక్కువగా ఉంటుంది. అంతేకాని వస్తువు ప్రయాణించిన దూరం అనేది స్థానభ్రంశం కంటే ఎట్టిపరిస్థితుల్లో తక్కువగా ఉంటుంది.

వడి: గమనంలో ఉన్న వస్తువు నిర్దేశిత కాలంలో ప్రయాణించిన దూరాన్ని వడి అంటారు.

$$\text{వడి(V)} = \frac{\text{ప్రయాణించిన దూరం}}{\text{కాలం}} = \frac{s}{t}$$

ప్రమాణాలు: సెం.మీ/ సెకన్ లేదా మీ./సెకన్

వడి అనేది అదిశరాశి

వేగం: గమనంలో ఉన్న ఒక వస్తువు నిర్దేశిత కాలంలో పొందిన స్థానభ్రంశాన్ని వేగం అంటారు.

$$\text{వేగం}\ (\bar{V}) = \frac{\bar{S}}{t}$$

ప్రమాణాలు: సెం.మీ./ సెకన్ (లేదా) మీ./సెకన్

వేగం అనేది సదిశరాశి

త్వరణం: గమనంలో ఉన్న వస్తువు వేగంలోని మార్పురేటుని త్వరణం అంటారు.

$$\bar{a} = \frac{\text{వేగంలోని మార్పు}}{\text{కాలంలోని మార్పు}}$$

$$= \frac{V_2 - V_1}{t_2 - t_1} = \frac{\bar{V}}{t}$$

ప్రమాణాలు: సెం.మీ/ సెకన్^{2} (లేదా) మీ/సెకన్^{2}

త్వరణాన్ని 2 రకాలుగా వర్గీకరించవచ్చు

1. **ధన త్వరణం:** గమనంలో ఉన్న వస్తువు వేగంలో మార్పు రేటు పెరిగితే దానికి ధన త్వరణం ఉంటుంది.
2. **రుణ త్వరణం:** గమనంలో ఉన్న వస్తువు వేగంలో మార్పు రేటు తగ్గితే దానికి రుణ త్వరణం ఉంటుంది.

- ఒక వస్తువు విరామస్థితిలో ఉన్నపుడు $(\bar{V}=0)$ లేదా సమాన వేగంతో కదులుతున్నపుడు $(\bar{V_1}=\bar{V_2}=\bar{V_3}=\ldots\ldots)$, ఆ వస్తువు త్వరణం శూన్యం.

రేఖీయ ద్రవ్యవేగం: గమనంలో ఉన్న వస్తువు ద్రవ్యరాశి, వేగాల లబ్ధాన్ని రేఖీయ ద్రవ్యవేగం అంటారు.

$$P = m\bar{v}$$

$m \rightarrow$ ద్రవ్యరాశి
$\bar{v} \rightarrow$ వేగం

ప్రమాణాలు : గ్రామ్,సెం.మీ/సెకను లేదా కిలోగ్రామ్, మీటర్/సెకన్

- రేఖీయ ద్రవ్యవేగం సదిశరాశి.

బలం: ఒక వస్తువు స్థితిని మార్చేది లేదా మార్చడానికి ప్రయత్నించే దాన్ని బలం అంటారు.

$$\text{బలం}\ (\bar{F}) = m\bar{a}$$

$m \rightarrow$ ద్రవ్యరాశి
$\bar{a} \rightarrow$ త్వరణం

ప్రమాణాలు : డైన్, న్యూటన్ (ఇది అంతర్జాతీయ ప్రమాణం)

1 న్యూటన్ = 10^5 డైన్స్

- బలం గురించి న్యూటన్ అనే శాస్త్రవేత్త అధ్యయనం చేసి వాటిని 2 రకాలుగా వర్గీకరించారు.

అంతర బలం: ప్రతి వస్తువు లేదా వ్యవస్థ లోపల ఉన్న బలాలను అంతర బలాలు అంటా రు. ఈ బలం వల్ల వస్తువు స్థితిలో ఎలాంటి మార్పు ఉండదని న్యూటన్ ప్రతిపాదించారు.

ఉదా॥ ఒక బస్సు లోపల ఉన్న ప్రయాణికులు తమ ఎదుటి సీట్లపై బలాలను ప్రయో గించినప్పుడు ఆ బస్సు స్థితిలో ఎలాంటి మార్పు ఉండదు.

బాహ్యబలం: ఒక వస్తువు మరో వస్తువుపై ప్రయోగించే బలాన్ని బాహ్యబలం అంటారు.

- ఈ బలం వల్ల వస్తువు స్థితిలో మార్పు రావచ్చు. లేదా మార్పు రావడానికి ప్రయత్నించవచ్చు.
- Liftని కనుగొన్న శాస్త్రవేత్త otis

న్యూటన్ గమన నియమాలు: వస్తువుల చలనాన్ని అధ్యయనం చేసి వాటిని వివరించడానికి 16వ



శతాబ్దంలో న్యూటన్ మూడు నియమాలను ప్రతిపాదించారు. వీటిని న్యూటన్ గమన నియమాలు అంటారు.

మొదటి నియమం లేదా జడత్వ నియమం

- బాహ్యబలాన్ని ప్రయోగించినంతవరకు విరామ స్థితిలో ఉన్న వస్తువు విరామ స్థితిలోను, గమనంలో ఉన్న వస్తువు సమవేగంతో రుజు మార్గంలో కదులు తుంది.
- ప్రతి వస్తువుకు సహజసిద్ధంగా ఏర్పడే జడత్వం అనే ధర్మం ఉంటుందని మొదటి నియమం వల్ల తెలుస్తోంది. అందువల్ల ఈ నియమాన్ని జడత్వ నియమం అంటారు.

జడత్వం: ఒక వస్తువు తనంతట తానుగా తన స్థితిని మార్చుకోలేని అశక్తతను లేదా ధర్మాన్ని జడత్వం అంటారు. ఈ ధర్మం వస్తువుల ద్రవ్యరాశిపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి ద్రవ్యరాశి పెరిగితే జడత్వం కూడా పెరుగుతుంది.

ప్రమాణాలు : గ్రామ్ లేదా కి.గ్రా.

జడత్వాన్ని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. **విరామ జడత్వం:** విరామస్థితిలో ఉన్న ఒక వస్తువు తనంతట తానుగా తన విరామ స్థితిని మార్చుకోలేని అశక్తతను విరామ జడత్వం అని అంటారు.
2. **గమన జడత్వం:** గమనంలో ఉన్న వస్తువు తనంతట తానుగా తన గమనస్థితిని మార్చుకోలేని అశక్తతను గమన జడత్వం అని అంటారు.

ఉదా॥ గమనంలో ఉన్న బస్సుకు అకస్మాత్తుగా బ్రేకులువేసి ఆపినపుడు దానిలోపల ఉన్న ప్రయాణీకులు గమనజడత్వం వల్ల ముందువైపు తూలుతారు.

3. **దిశ జడత్వం:** ఒక వస్తువు తనంతట తానుగా తన దిశను మార్చుకోలేని అశక్తతను దిశ జడత్వం అని అంటారు.

ఉదా॥ రుజుమార్గంలో ప్రయాణిస్తున్న బస్సు మలుపు తిరుగుతున్నప్పుడు అందులోని ప్రయాణికులు జడత్వం వల్ల అవతలివైపు తూలుతారు.

- న్యూటన్ రెండో గమన నియమం ప్రకారం బలానికి సమీకరణం F=ma

న్యూటన్ మూడవ గమన నియమం

చర్యకు సమానమైన వ్యతిరేక ప్రతిచర్య ఉంటుంది. చర్య= – ప్రతిచర్య

చర్య+ ప్రతిచర్య = 0

- ఈ నియమం ప్రకారం చర్య, ప్రతిచర్య అనేవి పరస్పరం సమానంగా ఉండి, వ్యతిరేక దిశలో ఎల్లప్పుడూ జంటగా ఉంటాయి.

ఉదా॥ 1. రబ్బర్ బంతిని గోడవైపునకు విసిరినపుడు, అది గోడపై కలుగజేసే బలాన్ని చర్య అంటారు. ప్రతిచర్యగా గోడ కూడా అంతే బలాన్ని బంతివైపు వ్యతిరేక దిశలో ప్రయోగిస్తుంది.

2. నడవడం, పరుగెత్తడం, నీటిలో ఈదడం, పడవ ప్రయాణం, పక్షి ఎగరడం మొదలైన అంశాల్లో న్యూటన్ మూడో గమన నియమం ఇమిడి ఉంది.
3. తుపాకి, రాకెట్, జెట్ విమానం.. పని చేయడంలోనూ ఈ నియమం ఇమిడి ఉంది.

- రాకెట్, క్షిపణులు పనిచేయడంలో రేఖీయ ద్రవ్యవేగ నిత్యత్వ నియమం ఇమిడి ఉంది.

మాదిరి ప్రశ్నలు

1. న్యూటన్ మూడు గమన నియమాల్లో.. ఏ నియమాన్ని జడత్వ నియమం అంటారు?
   ఎ) మొదటి బి) రెండో
   సి) మూడో డి) పైవన్నీ
2. బైకు, కారు, బస్సులలో... దేని జడత్వం ఎక్కువ?
   ఎ) బైకు బి) కారు
   సి) బస్సు డి) పైవన్నీ
3. గమనంలో ఉన్న వస్తువుకు ఏ భౌతిక రాశి ఉంటుంది?
   ఎ) వేగం బి) రేఖీయ ద్రవ్యవేగం
   సి) గతిజ శక్తి డి) పైవన్నీ
4. బాంబు విస్ఫోటనం, తుపాకి పని చేయడంలో ఏ నిత్యత్వ నియమం ఇమిడి ఉంది?
   ఎ) న్యూటన్ మూడో గమన నియమం
   బి) రేఖీయ ద్రవ్యవేగ నిత్యత్వ నియమం
   సి) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
   డి) కోణీయ ద్రవ్యవేగ నిత్యత్వ నియమం
5. జడత్వం ప్రమాణం?
   ఎ) గ్రామ్ బి) కిలోగ్రామ్
   సి) పౌండ్ డి) పైవన్నీ
6. అంతర్గత బలం వల్ల గమనంలో ఉన్న వస్తువు వేగం?
   ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
   సి) మారదు
   డి) రెండింతలు అవుతుంది
7. ఏ ప్రక్షిప్త కోణం వద్ద ప్రక్షేపకం గరిష్ఠ వ్యాప్తిని పొందుతుంది?
   ఎ) 30° బి) 45° సి) 90° డి) 120°
8. బలం.. అంతర్జాతీయ ప్రమాణం?
   ఎ) న్యూటన్ బి) డైన్
   సి) కి.గ్రా., మీ/సె^{2}
   డి) గ్రా., సెం.మీ/సె^{2}
9. కింది వాటిలో అత్యంత గరిష్ఠమైన బలం?
   ఎ) అయస్కాంత బలం
   బి) ఘర్షణ బలం
   సి) గురుత్వాకర్షణ బలం
   డి) కేంద్రక బలం
10. ఎక్కువ ప్రాధాన్యతను కలిగిన న్యూటన్ గమన నియమం?
    ఎ) మొదటి బి) రెండో
    సి) మూడో డి) పైవన్నీ
11. ప్రక్షేపకం ఏ మార్గంలో ప్రయాణిస్తుంది?
    ఎ) రుజు బి) వృత్తాకార
    సి) పరావలయ డి) దీర్ఘవృత్తాకార
12. న్యూటన్ మూడో గమన నియమం ఆధారంగా పనిచేసేది?
    ఎ) రాకెట్ బి) క్షిపణి
    సి) యుద్ధ విమానం డి) పైవన్నీ
13. ఒక వస్తువుపై ఎక్కువ బలాన్ని అధిక కాలవ్యవధిలో ప్రయోగిస్తే దానిపై ప్రచోదన ప్రభావం?
    ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
    సి) శూన్యం డి) అనంతం
14. లిఫ్టని కనుగొన్న శాస్త్రవేత్త?
    ఎ) న్యూటన్ బి) రూథర్‌ఫర్డ్
    సి) పాస్కల్ డి) ఓటిస్
15. పైకి కదులుతున్న లిఫ్ట్‌లోని వ్యక్తి చర్య, ప్రతిచర్యలు అనేవి?
    ఎ) సమానం బి) చర్య ఎక్కువ
    సి) ప్రతిచర్య ఎక్కువ డి) ప్రతిచర్య శూన్యం

సమాధానాలు

1) ఎ	2) సి	3) డి	4) బి	5) డి
6) సి	7) బి	8) ఎ	9) డి	10) బి
11) సి	12) డి	13) బి	14) డి	15) సి

Neither of the five students was responsible for...

BANK EXAMS

GENERAL ENGLISH



MODEL QUESTIONS

Directions (Q.No.1-05): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The process of updation of state's part of NRC (1)/ in the state of Assam is started in the year 2013, (2)/ when the Supreme Court of India (3)/ passed an order for its updation. (4)/ No error (5)
2. The Supreme Court on Wednesday hinted at taking back a controversial March 20, 2018, ruling (1)/ that had instituted a check on the institution of false, motivated cases (2)/ against the stringent SC/ST Prevention of Atrocities Act (3)/ while reserving orders on a government plea to review the ruling. (4)/ No error (5)
3. Aadhaar enrolments in Jammu & Kashmir (J&K) have dropped drastic (1)/ since August 5, (2)/ after restrictions came into place (3)/ following the abrogation of Article 370. (4)/ No error (5)
4. The Indian Army conducts a massive rare exercise (1)/ involving all its arms and services including tanks, artillery and helicopters, (2)/ in Eastern Ladakh bordering China, (3)/ for testing and improving its war-fighting capabilities. (4)/ No error (5)
5. European parliamentarians Ryszard Czarnecki and Fulvio Martusciello (1)/ have slammed Pakistan for harbouring militants, (2)/ with one of them saying terrorists who carried out attacks in India (3)/ did not came from the Moon. (4)/ No error (5)

Directions (Q.No. 06-10): Each question below has blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. Some of the banned ___ for which Indian sports persons have been ___ positive are so highly priced that no ____ sportsperson would be able to buy them on his own.
   1) Substances, tested, ordinary
   2) products, examination, simple
   3) drugs, proved, common
   4) medicines, declared, general
   5) materials, experienced, regular
7. The present education system is ___ and needs ___, if we don't address this immediately we shall be ____ behind.
   1) complete, improvement, progressing
   2) full, betterment, covering
   3) defective, reforming, lagging
   4) total, redressal, moving
   5) inadequate, recharging, stirring
8. The amended Motor Vehicle law was expected to have a ___ effect on errant drivers, ___ traffic in metros and a ___ effect on highways.
   1) solemn, terrifying, upsetting
   2) grave, nightmarish, shocking
   3) glum, vivid, distressing
   4) optimistic, lurid, calming
   5) sobering, nightmarish, calming
9. Former Prime Minister Manmohan Singh ___ to take military action against Pakistan if another Mumbai-type terror attack occurred, David Cameron, who ___ with him as prime minister, reveals in his book ___ Singh as a 'saintly man'.
   1) planning, interacts, describing
   2) planned, interacting, describes
   3) planned, interactive, described
   4) planned, interacted, describing
   5) plans, interacted, describing
10. The government last month ___ the merger of 10 public sector banks (PSBs) ___ four strong lenders with countrywide networks and global reach to boost credit and revive economic ___ in the nation's bid to become a five trillion dollar economy in the next five years.
    1) announces, to, growth
    2) has announced, into, growing
    3) have announced, in, growths
    4) announced, into, growth
    5) is announcing, into, growth

Directions: (Q.No. 11 - 15) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. Unlike Satyajit Ray whose films transcend ideology, Sanjay Leela Bansali is frequently dismissed <u>with being merely a photographer</u> for a visually impressive production with little meaning.
    1) as being a photographer merely
    2) for being merely a photographer
    3) as a mere photographer
    4) merely for being a photographer
    5) No correction required
12. In many rural provinces, the so-called party leaders are more powerful, wealthy and wield <u>more influence as any other</u> illicit group.
    1) wielding more influence to any other
    2) wielded much influence as any other
    3) wield more influence than any other
    4) wields more influence as many other
    5) No correction required
13. <u>Ambanis are keeping</u> the nose to the grind stone and expanding their business.
    1) Ambanis were keeping
    2) Ambanis have kept
    3) The Ambanis are keeping
    4) The Ambanis have been kept
    5) No correction required
14. <u>N.D.Prasad grammar book</u> based on Wren and Martin's grammar book is loved by many students.
    1) N.D.Prasads grammar book
    2) N.D.Prasad's grammar book
    3) N.D.Prasad grammar books
    4) N.D.Prasad grammars book
    5) No correction required
15. She doesn't <u>like to lend me some money.</u>
    1) like to lend me any money
    2) like to lend me no money
    3) like to lend me few money
    4) like to lend me many money
    5) No correction required

Directions (Q.No. 16-20): In the following set of questions, there are four sentences given in each question, find out which sentence is correct and mark the number of that sentence as your answer. If no sentence is correct mark 5 'None' as your answer.

16. 1) My cousin sister is a brewer.
    2) Neither of the five students was responsible for the damage in the Chemistry laboratory.
    3) You, Sarma and we have murdered the democracy by taking the law in our hands.
    4) Between you and me, there is nothing. So, let us part our ways.
    5) None
17. 1) Both the wife and husband love one another. It helped them to overcome all misunderstandings.
    2) For every wrong answers negative marking is there.
    3) You should approach the concerned clerk.
    4) Each one of the novels you suggested is worth reading.
    5) None
18. 1) Raju is the only boy that comes early.
    2) It is none of your business.
    3) I found a two thousand rupees note on my way.
    4) Indira Gandhi was the bravest and the influential leader of the congress party.
    5) None
19. 1) There are many architectural marvels at India.
    2) Ramesh cut the tree by an axe.
    3) Both the siblings divided the property among themselves after their father's demise.
    4) I have been standing here from the past four hours.
    5) None
20. 1) The platinum is an expensive metal.
    2) The Shakespeare is the Kalidas of the west.
    3) I eat the breakfast at 8 a.m.
    4) The Grand Trunk express is not running on time today.
    5) None

Answers with Explanation

1. **2;** In place of 'is started', simple past tense must be used, i.e. 'started'.
2. **2;** In order to make the sentence correct the correct preposition to be used is 'under', not 'against'.
3. **1;** It is not the adjective 'drastic' which must be used, but the adverb 'drastically' which must be used here.
4. **1;** The verb 'conduct' must be used in past tense 'conducted', as it is not a regular activity.
5. **4;** Did is always followed by the present tense of the verb, not the past tense. ('He did not told' is wrong, 'he did not tell' is right)
6. **1;** Only in the first option all the words are present in the correct form, to complete the sentence.
7. **3;** If it is complete it doesn't require any improvement, so option 1 is wrong. Second option, full and betterment will not fit. Option 4, total and redressal doesn't go hand in hand to convey the meaning in this sentence and the last option, if it is inadequate it cannot be recharging.
8. **5;**
9. **4;** Only in option 4 all the words are used in the correct form.
10. **4;** Based on the first blank in the sentence, this bit can be easily answered. The word 'last month' is the indicator which tells us that we should go for the past tense of the verb. In all other options the verb is in different forms of present tense.
11. **4;** The modifier 'mere' and the preposition for are used in the correct order and sense only in option 4. All the other options are incorrect.
12. **3;** When we use comparative degree in a sentence, usage of 'than' is must.
13. **3;** Before the names of the families the definite article 'the' must be used.
14. **2;** After the noun an apostrophe is supposed to be used to show the possessive, it is used correctly in 2 option.
15. **1;**. Any money is the correct expression, all other expressions are wrong.
16. **4;** Option 1 is wrong, as cousin sister is incorrect usage. Option 2 is incorrect as neither is used for two and none is used for more than two. Option 3, the order of subjects should be We, you and Sarma.
17. **4;** Option 1, love each other, not one another. Option 2, it should be 'for every wrong answer' not 'for every wrong answers'. Option 3, the correct usage is clerk concerned.
18. **1;** If 'the only/ the same' appears after the subject 'that' should be used. Option 2, though this expression is frequently used, it is wrong; the correct expression is 'it is no business of yours'. Option 3, it should be 'two thousand rupee note'. Option 4, it should be 'most influential'.
19. **5;** Option 1, the correct preposition to be used is 'in', not 'at'. Option 2, the correct preposition to be used is 'between', not 'among'. Option 3, the correct preposition to be used is 'with', not 'by'. Option 4, the correct preposition to be used is 'for', not 'from'.
20. **4;** Option 1, before material nouns article is not used. Option 2, before proper noun (Shakespeare) we shouldn't use article. (Usage of 'the' before Kalidas is justified, because it is used as a common noun) Option 3, before the names of meals article shouldn't be used.